

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 116

గురువారం 17-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




సింధుకు మళ్లీ నిరాశే

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్ - 14లో



కొలువుల పండుగ!

ద్వితీయార్థంలో దేశంలో 2.16 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు.. - 15లో



వచ్చే నెలలో మోదీ చైనా పర్యటన!

ప్రధాని మోదీ చైనాలో పర్యటించనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ఎస్సీఓ సదస్సులో పాల్గొంటారని సమాచారం.

- వివరాలు 6లో



రైతు సంక్షేమానికి 'ధన్-ధాన్య'

కేంద్రం రూ.24,000 కోట్లతో ఆరేళ్లపాటు వంద జిల్లాల్లో 'ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన' పథకాన్ని అమలు చేయనుంది.

- వివరాలు 6లో



రష్యాతో వ్యాపారం చేస్తే ఊరుకోం

రష్యాతో వ్యాపారం చేస్తే తీవ్ర ఆర్థిక ఆంక్షలు తప్పవని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టే భారత్, బ్రెజిల్, చైనాను హెచ్చరించారు.

- వివరాలు 6లో



'నిమిషా'ను క్షమించలేం..

తన సోదరుడిని దారుణంగా హత్య చేసిన కేరళ నర్స్ నిమిషా ప్రియను క్షమించలేనని అబ్దెల్ ఫతాహ్ మెహదీ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో

ఆ ముచ్చటే లేదు!

'బనకచర్ల'ను ఏపీ ప్రస్తావించలేదు.. మేం ఆపమనలేదు

ఢిల్లీలో జలశక్తి మంత్రి వద్ద భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి

- తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ ఏర్పాటు చేసేలా చేయడం, జల వివాదాల పరిష్కారానికి కమిటీ వేసేలా చేయడం తెలంగాణ సాధించిన విజయం
- టెలీమెట్రీ ఏర్పాటు, శ్రీశైలం మరమ్మతులకు ఏపీని ఒప్పించడం కూడా రాష్ట్రం సాధించిన విజయమే
- గోదావరి బోర్డు హైదరాబాద్‌లో, కృష్ణా బోర్డు ఏపీలో ఏర్పాటు చేయాలని నిర్ణయం
- పార్లమెంటులో చేసిన చట్టాలకే నిబద్ధత లేదు
- కేంద్రం ఏర్పాటు చేసే కమిటీపై నమ్మకంతో ముందుకు వెళ్తాం
- ఇది కేవలం అనధికార భేటీ మాత్రమే అన్న ముఖ్యమంత్రి
- కేంద్రం మధ్యవర్తిగా వ్యవహరించిందని వెల్లడి



ఢిల్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో ఉత్తమ్, సురేశ్ షెట్కార్, రఘువీర్, వంశీ, సింఘ్వీ, మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్ల అంశమే ప్రస్తావనకు రాలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'బనకచర్ల ప్రాజెక్టును కడతామని ఏపీ వాళ్లు ప్రస్తావిస్తే కదా.. మేము ఆపమంటూ అభ్యంతరం తెలిపేది..' అని సీఎం అన్నారు. అయినా బనకచర్లపై ఇప్పటికే తెలంగాణ అభ్యంతరాలు తెలియజేసిందని, ఆ ప్రాజెక్టుపై పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా అభ్యంతరాలు తెలిపాయని చెప్పారు. ఇది కేవలం అనధికార (ఇన్‌ఫార్మల్) భేటీ మాత్రమే అన్న రేవంత్‌రెడ్డి.. ఇద్దరు సీఎంలతో ఈ భేటీని నిర్వహించేలా చేయడం,

మిగతా 3వ పేజీలో ▶

జల వివాదాలపై సాంకేతిక కమిటీ

కేంద్ర జలశక్తి శాఖ ప్రకటన 3లో

'స్థానిక' స్థానాలు ఖరారు



రాష్ట్రంలో జెడ్పీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీల సంఖ్య వెల్లడి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. 2019 ఎన్నికలతో పోల్చితే తగ్గిన స్థానాలు

జెడ్పీపీలు	: 31
జెడ్పీటీసీ స్థానాలు	: 566
ఎంపీపీలు	: 566
ఎంపీటీసీ స్థానాలు	: 5,773
గ్రామపంచాయతీలు	: 12,778
వార్డుల సంఖ్య	: 1,12,694

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో రాష్ట్రంలో జెడ్పీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం.. రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్‌లు 31, జెడ్పీటీసీ స్థానాలు 566, మండల ప్రజా పరిషత్‌లు 566, ఎంపీటీసీ స్థానాలు 5,773, గ్రామపంచాయతీలు 12,778, వార్డులు 1,12,694 ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2019లో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. అప్పుడు 32 జెడ్పీపీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు 570 చొప్పున, ఎంపీటీసీలు 5,817, గ్రామ పంచాయతీలు 12,848 ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే ఇప్పుడు 1 జెడ్పీపీ, నాలుగు జెడ్పీటీసీ, నాలుగు ఎంపీపీలు, 44 ఎంపీటీసీ స్థానాలు, 70 గ్రామపంచాయతీలు తగ్గాయి. మేడ్చల్-మల్కాజిగిరిలోని మెజారిటీ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో ఈ గ్రామీణ జిల్లా ఉనికి లేకుండా పోయింది. దీనివల్లే ఒక జెడ్పీపీ, 4 జెడ్పీటీసీల సంఖ్య తగ్గింది. మరి కొన్ని జిల్లాల్లోనూ పంచాయతీలు

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

టెన్త్ ప్రశ్నపత్రంపై కసరత్తు



పదో తరగతి పరీక్ష ప్రశ్నపత్రం రూపకల్పనపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి పరీక్ష విధానం మారనుంది. ప్రస్తుతం ఉన్న 20 మార్కుల ఇంటర్నల్స్‌ను తీసివేస్తున్నారు. వంద మార్కులకు ప్రశ్నపత్రం రూపొందించాల్సి ఉంది.

- వివరాలు 2లో

నిధులు రాహుల్‌కు.. నీళ్లు చంద్రబాబుకు..



'నిధులు రాహుల్‌గాంధీకి.. నీళ్లు చంద్రబాబుకు.. తెలంగాణ వ్యతిరేకిని సీఎంగా గెలిపించినందుకు బూడిద తెలంగాణ ప్రజలకు' అన్న చందంగా సీఎం రేవంత్ తీరు ఉందంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

- వివరాలు 3లో

ఉరి వేస్తారా.. ఊపిరి ఇస్తారా!



యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న నిమిష ప్రియలా విదేశీ జైళ్లలో మగ్గుతున్న భారతీయులు ఎందరో తెలుసా? 86 దేశాల్లోని జైళ్లలో ఏకంగా 10,152 మంది బందీలుగా ఉన్నారు. వీరిలో 49 మందికి మరణ శిక్ష ఖరారైంది.

- వివరాలు 16లో

కృష్ణా, గోదావరి సంగమం!



వైరా రిజర్వాయర్ తొలిసారిగా కృష్ణా, గోదావరి నదుల సంగమానికి వేదికైంది. ఈ రెండు నదుల నీళ్లు వైరా రిజర్వాయర్‌కు చేరుతుండగా.. ఖమ్మం జిల్లాలోని వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సుమారు 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించినట్లయింది.

- వివరాలు 5లో



ఇది శాంపిల్ మాత్రమే. బాగా ప్రాక్టీస్ చెయ్!

అనిల్ హత్య వెనుక టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే మనవడు?

- రంగంలోకి దిగిన ఎమ్మెల్యే సోదరుడి కుమారుడు!
- తెలంగాణలో 'పెద్ద' స్థాయి ఒత్తిడితో కేసును తొక్కిపెట్టేందుకు యత్నం
- నత్తనడకన కేసు దర్యాప్తు
- సెటిల్‌మెంట్ వ్యవహారాలే హత్యకు కారణం



అనిల్ ప్రయాణించిన వాహనం

సాక్షి టాస్క్‌ఫోర్స్/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్ జోన్/కొల్చారం: మెదక్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మారెల్లి అనిల్ కుమార్ హత్య కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ హత్య వెనుక వైఎస్సార్ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే మనవడి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో పార్టీ సమావేశానికి హాజరై తిరిగి వెళ్తుండగా మెదక్ జిల్లా ఘన్‌పూర్ శివారులో రెండు కార్లలో వచ్చిన దుండగులు అనిల్‌పై కాల్పులు జరిపి హత్య చేసిన సంగతి తెలిసిందే. కాగా ఆ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే మనవడు హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఆపై సెటిల్‌మెంట్లు.. దందాలు మొదలుపెట్టారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పేరుతో ఏపీలోని ప్రొద్దుటూరు, బద్వేలు, నాగులపల్లె, దర్శి ప్రాంతాల్లోని సన్నిహితుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారు. వారికి నమ్మకం కలిగించేందుకు కొన్ని ప్లాట్లను ఆయా వ్యక్తుల పేర్ల మీద ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయం బయటపడటంతో దర్శి ప్రాంతానికి చెందిన వ్యక్తులు.. ఎమ్మెల్యే మనవడిని నిలదీశారు. తమకు డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యవహారాల నేపథ్యంలో ఓ సెటిల్‌మెంట్‌కు సంబంధించి అనిల్‌కు ఆ ఎమ్మెల్యే మనవడు దాదాపు రూ.కోటి ఇవ్వాల్సి ఉన్నట్లు

మిగతా 3వ పేజీలో ▶

తప్పుడు కేసులకు భయపడం

మేమెప్పుడూ ప్రజాపక్షం

- ప్రజలకు ఏ సమస్య వచ్చినా వైఎస్సార్‌సీపీ తలుపు తడుతున్నారు.. చంద్రబాబు ఎలాగూ చేయడని మాకు చెబుతున్నారు
- ఇది తట్టుకోలేకే వైఎస్సార్‌సీపీపై చంద్రబాబు కుట్రలు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- పనిగట్టుకుని తప్పుడు కేసులు.. తప్పుడు వాంగ్మూలాలతో వేధింపులు
- చంద్రబాబు వేసిన తప్పుడు విత్తనం చెట్టవుతుంది
- దెబ్బ తిన్నవాడు రేపు మేం అధికారంలోకి వచ్చాక నా మాట వినే పరిస్థితి ఉండకపోవచ్చు
- ఇప్పటికైనా తప్పు తెలుసుకుని మేలుకో..

12లో



అలాగైతేనే... పోలవరంలో మిగులు జలాల మళ్లింపు సాధ్యం

- 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా నిర్మిస్తేనే అవకాశం
- పోలవరంలో నీటి నిల్వ ఎత్తును 41.15 మీటర్లకు కుదించేందుకు చంద్రబాబు అంగీకరించారు
- దీనివల్ల గోదావరి జలాలు కృష్ణాకు తరలించే అవకాశం ఉండదు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

12లో



ఎడ్లబండే అంబులెన్స్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లోహ గ్రామంలో నిండు గర్భిణి పుష్పలతకు పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అయితే రోడ్డు బురదగా మారడంతో మధ్యలోనే వాహనం ఆగిపోయింది. దీంతో ఆమెను 6 కిలోమీటర్లు ఎడ్లబండిలో ఎక్కించుకొని తీసుకు వెళ్లాల్సి వచ్చింది. దహెగాం పీహెచ్‌సీలో ప్రసవానంతరం సైతం లోహ గ్రామానికి 3 కి.మీ. ముందే అంబులెన్స్ ఆగిపోవడంతో తిరిగి ఎడ్లబండిపైనే తల్లీబిడ్డను ఇంటికి చేర్చారు.

12లో

తాళాలే తియ్యరు.. ఫీజులు మెక్కేస్తారు



- ప్రైవేటు ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల మోసం
- ఉన్నత విద్యామండలి పరిశీలనలో వెలుగు చూసిన నిజాలు
- పుస్తకాల లెక్కల్లోనే విద్యార్థులు.. వారిదంతా వేరే దారి
- తూతూ మంత్రంలా పరీక్షలు.. పాస్ సర్టిఫికెట్లు

సాక్షి, హైదరాబాద్: క్లాసులే పెట్టరు.. విద్యార్థులే రారు..ఫీజు రీయింబర్స్‌మెంట్ మాత్రం కాలేజీల ఖాతాల్లోకి వెళుతుంది. ఇదీ ప్రైవేటు ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల తీరు. కొన్నేళ్లుగా ఈ వ్యవహారం సాగుతోంది. దీనిపై ఏటా కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి ఇటీవల దాదాపు 40 కాలేజీలను తనిఖీ చేసింది. చాలాచోట్ల ఎంబీఏ, ఎంసీఏ బోధనే జరగడం లేదని గుర్తించింది. కొన్నిచోట్ల అదే ప్రాంగణంలో ఇంజనీరింగ్ కాలేజీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల్లో మాత్రం కాలేజీలు కనిపిస్తున్నాయి. కౌన్సెలింగ్ జరుగుతోంది. సీట్ల కేటాయింపు పూర్తవుతుంది. రికార్డుల్లో ఉన్న విద్యార్థులు కాలేజీల్లో మాత్రం

మిగతా 2వ పేజీలో ▶



బయ్యారం: ఎండిపోతున్న వరినారుకు బిందెలతో నీళ్లుపోస్తూ జీవం పోసే యత్నం చేస్తున్న మహబూబాబాద్ జిల్లా కస్తూరినగర్‌కు చెందిన రైతు మాలోత్ రాంబాబు..

వాయుగండం

గాలుల తీవ్రతతోనే వానలకు ఆటంకం అంటున్న వాతావరణ శాస్త్రవేత్తలు

- తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సగటున 28 శాతం లోటు వర్షపాతం
- ఆదిలాబాద్‌లో మాత్రమే సాధారణ వర్షపాతం
- ఈ నెలాఖరులో వర్షాలు కురిసే అవకాశం
- వాతావరణ విభాగం నిపుణుల అంచనా

సాక్షి, హైదరాబాద్: 'ముందస్తు'గా మురిపించిన వర్షాలు కీలక సమయంలో ముఖం చాటేయటంతో రాష్ట్రంలో వాతావరణం వేసవిని తలపిస్తోంది. నైరుతి రుతుపవనాల సీజన్ లో సమృద్ధిగా వానలు కురవాల్సిన సమయంలో.. మొగులు కోసం రైతన్న దిగులుగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రుతుపవనాల కదలికలు మందగించడం, నిలకడలేని తీవ్రగాలుల ప్రభావంతో వర్షాలు జాడ లేకుండా పోయాయి. ఇదే సమయంలో తెలంగాణ ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈసారి రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించడంతో ఈ సీజన్‌లో వర్షాలు జోరుగా ఉంటాయని అంచనా వేశారు. ఈ అంచనాలు తలకిందులు కావటానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

నైరుతి రుతుపవనాల సీజన్‌లోనే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఇప్పటివరకు

మిగతా 5వ పేజీలో ▶

హైదరాబాద్-అమరావతి కొత్త రైలు మార్గం

- పూర్తి కావొస్తున్న భూసేకరణ ప్రక్రియ.. టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు
- డిసెంబర్‌లో మొదలు.. నాలుగేళ్లలో పూర్తి
- రూ.2,300 కోట్ల వ్యయం అవుతుందని అంచనా
- రూ.550 కోట్లతో కృష్ణానదిపై 3.3 కి.మీ. పొడవైన భారీ వంతెన
- 56.53 కి.మీ. మార్గంలో 124 వంతెనలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్-అమరావతి మధ్య కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. భూసేకరణ ప్రక్రియ పూర్తికానుండటంతో టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నదిపై నిర్మించాల్సిన భారీ వంతెనకు విడిగా టెండర్లు పిలుస్తారు. డిసెంబర్‌లో కొత్త లైన్ నిర్మాణ పనులు ప్రారంభించబోతున్నారు. నాలుగేళ్లలో ఇది పూర్తికానుందని సమాచారం.



ఎక్కడి నుంచి ఎక్కడి వరకు..

హైదరాబాద్-అమరావతి మధ్య తొలుత పిడుగురాళ్ల మార్గంలో కొత్తలైన్ నిర్మించాలని ప్రతిపాదించినా, తర్వాత దాన్ని ఉపసంహరించుకుని కాజీపేట-విజయవాడ లైన్‌తో అనుసంధానించాలని నిర్ణయించారు.

→ కాజీపేట-విజయవాడ లైన్‌లో మధిర సమీపంలోని ఎర్రుపాలెం స్టేషన్ నుంచి

మిగతా 12వ పేజీలో ▶

శుభ సప్తకం



ఐఎస్ఎస్‌లో 7 ప్రయోగాలు చేసిన శుభాంశు

మైక్రోగ్రావిటీలో 'జీవన వ్యూహాల'పై అధ్యయనం

ఆహారం, ఆరోగ్యం, వ్యోమగాముల రక్షణపై దృష్టి

'గగన్‌యాన్'కు దారి దీపాలు ఈ ప్రయోగాలు



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) లోకి అడుగు పెట్టిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా ఘనత సాధించారు. యాగ్జియం -4 మిషన్‌లో భాగంగా శుభాంశు చేపట్టిన అంతరిక్ష యాత్ర విజయవంతంగా ముగియటంతో ఇక ఇప్పుడు - ఐఎస్ఎస్‌లో ఉన్న ఈ 18 రోజుల్లోనూ ఆయన జరిపిన 7 ప్రధాన ప్రయోగాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి మొదలైంది. భారత్ ఎంతో ప్రతిష్టాత్మకమైనదిగా భావిస్తున్న భవిష్యత్ మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు ఇవి ఎంతో ఉపయుక్తమైనవి కావటం వలన కూడా ఈ ప్రయోగాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తిలో వివిధ జీవ, భౌతిక వ్యవస్థలను అధ్యయనం చేయటానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు వంటి ప్రసిద్ధ భారతీయ పరిశోధన సంస్థలు రూపొందించిన ఆ ప్రయోగాలు ఏమిటో చూద్దాం.

1 టార్డిగ్రేడ్



ఏంటివి?: టార్డిగ్రేడ్‌లు అంటే నీటి ఎలుగు బంట్లు. ఎనిమిది కాళ్లుండే సూక్ష్మజీవులు. ఇవి అధిక ఉష్ణోగ్రతలు, రేడియేషన్ వంటి తీవ్ర ప్రతికూల పరిస్థితులలో కూడా ఎక్కువ కాలం జీవించగలవు.

ఏంటి ఉపయోగం?: టార్డిగ్రేడ్‌లు అంతరిక్షంలో ఎలా మనుగడ సాగిస్తాయో అర్థం చేసుకోవడం వల్ల అంతరిక్ష కార్యకలాపాల్లో వ్యోమగాముల రక్షణకు కొత్త వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు. శుభాంశు అంతరిక్షంలో భారత జాతి టార్డిగ్రేడ్‌లపై అధ్యయనం చేసి, అవి ఎలా మనుగడ సాగిస్తాయో, పునరుత్పత్తి చేస్తాయో, సూక్ష్మ గురుత్వాకర్షణకు (మైక్రోగ్రావిటీ) ఎలా స్పందిస్తాయో, రోజులు గడుస్తున్నకొద్దీ వాటిలో వచ్చే మార్పులు (ఏజింగ్ ప్యాటర్న్స్) పరిశీలించారు. ఈ అధ్యయనం వల్ల రక్షణ వ్యూహాలే కాకుండా.. అంతరిక్షంలో ఆహారాన్ని, జీవ నమూనాలను ఎలా నిల్వ చేయవచ్చో తెలుస్తుంది.

2 మయోజెనిసిస్

ఏంటిది?: మయోజెనిసిస్ అంటే కండరాల్లోని కణాల అభివృద్ధి/పెరుగుదల. దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రల సమయంలో వ్యోమగాముల కండరాల బరువు తగ్గుతుంటుంది. తద్వారా కండరాలు బలహీనమవుతాయి.

ఏంటి ఉపయోగం?: కండరాల్లో కణాలను సూక్ష్మ గురుత్వాకర్షణలో అధ్యయనం చేసి అవి ఎలా ప్రవర్తిస్తాయో, వాటిలో వచ్చే మార్పులేమిటో శుభాంశు నిశితంగా పరిశీలించారు. సూక్ష్మ గురుత్వాకర్షణలో కండరాల్లో కణాలు ఎలా ప్రవర్తిస్తాయో అర్థం చేసుకోవడం వల్ల వాటి బరువు తగ్గకుండా నివారణోపాయాలను కనిపెట్టటానికి, ఆరోగ్య పరిరక్షణకు ఈ అధ్యయనం తోడ్పడుతుంది.

3 విత్తనాల పెరుగుదల

ఏంటిది?: అంతరిక్షంలోకి శుభాంశు పెసర, మెంతి విత్తనాలు తీసుకెళ్లి ట్రేలలో వాటిని ఉంచారు.



ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావం మొలకలపైనా, విత్తనాల పెరుగుదలపైనా ఎలా ఉంటుందో అధ్యయనం చేశారు. అంతరిక్షంలో మొక్కలను పెంచడం వల్ల దీర్ఘకాలిక మిషన్లలో వ్యోమగాములకు స్థిరమైన ఆహార వనరు లభిస్తుంది.


4 సైనోబ్యాక్టీరియా



ఏంటివి?: సైనోబ్యాక్టీరియా అనేవి ఆక్సిజన్‌ను, పోషకాలను ఉత్పత్తి చేయగల సూక్ష్మజీ వులు. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం భూమిపై మొట్టమొదట ప్రాణ వాయువును ఉత్పత్తి చేసిన జీవులు ఇవి.

ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురుత్వాకర్షణలో సైనోబ్యాక్టీరియా ఎలా పెరుగుతుందో అర్థం చేసుకోవడం ద్వారా అంతరిక్ష కార్యకలాపాల కోసం 'బయో రీజెనరేటివ్ లైఫ్ సపోర్ట్ వ్యవస్థ'లను అభివృద్ధి చేయవచ్చు. ఉన్న వనరులను రీ సైకిల్ చేసి ఆక్సిజన్, నీరు, ఆహారం వంటి వనరులను తయారు / ఉత్పత్తి చేయటం ద్వారా అంతరిక్షంలో మానవ మనుగడకు సహాయం చేసే కృత్రిమ వ్యవస్థలే ఈ బయో రీజెనరేటివ్ వ్యవస్థలు. ఇవి పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గిస్తాయి.

5 మైక్రో ఆల్గే



ఏంటివి?: మంచినీరు, సముద్ర పర్యావరణ వ్యవస్థలలో కీలక పాత్ర పోషించే సూక్ష్మ, ఏకకణ జల జీవులనే సూక్ష్మ శైవలాలు (మైక్రో ఆల్గే) అంటారు. ఇవి పోషకాలను అందించగల ఆహారంగా స్వీకరించతగిన సూక్ష్మజీవులు. అలాగే బొగ్గు వంటి శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయమైన బయో ఇంధనంగానూ ఉపయోగపడతాయి.

ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురుత్వాకర్షణలో సూక్ష్మ శైవలాలు ఎలా పెరుగుతాయో అర్థం చేసుకోవడం, వ్యోమగాములకు స్థిరమైన ఆహార వ్యవస్థలను అభివృద్ధి చేయటం ఈ అధ్యయన లక్ష్యం. అలాగే అంతరిక్షంలో ఇంధన సమస్యల పరిష్కారానికి కూడా ఇది దారి చూపుతుందని భావిస్తున్నారు.

6 పంట విత్తనాలు

ఏంటిది?: ఈ ప్రయోగం ఆహార పంటల విత్తనాలపై సూక్ష్మగురుత్వాకర్షణ ప్రభావాన్ని పరిశీలించింది.

ఏంటి ఉపయోగం?: శుభాంశు సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణంలో పంట విత్తనాల పెరుగుదల, దిగుబడులపై అధ్యయనం చేశారు. దీర్ఘకాలిక అంతరిక్ష యాత్రలలో వ్యోమగాములకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే విధానాలను తెలుసుకోవటానికి ఈ అధ్యయన ఫలితాలు ఉపకరిస్తాయి.



7 వాయేజర్ డిస్‌ప్లేలు



ఏంటివి?: కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు. ఈ ప్రయోగంతో ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు అంతరిక్షంలో ఎలా పనిచేస్తాయి, వాటి వాడకం వల్ల వ్యోమగాములపై ఎలాంటి ప్రభావం ఉంటుందో శుభాంశు విశ్లేషించారు.

ఏంటి ఉపయోగం?: సూక్ష్మ గురుత్వాకర్షణలో కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు వ్యోమగాముల కళ్లు, మెదడుపై ఎలాంటి ప్రభావం చూపుతాయి, ఎన్ని గంటల పాటు వాటిని వినియోగించవచ్చు, అంతరిక్ష అవసరాల కోసం ఎలాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు కావాలి.. వంటి విషయాలు తెలుసుకునేందుకు ఈ ప్రయోగం తోడ్పడుతుంది.

క్లుప్తంగా...

ఇక అంబేడ్కర్ విదేశీ విద్యానిధి 500 మందికి..

పరిమితి పెంచుతూ ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థులకు కోటాను ప్రభుత్వం భారీగా పెంచింది. ఇప్పటివరకు ఏటా 210 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి గరిష్టంగా రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. తాజాగా ఈ పథకం కింద పరిమితిని 500 మందికి పెంచుతూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ రోజు తొలి సంతకం చేశారు. ఇందులో భాగంగా ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకున్న విద్యార్థులకు ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరనుంది.

రైతులపై అక్రమ కేసులు పెడతారా?

ప్రభుత్వంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన రైతులపై అక్రమ కేసులు పెట్టడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. వారంలోగా నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుపై 12 గ్రామాల ప్రజలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 57 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మరో 40 మంది వరకు పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. గత నెల జరిగిన ఈ ఉదంతంపై న్యాయవాది ఇమ్మానేని రామారావు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం కమిషన్ విచారణ చేపట్టింది. సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై బహిరంగ విచారణ చేస్తామని, దీని కోసం ఈ నెల 28న హైదరాబాద్ రానున్నట్టు పేర్కొంది. ఉదయం 10 గంటల నుంచి విచారణ చేపడతామని, కార్యాలయ ప్రాంతాన్ని తెలియజేస్తామని స్పష్టం చేసింది.

భవిష్యత్ ప్రయాణానికి మార్గనిర్దేశమే స్నాతకోత్సవం

రాష్ట్రం పేరుతో ఏర్పాటైన వర్సిటీ ప్రత్యేకత నిలుపుకోంది

- తెలంగాణ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



డాక్టరేట్ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవమంటే కేవలం విద్యాపరమైన లక్ష్యాల సాధన మాత్రమే కాదని.. భవిష్యత్ ప్రయాణానికి మార్గాన్ని నిర్దేశించే గొప్ప ప్రయాణమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. బుధవారం తెలంగాణ విశ్వవిద్యాలయ ద్వితీయ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రం పేరుతో ఏర్పాటు చేసిన తెలంగాణ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇది గర్వపడాల్సిన విషయమన్నారు. చైతన్యవంతమైన నేల నుంచి ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు తెలంగాణ వర్సిటీ ద్వారా ప్రస్ఫుటమవుతున్నాయని చెప్పారు. 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమైన వర్సిటీ నేడు 31 కోర్సులతో విద్యనందిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ వర్సిటీ పలు ఆశాజనకమైన పారిశ్రామిక, విద్యాపరమైన సంబంధాలతో ముందుకు పోవడం స్వాగతించదగిందని తెలిపారు. కొఠారి కమిషన్ చెప్పినట్టుగా 'దేశ భవిష్యత్ తరగతి గదిలోనే తీర్చిదిద్దబడుతుందనేలా' వర్సిటీ విజయాలు రుజువు చేశాయన్నారు.

ముఖ్యఅతిథిగా హాజరైన భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ (ఐసీటీ) మాజీ డైరెక్టర్ ఆచార్య శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుంచి బయటకు వెళ్లిన ప్రతి విద్యార్థికి ఆందోళనతోపాటు అవకాశాలు కనిపిస్తాయన్నారు. ఆందోళన చెందకుండా అవకాశాల వైపు పరుగెత్తాలని సూచించారు. జీవితమంటే పందెం లాంటిది కాదని.. ఇది ఒక ప్రయాణం మాత్రమేనని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రయాణంలో సమయస్ఫూర్తితో, కచ్చితమైన విశ్లేషణతో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని చెప్పారు. స్నాతకోత్సవంలో 15 విభాగాలకు సంబంధించి, 2014 నుంచి 2023 వరకు 132 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. 156 మంది పరిశోధకులకు డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య టి.యాదగిరిరావు పాల్గొన్నారు.

డిమాండ్ మేరకు కొత్త సబ్ స్టేషన్లు

విద్యుత్ అంతరాయాల కట్టడికి ఏర్పాటు చేయండి

- విద్యుత్ అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశాలు



అధికారులతో సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ ఉన్నతాధికారులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ డిమాండ్ ఏటా 9.8 శాతం పెరుగుతోందని ఆయన గుర్తు చేశారు. 2034 నాటికి ఇది 33,773 మెగావాట్లకు చేరుతుందని తెలిపారు. శరవేగంతో అభివృద్ధి చెందుతున్న రాజధాని నగరంలో విద్యుత్ సామర్థ్యం మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ ఉన్నతాధికారులతో భట్టి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది మార్చి 24న 308.45 మిలియన్ యూనిట్లు ఉన్న డిమాండ్, రాష్ట్ర చరిత్రలో ఈ ఏడాది మార్చి 18కి 335.19 మిలియన్ యూనిట్ల గరిష్ట స్థాయికి చేరిందని తెలిపారు. కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల భూమి కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని అధికారులను భట్టి ఆదేశించారు. హైదరాబాద్ మహానగరంలో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ కేబుల్స్ నిర్మాణం కోసం సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. ఇప్పుడున్న 12.5 మిలియన్ యూనిట్ల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 16 మిలియన్ యూనిట్ల సామర్థ్యం గల వాటిని ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో నవీన్ మిత్తల్, కృష్ణ భాస్కర్, హరీశ్, ముషారఫ్ ఫారూఖీ, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ బృందంతో డిప్యూటీ సీఎం భట్టి

పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం ఎంతో అనుకూలమని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లేమి బృందం డిప్యూటీ సీఎంతో బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ టెక్నాలజీ రంగం అభివృద్ధికి రాష్ట్రం అనుకూలంగా ఉంటుందని, పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలపై అధ్యయనం చేయాలని ఫ్రాన్స్ బృందానికి సూచించారు.

వచ్చే ఏడాది దసరాకు ఉప్పల్ ఫ్లైఓవర్

ఇక నుంచి ఫ్లైఓవర్ నిర్మాణంలో జాప్యం లేకుండా చూస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి.. నిర్మాణ పనులు పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ పనులను 2026 దసరా పండుగ నాటికి పూర్తిచేసి ప్రారంభిస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇకపై ఈ పనుల్లో జాప్యం లేకుండా చూస్తామని చెప్పారు. బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులతో కలిసి ఆయన ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మాణం పనులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల గడిచినా కారిడార్ నిర్మాణం పూర్తి కాకపోవడం బాధాకరమన్నారు. కొన్నిచోట్ల ఫారెస్టు భూములు, మరికొన్ని చోట్ల ప్రైవేటు వ్యక్తుల నుంచి భూ సేకరణ తదితర అనేక కారణాల వల్ల జాప్యం జరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఫ్లైఓవర్ పనులను వేగవతం చేసినట్లు మంత్రి తెలిపారు. పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే తర్వాత ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద ఎలివేటెడ్ కారిడార్ అని మంత్రి చెప్పారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చిక్కులు పరిష్కరించినట్లు వెల్లడించారు. ఉప్పల్ జంక్షన్ నుంచి టీఎస్ఎల్ మాల్ వరకు అదనంగా నిర్మిస్తున్న 1.4 కిలోమీటర్ల పొడవైన కారిడార్ పనులపై జీహెచ్ఎంసీ అధికారులతో మంత్రి చర్చించారు. కారిడార్ నిర్మాణ పనులు వేగవంతం చేయటంపై గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్, ఈఎన్సీ, సీఈలతో సచివాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

సర్కార్ వైఫల్యాలను ఎండగడదాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రతి డివిజన్, మండల స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ డివిజన్, మండల అధ్యక్షులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ బూత్ స్థాయిలో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. 'ఒక్కొక్క పోలింగ్ బూత్‌లో గెలిస్తే, ఒక్కొక్క నియోజకవర్గం మనదవుతుంది. ఒక్కొక్క నియోజకవర్గం మనదైతే తెలంగాణ మనదవుతుంది. విజయం పోలింగ్ బూత్ తోనే మొదలవుతుంది అనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలి' అని కోరారు. బుధవారం రాత్రి ఘట్‌కేసర్‌లోని ఆర్వీకేలో బీజేపీ కొన్ని జిల్లాల డివిజన్, మండల అధ్యక్షుల వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో అనేక కుంభకోణాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. పీఎం ముద్ర యోజన కింద చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు, స్వయం ఉపాధికి వడ్డీ లేని లేదా తక్కువ వడ్డీతో రుణాలను కేంద్ర అందిస్తోందని వెల్లడించారు.

తాళాలే తియ్యరు.. ఫీజులు మెక్కేస్తారు

▶ మొదటి పేజీ తరువాయి

కనిపించరు. తనిఖీలు చేపడతామని యూనివర్సిటీ అధికారులు నోటీసులు ఇస్తే మాత్రం పిలిపిస్తారు. ఘట్‌కేసర్‌లోని ఓ రాజకీయ నేత కాలేజీకి వెళ్లిన మండలి అధికారులు నివ్వెరబోయారు. అక్కడ ఇంజనీరింగ్ కాలేజీ మినహా ఎంబీఏ, ఎంసీఏ తరగతులు, రికార్డులు కనిపించలేదు.

పరీక్షల తీరూ ప్రహసనమే

రాష్ట్రవ్యాప్తంగా 281 ఎంబీఏ కాలేజీల్లో 38,200 సీట్లున్నాయి. 76 ఎంసీఏ కాలేజీల్లో 8,900 సీట్లున్నాయి. ఒక్కో వర్సిటీ పరిధిలో ఒక్క కాలేజీని మినహాయిస్తే..మిగతావన్నీ ప్రైవేట్ కాలేజీలే. ఉమ్మడి ప్రవేశపరీక్ష ద్వారా ఈ సీట్లు భర్తీ చేస్తారు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.28 వేల ఫీజు రీయింబర్స్ చేస్తుంది. ఇతర స్కాలర్‌షిప్పులూ విద్యార్థులకు అందుతాయి. ఈ ప్రక్రియ మొత్తం సాధారణంగానే జరిగిపోతుంది. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు 50 శాతం ప్రాజెక్టు వర్క్ ఉంటుంది. ఈ రిపోర్టులనూ వీరు తయారు చేయడం లేదు. ఇతరులు చేసినవి డబ్బులిచ్చి కొంటున్నారు. కాలేజీలో ఒక్క క్లాసు కూడా జరిగిన దాఖలాల్లేవు. ఎంబీఏ, ఎంసీఏ అధ్యాపకులు ఎవరో? వారికి ఏ అకౌంట్ నుంచి వేతనాలు ఇస్తున్నారో.. తెలిపే ఒక్క ఆధారం మండలి అధికారులకు కనిపించలేదు. విద్యార్థులంతా వార్షిక సంవత్సరం ఆఖరులో పరీక్షలకు హాజరవుతారు. అక్కడా కాలేజీలే మేనేజ్ చేస్తున్నాయనేది ఆరోపణ. క్లాసులకు రాకున్నా, పాఠాలు చదవకున్నా, అందరూ పాసయిపోతున్నారు. ఇలా డిగ్రీలు ఇస్తే విద్యార్థుల్లో నైపుణ్యం ఏముంటుందని మండలి వైస్‌చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు.

నివేదికను తొక్కి పెట్టిందెవరు?

ఆనవాళ్లే లేని కాలేజీల బాగోతంపై తనిఖీలు జరిపిన మండలి అధికారులు నివేదిక రూపొందించారు. ఇది జరిగి రెండు నెలలైంది. ఇంతవరకూ ఇది ప్రభుత్వం వద్దకే చేరలేదు. రాజకీయ ఒత్తిడే కారణమని తెలుస్తోంది. తనిఖీ వ్యవహారంపై మండలి వర్గాల్లోనూ వివాదాలకు కారణమవుతోంది. కీలకమైన నివేదికను ప్రభుత్వం దృష్టికి తేవాలని ఒక వీసీ పట్టుబడుతున్నారు. దీనిపై ఆందోళన చేసేందుకు విద్యార్థి సంఘాలు సమాయత్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే ఉస్మానియా వర్సిటీ అధికారులు గురువారం నుంచి కాలేజీల తనిఖీలు చేపట్టబోతున్నారు. ఇది పూర్తయిన తర్వాతే అనుబంధ గుర్తింపు ఇస్తారు. మండలి నివేదికను పరిగణలోనికి తీసుకుంటే చాలా కాలేజీలకు అనుబంధ గుర్తింపు వచ్చే అవకాశం ఉండదు. ఈ మొత్తం వ్యవహారంలో అన్ని స్థాయిలకు ముడుపులు వెళుతున్నాయని విద్యార్థి వర్గాలు అంటున్నాయి.

జస్టిస్ సుజోయ్‌పాల్ మానవతావాది

ఆయన సేవలను ప్రశంసించిన జస్టిస్ శామ్‌కోషి




మాట్లాడుతున్న జస్టిస్ సుజోయ్‌పాల్

సాక్షి, హైదరాబాద్: చట్టానికి మానవత్వాన్ని జోడించి తీర్పులందించిన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అని జస్టిస్ శ్యామ్‌కోషి ప్రశంసించారు. వృత్తి నిబద్ధతతో పనిచేయడంలో ఆయన ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ప్రతి వ్యక్తికి తల్లి తొలి టీచర్ అని.. జస్టిస్ సుజోయ్‌పాల్‌కు ఇంట్లోనే కాకుండా తరగతి గదిలోనూ ఉపాధ్యాయురాలిగా సూచనలిస్తూ లక్ష్యాలను సాధించడంలో ఆయన మాతృమూర్తి అండగా నిలిచారని పేర్కొన్నారు. కోల్‌కతా హైకోర్టుకు బదిలీపై వెళ్తున్న ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్‌కు ఫుల్‌కోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. బుధవారం మధ్యాహ్నం 3.45కు ఫస్ట్‌కోర్టు హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయనను ఘనంగా సత్కరించింది. వీడ్కోలు సమావేశంలో అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. 255 రోజుల కాలంలో 4,223 మెయిన్, 5 వేల మిస్లేనియస్ కేసులను జస్టిస్ సుజోయ్‌పాల్ పరిష్కరించారన్నారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ విశ్వసనీయతపైనే ఆధారపడి పనిచేస్తుందని, ఆన్‌లైన్ విచారణ నేపథ్యంలో ప్రజలంతా గమనిస్తున్నారన్న విషయం గుర్తించుకోవాలని అన్నారు. పారదర్శకమైన విచారణ, స్వచ్ఛతతో కూడిన తీర్పులు వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులతో పాటు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహాశర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి పంచాక్షరి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నరసింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) అధ్యక్షుడు జగన్, రిజిస్ట్రార్లు, కోర్టు సిబ్బంది, జస్టిస్ సుజోయ్‌పాల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం హెచ్‌సీఏఏ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

ఘట్‌కేసర్–యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు రూ.100 కోట్లు

ఎంపీ చామల కిరణ్‌కు లేఖ ద్వారా తెలిపిన రైల్వే శాఖమంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: ఘట్‌కేసర్–యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ రైలు ప్రాజెక్టు పనుల నిమిత్తం రూ.100 కోట్లు కేటాయించినట్లు రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈమేరకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి లేఖ ద్వారా వెల్లడించారు. 33 కి.మీ. మేర ఉన్న మూడవ లైన్ మార్గం కోసం కేటాయించిన రూ.412 కోట్లు విడుదల చేయాలని గత పార్లమెంట్ సమావేశాల్లో జీరో అవర్‌లో ఎంపీ చామల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత నిధుల కేటాయింపుల కోసం రైల్వే మంత్రిని కలిశారు. పలుమార్లు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించారు. 'ఏప్రిల్ 3న జీరో అవర్ సందర్భంగా ఘట్‌కేసర్–యాదగిరిగుట్ట రైలు మార్గం కోసం విడుదల చేయాల్సిన రూ.412 కోట్లు విషయాన్ని లేవనెత్తిన విషయాన్ని గుర్తు చేస్తున్నా. 2016లో ఎంఎంటీఎస్ కింద ఖర్చు భాగస్వామ్య ప్రాతిపదికన ఆమోదం పొందింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు డిపాజిట్ చేయకపోవడం వలన ప్రాజెక్ట్ ప్రారంభించలేకపోయాం. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రాజెక్టు కోసం రూ.100 కోట్లు కేటాయించాం. నిధుల విడుదల ప్రాజెక్టును అమలు చేసే ఏజెన్సీ నుంచి డిమాండ్, ప్రాజెక్టు పురోగతికి అనుగుణంగా జరుగుతుంది. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ కూడా కొనసాగుతోంది' అంటూ లేఖలో అశ్వినీ వైష్ణవ్ ప్రస్తావించారు. అడిగిన వెంటనే నిధులు కేటాయించడం పట్ల చామల హర్షం వ్యక్తం చేశారు.

టెన్త్ ప్రశ్నపత్రంపై కసరత్తు

ఈ సంవత్సరం నుంచి వంద మార్కులకు పేపర్

ఇంటర్నల్ మార్కులు ఎత్తివేత.. ప్రశ్నల కూర్పుపై చర్చలు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్షకు ప్రశ్నపత్రం రూపకల్పనపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) బుధవారం ఈ అంశంపై చర్చించింది. ఈ ఏడాది నుంచి పరీక్ష విధానం మారబోతోంది. ఇప్పటివరకు ఉన్న 20 మార్కుల ఇంటర్నల్స్‌ను తీసివేస్తున్నారు. పూర్తిస్థాయిలో వంద మార్కులకు ప్రశ్నపత్రం రూపొందించాల్సి ఉంది. కొత్తగా 20 మార్కులకు ఏయే ప్రశ్నలు ఇవ్వాలి? ఎందులో పెంచాలి? అనే అంశంపై సబ్జెక్టు నిపుణులతో అధికారులు చర్చిస్తున్నారు. సాధారణంగా టెన్త్ పరీక్షల్లో లఘు, దీర్ఘ, మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్నల్ మార్కులను విద్యార్థి అభివృద్ధి, ఎస్ఏ-1, ఎస్-2 మార్కుల ఆధారంగా ఇచ్చేవాళ్లు. విద్యార్థి స్కిల్‌ను అంచనా వేయడానికి ఈసారి పరీక్ష పేపర్‌లో ప్రశ్నలు ఇవ్వాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. ఈ ప్రశ్నలను పాఠ్యపుస్తకాలతో అనుసంధానం చేసి ఇవ్వడమా? దీంతో సంబంధం లేకుండా ఇవ్వడమా? అనే కోణంలోనూ చర్చ నడుస్తోంది. వాస్తవానికి ఇప్పటికే ప్రశ్నల సరళితో బ్లూప్రింట్ ఇవ్వాల్సి ఉంది. బ్లూప్రింట్ ఆధారంగానే స్కూళ్లలో పరీక్షల సన్నద్ధత జరుగుతుంది. చాప్టర్ పూర్తయిన తర్వాత ప్రశ్నలను విద్యార్థులకు వివరిస్తారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్‌కు సంబంధించిన రెండు పర్యాయాల పరీక్షలకు కూడా ఇదే ముఖ్యం. మరోవైపు పబ్లిషర్లు గైడ్లు, మాదిరి ప్రశ్నపత్రాల రూపకల్పన చేసేందుకు బ్లూప్రింట్ కోసం ఎదురు చూస్తున్నారు.

జల వివాదాలపై సాంకేతిక కమిటీ

కేంద్ర జలశక్తి శాఖ ప్రకటన

- కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణపై చర్చ జరిగింది
- టెలిమెట్రీ ఏర్పాటు, శ్రీశైలం మరమ్మతులకు అంగీకారం కుదిరిందని వెల్లడి
- ఢిల్లీలో భేటీకి హాజరైన తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు



శ్రమశక్తి భవన్‌లో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, తెలంగాణ సీఎం రేవంత్, ఏపీ సీఎం చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఉన్న వివాదాల పరిష్కారానికి.. కేంద్ర ప్రభుత్వ, రెండు రాష్ట్రాల అధికారులు, నిపుణులు, ఇంజనీర్లతో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో బుధవారం ఢిల్లీలో నిర్వహించిన సమావేశం అనంతరం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'రెండు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న జల వివాదాలపై సమావేశం జరిగింది. భేటీలో నీటి నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించాం. ప్రాజెక్టులపై టెలిమెట్రీ పరికరాల ఏర్పాటుకు, శ్రీశైలం నిర్వహణ, రక్షణ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. కృష్ణా యాజమాన్య బోర్డు ఏపీలో, గోదావరి బోర్డు తెలంగాణలో ఉండేందుకు ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. మిగిలిన సమస్యలను సమగ్రంగా, సాంకేతికంగా పరిష్కరించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఈ కమిటీ అపరిష్కృత సమస్యలపై అధ్యయనం చేయడంతో పాటు సమర్థవంతమైన నీటి భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి ఆచరణీయమైన పరిష్కారాలను సూచిస్తుంది. వారంలోగా కమిటీ ఏర్పాటవుతుంది. రెండు రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు, రెండు రాష్ట్రాల ప్రయోజనం కోసం స్థిరమైన నీటి నిర్వహణ పద్ధతులను సులభతరం చేసేందుకు జలశక్తి శాఖ నిబద్ధతతో ఉంది..' అని పేర్కొంది. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో సుమారు గంటన్నరపాటు జరిగిన సమావేశంలో.. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, జల వనరుల శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతో పాటు తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, నీటి పారుదల శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, రెండు రాష్ట్రాల సీఎస్‌లు, నీటి పారుదల శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ ముచ్చటే లేదు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇరు రాష్ట్రాలకు సంబంధించిన జల వివాదాల పరిష్కారానికి కమిటీ వేసేలా చేయడం.. తెలంగాణ సాధించిన విజయంగా అభివర్ణించారు. ముఖ్యమంత్రుల సమావేశం పూర్తిగా ఇన్‌ఫార్మల్‌గానే సాగిందని, కేంద్రం ఎటువంటి ఎజెండా పెట్టుకోకుండా, కేవలం ఒక వేదికను ఏర్పాటు చేసి మధ్యవర్తిలా మాత్రమే వ్యవహరించిందని తెలిపారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఎంలు, నీటిపారుదల శాఖల మంత్రులు, అధికారుల సమావేశం అనంతరం..రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

అపెక్స్ కౌన్సిల్ సమావేశం కాదు

'జరిగింది అపెక్స్ కౌన్సిల్ సమావేశం కాదు. కేవలం ముఖ్యమంత్రుల స్థాయిలో జరిగిన ఒక అనధికార సమావేశం. కృష్ణా, గోదావరి నదీ జలాల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న కమిటీ అన్ని అంశాలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటుంది. పార్లమెంటులో చేసిన రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాల అమలు నిబద్ధతకే దిక్కు లేదు. ఏ విషయంలోనైనా నమ్మకంతో ముందుకు పోవాలి తప్ప, అనుమానించుకుంటూ పోతే ఏ సమస్యలూ పరిష్కారం కావు..' అని ముఖ్యమంత్రి (విలేకరుల ప్రశ్నకు జవాబు) అన్నారు.

యుద్ధ ప్రాతిపదికన టెలీమెట్రీ

'కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాలకూ అనుమానాలున్నాయి. అందుకే టెలీమెట్రీ పరికరాలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఎవరెన్ని నీళ్లు వాడుతున్నారోనన్న రాష్ట్రాల సందేహాలకు ఇది శాశ్వత పరిష్కారం చూపిస్తుంది. కాబట్టి అవసరమైతే తెలంగాణ నిధులతోనే యుద్ధ ప్రాతిపదికన అన్ని పాయింట్లలో టెలీమెట్రీ ఏర్పాటు చేస్తాం. గోదావరి బోర్డు హైదరాబాద్‌లో, కృష్ణా బోర్డు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. శ్రీశైలం డ్యాం మరమ్మతులు తక్షణమే చేపట్టేందుకు ఏపీ అంగీకరించింది. ఈ నాలుగు అంశాలపైనే ఈసారి చర్చ సాగింది. టెలీమెట్రీ ఏర్పాటుతో పాటు శ్రీశైలం డ్యాం మరమ్మతులకు ఏపీని ఒప్పించడం కూడా రాష్ట్రం సాధించిన విజయమే. ఈ విషయంలో ఎలాంటి ఊహాగానాలకు తావు లేదు. కమిటీ ఏర్పాటు అయిన 30 రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం..' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

కేసీఆర్ రాష్ట్ర హక్కులు ఏపీకి ధారాదత్తం చేశారు

'గత సీఎం కేసీఆర్ తెలంగాణ హక్కులను ఏపీకి ధారాదత్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా అమలు చేయలేకపోయారు. పదేళ్ల అధికారంలో ఉండి ఏం సాధించారు? కనీసం బోర్డుల కార్యాలయాలు ఎక్కడ ఉండాలో కూడా నిర్ణయించలేకపోయారు. కానీ మేము సమస్యలను పరిష్కరించుకునే దిశగా అడుగులు వేస్తున్నాం. మా హయాంలో పలు అంశాలు చర్చల స్థాయికి రావడం, నాలుగు అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు రావడం తెలంగాణ సాధించిన విజయం. కానీ కొందరు అధికారం కోల్పోయిన బాధతో ఈ చర్చలు సఫలమవ్వకూడదని చూస్తున్నారు..' అని సీఎం విమర్శించారు. ఈ సమావేశంలో కేంద్రం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరించిందని, జలశక్తి మంత్రి ఈ విషయంలో ఎవరి పక్షాన నిలబడకుండా ఒక న్యాయమూర్తిలా వ్యవహరించారని కితాబు ఇచ్చారు.

సమావేశం ఫలప్రదం: ఏపీ మంత్రి నిమ్మల

కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం ఫలప్రదమైనట్లు ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాకు చెప్పారు. భేటీ స్నేహపూరిత, సుహృద్భావ వాతావరణంలో జరిగిందని అన్నారు. కేంద్రం ఏర్పాటు చేసే కమిటీ సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో పనిచేస్తుందని తెలిపారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- కూలిందన్న ప్రాజెక్టుపై నేనే స్వయంగా కారులో తిరిగి వచ్చిన..
- ఇసుక దందా కోసమే కాళేశ్వరం నీళ్లు ఇస్తలేరు..
- చర్చకు సిద్ధమని సీఎం రేవంత్‌కు సవాల్
- కాళేశ్వరంపై మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: తెలంగాణ రైతాంగానికి రెండు పంటలకు నీళ్లు ఇచ్చేందుకు కేసీఆర్ ఎంతో గొప్ప ఆలోచనతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు..అలాంటి ప్రాజెక్టుపై కాంగ్రెస్, కాంగ్రెస్‌వర్గ మీడియా దుష్ప్రచారం చేస్తోందని మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం సూర్యాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆయన రైతులు, నాయకులకు రెండు గంటల పాటు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సూర్యాపేటకు నీళ్లొచ్చాయో.. లేదో రైతుల వద్దకే వెళ్లి తెలుసుకుందామా అని ప్రశ్నించారు. దమ్ముంటే రా.. చిన్న సీతారాంతండాకు వెళ్దాం.. అక్కడి రైతులను అడుగుదాం వాళ్ల భూములకు నీళ్లు అందలేదంటే నన్ను కొడతరు.. నీళ్లు అందినాయంటే నిన్ను కొడతరని ఘాటుగా అన్నారు. కళ్ల ముందు నీళ్లు పోతుంటే రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారన్నారు. కూలిందన్న ప్రాజెక్టుపై నేనే స్వయంగా కారులో తిరిగి వచ్చిన అని.. సాక్ష్యాలన్నీ ప్రజల కళ్లముందున్నాయంటూ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక దందాకోసమే కాళేశ్వరం నీళ్లు ఇస్తలేదన్నారు. సూర్యాపేట జిల్లాకు లక్షలాది ఎకరాల్లో కాళేశ్వరం నీళ్లందించామన్నారు. నీళ్లు పారే కాలువల్లో నేడు తుమ్మలు, సర్కారు చెట్లు మొలుస్తున్నాయన్నారు. చంద్రబాబులాంటి నీటిదొంగలతో చర్చలెందుకని, చంద్రబాబు పంపిన వాళ్లను సలహాదారులుగా పెట్టి మరింత దిగజారావని సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్‌కుమార్, భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నాయకులు చెరుకు సుధాకర్, బండా నరేందర్‌రెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, రాకేశ్‌రెడ్డి, గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, అన్నపూర్ణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఏం చెప్పారంటే..

చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా గోదావరికి 38 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని, కాళేశ్వరం అంటే 3 బరాజ్‌లు..5 రిజర్వాయర్లు అని జగదీశ్‌రెడ్డి వివరించారు. 19 సబ్ స్టేషన్లు.. 21 పంప్‌హౌస్‌లు.. 203 కిలోమీటర్ల మేర సొరంగాలు.. 1,531 కిలోమీటర్ల మేర గ్రావిటీ కెనాల్స్ ఉన్నాయని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 98 కిలోమీటర్ల మేర ప్రెజర్ మెయిన్స్.. 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ గల ప్రాజెక్టు అన్నారు. 530 మీటర్ల ఎత్తుకు లిఫ్టు.. 240 టీఎంసీల నీటి వినియోగం.. ఇది కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపమని రైతులు, నాయకులకు కళ్లకు కట్టినట్టు వివరించారు.

బనకచర్లతో తెలంగాణకు మరణశాసనం

- రెండు రాష్ట్రాల సీఎంల భేటీలో ఆ ప్రాజెక్టు లేదని రేవంత్ బుకాయింపు
- చంద్రబాబుకు నదీజలాలను గురుదక్షిణగా రేవంత్ అప్పగిస్తున్నాడు:హరీశ్



సాక్షి, హైదరాబాద్: గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై కమిటీ ఏర్పాటుకు అంగీకరించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణకు ద్రోహం చేయడంతోపాటు మరణశాసనం రాస్తున్నారని మాజీమంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో బనకచర్ల అంశం ఎజెండాలో లేదని రేవంత్ బుకాయిస్తే తెలంగాణ ప్రజలను వంచించడమే అని మండిపడ్డారు. తెలంగాణ ద్రోహిగా మారిన రేవంత్ గురుదక్షిణగా ఏపీ సీఎం చంద్రబాబుకు నదీ జలాలను అప్పగిస్తున్నాడన్నారు. తెలంగాణకు ద్రోహం చేస్తున్న రేవంత్ రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారంరాత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'బనకచర్లపై సమావేశం పెడితే ఢిల్లీ సమావేశాన్ని బహిష్కరిస్తానని లీకులు ఇచ్చిన సీఎం అర్ధరాత్రి పరుగు పరుగున వెళ్లాడు. ఎజెండాలో బనకచర్ల అంశం ఉన్నా సీఎం ఎందుకు పాల్గొన్నాడో చెప్పాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సమావేశ ఎజెండాలో బనకచర్ల అంశం ఉందని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన ప్రకటనను హరీశ్ వినిపించారు.

టీడీపీ, బీజేపీ రిమోట్ పాలన

'తెలంగాణలో టీడీపీ, బీజేపీ రిమోట్ పాలన జరుగుతోంది. బనకచర్ల అంశాన్ని ఎజెండాలో పెట్టడమే కేంద్రం చేసిన తప్పు. బనకచర్లపై ఏపీ సమర్పించిన ప్రీ ఫీజిబులిటీ రిపోర్టును నాలుగు కేంద్ర ప్రభుత్వ సంస్థలు తిరస్కరించినా, కమిటీ ఏర్పాటుకు రేవంత్ తలూపి రాష్ట్రానికి తీరని నష్టం చేశాడు. కేఆర్‌ఎంబీ కార్యాలయాన్ని విజయవాడకు తరలించడాన్ని కూడా రేవంత్ తన నిర్ణయంగా చెప్పుకుంటున్నాడు. కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత అంశంపై గతంలో కేసీఆర్ గర్జిస్తే అసెంబ్లీలో తీర్మానం చేసి తోకముడిచాడు'అని హరీశ్‌రావు విమర్శించారు.

20 నెలల్లో ఏం సాధించారు

'రెండుమార్లు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఏపీ చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించకుండా కేసీఆర్‌ను విమర్శించడమే లక్ష్యంగా రేవంత్ మాట్లాడాడు. సాగునీటిరంగంలో 20 నెలలుగా కాంగ్రెస్ సాధించేదేమీ లేదు. గత ఏడాది కృష్ణాలో 34 శాతం నీటి వాటా ఉన్న వాడుకోకుండా నెట్టెంపాడు కింద క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాది బీఆర్‌ఎస్ ఒత్తిడి వల్లే కల్వకుర్తి లిఫ్టులను ఆన్ చేశారు. ఏపీ ప్రభుత్వం గోదావరి జలాలతోపాటు కృష్ణా జలాలను కూడా తరలించే కుట్రకు పాల్పడుతోంది. నాగార్జునసాగర్ కుడి కాల్వ సామర్థ్యాన్ని రెట్టింపు చేసి 150 టీఎంసీల బొల్లాపల్లి రిజర్వాయర్‌ను ఏపీ నింపుకునే కుట్రలు జరుగుతున్నాయి. రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలు కాపాడేందుకు ఢిల్లీకి అఖిలపక్షం తీసుకెళ్లాలి, సుప్రీంలో కేసులు వేయాలి. తెలంగాణకు అన్యాయం జరిగితే బీఆర్‌ఎస్ ఉద్యమిస్తుంది'అని హరీశ్ హెచ్చరించారు.

అనిల్ హత్య వెనుక టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే మనవడు?

▶ మొదటి పేజీ తరువాయి

తెలిసింది. డబ్బులు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో బెంజ్ కారు అప్పగించినట్లు సమాచారం. రోజులు గడుస్తున్నా ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఎమ్మెల్యే మనవడిని అనిల్ పరుష పదజాలంతో దూషించినట్లు తెలిసింది. దీన్ని ఎమ్మెల్యే మనవడు తీవ్ర అవమానంగా భావించి.. ఓ మాజీ నక్సలైట్‌కు సుపారీ, ఆయుధం ఇచ్చి అనిల్‌ను హత్య చేయించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు

అనిల్ హత్యలో ఏపీకి చెందిన కొందరు ప్రత్యక్షంగా పాల్గొన్నారని, నేరం చేసిన తర్వాత అక్కడికే పారిపోయారని తెలిసింది. ఇందులో తన మనవడి పాత్ర వెలుగులోకి వస్తుండటంతో ఆ సీనియర్ ఎమ్మెల్యే చక్రం తిప్పారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న ఆయన సోదరుడి కుమారుడు రంగంలోకి దిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తెలంగాణలో రాజకీయ పెద్దలతో తనకున్న సన్నిహిత సంబంధాలను ఉపయోగించుకుని.. ఇక్కడి పోలీసులపై 'పెద్ద' స్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నట్టు సమాచారం. కేసును తొక్కిపెట్టేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే రెండు రోజులుగా దర్యాప్తు నత్తనడకన నడుస్తున్నట్లు సమాచారం. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొంటున్న పోలీసులు.. ఎలాంటి పురోగతిని సాధించలేకపోతున్నారు. దీనికి రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. కాగా, అనిల్ అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం పైతరలో జరిగాయి.

అదుపులో నిందితులు?

సీనియర్ ఎమ్మెల్యే మనవడి వద్ద విల్లా కొనుగోలు చేసిన రామచంద్రారెడ్డి అనే వ్యక్తిని మెదక్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడిని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు సమాచారం. అనిల్‌తో పరిచయాలపై ఆరా తీసినట్లు తెలిసింది. అనిల్ గతంలో పలు తగాదాల్లో ఉన్న భూములను సెటిల్‌మెంట్లు చేశాడని, అందుకే విల్లాకు సంబంధించిన గొడవ తనకు చెప్పటంతో రూ.2 కోట్లకుగాను రూ.1.20 కోట్లు వసూలు చేశాడని పోలీసులకు వివరించినట్లు తెలిసింది. కాగా అనిల్‌పై కాల్పులు జరిపిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై మెదక్ డీఎస్పీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. లేరంటూ సమాధానం దాటవేశారు.

రాహుల్ కలను నిజం చేస్తున్నాం

- బెంగళూరు ఓబీసీ భేటీలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: 'మనమెంతో మనకంత'అనే నినాదాన్ని దేశ ప్రజలకు అందించి సమాజంలోని అన్ని వర్గాలకు సమాన భాగస్వామ్యం లభించాలన్న రాహుల్‌గాంధీ కలను నిజం చేసేం దుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ చేపట్టిన బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ దేశానికే ఆదర్శమని, ఈ అంశంలో తెలంగాణను అందరూ రోల్‌మోడల్‌గా తీసుకుంటున్నారని చెప్పారు. బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన బెంగళూరులో జరిగిన ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, కామారెడ్డి డిక్లరేషన్ నుంచి బీసీ రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్సును ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించేంతవరకు జరిగిన అన్ని విషయాలను వెల్లడించారు. ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వాముడిని కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి అయినప్పటికీ బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి సమావేశాలు అక్టోబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నుంచి ఓబీసీ ఎంపీల ఫోరం మాజీ కన్వీనర్ వి.హనుమంతరావు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు.

చర్చలు జరిగితే మీకు చలి జ్వరం వచ్చిందా?

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: కృష్ణా, గోదావరి జలాలపై ఢిల్లీలో చర్చలు జరిగితే బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. చర్చలు జరిగితే మీకు చలి జ్వరం వచ్చిందా? అని ఎద్దేవాచేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎజెండాలో బనకచర్ల లేకపోవడంతో తెలంగాణ సెంటిమెంటును రంగరించలేకుండా పోయిందని కుమిలిపోతున్నారా? అని ప్రశ్నించారు. ఇంకెంత కాలం తెలంగాణ సెంటిమెంటుతో బతకాలనుకుంటున్నారని నిలదీశారు. తెలంగాణకు కృష్ణా, గోదావరి జలాల వాటా నుంచి చుక్క నీరు కూడా వదులుకోమని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చి చెబుతున్నారన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా...

మళ్లీ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారు

- అందుకే కేటీఆర్, హరీశ్‌లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ ఎంపీల ధ్వజం

సాక్షి, న్యూఢిల్లీ: బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేటీఆర్, హరీశ్‌లు మళ్లీ ఆంధ్ర సెంటిమెంట్‌తో పబ్బం గడుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. అందుకే ఈ ఇద్దరు నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ చేసిన విమర్శలను కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రఘురామ రెడ్డి, బలరాం నాయక్‌లు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఢిల్లీలో వీరు మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్, రాజ్యాంగం గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ చామల మండిపడ్డారు. దళిత ముఖ్యమంత్రి, ఇతర హామీలు నెరవేర్చని సీఎం కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. ఆదర్శవంతంగా రాజకీయాలు చేయాలనుకున్న తమపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని ఎంపీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. అసెంబ్లీలో చర్చ జరుగుతుంటే ప్రతిపక్షనేత కేసీఆర్ ఫాం హౌస్‌లో ఎందుకు దాక్కున్నారని ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. రెండు రాష్ట్రాల జల వివాదాల విషయంలో కీలక చర్చ జరిగిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులపై మాట్లాడటానికి కేటీఆర్‌కు అర్హత లేదని, ప్రతిపక్షనేత హోదాలో కేసీఆర్ వస్తే తాము చర్చకు సిద్ధమని చెప్పారు.

నల్లగొండ అభివృద్ధిపై ఏనాడైనా సమీక్షించారా?

- జగదీశ్‌రెడ్డి, గ్యాదరి కిశోర్‌లపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శుల మండిపాటు



సాక్షి, హైదరాబాద్: పదేళ్లు మంత్రిగా పనిచేసిన జగదీశ్‌రెడ్డి తన సొంత ఊళ్లోని పేదలకు రేషన్‌కార్డులిచ్చారా? అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు పున్నా కైలాశ్ నేత, చనగాని దయాకర్ ప్రశ్నించారు. సొంతూరుకు కనీసం ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వని ఘనత కలిగిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులతోనే రెండు పంటలకు సాగునీరు అందుతోందని తెలిపారు. జగదీశ్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు కనీసం నల్లగొండ అభివృద్ధిపై సమీక్ష కూడా జరపలేదని, ఏడాదిన్నర కాలంలోనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 12 సార్లు సమీక్షలు నిర్వహించారని చెప్పారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో జరిగిన అనేక అవినీతి, అక్రమాల్లో జగదీశ్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. అధికారంలో ఉన్నన్ని రోజులు జగదీశ్‌రెడ్డి, గ్యాదరి కిశోర్ దొంగల ముఠాగా పనిచేశారని ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనపై, ఏడాదిన్నర ప్రజాపాలనపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, సీఎం రేవంత్‌రెడ్డిపై చౌకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కైలాశ్ నేత, దయాకర్ హెచ్చరించారు.

రూ.1.20 కోట్ల విలువైన బియ్యం మాయం?

- రంగారెడ్డి జిల్లా కిస్మత్‌పురా గోడౌన్‌లో గోల్‌మాల్
- విషయం కమిషనర్ దృష్టికి వెళ్లకుండా ప్రయత్నిస్తున్న అధికారులు!

సాక్షి, హైదరాబాద్: అవకతవకలకు అడ్డాగా మారిన పౌరసరఫరాల శాఖను దారిలో పెట్టాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆ శాఖలోని అధికారులే అడ్డుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. బాహాటంగా జరిగిన ఘటనలను తెరపైకి తెచ్చి, సస్పెన్షన్‌లతో హడావుడి చేస్తున్న అధికారులు.. గోదాములు, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో జరుగుతున్న అవకతవకలు బయటకు రాకుండా అడ్డు తగలడం చర్చనీయాంశమైంది. ఇటీవల రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు కిస్మత్‌పురా గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించగా, రూ.1.20 కోట్ల విలువైన బియ్యం ఏడాది క్రితమే మాయమైనట్లు తేలింది. అప్పట్లో గోదాం ఇన్‌చార్జిగా కొనసాగిన సహాయ గ్రేడ్–1 అకౌంటెంట్ ఒకరు రూ.1.20 కోట్ల విలువైన బియ్యాన్ని అమ్ముకున్నట్లు స్పష్టమైంది. కాగా, ప్రస్తుతం వనపర్తిలో ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరిస్తున్న బియ్యం మింగిన అధికారిని కాపాడేందుకు పౌరసరఫరాల శాఖలోని అధికారులే ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే బియ్యం మాయం చేసిన అధికారిపై అదనపు కలెక్టర్ ఇచ్చిన నివేదికను కమిషనర్ చౌహాన్ దృష్టికి వెళ్లకుండా ప్రధాన కార్యాలయం అధికారులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిన్నర క్రితమే కిస్మత్‌పురాలో రూ.1.20 కోట్ల విలువైన బియ్యం లెక్క తేలని విషయాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలో తేల్చినప్పటికీ, ఆ విషయం బయటకు రాకుండా మేనేజ్ చేశారు. దీంతో అప్పటి అధికారి కిస్మత్‌పురా నుంచి వనపర్తికి బదిలీపై వెళ్లినా, ఎలాంటి చర్యలు లేవని తెలుస్తోంది. ఇప్పుడు ఏకంగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చర్యలకు సిఫారసు చేసినా, మరోసారి అడ్డుకునే ప్రయత్నం జరుగుతుండడం గమనార్హం.

ఎల్బీనగర్ అసిస్టెంట్ మేనేజర్‌పై వేటు

సన్నబియ్యం పక్కదారి పట్టించిన కేసులో మరో అధికారిని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్‌లోని హైదరాబాద్ జిల్లా గోదాం నుంచి సన్న బియ్యం పక్కదారి పట్టేందుకు కారణమైన పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ శివచరణ్‌పై వేటు వేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ నీటి వాటాకు ఏపీ అడ్డుపడుతోంది

- తెలంగాణకు దక్కాల్సిన నీటిలో చుక్క కూడా వదలం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ములకలపల్లి/దమ్మపేట: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామి అయిన ఏపీ ప్రభుత్వం తెలంగాణకు రావాల్సిన నీటి వాటా అంశంలో అడ్డుపడుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేటలో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర పాలకులు రాజకీయ, స్వలాభాల కోసం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విభజన చట్టాల అమల్లో పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం ఏపీకి కొమ్ముకాస్తోందని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో నీటి విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తెలంగాణ రైతులకు దక్కాల్సిన చుక్క నీటిని కూడా వదులుకునేది లేదని స్పష్టం చేశారు. గిరిజనుల భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా రూ. 9 కోట్ల వ్యయంతో మూరుమూల ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

రాష్ట్రంలో రాబోయే మూడున్నర సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని మంత్రి పొంగులేటి అన్నారు. దమ్మపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులంలో బుధవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు, 18 నెలల కాంగ్రెస్ పాలనకు తేడా అందరికీ తెలుస్తోందన్నారు. ధనిక తెలంగాణను పాలించిన దొరలు, పేదల సంక్షేమం కోసం చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల మందికి మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. పోడు భూములు సాగుచేస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని అధికారులకు సూచించారు. పావలా వడ్డీ కింద మంజూరైన చెక్కులు, ఇతర మహిళా రుణాలకు సంబంధించిన చెక్కులతో పాటు నూతన రేషన్ కార్డులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో టీఎస్‌ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ రాహుల్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నిధులు రాహుల్ గాంధీకి.. నీళ్లు చంద్రబాబుకు..

- ముసుగు వీడింది.. నిజం తేటతెల్లమైంది
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: 'నీ గురువుపై విశ్వాసం చూపించడానికిం తెలంగాణ విధ్వంసం కావలసిందేనా'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు రాహుల్ గాంధీకి, నీళ్లు చంద్రబాబుకు, తెలంగాణ వ్యతిరేకిని ముఖ్యమంత్రిగా గెలిపించినందుకు బూడిద తెలంగాణ ప్రజలకు అన్న చందంగా మారిందన్నారు. ఢిల్లీలో బుధవారం జరిగిన సమావేశంతో ముసుగు వీడి తేటతెల్లమైందని, కోవర్టులు ఎవరో, తెలంగాణ కోసం కొట్లాడిన వారు ఎవరో ఈ సమావేశంతో తేలిపోయిందని బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బనకచర్ల గురించి చర్చే రాలేదని బుకాయించి.. గురుదక్షిణగా గోదావరి జలాలను అప్పచెప్పడం కోసమా నువ్వు గద్దెనెక్కిందని ప్రశ్నించారు. జై తెలంగాణ అనడానికి ఉన్న సిగ్గు... నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల హక్కులను చంద్రబాబుకి ధారపోయడానికి మాత్రం లేదా అని నిలదీశారు. ఇంకెందుకు రెండు రాష్ట్రాలు, ఇద్దరు ముఖ్యమంత్రులు అని ప్రశ్నించారు. నిన్ను ఎన్నుకున్న పాపానికి సరిహద్దులు చెరిపేస్తే తెలంగాణ మీద నీ అక్కసు చల్లారుతుందేమోనని, జై తెలంగాణ అనాల్సిన బాధ నీకు తప్పుతుందేమో అని అన్నారు. ఒక్క మాట గుర్తు పెట్టుకో.. ఒక్క బొట్టు నీరు అక్రమంగా అప్పజెప్పినా, మరో పోరాటం చూస్తావని, ప్రాంతేతరుడు మోసం చేస్తే తరిమి, తరిమి కొడతామని, ప్రాంతం వాడు మోసం చేస్తే ఇక్కడే పాతి పెడతామని హెచ్చరించారు. తెలంగాణను పీక్కుతింటున్న రాబందుల పని తప్పక పడతామన్నారు.

మేడిగడ్డ బరాజ్ మీదనే చర్చిద్దాం

- స్థానిక ఎన్నికల్లో ప్రజలు సత్తా చూపించడం ఖాయం
- దళితబంధును ప్రారంభించి రూ.12 లక్షలు ఇవ్వాలి : కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును 'కూలేశ్వరం'అంటూ ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఆయన కూలిపోయిందంటున్న మేడిగడ్డ బరాజ్ మీదనే చర్చకు రావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. గతంలో చర్చకు రావాలని సవాల్ విసిరిన రేవంత్‌కు మూడు రోజుల సమయం ఇచ్చి ప్రెస్‌క్లబ్‌లో చర్చకు వెళితే పారిపోయాడని ఎద్దేవా చేశారు. చర్చకు రమ్మని పిలిచి పారిపోయిన పిరికిపంద రేవంత్‌రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణభవన్‌లో బుధవారం జరిగిన దళితబంధు సాధన సమితి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఇప్పటికే మేడిగడ్డ బరాజ్‌కు చర్చకు రావాలని సవాల్ విసిరిన విషయాన్ని గుర్తు చేశారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో చివరి మడి వరకు కేసీఆర్ నీళ్లు ఇచ్చారని తెలిసినా, సీఎం రేవంత్ అబద్ధాలు వల్లె వేస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ సత్తా చూపడం ఖాయమన్నారు. రేవంత్ లాంటి మోసగాళ్లను వెనక్కి రప్పించేందుకు రీకాల్ వ్యవస్థ అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. హామీల అమలును ప్రశ్నించిన వారిపై అప్రజాస్వామికంగా కేసులు నమోదు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ఎన్ని కేసులు పెట్టి అణచివేతలకు పాల్పడినా కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు.

దళితబంధు నిలిపివేతపై ఆగ్రహం: దళితబంధుపై ప్రభుత్వం విధించిన ఆంక్షలు తొలగించి.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.12 లక్షల చొప్పున ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు త్వరలో లేఖ రాస్తానన్నారు. అధికారంలోకి వస్తే రూ.12లక్షలు ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ దళితులను మోసగించిందని కేటీఆర్ పేర్కొన్నారు.



దేన్నీ సాహసించకపోతే, దేన్నీ సాధించలేము.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 17 జూలై 2025

ట్రంప్ కొత్త రాగం!

చాలా తరచుగా మాటలు మార్చే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై కత్తిగట్టారు. 50 రోజుల్లోగా ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి రాకపోతే 'కఠినాతి కఠినమైన' సుంకాలు విధించటంతోపాటు, తీవ్రమైన ఆంక్షలు మొదలుపెడతానని హెచ్చరించారు. అంతేకాదు... ఉక్రెయిన్ కోసం నాటో దేశాలకు పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థనూ, ఇతరేతర ఆయుధాలనూ విక్రయిస్తారట. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగినప్పుడు రిపబ్లికన్ పార్టీ వైఖరికీ, ట్రంప్ అప్పట్లో చేసిన ప్రకటనలకూ తాజా హెచ్చరికలు పూర్తి విరుద్ధం. ఉక్రెయిన్ విషయంలో బైడెన్ ప్రభుత్వానికి మద్దతునిచ్చారంటూ తమ పార్టీకి చెందిన అప్పటి స్పీకర్ కెవిన్ మెకార్తీకి ఉద్వాసన పలికింది రిపబ్లికన్‌లే. అటు తర్వాత వచ్చిన మైక్ జాన్సన్‌ను సైతం ఇబ్బంది పెట్టారు. చిత్రమేమంటే అప్పట్లో ఉక్రెయిన్‌కు సాయం అందించటాన్ని గట్టిగా వ్యతిరేకించినవారంతా ఇప్పుడు ట్రంప్ మాదిరే అభిప్రాయాలు మార్చుకుని ఆయనకు మద్దతునిస్తున్నారు. ట్రంప్ విధానం అద్భుతమైనదంటూ పొగుడుతున్నారు. ఉక్రెయిన్‌కు అందించదల్చుకున్న ఆయుధాలను ట్రంప్ నాటోకు విక్రయిస్తున్నారని, అందువల్ల అమెరికా నష్టపోయేదేమీ వుండదని వీరి వాదన. యూరప్ దేశాలు ఇటీవల రక్షణ బడ్జెట్లను విపరీతంగా పెంచాయి. ఆ డబ్బంతా అమెరికా ఖజానాకు చేరుతుందన్నది రిపబ్లికన్ల అంచనా.

ట్రంప్ అన్నంత పనీ చేస్తారని నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఇప్పుడున్న వైఖరి సెప్టెంబర్ నాటికి వుంటుందనటానికి లేదు. తాను అధ్యక్షుడయ్యాక కలవటానికొచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని వైట్‌హౌస్‌లో తీవ్రంగా అవమానించి, యుద్ధోన్మాదిగా చిత్రించిన ట్రంప్ ఆర్నెల్లయ్యేసరికి ఆ పాత్ర తానే పోషించటానికి సిద్ధపడ్డారు. ట్రంప్ చెబుతున్న ప్రకారం రష్యా దారికి రాకపోతే ఆ దేశంతో వాణిజ్యం నెరపే దేశాలపై కూడా వంద శాతం సుంకాలు విధించాలి. అంటే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న మన దేశంతోపాటు ఏటా 25,000 కోట్ల డాలర్ల మేర దిగుమతులు చేసుకుంటున్న చైనాపై కూడా చర్యలుండాలి. మన మాటెలావున్నా ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో రెండో స్థానంలో వున్న చైనాతో నేరుగా యుద్ధానికి దిగటంతో సమానం. పిపీలక ప్రాయమైన ఉక్రెయిన్ కోసం ట్రంప్ ఇంత వివాదానికి దిగుతారా అన్నది ప్రశ్నార్థకం. పైగా అమెరికా మిత్ర దేశాలైన ఈయూ, జపాన్ సైతం రష్యాతో ఇప్పటికీ గణనీయంగా వాణిజ్య లావాదేవీలు సాగిస్తున్నాయి. లక్ష్మణ రేఖల్ని గీయటంలో ట్రంప్‌ను మించినవారు లేరు. అధిక సుంకాల విధింపు హెచ్చరిక ఏమైందో కనబడుతూనే వుంది. దాన్ని వరసగా పొడిగించుకుంటూ పోతున్నారు. ప్రస్తుతానికి వచ్చే నెల 1వ తేదీ తాజా డెడ్‌లైన్. అసలు పదవిలోకి వచ్చేముందే 'నేను అధ్యక్షుడినైన రెండు వారాలకల్లా రష్యా–ఉక్రెయిన్ లడాయి ఆగితీరాలి' అని హెచ్చరించిన విషయం ఎవరూ మరిచిపోరు.

ఉక్రెయిన్‌ను అడ్డుపెట్టుకుని ఏదోవిధంగా రష్యాను అదుపు చేయటానికి శ్రమిస్తున్న నాటో కూటమి ఎలాగైతేనేం ట్రంప్ అంతరంగాన్ని పట్టుకుని, ఆయన అభిప్రాయాన్ని మార్చగలిగింది. మొన్నటివరకూ తిట్టిన నోరే మెచ్చుకునేలా చేసింది. కానీ ఇదెంత కాలం? నిజానికి 'వేల కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు నాటోకు అందిస్తాం. మొండికేస్తున్న రష్యాను దారికి తెస్తాం' అంటూ ట్రంప్ సోమవారం చేసిన ప్రకటన నాటోను లోలోన వణికిస్తోంది. కొత్తగా తాము పెంచుకున్న రక్షణ కేటాయింపులన్నీ అమెరికా ఆవిరి చేస్తుందన్న భయం వాటిని వేధిస్తోంది. పైగా అవసరమైన ఆయుధాలు అందించటం రోజుల్లో, నెలల్లో పూర్తయ్యేది కాదు. అమెరికా, యూరప్ దేశాల దగ్గరున్న ఆయుధాలన్నిటినీ వినియోగించినా రష్యాపై తక్షణ ఆధిక్యత అసాధ్యం. కొత్తగా ఆయుధాల ఉత్పత్తి మొదలై నాటో కూటమికి చేరటానికి సంవత్సరాలు పట్టొచ్చు. యూరప్ దేశాల్లో వున్న ఆయుధ పరిశ్రమ పరిమాణం చిన్నది. అమెరికా ఒక్కటే లక్ష్యాన్ని పూర్తి చేయటం అంత సులభం కాదు. వాణిజ్యం వరకూ చూస్తే రష్యా నుంచి అమెరికా దిగుమతులు ఎక్కువేమీ కాదు. అవి 300 కోట్ల డాలర్లు మించవని నిపుణులు చెబుతున్నారు. వాటిలో అమెరికాకు ఎంతో అవసరమైన ఎరువులు, ఇనుము, ఉక్కు, యురేనియంలున్నాయి. ఇప్పటికే మూడేళ్లుగా ఆర్థిక ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా కొత్తగా నష్టపోయేది కూడా వుండదు. కానీ రష్యాతో వాణిజ్య లావాదేవీలున్న దేశాలను గణనీయంగా దెబ్బతీసేందుకు అవకాశం వుంటుంది. కానీ అది ఆచరణ సాధ్యమేనా?

ఈ చర్యలన్నీ అమలైతే రష్యా స్పందన గురించి ట్రంప్ ఆలోచించినట్టు లేరు. ఆ పర్యవసానాలను ఎదుర్కొనగలిగే శక్తిసామర్థ్యాలు అమెరికాకు లేవు. ఇప్పటికే పీకల్లోతు రుణ భారంతో కుంగుతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈ యుద్ధంలో వేలుపెడితే మరింత దిగజారుతుంది. ఏరికోరి ఈ విపత్తు తెచ్చుకోవటానికి ట్రంప్ సిద్ధపడకపోవచ్చు. అయితే రష్యాకు ఆయన విధించిన గడువులో ఒక మతలబుంది. మరో యాభై రోజులకల్లా వేసవి ముగిసి, హిమ పాతం మొదలై రష్యాకు ఇబ్బందులెదురవుతాయి. ఇప్పటికే స్వాధీనమైన తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాలు నిలబెట్టుకోవటం మినహా అది చేయగలిగేది వుండదు. ఎటూ యుద్ధం జోరు తగ్గుతుంది గనుక దాన్ని తన ఘనతగా చెప్పుకోవటమే ట్రంప్ ఆంతర్యమని నిపుణులంటున్న మాట కొట్టివేయదగ్గది కాదు. యుద్ధాన్ని అంతం చేయటానికి దాన్ని మరింత తీవ్రతరం చేస్తామనటం తెలివితక్కువైనా కావాలి... మూర్ఖత్వమైనా కావాలి. ట్రంప్ వ్యవహార శైలి దేనికి దగ్గరగా వున్నదో త్వరలో తేలిపోతుంది.

నిధులు ముద్దు... జాప్యం వద్దు!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

ప్రభుత్వం ఇటీవల ఒక లక్ష కోట్ల రూపాయల నిధితో ఒక నూతన పరిశోధన, అభివృద్ధి, నవీకరణ(ఆర్డీఐ) పథకానికి ఆమోదం తెలిపింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ప్రగాఢమైన సాంకేతిక రంగాల్లో నవీకరణ, వాణిజ్యపరమైన పరిశోధన–అభివృద్ధి (ఆర్–డి)లో ప్రైవేటు రంగ పెట్టుబడులను పెంపొందించే ఉద్దేశంతో ఈ నిధిని నెలకొల్పింది. దీర్ఘకాలిక రుణ సదుపాయాల కల్పనకు లేదా తక్కువ వడ్డీ రేట్లపై రీఫైనాన్సింగ్‌కు ఈ నిధులను వినియోగిస్తారు. జాతీయ లక్ష్యమైన స్వావలంబన సాధనకు చేయూతనందించదలచుకున్న ప్రైవేటు కంపెనీలు ఆర్–డి, టెక్నాలజీ అభివృద్ధి స్థాయిని పెంచాలనుకున్నప్పుడు వృద్ధి, రిస్క్ క్యాపిటల్ రూపంలో ఈ నిధులు అందుతాయి. కీలకమైన లేదా వ్యూహాత్మకంగా ప్రాధాన్యం ఉన్న టెక్నాలజీల సమీకరణతో ప్రమేయం ఉన్నవాటితోపాటు, 'టెక్నాలజీ సంసిద్ధత స్థాయి'ని హెచ్చుగా కనబరచిన ప్రాజెక్టులకు రుణాలు ఇస్తారు.

పరిశోధనలో ఎక్కడున్నాం?

'ఆర్–డి'లో పెట్టుబడులు తక్కువగా ఉండటం, ప్రైవేటు రంగ వాటా పేలవంగా ఉండటంతో నూతన నిధిని సృష్టించవలసిన అవసరం ఏర్పడింది. ఆర్–డిపై స్థూల వ్యయాన్ని (జీఈఆర్డీ)గా పిలుస్తారు. ఇది ఎంత ఉందనేదానిని బట్టే పరిశోధనల పట్ల సదరు దేశపు నిబద్ధతను అంచనా వేస్తారు. భారతదేశపు జీఈఆర్డీ అత్యల్పంగా 0.64 శాతంగా ఉంది. ఎదుగు బొదుగు లేకుండా ఉండిపోయిన ఈ సంఖ్య, వాస్తవానికి, 2019–20 నుంచి ఇంకా తగ్గిపోవడం ప్రారంభించింది. అయితే, స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి.)లో పెరుగుదలతోపాటు ఆర్–డి కాసుల మూట కూడా కాస్తోకూస్తో బరువు పెరుగుతూ రావడం ఒక్కటే ఊరటనిచ్చే అంశం.

ఆర్–డిపై వ్యయంలో భారత్ స్థానం ఎక్కడా చెప్పుకోతగినదిగా లేదు. ఈ విషయంలో అమెరికా 784 బిలియన్ల డాలర్లతో 2023లో మొదటి స్థానంలో నిలిచింది. చైనా (723 బిలియన్ల డాలర్లు), జపాన్ (184 బిలియన్ల డాలర్లు), జర్మనీ (132 బిలియన్ల డాలర్లు), దక్షిణ కొరియా (121 బిలియన్ల డాలర్లు), బ్రిటన్ (88 బిలియన్ల డాలర్లు), ఇండియా (71 బిలియన్ల డాలర్లు) ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయని 'వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్' వెల్లడిస్తోంది.

చైనాతో సహా ఆర్–డిపై అధికంగా వెచ్చిస్తున్న దేశాల్లో ప్రైవేటు రంగమే దానికి సారథ్యం వహిస్తున్నట్లు తెలుస్తుంది. భారతదేశంలో మాత్రం జీఈఆర్డీకి ప్రభుత్వ రంగమే ప్రధాన చోదక శక్తిగా నిలుస్తోంది. మన దేశంలో ఆర్–డిపై మొత్తం వ్యయంలో ప్రైవేటు రంగ వాటా 36.4 శాతంగానే ఉంది.

ప్రభుత్వ ఊతంతోనే ఎదుగుదల!

ఉన్నత సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో ప్రైవేటు రంగ పెట్టుబడిని నష్ట ప్రమాదం లేకుండా మార్చేందుకు ఈ రకమైన ప్రోత్సాహక చర్యకు శ్రీకారం చుట్టడం ఇదే మొదటిసారేమీ కాదు. ప్రపంచీకరణ యుగంలో సాఫ్ట్‌వేర్, బయోటెక్నాలజీ విప్లవాలు బాగా ప్రాచుర్యం పొందాయి. అవి విజయవంతమైన ఉదాహరణలుగా నిలవడం వెనుక ప్రభుత్వ ప్రాయోజిత పథకాల మూల నిధులు ఉన్నాయి.



సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ (ఎస్టీపీ) అనే కొత్త ఐడియానే తీసుకుందాం. ఉపగ్రహ డాటా–లింక్ సదుపాయాలు పంచుకోవడం, సరసమైన ధరలకు కార్యాలయాల స్థలాన్ని పొందడం, పన్నుల్లో భారీ వెసులుబాట్ల రూపంలో ఔత్సాహిక సాఫ్ట్‌వేర్ సంస్థలకు ఎంతో అవసరమైన సహాయం ఎస్టీపీ ద్వారా లభించింది. అలా ఉత్సాహం చూపిన చాలా సంస్థలు కోట్లాది డాలర్ల బృహత్ సంస్థలుగా రూపాంతరం చెందాయి. ఆర్–డి, ప్రాడక్ట్ డెవలప్‌మెంట్ ఔట్‌సోర్సింగ్‌లోకి అవి విస్తరించాయి. భారతదేశపు జి.డి.పి.లో సాఫ్ట్‌వేర్ రంగ వాటా ప్రస్తుతం సుమారు 8 శాతంగా ఉంది.

శాంతా బయోటెక్నిక్స్, భారత్ బయోటెక్ మొట్టమొదటి బయోటెక్నాలజీ, వ్యాక్సీన్ కంపెనీలు అదే కోవలో లబ్ధి పొందినవే. సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో నెలకొల్పిన టెక్నాలజీ అభివృద్ధి బోర్డు (టి.డి.బి.) ఆ రెండు సంస్థలకు ఉదారంగా నిధులు అందించింది. అవి కూడా నిధులను సద్వినియోగం చేసుకుని, హైదరాబాద్‌ను భారతదేశపు వ్యాక్సీన్ రాజధానిగా అవతరించేటట్లు చేశాయి.

విద్యాసంస్థలతో కలిసి నడిస్తేనే...

ఆర్–డిపై ఆసక్తి ఉన్న ప్రైవేటు రంగాన్ని తీసుకురావడంలో ఇంతవరకు గడించిన అనుభవాన్ని ఆధారం చేసుకుని ఇంకా పైకెదగడం, ఇంతకుముందు తెచ్చిన పథకాల్లోని లోటుపాట్లను సరిదిద్దుకోవడం తెలివైన పని అనిపించుకుంటుంది. మొట్టమొదటగా, అటువంటి పథకాల అమలులో, అధికార యంత్రాంగం నుంచి ఎదురయ్యే జాప్యాలను తలచుకుని ప్రైవేటు రంగం ఎప్పుడూ జంకుతూ ఉంటుంది. కనుక, పాలనాపరమైన జోక్యం వీలైనంత తక్కువగా ఉండేటట్లు చూడాలి.

కొత్త ఆర్డీఐ పథకం పాలనాపరంగా పీడకలకు కారణమయ్యేదిగా కనిపిస్తోంది. ఈ పథకానికి 'వ్యూహాత్మక దిశా నిర్దేశం' చేసేందుకు ప్రధాన మంత్రి అధ్యక్షతన గల 'అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్' (ఎ.ఎన్.ఆర్.ఎఫ్.) గవర్నింగ్ బోర్డ్ పెద్ద తలకాయలా ఉంటుంది. ఎ.ఎన్.ఆర్.ఎఫ్. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మార్గదర్శక సూత్రాలను ఆమోదించి, నిధులు ఇవ్వదగిన ప్రాజెక్టుల పరిధి, తరహాలపై సిఫార్సు చేస్తుంది. క్యాబినెట్ కార్యదర్శి అధ్యక్షతన కార్యదర్శుల సాధికార బృందం ఒకటి ఉంటుంది. ఏయే రంగాల్లో, ఏయే తరహా ప్రాజెక్టులకు నిధులు సమకూర్చవచ్చునో ఈ బృందం సిఫార్సు చేస్తుంది. వాటి పనితీరుపై సమీక్ష నిర్వహిస్తుంది. ఈ అధికార యంత్రాంగపు పిరమిడ్‌కు అట్టడుగున వైజ్ఞానిక, సాంకేతిక శాఖ ఉండి ఈ పథకాన్ని అమలుపరుస్తుంది. రెండు అంచెల వ్యవస్థ ద్వారా నిధుల ప్రవాహం సాగుతుంది. ఎ.ఎన్.ఆర్.ఎఫ్. లోపల స్పెషల్ పర్పస్ ఫండ్ (ఎస్.పి.ఎఫ్.) అని ఒకటుంటుంది. అలాగే, ద్వితీయ స్థాయి ఫండ్ మేనేజర్లు కొందరుంటారు.

కొల్లేటి చాంతాడు లాంటి అధికార యంత్రాంగాన్ని అలా ఉంచితే... రూ. 10,000 కోట్ల నిధులతో డీప్ టెక్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ పేరుతో ఆర్డీఐ లాంటి పథకం ఇప్పటికే ఒకటి ఉంది. అయినా, కొత్త దానికి ఎందుకు రూపకల్పన చేశారో అర్థం కాదు. స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో, ఏఐ, బయోటెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రిస్క్ ఎక్కువ ఉన్న రంగాల్లో వ్యాపారాల తొలి అభివృద్ధి దశల్లో పెట్టుబడులకు డీప్ టెక్ ఫండ్ సాయపడాల్సి ఉంది. బహుశా, ఒకే రకమైన పథకాలు రెండింటికి రూపకల్పన చేశామని గ్రహించినందువల్లనే కాబోలు, డీప్ టెక్ ఫండ్‌కు ఆర్డీఐ నిధులు తరలించవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక నిధి మరో నిధికి నిధులిస్తే, ఇక అది ఏ ప్రయోజనాలను నిర్వర్తించనున్నట్లు?

టెక్నాలజీ అభివృద్ధిని ప్రైవేటు రంగం చేపట్టాలని మనం కోరుకుంటున్నట్లయితే, విద్యా సంస్థలతో కలసి పనిచేయడమనే ప్రాథమిక సూత్రం ఉండనే ఉంది. వాటితో కలసి అడుగులు వేస్తే, ఐడియాలలో పురోగతిని త్వరగా అందిపుచ్చుకునేందుకు కంపెనీలకు వీలవుతుంది. పీహెచ్‌డీ హోల్డర్లు, సుశిక్షితులైన రిసెర్చర్లు, ఇంజనీర్లు తగినంత సంఖ్యలో అందుబాటులో ఉంటారు. పరిశోధనా దశ నుంచే సహకారాన్ని ఇచ్చిపుచ్చుకుంటే, వస్తువులను అభివృద్ధిపరచగల సమయాన్ని కంపెనీలు కుదించుకోగలుగుతాయి. దీనికి, విద్యా సంస్థల్లో పరిశోధనను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీల్లో ముందడుగులో ఉన్న దేశాలు అదే చేశాయి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

◆ పరిశోధన–అభివృద్ధి(ఆర్–డి) వ్యయంలో భారత్ స్థానం చెప్పుకోతగినదిగా లేదు. అమెరికా 784, చైనా 723 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తుండగా, ఇండియా వెచ్చింపు కేవలం 71 బిలియన్ డాలర్లు.

◆ మన దేశంలో ఆర్–డిపై మొత్తం వ్యయంలో ప్రైవేటు రంగ వాటా 36.4 శాతమే.

◆ టెక్నాలజీ అభివృద్ధిని ప్రైవేటు రంగం చేపట్టాలని మనం కోరుకుంటున్నట్లయితే, విద్యా సంస్థలతో కలసి పని చేయడమనే ఒక ప్రాథమిక సూత్రం ఉండనే ఉంది. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ వంటి వాటిలో ముందడుగులో ఉన్న దేశాలు ఆ పనే చేశాయి.

సోషల్ మీడియా

పాములు - మనుషులు



చెన్నై శివార్లలోని 'ఇరుల స్నేక్ క్యాచర్స్ కో ఆపరేటివ్ సొసైటీ'ని మొదటిసారి దర్శించినప్పుడు ఆశ్చర్యపోయాను. ఇండియాలో పాము విషానికి విరుగుడు 80 శాతం వీళ్లే సరఫరా చేస్తున్నప్పటికీ, పాములను సంతాన కాలంలో అసలు పట్టుకోరు. పైగా విషం తీసిన తర్వాత వాటిని జాగ్రత్తగా అడవిలో వదిలేస్తారు. మన పర్యావరణ వ్యవస్థను కాపాడుతున్నప్పటికీ మనం తప్పుగా అర్థం చేసుకునే పాములనూ, వాటిని కాపాడే సమాజాలనూ 'ప్రపంచ పాముల దినోత్సవం' (జూలై 16) సందర్భంగా గౌరవించుకుందాం!

– సుప్రియా సాహు, తమిళనాడు ఉన్నతాధికారి

మించిపోలేదు!



మిమ్మల్ని మీరు క్షమించుకోండి. తప్పుడు ఎంపిక చేసుకున్నందుకు కాదు, అంతకంటే మెరుగైనది మీకు తెలియనందుకు. అంత ఆలస్యమేం కాలేదు. మీరు అంత దూరమేం పోలేదు. ఏ క్షణంలోనైనా మీరు మళ్లీ మొదలు పెట్టొచ్చు.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

అగౌరవం



బంగ్లాదేశ్‌లో సత్యజిత్ రే పూర్వీకుల ఇంటిని ధ్వంసం చేశారు. అవును, భారతదేశ అత్యంత గొప్ప దర్శకుడు, కళకు గ్లోబల్ ఐకాన్ లాంటి రే ఇంటినే! 'నోబెల్ శాంతి బహుమతి విజేత' మహమ్మద్ యూనస్‌కు తెలిసే ఇది జరిగింది. అది కేవలం ఇల్లు కాదు. అది ఉమ్మడి బెంగాలీ వారసత్వ సంకేతం. ఇండియా, బంగ్లాదేశ్ రెండింటికీ చెందే వారసత్వం.

– రాధారమణ్ దాస్, సాధువు

రోబో కావొద్దు!



మీరే ఒక రోబోను నియంత్రించే ఉద్యోగానికీ, మీరే ఒక రోబో కావడానికీ తేడా ఉంది.

– నవల్ రవికాంత్, ఇన్వెస్టర్

పరుగు ధ్యానం



పరుగెత్తడం అనేది అత్యంత చవకైన వైద్యం. పరుగెత్తడం అనేది మన లోపలికి మనం చేసుకునే ప్రయాణం.

– షాజన్ సామ్యూల్, అల్ట్రా రన్నర్

ఇన్ బాక్స్

రైతుల ఐక్యతా విజయం!

బెంగళూరు ఎయిర్ పోర్టుకు దగ్గరలోని దేవనహల్లి తాలూకా చెన్నారాయ పట్టణ మండలంలోని 13 గ్రామాల ప్రజలకు చెందిన 1,778 ఎకరాల భూసేకరణ కోసం మూడు సంవత్సరాల క్రితం అప్పటి బీజేపీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ 13 గ్రామాల ప్రజలు గతంలో మూడుసార్లు ప్రభుత్వం చేసిన భూసేకరణలో మొత్తం భూములు కోల్పోగా, మిగిలిన ఈ భూమికి నాల్గవసారి నోటిఫికేషన్ ఇచ్చారు. మొత్తంగా వ్యవసాయానికే పూర్తిగా దూరమవుతామనే బాధతో ఈ గ్రామాల రైతాంగం సంఘటితమై పోరాటం మొదలుపెట్టారు.

పోరాటం 25 రోజులు అయిన సందర్భంగా, 'ఏఐకేఎంకేఎస్' అనుబంధ 'కర్ణాటక రాజ్యరైతు సంఘం' (కేఆర్ఆర్ఎస్) చెన్నరాయపట్న ధర్నా స్థలం నుండి పాదయాత్ర చేపట్టి రైతులంతా మరింత పట్టుదలతో నిలబడాలని ప్రచారం చేసింది. అప్పటినుంచి అనేక రోజులు ఆ రైతులతో కలిసి పోరాడుతూ వచ్చింది. 1,198 రోజుల పాటు వివిధ దశలలో జరిగిన సంయుక్త పోరాటానికి 'చాగనూరు సిరివర భూరక్షణ హోరట సమితి' వంటి వివిధ రైతుసంఘాలతో కలిసి అండగా నిలిచింది.

అప్పుడు ప్రతిపక్షంలో ఉండి సిద్ధరామయ్య ఇచ్చిన మాట, అధికారంలోకి వచ్చాక నిలబెట్టుకోకుండా భూసేకరణ జరిపి తీరుతామని రెండు మూడు నెలల క్రితం ప్రకటించడంతో పోరాటం తీవ్రరూపం దాల్చింది. రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశ వ్యాప్తంగా ఈ పోరాటానికి సంఘీభావం పెరిగింది. వివిధ రైతుసంఘాలు, రాజకీయ పార్టీలు ఆఖరి పోరాటానికి సిద్ధపడ్డాయి. వివిధ దశల్లో ప్రభుత్వంతో చర్చలు నడిచాయి. రాజీలు, ఎక్కువ నష్టపరిహారాలు కుదరవని రైతులు తెగేసి చెప్పారు. ప్రాణం పోయినా తమ భూములు ఇచ్చేది లేదని తెగువతో నిలిచారు. ఆ కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను రద్దుచేసుకున్నట్టు ప్రకటించింది. ఆ 13 గ్రామాల రైతులకు, అండగా ఉన్న కర్ణాటక రైతులకు అభినందనలు. పోరాడకుండా మన భూములను, మన వ్యవసాయాన్ని కాపాడుకోలేం. భవిష్యత్తులో కూడా దేశ వ్యాప్తంగా రైతులు, కూలీలు, వివిధ వృత్తులు చేసుకునే వారంతా కలిసికట్టుగా ఉండి కార్పొరేట్ కంపెనీలు, బహుళజాతి కంపెనీల నుంచి మన జీవనాధారమైన వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి ఐకమత్యంతో ఉద్యమించాలి.

– ఆర్. మాధవరెడ్డి, కర్ణాటక రాజ్య రైతు సంఘ రాజ్యాధ్యక్షులు । చాగనూరు మల్లికార్జునరెడ్డి, చాగనూరు సిరివర భూరక్షణ హోరట సమితి, బళ్లారి

అక్కడ చదివి... ఇక్కడ త్రిశంకు స్వర్గంలో!

అభిప్రాయం



డా॥ టి. సేవకుమార్

విదేశాలలో వైద్య విద్యను పూర్తి చేసివచ్చిన మన విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. అందుకే తమ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వైద్య విద్యార్థులు జూలై 1వ తేదీ నుండి ఉద్యమ బాట పట్టారు. అనేకమంది భారతీయ విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు రష్యా, ఉక్రెయిన్, చైనా, ఫిలిప్పైన్స్, జమైకా, కజకిస్తాన్ వంటి విదేశాలకు వెళ్తున్నారు. విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ద్వారా 'ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్' (ఎఫ్ఎంజీ) పరీక్షను ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తోంది. ఈ పరీక్ష చాలా కఠినంగా ఉంటుంది. 15 నుంచి 20% మించి విద్యార్థులు ఇందులో ఉత్తీర్ణులైన సందర్భాలు లేవు.

ఇక అసలు విషయం ఏమిటంటే: 'కరోనా'... విదేశాల్లో చదివిన వైద్య విద్యార్థుల పాలిట శాపం అయింది. చాలామంది విద్యార్థులు ఎవరి మానాన వారు ఆ యా దేశాలలో ఉండి చదువుకుంటుంటే ప్రభుత్వాలు వారిని స్వదేశానికి రప్పించాయి. ఆ తర్వాత కరోనా తగ్గినా ఆ యా దేశాల వైద్య కళాశాలలు వారిని తిరిగి కాలేజీకి రమ్మని పిలువలేదు. అయితే కొందరు మళ్ళీ ఆ యా దేశాలకు వెళ్లి మరో సంవత్సరం అదనంగా ఫీజులు చెల్లించి, ఫైనల్ ఇయర్, ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేసి వచ్చారు. మరి కొందరు మన దేశంలోనే ఉండి, ఆ యా కళాశాలలకు మరో సంవత్సరం అదనంగా ఫీజులు చెల్లించి, ఆన్‌లైన్ మోడ్ ఫైనల్ ఇయర్, ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. వీరందరూ ఎఫ్ఎంజీ పరీక్ష రాశారు.

ఆ పరీక్ష పాసైనవారికీ ఇప్పుడు తిప్పలు తప్పడం లేదు. 2023లో 'నేషనల్ మెడికల్ కమిషన్' (ఎన్ఎంసీ), రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లకు కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత కాలంలో మరి కొన్ని ఆదేశాలను జారీ చేసింది. వీటిలో ఏ ఆదేశాలను తాము అమలు చేయాలి అన్నదే రాష్ట్రాల కౌన్సిళ్ల మీమాంస. ఇప్పటికే తాము అమలు జరిపిన ఆదేశాల మాట ఏమిటి? ఏ ఆదేశాలనైనా తు.చ. తప్పక పాటించాలా? ఏమైనా మార్పులు చేసుకోవచ్చునా అన్న పలు విషయాలు తెలియకపోవడంతో రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని రాష్ట్రాలు ఎఫ్ఎంజీ పరీక్ష పాస్ అయిన వారందరికీ ఒకే సంవత్సరం ఇంటర్న్‌షిప్ కేటాయించాయి. ఆంధ్రప్రదేశ్ మాత్రం ఎన్ఎంసీ రూల్స్ తు.చ. తప్పక పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.



◆ ఇప్పటికే ఆరున్నరేళ్లపాటు విదేశాల్లో వైద్య విద్య చదివివచ్చిన విద్యార్థులను మరో రెండు మూడేళ్లు చదవమని అనడం వారిని కుంగదీస్తోంది. ఈ వైద్య విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి విలువైన సమయాన్ని కాపాడాలని ఐఎంఏ, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్‌లు ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో గత ప్రభుత్వం నియమించిన కౌన్సిల్ సభ్యులందరూ రాజీనామా చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలకు ఆరుగురు నామినేటెడ్ సభ్యులతో కౌన్సిల్ ఏర్పాటు అయ్యింది. అప్పటివరకు కౌన్సిల్ కార్యకలాపాలను ఏపీ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ నిర్వహించారు. అయితే ఎఫ్ఎంజీ విద్యార్థుల విషయంలో కౌన్సిల్ లేకుండా తానేమీ నిర్ణయాలు తీసుకోలేనని ఆయన ప్రకటించారు. సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక జరిగిన తర్వాత కౌన్సిల్ ఎఫ్ఎంజీ విద్యార్థులపై దృష్టి సారించింది. ఒక ప్రత్యేక కమిటీని కూడా వేశారు. కమిటీ కూడా ఎన్ఎంసీ నిబంధనలు అంటూ ఒక సంవత్సరం గడిపింది. ఇప్పుడు రెండు సంవత్సరాల క్లర్క్ షిప్, మూడు సంవత్సరాల ఇంటర్న్‌షిప్‌లు అంటూ ప్రతిపాదన చేసింది. దీంతో తమకు అనుకూల నిర్ణయం వస్తుందని ఆశించిన విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈపాటి నిర్ణయానికి 13 నెలల విలువైన కాలం వృథా చేసి ఎదురు చూడాల్సి వచ్చినందుకు బాధపడుతున్నారు. ఇప్పటికే ఆరున్నరేళ్లపాటు విదేశాల్లో చదివివచ్చిన వీరిని మరో రెండు మూడేళ్లు చదవమని అనడం వారిని కుంగదీస్తోంది. ఈ వైద్య విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి విలువైన సమయాన్ని కాపాడాలని ఇప్పటికే ఐఎంఏ, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్‌లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

వీరి పరిస్థితి ఇలా ఉంటే... ఇంకా ఎఫ్ఎంజీ పరీక్ష రాసి పాస్ కాని 80 నుంచి 85% విద్యార్థుల పరిస్థితి ఏమిటి? బ్యాంకుల్లో విద్యా రుణాలు తీసు కున్న వారిని, గడువు ముగిసిందనీ, ఇక రుణం రీపేమెంట్ చేయమనీ బ్యాంకుల వేధింపులు మొదలయ్యాయి. ప్రైవేట్‌గా అధిక వడ్డీకి రుణం తెచ్చి ఫీజులు కట్టిన వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో ఎటూ పాలుపోని స్థితిలో ఎఫ్ఎంజీ విద్యార్థులు ధర్నాకు దిగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కరించి ఈ వైద్య విద్యార్థుల సేవల్ని ఉపయోగించుకోవాలి.

వ్యాసకర్త సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

నిజమైన భక్తి

'మేరోరపి సారతరా భక్తిః.' అంటే భక్తి మేరు పర్వతం కంటే కూడా మిక్కిలి శక్తి కలదీ, ఉన్నతమైనదీ అని అర్థం. సర్వము భగవద్విలసితంగా భావించి, ఆ భావనతో ఆత్మార్పణ చేసుకొనే పరిశుద్ధ స్థితి భక్తికి పరాకాష్ఠ. ఇదే నిజమైన భక్తి! గురుభక్తి కూడా ఇంతే! గురువునే దైవ భావంతో ఆరాధిస్తూ, ఆయన ఆజ్ఞాపాలన చేస్తూ జీవితాన్ని కైంకర్యం చేసుకోవటం నిర్దుష్టమైన భక్తికి సరిహద్దు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

భగవదనుభూతికి అనేక మార్గాలున్నాయి. కానీ అందరికీ అందుబాటులో అనుసరణీయమైన మార్గం మాత్రం భక్తి మార్గమే. విభిన్న రుచులు గల మానవుల మనస్సుకు నచ్చిన విధంగా స్వీకరించదగిన విధానాలు భక్తిమార్గంలో ఉన్నాయి. అవే నవవిధ భక్తి మార్గాలు: 'శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్' అని శ్రవణ కీర్తనాదులు చెప్పబడినాయి. ఆ యా భక్తుల రుచులను అనుసరించి ఈ నవవిధాలు అనుసరింపబడతాయి. భక్తి అనేది శ్రవణంతో ప్రారంభమై బలపడుతూ, చివరిదైన ఆత్మనివేదనంతో పరిపూర్ణం అవుతుంది. ఆత్మనివేదనం గల భక్తులకూ భగవంతునికీ భేదమే కనబడదు. ఈ విషయంలో గోపికల భక్తి ఉదాహరణగా తీసుకోవచ్చు.

'ఓ అర్జునా! నా సేవ కోసమే గోపికలు తమ శరీరాన్ని రక్షించుకొంటున్నారు. అందువల్లనే నిగూఢమైన నా ప్రేమకు వారు పాత్రులయ్యారు' అని కృష్ణ పరమాత్మ అర్జునునితో అంటాడు.

అలాగే దాన ధర్మాలు చేసినా... భక్తి భావంతో ప్రతిగ్రహీతను విష్ణువుగా భావించి దానమిస్తే దానికి విలువ ఉంటుంది.


ఒక రోజు ఓ రాజసభలో ఉన్న సాధువుతో 'నేను తల్చుకుంటే మిమ్మల్ని గొప్ప సంపన్నుణ్ణి చేయగలను' అన్నాడు రాజు. సాధువు ఆ మాటకే మాత్రం పొంగిపోకుండా: 'రాజా! దయవుంచి ఒక కాటా తెప్పించండి. అందులో ఒక వైపు నాకీయదలచిన సంపద ఉంచండి' అని అన్నాడు. దానికి రాజు సరే అని వెంటనే ఆ యేర్పాటు చేశాడు. నగలు, నాణాలు, బంగారం, వజ్రాలు వంటివెన్నో ఒక వైపు ఉంచాడు. అప్పుడు సాధువు చిరునవ్వుతో ఒక చిన్న ఆకును తెచ్చి ఆ రెండవ తక్కెటలో వేశాడు. అంతే కాటాలో వేసిన రాజుగారి సంపదకంతా ఈ ఆకు సమానంగా తూగింది. కాస్త మొగ్గు కూడా ఉంది. రాజుకు గర్వ భంగం అయింది. నిజమైన భక్తునికి ప్రతి జీవిలోనూ అంతర్యామిగా భగవంతుడే కనబడతాడు. నిజమైన భక్తుల్లో చివరికి ఆత్మజ్ఞానం సుసంపన్నమైన వాళ్లు మోక్షార్హులవుతారు అని స్వామీజీ అనుక్షణం ప్రబోధిస్తుంటారు.

జయ గురు దత్త!

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.సప్తమి సా.6.16 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** రేవతి రా.3.35 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** సా.4.18 నుండి 5.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు, **అమృతఘడియలు:** రా.7.11 నుండి 8.41 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.38, **సూర్యాస్తమయం:** 6.34.

కృష్ణా, గోదావరి సంగమం!

- వైరా రిజర్వాయర్‌కు తొలిసారిగా రెండు నదుల జలాలు
- ఎన్నెస్పీ ఎడమ కాల్వ ద్వారా రెండో జోన్‌కు ఇటీవల నీటి విడుదల
- తాజాగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు రాక
- ఖమ్మం జిల్లాలో లక్షన్నర ఎకరాల స్థిరీకరణ


నీటితో కళకళలాడుతున్న వైరా రిజర్వాయర్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలోని ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్ తొలిసారిగా కృష్ణా, గోదావరి నదుల సంగమానికి వేదికైంది. దీంతో జిల్లాలో ఈ వానాకాలం పంటల సాగుకు అడ్డంకులు తొలగాయి. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సాగర్ రెండో జోన్‌కు పాలేరు రిజర్వాయర్ నుంచి కృష్ణా నీటిని విడుదల చేశారు. ఇదే సమయాన గోదావరిలో నీటిమట్టం పెరగడంతో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వకు జలవనరుల శాఖ అధికారులు నీటిని వదిలారు. ఫలితంగా ఈ రెండు నదుల నీళ్లు వైరా రిజర్వాయర్‌కు చేరుతుండగా...ఖమ్మం జిల్లాలోని వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సుమారు 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించినట్లయింది.

ఇటు పాలేరు, అటు సీతారామ నుంచి..

ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఈ క్రమంలో రైతులు దుక్కులు దున్ని సాగర్ జలాల విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. కృష్ణా పరీవాహకంలో కురిసిన వర్షాలతో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లోకి వరద చేరగా, తాగునీటి అవసరాల కోసం పాలేరు రిజర్వాయర్‌కు విడుదల చేశారు. రిజర్వాయర్‌లోకి 20 అడుగుల మేర నీరు చేరడంతో ఎండిపోతున్న వరి (నార్లు) పొలాలకు నీటిని వదిలారు. దీంతో ఈ నీళ్లు వైరా జలాశయానికి చేరుతున్నాయి. మరోవైపు ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ నీళ్లు ములకలపల్లి మండలం మీదుగా రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా ఏన్కూరు వద్ద సాగర్ ప్రధాన కాల్వలోకి చేరి సత్తుపల్లి నియోజకవర్గానికి ప్రవహించాయి. కాగా ఇదే కాల్వ 52వ కి.మీ. వద్ద మంగళవారం షట్టర్లు మూసి రాయమాధారం వద్ద షట్టర్లు ఎత్తి వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను పంపారు. నిమ్మవాగు ద్వారా 22 కి.మీ. ప్రవహించిన అనంతరం ఈ నీరు బుధవారం వైరా రిజర్వాయర్‌లోకి వచ్చింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా ప్రస్తుతం 17 అడుగుల మేర నిండి మరింత పెరుగుతోంది.

'సీతారామ'పూర్తికి మరింత సమయం

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా నిలిచే సీతారామ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు ఇంకొంత సమయం పట్టనుంది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో సాగర్ జలాల లభ్యత లేకపోతే గోదావరి జలాలు వదిలేందుకు వీలుగా ఏన్కూరు వద్ద రాజీవ్ లింక్ కెనాల్ నిర్మించడంతో గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీల్లో భాగంగా భద్రాద్రి జిల్లాలో 1, 2, 7, 8వ ప్యాకేజీలు, ఖమ్మం జిల్లాలో 3, 4, 5, 6వ ప్యాకేజీలు నిర్మిస్తున్నారు. ఇందులో 2, 3, 6వ ప్యాకేజీల టెండర్లు పూర్తికాగా, భూముల సర్వే, రైతులకు పరిహారం తేలాల్సి ఉన్నందున ఆలస్యమయ్యే అవకాశముంది. ఇక సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పరిధిలో యాతాలకుంట టన్నెల్ పనులు జరుగుతున్నాయి. పాలేరు లింక్ కెనాల్‌లో టన్నెల్ పనులు నిలిచిపోగా, జూలూరుపాడు వద్ద టన్నెల్ పనులు మొదలే కాలేదు.

ప్రాజెక్టు పూర్తయితే 5 లక్షల ఎకరాలకు నీరు

సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం జిల్లాలోనే కృష్ణా, గోదావరి జలాలతో 5,12,017 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలు, ఎత్తిపోతల పథకాల పరిధిలో పంటల సాగుకు అడ్డంకులు తొలగిపోతాయి. కృష్ణా జలాలు అందుబాటులో లేని సమయాన గోదావరి జలాలు అందిస్తారు.

రెండు పంటలకు అవకాశం..



వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను విడుదల చేయడం సంతోషం. రిజర్వాయర్ కింద నాకు ఐదెకరాల పొలం ఉంది. ఏళ్లుగా గోదావరి నీటి కోసమే ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు నీటి విడుదలతో రెండు పంటల సాగుకు అవకాశం దక్కింది. అంతేకాక ఆయకట్టు చివరి వరకు నీరు అందుతుంది. సాగర్ జలాలు రాకున్నా గోదావరి నీళ్లతో పంటలు పండించుకోవచ్చు.

– జి.వెంకటరమణ, రైతు, దాసాపురం, వైరా మండలం

అసలు నిందితులు ఆరుగురు?

- పక్కా పథకంతో చందు నాయక్ హత్య
- ఫిర్యాదు ఆధారంగా తొమ్మిది మందిపై కేసు నమోదు
- నిందితులు రాష్ట్రం విడిచి పారిపోయినట్లు అనుమానం

సాక్షి, హైదరాబాద్/మలక్‌పేట: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ అలియాస్ చందు నాయక్‌ను కాల్చి చంపిన వ్యవహారంలో మొత్తం ఆరుగురి పాత్ర ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. వీరిలో నలుగురు ప్రత్యక్షంగా పాల్గొనగా.. మరో ఇద్దరు సహకరించారని భావిస్తున్నారు. అయితే చందు నాయక్ భార్య నారీబాయి ఇచ్చిన ఫిర్యాదులో మొత్తం తొమ్మిది మంది ప్రస్తావన ఉంది. పోలీసులు రాజన్న, ప్రశాంత్, ఏడుకొండలు, సుధాకర్, రాయుడు, మున్నా, రవీంద్రచారి, యాదిరెడ్డితో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. రాజన్న అలియాస్ రాకేష్‌ను కీలక నిందితుడిగా తేల్చారు. పరారీలో ఉన్న నిందితులు రాష్ట్రం దాటి వెళ్లి ఉంటారని అనుమానిస్తూ ప్రత్యేక బృందాలను ఆయా ప్రాంతాలకు పంపారు. కొందరు అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ కొత్వాల్ సీవీ ఆనంద్ బుధవారం సమీక్షించారు.

ఆయుధాలు సమకూర్చుకొని..

సీపీఐ (ఎంఎల్) పార్టీకి చెందిన రాజన్నకు చందు నాయక్‌తో నాలుగేళ్లుగా పరిచయం ఉంది. కుంట్లూరులో వంద ఎకరాల ఖాళీ స్థలంలో గుడిసెలు వేయించాలని రాజన్న భావించాడు. దీనికోసమే తొలిసారిగా 2022 నవంబర్‌లో చందు వద్దకు వచ్చాడు. తనను పార్టీ గుడిసెల వ్యవహారంలోకి రానివ్వనని, నువ్వే ముందుండి వెయ్యి మందితో గుడిసెలు వేయించాలని కోరాడు. ఆ పని అయిన తర్వాత రాజన్న.. రవీంద్రచారి, యాదిరెడ్డిలతో కుమ్మక్కయ్యాడు. రెండేళ్లుగా ఆ స్థలాలకు సంబంధించి పట్టాలు ఇప్పిస్తానంటూ గుడిసెవాసుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన చందు ఆగ్రహం వ్యక్తం చేసి రాజన్నను దూరంగా ఉంచాడు. దీనికితోడు మరికొన్ని వ్యక్తిగత కారణాలతో చందును హత్య చేయాలని రాజన్న నిర్ణయించుకున్నాడు. ఆయుధాలు సమకూర్చుకొని తన అనుచరుడైన ఏడుకొండలు, ప్రశాంత్ సహా ఐదుగురితో కలిసి రంగంలోకి దిగాడు.

ఇంటి నుంచి పార్కు వరకు..

మంగళవారం ఉదయం చందు ద్విచక్ర వాహనంపై, ఆయన భార్య నారీబాయి, కుమార్తె సింధు నడుచుకుంటూ శాలివాహననగర్ పార్కు వద్దకు వచ్చారు. అలా వచ్చేప్పుడు తమ ఇంటి సమీపంలో కారులో వేచి ఉన్న రాజన్న తదితరులను నారీబాయి గుర్తించి విషయాన్ని భర్తకు తెలిపారు. వాకింగ్ ముగిశాక చందు పార్కులోనే తన స్నేహితులతో మాట్లాడుతూ బెంచ్‌పైన కూర్చున్నారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే కారు పార్కు ఎదురుగా ఉండటాన్ని నారీబాయి, సింధు చూశారు. సింధు కారు వద్దకు వెళ్లి చూడగా ముందు సీట్లో రాజన్న, వెనుక మరో ఇద్దరు కనిపించారు. నారీబాయి, సింధు వెళ్లిన కొద్దిసేపటికి చందు పార్కు నుంచి బయటకు రాగా... రాజన్న, ఏడుకొండలు, ప్రశాంత్ ఆయన కళ్లలో కారం కొట్టి తుపాకీతో కాల్చి చంపేశారు. అనంతరం అంతా కలిసి కారులో ప్రధాన రహదారి వరకు పారిపోయారు. అక్కడ రాజన్న, ప్రశాంత్ దిగిపోగా.. ఏడుకొండలు కారు తీసుకువెళ్లి అద్దెకు ఇచ్చిన సంస్థకు అప్పగించాడు. ఆపై అంతా కలిసి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు వెళ్లి తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని పారిపోయారు. వీరికి పరోక్షంగా మరో ముగ్గురు సహకరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరంతా రాష్ట్రం వదిలి వెళ్లిపోయారని గుర్తించి వేటాడుతున్నారు.

'స్థానిక' ఏర్పాట్లు వేగవంతం

- అధికారులకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. అందులో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తన యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో బుధవారం పీఆర్ శాఖ అధికారులకు కీలక సూచనలు జారీచేసింది. బుధవారమే స్థానిక స్థానాలు ఖరారు అయిన నేపథ్యంలో ఎన్నికలకు అవసరమైన ఎన్నికల మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీపీఓలకు పీఆర్‌ఆర్‌డీ శాఖ డైరెక్టర్ సృజన ఆదేశాలు జారీచేశారు. బ్యాలెట్ పేపర్లకు అవసరమైన గులాబీ, తెలుపురంగు పేపర్, పేపర్ సీల్స్, అడ్రస్‌టాగ్‌లు, హ్యాండ్‌బుక్‌లు, స్టాట్యుటరీ, నాన్ స్టాట్యుటరీ ఫామ్స్, కవర్స్, తదితరాలను ఇప్పటికే జెడ్పీ, డీపీఓ కార్యాలయాలకు పంపించారు. ఈ ఎన్నికల మెటీరియల్‌ను మరోసారి సరిచూసుకొని సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి తప్పులు దొర్లినా, తప్పిదాలు చోటుచేసుకున్నా అందుకు సీఈవోలు, డీపీఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

ఆర్డినెన్స్‌పై నిపుణులతో సంప్రదింపులు

బీసీ రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌పై న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులతో గవర్నర్ సంప్రదింపులు జరుపుతున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ముసాయిదా ఆర్డినెన్స్‌లో పేర్కొన్న అంశాలను లోతుగా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే రిజర్వేషన్ల పెంపుదలకు సంబంధించి అసెంబ్లీ, శాసనమండలి చేసిన తీర్మానాలను రాష్ట్రపతికి పంపించినందున దీనిపై ఎలా స్పందించాలనే దానిపై రాజ్‌భవన్ వర్గాలు దృష్టి సారించినట్టు సమాచారం.

వాయు'గండం'

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో సగటున 24.34 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. కానీ 17.59 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. సీజన్‌లో కేవలం జూన్, జూలై నెలల్లోనే ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత వరుసగా రెండు నెలలపాటు లోటు వర్షపాతం నమోదు కావడం ఇదే ప్రథమం అని వాతావరణ శాఖ వర్గాలు చెబుతున్నాయి.


- ఆదిలాబాద్ జిల్లాలో మాత్రమే సాధారణం కంటే 2 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మిగతా 32 జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉంది.
- ఏడు జిల్లాల్లో 20 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది.
- 24 జిల్లాల్లో వర్షపాతం భారీ లోటు నమోదైంది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబుబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, జనగామ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, ములుగు, నారాయణపేట జిల్లాల్లో 20 నుంచి 60 శాతం లోటు ఉంది.
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏకంగా 62 శాతం తక్కువ వర్షాలు కురిశాయి.

వేసవి ఎండలు తక్కువగా ఉండడంవల్లే..

రాష్ట్రంలో సాధారణంగా వేసవి సీజన్‌లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. కానీ, ఈ ఏడాది వేసవిలో సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత 20 సంవత్సరాల్లో మే నెలలో అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు ఈ సారి నమోదు కావడం గమనార్హం. ఎండల తీవ్రత తక్కువగా ఉంటే వర్షాలు సైతం తక్కువగానే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా మే నెలలో వర్షాలు అధికంగా కురవడం కూడా ప్రస్తుత వర్షాభావ పరిస్థితులకు మరో కారణమని అంటున్నారు. రాష్ట్రంలో వానలు బాగా కురవాలంటే బంగాళాఖాతంలో వాతావరణ మార్పులు కీలకమని నిపుణులు చెబుతున్నారు.

గాలుల తీవ్రతతో వానలకు ఆటంకం

నైరుతి సీజన్‌లో గాలుల తీవ్రత విపరీతంగా ఉంది. నిలకడలేని గాలుల కారణంగా వర్షాలు కురవడం లేదు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం లాంటివి ఏర్పడితే రాష్ట్రంలో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఉండేవి. కానీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు అలాంటివేవీ నమోదు కాలేదు. ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం లాంటివి కనీసం రెండుమూడు రోజుల పాటు కొనసాగితే వర్షాలు సమృద్ధిగా కురిసేవి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వానలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ... తెలంగాణలో మాత్రం తక్కువగా ఉన్నాయి. మరో వారం తర్వాత పరిస్థితులు మారుతాయని అంచనా వేస్తున్నాం.



– జీఎస్‌ఆర్‌ఎస్ శ్రీనివాసరావు, వాతావరణ శాస్త్రవేత్త, హైదరాబాద్ వాతావరణ కేంద్రం

'స్థానిక' స్థానాలు ఖరారు

▶ మొదటి పేజీ తరువాయి

సమీప మున్సిపాలిటీల్లో విలీనం కావడం, ఇతర కారణాలతో గ్రామ పంచాయతీల సంఖ్య తగ్గింది. సంఖ్యాపరంగా చూస్తే...నల్లగొండ జిల్లా 33 జెడ్పీటీసీలు, 33 ఎంపీపీలు, 353 ఎంపీటీసీ స్థానాలతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇక ములుగు జిల్లా 10 జెడ్పీటీసీలు, 10 ఎంపీపీలు, 83 ఎంపీటీసీ స్థానాలతో అత్యల్ప స్థానాలున్న జిల్లాగా నిలిచింది.

టాప్‌–5, లాస్ట్‌–5 జిల్లాల్లోని స్థానాలు ఇలా..

టాప్‌–5 జిల్లాలు...

నల్లగొండ: 1 జెడ్పీ, 33 జెడ్పీటీసీలు, 33 ఎంపీపీలు, 353 ఎంపీటీసీ స్థానాలు
నిజామాబాద్: 1 జెడ్పీ, 31 జెడ్పీటీసీలు, 31 ఎంపీపీలు, 307 ఎంపీటీసీ స్థానాలు
ఖమ్మం: 1 జెడ్పీ, 20 జెడ్పీటీసీలు, 20 ఎంపీపీలు, 283 ఎంపీటీసీ స్థానాలు
సంగారెడ్డి: 1 జెడ్పీ, 26 జెడ్పీటీసీలు, 26 ఎంపీపీలు, 271 ఎంపీటీసీ స్థానాలు
సూర్యాపేట: 1 జెడ్పీ, 23 జెడ్పీటీసీలు, 23 ఎంపీపీలు, 235 ఎంపీటీసీ స్థానాలు

లాస్ట్‌–5 జిల్లాలు...

ములుగు: 1 జెడ్పీ, 10 జెడ్పీటీసీలు, 10 ఎంపీపీలు, 83 ఎంపీటీసీ స్థానాలు
వరంగల్: 1 జెడ్పీ, 11 జెడ్పీటీసీలు, 11 ఎంపీపీలు, 130 ఎంపీటీసీ స్థానాలు
రాజన్న సిరిసిల్ల: 1 జెడ్పీ, 12 జెడ్పీటీసీలు, 12 ఎంపీపీలు, 123 ఎంపీటీసీ స్థానాలు
వనపర్తి: 1 జెడ్పీ, 15 జెడ్పీటీసీలు, 15 ఎంపీపీలు, 133 ఎంపీటీసీ స్థానాలు
మంచిర్యాల: 1 జెడ్పీ, 16 జెడ్పీటీసీలు, 16 ఎంపీపీలు, 129 ఎంపీటీసీ స్థానాలు

వరదొచ్చేదాకా వారబంధే!

- నీటి వరద లేక ఎగువ గోదావరి వెలవెల
- వచ్చే 15 రోజులు వారబంధి అవలంబించాలి
- నీటిపారుదల శాఖలోని స్కివం కమిటీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత వానాకాలంలో సాగునీటి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం వచ్చే 15 రోజులపాటు వారబంధి పద్ధతిని అవలంబించాలని నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలోని రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, యాజమాన్య కమిటీ (స్కివం) అధికారులను ఆదేశించింది. నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్ అధ్యక్షతన ఈ నెల 11న సమావేశమైన స్కివం కమిటీ.. కృష్ణా, గోదావరి బేసిన్లలోని జలాశయాల్లో నీటి నిల్వలు, వస్తున్న ప్రవాహాలను సమీక్షించింది. ప్రస్తుత వానాకాలంలో భారీ, మధ్య తరహా ప్రాజెక్టులతోపాటు చెరువులు, చిన్న ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 38,76,849 ఎకరాల ఆయకట్టుకు 339.11 టీఎంసీల జలాలను సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇందులో 26,71,941 ఎకరాల తడి, 12,04,908 ఎకరాల ఆరుతడి పంటలు ఉన్నాయి. కృష్ణా పరీవాహకంలోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు భారీ వరదలు రావడంతో వానాకాలం సాగుకు సరిపడా నిల్వలున్నట్టు కమిటీ తేల్చింది. ఎగువ గోదావరి పరీవాహకంలోని శ్రీరామ్‌సాగర్, నిజాంసాగర్, కడెం, సింగూరు, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, అప్పర్, లోయర్ మానేరు తదితర జలాశయాలకు ఇంకా ఆశించిన రీతిలో వరదలు ప్రారంభం కాలేదు. దీంతో ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వల ఆధారంగా వాటి కింద ఉన్న ఆయకట్టుకు ప్రస్తుతం పాక్షికంగానే సాగునీరు సరఫరా చేయాలని స్కివం కమిటీ నిర్ణయం తీసుకుంది. ఎగువ గోదావరిలో వరదలు ప్రారంభమయ్యాక మరోసారి సమావేశమై పూర్తిస్థాయి స్థిరీకృత ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. కాల్వలకు విడుదల చేసే నీళ్లు చివరి ఆయకట్టు వరకు సరఫరా అయ్యేలా చూడాలని నీటిపారుదల శాఖలోని టెరిటోరియల్ ఈఎన్సీలు/చీఫ్ ఇంజనీర్లను ఆదేశించింది. ప్రధానంగా గోదావరి పరీవాహకంలోని జలాశయాల్లో సరిపడా నిల్వలు లేకపోవడం, ఎగువ నుంచి ఆశించిన వరదలు రాకపోవడంతో తాగునీటి అవసరాలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించింది. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు రైతులకు అవగాహన కల్పించాలని కోరింది. కాల్వల లైనింగ్ దెబ్బతినేలా అకస్మాత్తుగా నీళ్లను విడుదల చేయరాదని, నిదానంగా ప్రవాహం పెంచుకుంటూ పోవాలని తెలిపింది. శ్రీరామ్‌సాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఎగువ నుంచి వరదలు ప్రారంభమైన వెంటనే మళ్లీ స్కివం కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలియజేసింది.

క్లుప్తంగా...

హెచ్‌సీఏ కేసులో సీఐడీ దర్యాప్తు ముమ్మరం

- కోర్టు అనుమతితో ఐదుగురు నిందితులను నేటి నుంచి విచారించనున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో నిధుల గోల్‌మాల్, అధ్యక్షుడి ఎన్నికలో ఫోర్జరీ తదితర అంశాలపై నమోదైన కేసులో సీఐడీ దర్యాప్తు ముమ్మరం కానుంది. ఈ కేసులో అరెస్టు అయిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు సహా ఐదుగురు నిందితులను ఈనెల 21 వరకు సీఐడీ కస్టడీకి ఇస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో గురువారం నుంచి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, ట్రెజరర్ జేఎస్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కాంటె, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్‌యాదవ్ ఆయన భార్య శ్రీచక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు కవితలను సీఐడీ అధికారులు ప్రశ్నించనున్నారు. ఈ ఐదుగురిని సీఐడీ అధికారులు ఈ నెల 9న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న కవితను, చర్లపల్లి జైలులో ఉన్న జగన్‌మోహన్‌రావు సహా మిగతా నిందితులను సీఐడీ అధికారులు విచారించనున్నారు. గురువారం ఉదయం జైలు నుంచి నిందితులను అదుపులోకి తీసుకొని రెడ్‌హిల్స్‌లోని సీఐడీ రీజినల్ ఆఫీస్‌కు తరలించి అధికారులు విచారిస్తారు.

నేరుగా హాజరై వివరణ ఇవ్వండి

- ధిక్కరణ కేసులో హెచ్‌సీఏ కార్యదర్శి, సీఈవోకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తాము ఆదేశాలిచ్చినా డబ్బులు ఎందుకు చెల్లించడం లేదో నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి దేవరాజ్, సీఈవో సునీల్ బోస్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారికి ఫామ్–1 నోటీసులను జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ.. న్యాయస్థానానికి వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. వర్క్ ఆర్డర్ మేరకు పనులు పూర్తి చేసినా అంగీకరించిన మొత్తం రూ.19 లక్షలను హెచ్‌సీఏ చెల్లించడం లేదని గంజం డెకార్ సర్వీసెస్ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆదేశాలిచ్చారు. అయినా చెల్లించకపోవడంతో పిటిషనర్ మరోసారి హైకోర్టును ఆశ్రయించి ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. హెచ్‌సీఏ కార్యదర్శి, సీఈవోకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


తరుణ్

నర్సాపూర్: ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న ఇంజనీరింగ్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు అందించిన వివరాలివి. నర్సాపూర్‌లోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతున్న తరుణ్ (20), మెకానికల్ బ్రాంచ్ చదువుతున్న సాయి ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నారు. కాగా బుధవారం ఉదయం తరుణ్ కాలేజీకి రానని చెప్పడంతో, సాయి కాలేజీకి వెళ్లాడు. సాయంత్రం సాయి హాస్టల్‌లోని రూమ్‌కొచ్చి తలుపు కొట్టినా తరుణ్ తీయలేదు. దీంతో అతను హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చాడు. వారు ఎస్ఐ లింగంకు తెలియజేయగా.. హాస్టల్‌కు వచ్చి తలుపులు పగులగొట్టారు. తరుణ్ గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. మృతునిది మహబూబాబాద్ జిల్లా గారుల మండలం పుల్లూరు గ్రామం. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కరెంట్ షాక్‌తో గిరిజన రైతు మృతి

బషీరాబాద్: కరెంట్ షాక్‌తో ఓ గిరిజన రైతు మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశింపూర్ తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన నార్యానాయక్ (60) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం సాయంత్రం వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు మోటార్‌ను ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య పతీబాయ్, కుమారుడు ప్రేమ్ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

ఎరువుల కోసం బారులు


శాయంపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

శాయంపేట/కమలాపూర్: హనుమకొండ జిల్లా శాయంపేట వ్యవసాయ గోదాము వద్ద బుధవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచే మహిళా రైతులు సైతం నిరీక్షించారు. ఒక్కొక్క రైతుకు 2 బస్తాల యూరియానే ఇచ్చారని, పంటలకు ఎటూ సరిపోదని పలువురు రైతులు వాపోయారు. వీటికి అనుబంధంగా రూ.225 విలువైన.. అర లీటర్ నానో యూరియా ప్లస్ బాటిల్ అంటగట్టారని తెలిపారు. కమలాపూర్ పీఏసీఎస్‌కు బుధవారం 444 బస్తాల యూరియా రాగా, సమాచారం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున రావడంతో తోపులాట జరిగింది. పోలీసులు వచ్చి వారిని క్యూలైన్లలో నిలబెట్టి.. ఒక్కొక్కరికి 3 బస్తాలు ఇచ్చి పంపించారు.

పోడుదారులు, అటవీ ఉద్యోగుల మధ్య ఘర్షణ

- దేరాలు తొలగించే యత్నంలో ప్రతిఘటించిన మహిళలు


పోడుదారులు, ఉద్యోగుల మధ్య ఘర్షణ దృశ్యం

కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధి మాణిక్యారం, ఎర్రబోడు పోడు ప్లాంటేషన్‌లో పోడుదారులు, ఫారెస్టు ఉద్యోగుల మధ్య బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ప్రాంతంలో 60 మందికి పైగా పోడు వ్యవసాయం చేస్తుండగా 2020లో ప్రత్యామ్నాయ భూమి చూపిస్తామంటూ అటవీ అధికారులు 50 హెక్టార్ల భూమిలో మొక్కలు నాటారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవడం ఏటా మొక్కలు ధ్వంసం చేయడం, అధికారులు అడ్డుకోవడం ఆనవాయితీగా మారింది. ఈక్రమంలోనే 7వ తేదీన కూడా పోడుదారులు దున్నడానికి యత్నించగా అటవీ ఉద్యోగులు అడ్డగించగా అక్కడే దేరాలు వేసుకుని ఉంటున్నారు. ఈమేరకు కారేపల్లి ఫారెస్టు రేంజ్ ఉద్యోగులు బుధవారం దేరాలు తొలగించే ప్రయత్నం చేయడంతో మహిళలు అడ్డుకున్నారు. అయితే మహిళలని చూడకుండా అటవీ ఉద్యోగులు ఎక్కడ పడితే అక్కడ చేతులు వేయడంతో పాటు జుట్టు పట్టుకుని ఈడ్చి వేశారని ఆరోపించారు. ఈక్రమంలో ఉద్రిక్తత నెలకొనడంతో కారేపల్లి పోలీసులు చేరుకొని ఇరుపక్షాలను సముదాయించారు. ఈ అంశంపై ఇరువర్గాలు కారేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

హాస్టల్‌లో నీళ్లు లేవని విద్యార్థుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులకు నచ్చజెప్పున్న పోలీసులు

మేళ్లచెరువు: హాస్టల్‌లో నీళ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రం శివారులోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు స్థానిక కోదాడ–మేళ్లచెరువు ప్రధాన రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నీటి విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. మూడేళ్లుగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు, మార్చి, ఏప్రిల్‌లో తీవ్రంగా నీటి కొరత తలెత్తుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. స్నానం చేయడానికి, బాత్‌రూమ్‌కు వెళ్లాలన్నా, బట్టలు ఉతుక్కోవాలన్నా తీవ్ర ఇబ్బందులున్నాయని, సమస్య తీర్చాలని ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. దీంతో మెయిన్ రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో స్థానిక ఎస్సై పరమేశ్ అక్కడికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

రష్యాతో వ్యాపారం చేస్తే ఊరుకోం

- భారత్‌పై 100 శాతం టారిఫ్‌లు విధిస్తాం
- నాటో సెక్రటరీ జనరల్ హెచ్చరిక
- బ్రెజిల్, చైనాలనూ హెచ్చరించిన మార్క్ రుట్టే

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై ఆక్రమణ జెండా ఎగరేసిన రష్యాను నిలువరించేందుకు దాని ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు నాటో కూటమి పరోక్ష చర్యలకు దిగింది. రష్యా నుంచి చమురు కొనుగోలుసహా పలురకాల వాణిజ్య కార్యకలాపాల కొనసాగిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్‌లపై నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే హెచ్చరికలు చేశారు. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ఎదుర్కోవలసి ఉంటుందని రుట్టే బ్రెజిల్, చైనా, భారత్‌లను హెచ్చరించారు. బుధవారం అమెరికా సెనేటర్లతో వాషింగ్టన్‌లో సమావేశమైన అనంతరం మీడియాతో రుట్టే మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను శాంతి చర్చలకు ఒప్పించేలా పుతిన్‌పై భారత్, చైనా, బ్రెజిల్‌లు ఒత్తిడితేవాలని రుట్టే వ్యాఖ్యానించారు. 'భారత ప్రధాన మంత్రి, చైనా అధ్యక్షుడు, బ్రెజిల్ అధ్యక్షుడు... మీరు ఎవరైనా కావొచ్చుగానీ రష్యాతో మీరు ముడిచమురు, సహజ వాయువు కొనుగోలుసహా వాణిజ్య వ్యాపారాలను వెంటనే ఆపేయండి. మీరో విషయం గుర్తుంచుకోవాలి. రష్యాలోని ఆ పెద్దమనిషి(పుతిన్) గనక ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి ముందుకు రాకపోతే నేను టారిఫ్‌ల కొరడాతో రంగంలోకి దిగుతా. భారత్, బ్రెజిల్, చైనాలపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తా. ఆర్థిక ఆంక్షలు సైతం విధిస్తా. నా ఈ హెచ్చరికలను మీరు చాలా సీరియస్‌గా తీసుకోవాల్సిందే. లేదంటే దీని విపరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. వాటిని మీరు ఎదుర్కోక తప్పదు. కొత్తగా ఈ 100 శాతం టారిఫ్‌ల బాధ తప్పాలంటే మీరు వెంటనే రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి బాగా పెంచాలి. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు పుతిన్‌ను ఒప్పించాలి. పుతిన్ ఆ శాంతి చర్చలకు కట్టుబడి ఉండాలి. పుతిన్‌కు వెంటనే ఫోన్ చేసి, శాంతి చర్చలపై మరింత సీరియస్‌గా ఆలోచించాలని సూచనలు చేయండి. మీరు చర్చలపై ముందడుగు వేయకుంటే నాటో మాపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తుందట అని పుతిన్‌కు చెప్పండి. శాంతి ఒప్పందంగనక సాధ్యంకాకపోతే మీ మూడు దేశాలపై టారిఫ్‌లు విధించడం ఖాయం. ఈ గుదిబండను మీరు మోయకతప్పదు''' అని రుట్టే హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు సైనిక మద్దతు మరింత పెంచుతామని, రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై టారిఫ్‌లను విపరీతంగా పెంచుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజు రుట్టే ఇలా భారత్‌ను హెచ్చరిస్తూ వ్యాఖ్యలుచేయడం గమనార్హం.



రష్యా, దాని భాగస్వాములపై 100 శాతం సుంకాలు విధిస్తాం: అమెరికా

రష్యా ఎగుమతులపై 100 శాతం సుంకాలను విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. 50 రోజుల్లోపు ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకోకపోతే రష్యా నుంచి ముడిచమురును కొనుగోలుచేసే దేశాలపై మరోదఫా ఆంక్షలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. '50 రోజుల్లోపు శాంతి ఒప్పందం కుదరాల్సిందే. అది జరక్కపోతే పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయి. టారిఫ్‌ల మోత మోగిస్తా. ఇతర ఆర్థిక ఆంక్షలు మోపుతా'' అని ట్రంప్ ప్రకటించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం అవసరం లేకుండానే మరోదఫా టారిఫ్‌లను అమలు చేయవచ్చన్నారు.

అత్యధిక కొనుగోలుదారుల్లో భారత్

తాజా అంతర్జాతీయ వాణిజ్య నివేదికల ప్రకారం రష్యా నుంచి ముడి చమురును అధికంగా దిగుమతి చేసుకుంటున్న, కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా, తుర్కియేే తొలి వరసలో ఉన్నాయి. ట్రంప్ నిజంగానే ఆర్థిక ఆంక్షలు విధిస్తే భారత్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు ఒడిదుడుకులకు లోనవుతున్న ఈ తరుణంలో ట్రంప్ కొత్తగా టారిఫ్‌ల కొరడా ఝుళిపిస్తే ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగే వీలుంది. ట్రంప్ బెదిరింపులపై రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్‌కోవ్ దీటుగా స్పందించారు. 'ట్రంప్‌తో చర్చలు జరపడానికి రష్యా సిద్ధంగా ఉంది. కానీ రష్యానే బెదిరించాలని చూడటం తగదు. అల్టిమేటం జారీ చేయడం అస్సలు ఆమోదయోగ్యం కాదు. ఇలాంటి చర్యలు సానుకూల ఫలితాలను ఇవ్వవని గుర్తుంచుకుంటే మంచిది' అని సెర్గీ వ్యాఖ్యానించారు.

నాటోకు ఆ అధికారం ఎక్కడిది?

సార్వభౌమ దేశానికి హెచ్చరికలు చేసే స్థాయి దానికి లేదు • ట్రంప్ అండతో నాటో చీఫ్ రుట్టే దుస్సాహసంపై సర్వత్రా విమర్శలు

ప్రతిరోజూ మారుతున్న రాజకీయ, భౌగోళిక పరిస్థితుల్లో ఒకరిపై మరొకరు సవాళ్లు విసురుకోవడం, హెచ్చరికలు చేసుకోవడం ఇప్పుడు సర్వసాధారణమైంది. అయితే ఏకంగా ఒక దేశంపై ఎలాంటి అంతర్జాతీయ అధికారిక అర్హతలు లేని వ్యక్తి సుంకాల సుత్తితో మోదుతానని, ఆర్థిక ఆంక్షలు విధిస్తానని హెచ్చరికలు చేయడం చర్చనీయాంశమైంది. అంతర్జాతీయ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ అన్ని దేశాలతో మైత్రీభావంతో మెలిగే భారత్‌ను నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్(నాటో) సెక్రటరీ జనరల్ హెచ్చరించడం అందరికీ విస్మయం కల్గిస్తోంది. కొన్ని దేశాలకే పరిమితమైన ఒక సైనిక కూటమికి సార్వభౌమ, గణతంత్ర దేశాన్ని హెచ్చరించే దమ్ము ఎక్కడిది? అనే ప్రశ్న ఇప్పుడు అందరి నోటా వినిపిస్తోంది. నాటో సభ్య దేశాలతో భారత దౌత్య సంబంధాలు దెబ్బతినేలా దుస్సాహసానికి తెగించిన నాటో చీఫ్ మార్క్ రుట్టేపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారత వాణిజ్య విధానాలను ప్రశ్నించే అధికారం నాటోకుగానీ, నాటో చీఫ్‌కుగానీ అస్సలు లేదని అంతర్జాతీయ నిపుణులు సైతం బల్లగుద్ది చెబుతున్నారు.

అంతర్జాతీయ వాణిజ్య సమీక్ష అధికారం నాటోకు లేదు

నాటో అనేది కేవలం ఉత్తర అట్లాంటిక్ ఖండంలోని కొన్ని దేశాల సైనిక కూటమి మాత్రమే. ప్రపంచ దేశాలు కుదుర్చుకుని పొరుగు, స్నేహపూర్వక దేశాలతో కుదుర్చుకునే వాణిజ్య ఒప్పందాల్లో నాటోకు ఎలాంటి ప్రమేయం, హక్కులు ఉండవు. సార్వభౌమత్వాన్ని సంతరించుకున్న భారత్ ఏ దేశంతో వాణిజ్యంచేసినా అది పూర్తి ఏకపక్షంగా తీసుకునే నిర్ణయం. ఇందులో జోక్యంచేసుకునే కనీస హక్కు, అర్హత నాటోకు లేదు. నాటో తన పరిధి దాటి ప్రవర్తిస్తోందని అంతర్జాతీయ వాణిజ్య రంగ నిపుణులు వ్యాఖ్యానించారు. అమెరికా విదేశాంగ విధానాలకు నాటో తలొగ్గిందనేది బహిరంగ రహస్యం. మరోవైపు చైనా, భారత్ సారథ్యంలో మరింత పటిష్టమవుతున్న బ్రిక్స్ కూటమి ఇప్పుడు అంతర్జాతీయ మారకమైన డాలర్ ఆధిపత్యానికి గండికొట్టి ప్రత్యామ్నాయ కరెన్సీని ముందుకు తేవొచ్చనే భయాందోళనలు అమెరికాను వెంటాడుతున్నాయి. అందుకే నాటోతో ఇలా అమెరికా పరోక్ష హెచ్చరికలు చేయిస్తోందని భావిస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్య విభేదాలు తలెత్తితే పరిష్కరించేందుకు ప్రపంచ వాణిజ్యసంస్థ(డబ్ల్యూటీఓ) ఉండనే ఉంది. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ విధుల్లోకి నాటో ఎందుకు తలదూర్చుతోందన్న విమర్శలు మొదలయ్యాయి.

భారత్‌కు శాంతి సందేశాలు అక్కర్లేదు

వేల సంవత్సరాల చరిత్రలో ఏనాడూ తనంతట తానుగా ఏ దేశం మీదా దండయాత్రకు దిగని దేశంగా భారత్ ఘనత సాధించింది. గతేడాది ఆగస్ట్‌లో నాటి అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో మాట్లాడిన మరుసటి రోజే పుతిన్‌తో మోదీ మాట్లాడి శాంతి ఒప్పందం చేసుకోవాలని సూచించిన విషయం తెల్సిందే. శాంతికాముక దేశంగా పేరొందిన భారత్‌కు ఉక్రెయిన్-రష్యా యుద్ధం విషయంలో శాంతి ప్రబోధాలు నాటో వంటి సైనికకూటమి నుంచి వినాల్సిన అవసరం లేదని అంతర్జాతీయ దౌత్యరంగ నిపుణులు చెప్పారు.



భారత ఇంధన విధానాలు సర్వస్వతంత్రం

ఏ దేశమైనా తమ ఇంధన అవసరాలకు తగ్గట్లు విదేశాంగ విధానాలను అవలంభిస్తుంది. భారత్ సైతం అదే పంథాను కొనసాగిస్తోంది. ఫలానా దేశం(రష్యా) నుంచి మీరు ముడిచమురు, సహజవాయువు కొనడానికి వీల్లేదనే హక్కు నాటోకు లేదు. అందులోనూ వలసరాజ్యంగా కాకుండా పూర్తి సార్వభౌమత్వం ఉన్న భారత్‌ను ఒక సైనికకూటమి ఎలా ఇలాంటి ఆర్థికపర సూచనలు చేస్తుందన్న ప్రశ్నకు నాటో సభ్య దేశాల నుంచి సమాధానం లేదు. పునర్వినియోగ ఇంధన వనరులతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి ఆత్మనిర్భరత దిశగా వెళ్తున్న భారత్ మరోవైపు భిన్న దేశాల నుంచి ముడిచమురు, సహజవాయువులను దిగుమతిచేసుకుంటోంది. రష్యా, అమెరికా మొదలు పశ్చిమాసియా, ఆఫ్రికా దాకా వేర్వేరు ఖండాల్లోని దేశాల నుంచి దిగుమతిచేసుకుంటోంది. భారత ఇంధన భద్రత విషయంలో వేలుపెట్టే అధికారం ఏ దేశానికీ లేదు. అలాంటప్పుడు కేవలం ఒక కూటమికి ఆ అధికారం ఎక్కడిది? అని పలువురు నిపుణులు సైతం విస్మయం వ్యక్తంచేశారు. భారత్ గనక నాటో హెచ్చరికలను సీరియస్‌గా తీసుకుంటే నాటోసభ్యదేశాలతో, ముఖ్యంగా అమెరికాతో దౌత్యబంధానికి స్వల్ప బీటలుపడే అవకాశం ఉంది.

సైనిక కూటమికి వాణిజ్యంతో పనేంటి?

ఇరుదేశాల దౌత్య సంబంధాల్లో వేలుపెట్టి, బలవంతపు ఆదేశాలు జారీ చేసే హక్కు నాటోకు లేదు. తమ దేశాల రక్షణే లక్ష్యంగా ఏర్పడిన ఒక కూటమి(నాటో) ఇప్పుడు విదేశాల పరస్పర వాణిజ్య సంబంధాల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎందుకొచ్చిందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అమెరికా స్వప్రయోజనాలు కాపాడే డమ్మీ వాణిజ్య విభాగం స్థాయికి నాటో పడిపోయిందని విమర్శలు పెరిగాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

వీసా అర్హతే.. హక్కుకాదు!

స్పష్టంచేసిన ట్రంప్ సర్కార్

వాషింగ్టన్: అమెరికా వీసా దక్కడం అనేది చట్టబద్ధమైన హక్కు కాదని, అది కేవలం అమెరికాలోకి అడుగుపెట్టేందుకు అర్హత మాత్రమేనని ట్రంప్ ప్రభుత్వం పునరుద్ఘాటించింది. వీసా దరఖాస్తులదారులను హెచ్చరిస్తూ ఇప్పటికే పలు మార్లు పలురకాల అడ్వైజరీలు జారీచేసిన ట్రంప్ సర్కార్ తాజాగా మరో ప్రకటనను విడుదలచేసింది. దరఖాస్తుదారుల సామాజికమాధ్యమ ఖాతాల్లో గత వ్యాఖ్యానాలు, వీడియోలు, పోస్ట్‌లను జల్లెడపట్టి వెతికిమరీ అప్లికేషన్లను ప్రభుత్వం బుట్టదాఖలుచేయడం తెల్సిందే. తాజాగా వీసా పొంది అమెరికా గడ్డపై అడుగుపెట్టాక చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వీసాను వెంటనే రద్దుచేసి, బహిష్కరించి బలవంతంగా స్వదేశానికి పంపుతామని ఒక ప్రకటనలో పేర్కొంది. ''అమెరికాలో ఉంటూ ఇతరులపై దాడికి పాల్పడటం, గృహ హింస, ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడితే వెంటనే వీసా గడువును రద్దుచేసి దేశం నుంచి బహిష్కరిస్తాం. భవిష్యత్తులో మరోసారి అమెరికాకు రాకుండా శాశ్వతంగా నిషేధిస్తాం. మీరు అతిక్రమిస్తే ప్రభుత్వం సైతం వీసా గడువును ముగించి మిమ్మల్ని దేశం నుంచి వెళ్లగొడుతుంది'' అని అమెరికా విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో స్పష్టంచేసింది. ''వీసా పొందిన మీరు చట్టబద్ధంగా అమెరికాలో ఉండేందుకు అర్హులు. ఆ సువర్ణావకాశాన్ని ఒక్క తప్పుతో చేజార్చుకోకండి. ఒక్క చిన్న నేరం చేసినా మీరు వీసా విషయంలో శాశ్వత విపరిణామాలను చవిచూడాల్సి ఉంటుంది. ఇక్కడికొచ్చే ప్రతి ఒక్క సందర్శకుడు మా చట్టాల ను గౌరవించి తీరాల్సిందే'' అని విదేశాంగ శాఖ స్పష్టంచేసింది.

వచ్చే నెలలో మోదీ చైనా పర్యటన!

- గల్వాన్ లోయ ఘర్షణ తర్వాత తొలిసారిగా చైనాకు..
- షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు కానున్న ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ వచ్చే నెలలో చైనాలో పర్యటించబోతున్నారు. ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో చైనాలోని తియాంజిన్ నగరంలో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారని సమాచారం. 2020 జూన్‌లో జరిగిన భారత్, చైనా జవాన్ల భీకర ఘర్షణ తర్వాత మోదీ చైనాకు వెళ్తుండడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఆయన చివరిసారిగా 2019లో చైనాలో పర్యటించారు. గల్వాన్ లోయ ఘటన తర్వాత భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించాయి. సంబంధాలు పునరుద్ధరించుకోవాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ విషయంలో మోదీ చైనా పర్యటన కీలకమైన ముందడుగు అవుతుందని దౌత్య నిపుణులు అంచనా వేస్తున్నారు. మోదీ చైనా పర్యటన సందర్భంగా చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. చైనాలో ఎస్సీఓ సదస్సు నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా సభ్యదేశాల అధినేతలతో మోదీ భేటీ అవుతారు. చైనా పర్యటన కంటే ముందు ప్రధానమంత్రి జపాన్‌లో పర్యటిస్తారని సమాచారం. మోదీ ప్రధానమంత్రి హోదాలో ఇప్పటిదాకా ఐదు సార్లు చైనాలో పర్యటించారు. దేశ విదేశాల్లో షీ జిన్‌పింగ్‌తో 18 సార్లు సమావేశమయ్యారు. మరోవైపు భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మంగళవారం చైనా అధినేత జిన్‌పింగ్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. భారత్-చైనా సంబంధాలపై వారు చర్చించారు.

రైతన్నల సంక్షేమానికి ధన్-ధాన్య కృషి యోజన

- ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రివర్గం
- రూ.24,000 కోట్లతో 100 జిల్లాల్లో పథకం
- ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఆరేళ్లపాటు అమలు
- పంటల ఉత్పత్తి, నిల్వ సామర్థ్యం పెంచడమే లక్ష్యం
- దేశవ్యాప్తంగా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి

న్యూఢిల్లీ: దేశంలో రైతన్నల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. 'ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన'కు ఆమోద ముద్రవేసింది. రూ.24,000 కోట్లతో రాబోయే ఆరేళ్లపాటు దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తారు. పంటల ఉత్పత్తిని పెంచడమే పథకం లక్ష్యం. దీంతో 1.7 కోట్ల మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం సమావేశమైంది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 'ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన'ను ఈ ఏడాది అక్టోబర్‌లో రబీ సీజన్ నుంచే అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

మూడు సూచికల ఆధారంగా ఎంపిక

ధన్-ధాన్య కృషి యోజన అమలుకు ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ఆగస్టులు ప్రారంభమవుతాయని చెప్పారు. 100 జిల్లాల్లో పంటల సాగు, ఉత్పత్తిపాటు గ్రామ స్థాయిలో పంటల నిల్వ సామర్థ్యాన్ని పెంచడం పథకం ఉద్దేశమని వివరించారు. పొలాలకు నీటి సరఫరాను మెరుగుపర్చడం, రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇవ్వడం ఇందులో భాగమని అన్నారు. పంటల ఉత్పాదకత తక్కువగా ఉండటం, అన్ని రుతువుల్లోనూ పంటలు సాగు పెద్దగా లేకపోవడం, రుణ లభ్యత అత్యంత తక్కువగా ఉండటం అనే మూడు కీలక సూచికల ఆధారంగా 100 జిల్లాలను గుర్తిస్తామని స్పష్టంచేశారు. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక జిల్లాను ఎంపిక చేస్తామన్నారు.

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచడానికి చర్యలు

ప్రస్తుతం అమల్లో ఉన్న 11 శాఖలకు సంబంధించిన 36 కేంద్ర పథకాలు, రాష్ట్ర పథకాల సమ్మేళనంతోపాటు ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో 'ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన'ను అమలు చేయనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెప్పారు. కేబినెట్ నిర్ణయాలను ఆయన మీడియాకు తెలియజేశారు. ఇంధన పరివర్తన ప్రయాణంలో కీలకమైన మైలురాయికి చేరుకున్నట్లు చెప్పారు. శిలాజేతర ఇంధన వనరుల నుంచే 50 శాతం విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని, నిర్దేశిత గడువు కంటే ఐదేళ్ల ముందే ఈ ఘనత సాధించామని అన్నారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని మరింత పెంచడానికి మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ప్రభుత్వ రంగంలోని ఎన్‌టీపీసీ పెట్టుబడుల పరిమితిని రూ.20,000 కోట్లకు పెంచినట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో రూ.7,000 కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్(ఎన్ఎల్‌సీఐఎల్)కు అనుమతి ఇచ్చినట్లు వివరించారు.



శుభాంశు శుక్లాకు అభినందనలు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లి, క్షేమంగా తిరిగివచ్చిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఒక తీర్మానం ఆమోదించారు. భారత అంతరిక్ష కార్యక్రమాల్లో ఇదొక నూతన అధ్యాయమని ప్రశంసించారు. శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర సఫలం కావడం మన దేశానికి గర్వకారణమని తీర్మానంలో పేర్కొన్నారు.

వర్షాకాల సమావేశాల్లో 8 కొత్త బిల్లులు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో 8 కొత్త బిల్లులు ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, జియోహెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్(సంరక్షణ, నిర్వహణ) బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్(అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్(సవరణ) బిల్లు, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను(సవరణ) బిల్లు వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే ఇన్‌కం ట్యాక్స్-2025ను కూడా ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 21వ తేదీ దాకా మొత్తం 21 రోజులపాటు జరుగుతాయి. రాఖీ పౌర్ణమి, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రెండు రోజులు సెలవులు ప్రకటించారు.

'మానవతాసాయం' వద్ద అమానవీయంగా..

- ఆహార పంపిణీ కేంద్రం వద్ద తొక్కిసలాట
- గాజాలో 20 మంది దుర్మరణం

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ భీకర భూతల, గగనతల దాడులతో నిలువెల్లా శిథిలరాజ్యంగా మారిన గాజాలో ఇప్పుడు తొక్కిసలాట ఘటనలూ పాలస్తీనియన్ల ప్రాణాలు తీస్తున్నాయి. బుధవారం గాజా స్ట్రిప్‌లో ఆహార పంపిణీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాటలో 20 మంది అమాయక పాలస్తీనియన్లు చనిపోయారు. మరోవైపు ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులపర్వంలో 11 మంది చిన్నారులుసహా మరో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజాలో ఇజ్రాయెల్ సాయంతో అమెరికాకు చెందిన ''ది గాజా హ్యూమానిటేరియన్ ఫండ్(జీహెచ్ఎఫ్)'' సంస్థ స్థానికుల కోసం ఆహారాన్ని ఉచితంగా అందిస్తోంది. ఈ కేంద్రం వద్ద బుధవారం వేలాది మంది జనం గుమిగూడారు. కౌంటర్ వద్ద ఇసకేస్తే రాలనంతగా జనం వేచి ఉన్నారు. కనీసం గాలి ఆడే అవకాశం లేక జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇదే సమయంలో హమాస్ సాయుధులు కొందరు అన్నార్తుల మాటున అక్కడికి వచ్చి త్వరగా ఆహారపంపిణీ చేయాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఆకలితో రగిలిపోతున్న జనంలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు, జనాన్ని చెల్లాచెదురుగా దూరంగా తరిమికొట్టేందుకు జీహెచ్ఎఫ్ రక్షణబలగాలు పెప్పర్ స్ప్రేలను వాడడంతోపాటు స్టన్ గ్రెనేడ్లను విసిరారు. దీంతో కళ్లు మండిపోయే పొగ, గ్రెనేడ్ల పేలుళ్లతో జనం కలావికలమయ్యారు. దీంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో కొందరు కిందపడ్డారు. వారిని తొక్కుకుంటూ జనం పారిపోయారు. ఈ ఘటనలో 20 మంది చనిపోయారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఖాన్ యూనిస్, రఫా పట్టణాల మధ్య రోడ్డు వెంట ఏర్పాటుచేసిన ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద ఈ ఘటన చోటుచేసుకుందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

నిమిషా ప్రియను క్షమించలేం

- మా కుటుంబానికి బ్లడ్ మనీ వద్దు
- షరియా చట్టం ప్రకారం న్యాయం జరగాలి: మెహదీ సోదరుడు

సనా: తన సోదరుడు తలాల్ అబ్దో మెహదీని దారుణంగా హత్య చేసిన కేరళ నర్స్ నిమిషా ప్రియను క్షమించలేమని అబ్దెల్ ఫతాహ్ మెహదీ తేల్చిచెప్పారు. ఆమె నుంచి క్షమాపణ గానీ, నష్టపరిహారం(బ్లడ్ మనీ) గానీ తాము కోరుకోవడం లేదని స్పష్టంచేశారు. తమ కుటుంబానికి న్యాయం జరగాలని అన్నారు. యెమెన్‌లో మాజీ వ్యాపార భాగస్వామి అయిన తలాల్ అబ్దో మెహదీని 2017లో విషపు ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేసినందుకు నిమిషా ప్రియకు స్థానిక కోర్టు మరణ శిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఆమెకు బుధ వారం శిక్ష అమలు చేయాల్సి ఉండగా, చివరి నిమి షంలో వాయిదా పడింది. బాధితుడి సోదరుడు అబ్దెల్ ఫతాహ్ మెహదీ బీబీసీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'ఖిసాస్' తప్ప ఇంకేమీ కోరుకోవడం లేదని చెప్పారు. షరియా చట్టం ప్రకారం తమకు న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. తన సోదరుడిని చంపినందుకు నిమిషా ప్రియను ఉరి తీయాల్సిందేనని, అంతకుమించి ఇంకేదీ అక్కర్లే దని వెల్లడించారు.

ఆకాశ్ ప్రైమ్ పరీక్ష విజయవంతం

సముద్రమట్టానికి 15వేల అడుగుల ఎత్తులో పరీక్ష

న్యూఢిల్లీ: భారత స్వదేశీ తయారీ గగనతల రక్షణ వ్యవస్థను మరింత పటిష్టంచేసేలా ఆకాశ్ ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతమైందని భారత రక్షణ శాఖ వర్గాలు బుధవారం ప్రకటించాయి. సముద్రమట్టానికి 15,000 అడుగుల ఎత్తులో లద్దాఖ్‌లో భూతలం నుంచి గగనతల లక్ష్యాలను ఛేదించే ఆకాశ్ ప్రైమ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించామని రక్షణ వర్గాలు తెలిపాయి. క్షిపణిని అభివృద్ధి చేసిన రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) సహకారంతో లద్దాఖ్ సెక్టార్‌లో ఈ ప్రయోగపరీక్షలు పూర్తయ్యాయి. గగనంలో వేగంగా భిన్న దిశల్లో కదిలే రెండు లక్ష్యాలను ఆకాశ్ ప్రైమ్ మిస్సైల్ అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించింది. అననుకూల వాతావరణంలోనూ పూర్తి సమర్థతతో పనిచేసి క్షిపణి తన సత్తా చాటింది. భారత సైన్యంలోని మూడో, నాలుగో ఆకాశ్ రెజిమెంట్‌లో ఈ కొత్త ఆకాశ్ ప్రైమ్ క్షిపణులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్తాన్ నుంచి దూసుకొచ్చిన డ్రోన్లు, క్షిపణులను ఆ ఆకాశ్ ప్రైమ్ క్షిపణి విజయవంతంగా అడ్డుకుని ఇప్పటికే తన సమర్థతను నిరూపించుకుంది. ఆనాడు పాకిస్తాన్‌కు చైనా తయారీ యుద్ధవిమానాలు, ఇజ్రాయెల్ సరఫరా చేసిన డ్రోన్ల నుంచి పొంచి ఉన్న ముప్పును ఆకాశ్ ప్రైమ్ క్షిపణులు తప్పించాయని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

సిరియాపై కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులు

డమాస్కస్: దశాబ్దాల తరబడి నిరంకుశ పాలన, 14 ఏళ్లుగా అంతర్యుద్ధంతో అల్లాడిపోయిన సిరియాలో కొత్తగా అహ్మద్ అల్ షారా నేతృత్వంలో కొలువుతీరిన తాత్కాలిక ప్రభుత్వానికి డ్రూజ్ మిలిటెంట్ల రూపంలో కొత్త సమస్య స్వాగతం పలికింది. దీంతో డ్రూజ్ ప్రాభల్య సువేదా నగరంలో మిలిటెంట్లతో సిరియా ప్రభుత్వ బలగాలు పోరాడుతున్నాయి. డ్రూజ్ మైనార్టీలకు మద్దతు పలికే పొరుగు దేశం సిరియా ఇందులో పూర్తిగా జోక్యం చేసుకుని సిరియా సేనలపైకి దాడులతో తెగబడుతోంది. బుధవారం సిరియా రాజధాని డమాస్కస్‌లోని రక్షణమంత్రిత్వ శాఖ కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడిలో ఒకరు చనిపోయారు. 34 మంది గాయపడ్డారు.

ఇంజిన్ వైఫల్యంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్

ముంబై: ఢిల్లీ నుంచి గోవాకు బయల్దేరిన ఢిల్లీ-గోవా ఇండిగో విమానం మార్గమధ్యంలో ముంబైలో అత్యవసరంగా ల్యాండయింది. ఢిల్లీలో బుధవారం రాత్రి 8 గంటలకు బయల్దేరిన ఈ విమానం ఇంజిన్ వైఫల్యం కారణంగా దిశను మార్చుకుని ముంబైలో 9గంటల 52 నిమిషాలకు ల్యాండయిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ అనూహ్య ఘటన జరిగినప్పుడు ఈ ఎయిర్‌బస్ ఏ320 నియో రకం విమానంలో ఎంతమంది ఉన్నారనే వివరాలు తెలియరాలేదు.

పహల్గాంలో ఉగ్రవాదుల రాక్షసానందం

- పర్యాటకులను హత్య చేశాక గాల్లోకి కాల్పులు జరుపుతూ సంబరాలు
- విచారణలో వెల్లడించిన ప్రత్యక్ష సాక్షి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన రాక్షసంగా దాడికి పాల్పడి, 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్న కిరాతకులు ఆ తర్వాత సంబరాల్లో మునిగిపోయారు. తుపాకులతో గాల్లోకి కాల్పులు జరుపుతూ ఆనందంతో గంతులు వేశారు. అనుకున్నది సాధించామన్న సంతృప్తి వారిలో కనిపించింది. ప్రత్యక్ష సాక్షి ఒకరు ఈ విషయం బయటపెట్టారు. పహల్గాం ఉగ్రవాద దాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) విచారణ కొనసాగిస్తోంది. సాక్షులను ప్రశ్నిస్తోంది. ప్రత్యక్ష సాక్షి తాను కళ్లారా చూసిన సంగతులు అధికారులకు వివరించారు. పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులపై ముగ్గురు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. పర్యాటకులు మరణించాక చాలాసేపు అక్కడే ఉన్నారు. మృతదేహాలను చూస్తూ గాల్లోకి కాల్పులు జరుపుతూ రాక్షసానందం పొందారు. అనంతరం నింపాదిగా వెళ్లిపోయారు. వారు అక్కడి నుంచి వెళ్తూ ప్రత్యక్ష సాక్షికి ఎదురుపడ్డారు. పహల్గాం దాడిపై ప్రత్యక్ష సాక్షి విలువైన సమాచారం అందించాడని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ దాడికి సంబంధించిన సంఘటనలను ఒక క్రమపద్ధతిలో పేర్చడానికి అతడి సమాచారం దోహదపడిందని అన్నారు.

కబుర్లు చెప్తా.. కమ్మటి భోజనం పెడతా

శుభాంశు భార్య కామ్నా ఎదురుచూపులు

లక్నో: అంతరిక్షరంగంలో భారత కీర్తిపతాకను అంతర్జాతీయ అంతరిక్షకేంద్రంలో ఎగరేసి పుడమికి తిరిగొచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లా రాక కోసం లక్నోలో ఆయన కుటుంబం ఎదురుచూస్తోంది. ఈ సందర్భంగా శుక్లా సతీమణి కామ్నా మీడియాతో మాట్లాడారు. ''అద్వితీయమైన ఆయన అంతరిక్ష యాత్ర ముగింపు తర్వాత కుటుంబంతో ఎప్పుడు గడుపుతారా అని మేమంతా ఎదురు చూస్తున్నాం. ఆయన లక్నోకు రాగానే ఇంటి భోజనం రుచి చూపిస్తా. తినలేకపోయిన ఆయనకు ఎంతో ఇష్టమైన వంటకాలను కొసరి కొసరి వడ్డిస్తా'' మా ఆరేళ్ల అబ్బాయి కియాశ్ సహా కుటుంబం మొత్తం సరదాగా గడుపుతాం'' అని ఆయన భార్య కామ్నా చెప్పారు. ''ఈయన వెళ్లిన వెంటనే నాకు ఫోన్ చేశారు. సంభ్రమాశ్చర్యాలకు గురయ్యా. ఆయన గొంతు వినగానే ప్రాణం లేచొచ్చింది. అక్కడ ఆయన చేసిన శాస్త్రసాంకేతిక ప్రయోగాలపైనే మేమిద్దరం మాట్లాడుకున్నాం. భూమికి దూరంగా అంతెత్తులో గడపడం అసాధారణంగా ఉందని నాతో అనేవారు. అక్కడ ఉన్న ఈ 18 రోజుల్లో ఆయనతో జరిపిన ఈ ఫోన్‌కాల్ సంభాషణలు నా జీవితంలో మర్చిపోలేను. ఆయన స్వదేశాను గమనం మా కుటుంబానికే కాదు యావత్ దేశానికి గర్వకారణం కావడం నాకెంతో నచ్చింది అని ఆమె అన్నారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 17 । జూలై । 2025



దాడులు.. కేసులు.. అరెస్టులు

నకిలీ మందుల సరఫరా ఏజెన్సీలపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు దాడులు ఉధృతం చేస్తున్నారు. మెడికల్ షాపులు, సరఫరా ఏజెన్సీలపై దాడులు నిర్వహిస్తున్నారు. -8లో



కెరీర్.. వెరీ కేర్‌ఫుల్

ప్రస్తుతం నగరం చదువుల ఉత్సాహంతో ఉప్పొంగిపోతోంది. నోటిఫికేషన్లు, ఎంట్రెన్స్ ఫలితాలు, ర్యాంకులు, సీట్లు, కేటాయింపులు, కౌన్సెలింగ్‌ల ప్రక్రియల చర్చలు సాగుతున్నాయి.- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/24.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ఐసీసీసీలో ఫైర్ మాక్‌డ్రిల్

పర్యవేక్షించిన ఉన్నతాధికారులు



అవగాహన కల్పిస్తున్న కమలాసన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీఐసీసీసీ) బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య పర్యవేక్షణలో జరిగిన ఈ డ్రిల్‌లో అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్, హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ, 108, వాటర్ వర్క్స్ తదితర విభాగాలు పాల్గొన్నాయి. అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితులలో భవనంలో పని చేస్తున్న ఉద్యోగులను ఎలా కాపాడాలి? వారు స్వచ్ఛందంగా తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి? తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ మాక్ డ్రిల్ చాలా కీలకమైనవని, వీటిలో ఉండే, పని చేసే ఉద్యోగులకు తప్పనిసరిగా భవన నిర్మాణం, అత్యవసర నిష్క్రమణలు, ఫైర్ అలారం, అగ్నిమాపక పరికరాలు ఉన్న ప్రాంతాలు, వాటి వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు. ఏడున్నర ఎకరాల స్థలం మధ్యలో ఈ భవనం నిర్మించడంతో ఫైర్ ఇంజన్లు, 108 వాహనాలు సులభంగా సమీపం వరకు చేరుకునే అవకాశం ఉంది. ప్రతి టవర్‌కు రెండు ప్రదేశాల్లో మెట్లు ఉన్నాయి. అత్యవసర సమయంలో లిఫ్టులు వాడకుండా మెట్ల దారులను ఎంచుకోవాలని సూచించారు.

ఎట్టకేలకు అమ్మ చెంతకు..

- రెండు నెలల క్రితం తప్పినపోయిన ఇద్దరు పిల్లలు
- ఆపరేషన్ ముస్కాన్‌లో తల్లికి అప్పగించిన పోలీసులు



నిజాంపేట్: కూకట్‌పల్లి డివిజన్ టీమ్ చైల్డ్ మిస్సింగ్ ట్రేస్ అవుట్‌లో భాగంగా బుధవారం ఆపరేషన్ ముస్కాన్ ద్వారా పోలీసులు ఇద్దరు పిల్లలను అమ్మ ఒడికి చేర్చారు. రెండు నెలల క్రితం ఆడుకుంటూ తప్పిపోయిన పిల్లలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి వెళ్లగా అక్కడ ఆర్పీఎఫ్ పోలీసులు రక్షించారు. హైదరాబాద్ జిల్లా బాలల సంరక్షణ గృహంలో వీరిని ఉంచారు. 15 రోజులకు పిల్లల తల్లి బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కంప్లెయింట్ చేశారు. ఎఫ్ఐఆర్ సీఆర్ నంబర్ 527/2025 ఆపరేషన్ మిస్సింగ్ టీమ్ ఇన్‌చార్జి సబ్ ఇన్‌స్పెక్టర్ నజీర్ మియా, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి శ్రావణ్ కుమార్, ఏహెచ్‌టీయూ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి బృందం బాచుపల్లి ప్లై ఓవర్ కింద ఉన్న పిల్లల ఆచూకీ తెలుసుకొని తల్లి చెంతకు చేర్చారు. పిల్లలను, తల్లిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ ముందు హాజరుపరిచారు. పిల్లలను సంరక్షణ గృహంలో ఆశ్రయం ఇచ్చారు. తల్లికి స్వధార్ హోమ్‌లో ఆశ్రయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ సుమన్, ఉమెన్ కానిస్టేబుల్ జ్యోతి, ఏఎస్ఐ చక్రపాణి, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

కలెక్టర్ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల రక్షణపై కలెక్టరేట్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ విభాగాల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్కారు స్థలాల్లో ఆక్రమణలను నిరోధించేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, ఇది రెవెన్యూ అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణ, భవన నిర్మాణ అనుమతుల విషయంలో నిర్లక్ష్యం, తగిన ఆధారాలు లేకుండా సిఫార్సులు, నిరాకరించడం వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ప్రతిపాదనకు సరైన వాస్తవాధారాలతో నివేదిక ఇవ్వాలని సూచించారు. న్యాయ సంబంధిత కేసులపై సమీక్ష నిర్వహించి ముఖ్యంగా కోర్టు కేసులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముకుందరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, లా ఆఫీసర్ శ్రీధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన



విలీనంపై ప్రచారం..

గ్రేటర్ నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు పోచారం, ఘట్కేసర్, దమ్మాయిగూడ, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, కొంపల్లి, అలియాబాద్, ఎల్లంపేట, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలు విలీనం కానున్నాయన్న ప్రచారం స్థానిక రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. 16 పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేస్తారన్న స్థానిక ప్రజల చర్చల నేపథ్యంలో.. అధికార కాంగ్రెస్ పార్టీకి ఒనగూరే రాజకీయ లాభనష్టాల సమీకరణలకు అనుగుణంగా విలీన ప్రక్రియ ఆధారపడి ఉండనున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్త రూపం.. అద్వితీయం

అర్బన్ జిల్లాగా మేడ్చల్- మల్కాజిగిరి

- జెడ్పీ లేని రెండో జిల్లాగా హైదరాబాద్ సరసన
- 62 జీపీలు, 5 ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా పరిషత్ మాయం
- 16 పురపాలక సంఘాలు, 6 మున్సిపల్ సర్కిళ్లతో అర్బన్ మయం

సాక్షి, మేడ్చల్ జిల్లా

అర్బన్ ప్రాంతంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రూపురేఖలు మారాయి. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలు ఉండగా, ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లా మాత్రమే జెడ్పీ లేని అర్బన్ ప్రాంతంగా కొనసాగుతోంది. తాజాగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూడా జెడ్పీ లేని రెండో జిల్లాగా తెలంగాణలో హైదరాబాద్ సరసన చేరింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి కొత్తగా ఆవిర్భవించిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు మండలాలు.. 62 గ్రామ పంచాయతీలతో జిల్లా పరిషత్ (జెడ్పీ) ఉండేది. దీని పరిధిలో ఐదు మండలాలు మాత్రమే ఉండగా, అతి చిన్న జిల్లా పరిషత్‌గా ఐదుగురు జెడ్పీటీసీలు, ఐదుగురు ఎంపీపీలతో జెడ్పీ పాలకవర్గం ఐదేళ్లు మనుగడ సాగించింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు మండలాల పరిధిలో 62 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో ఓఆర్ఆర్ లోపల ఉన్న 28 గ్రామ పంచాయతీలను సమీపంలోని ఏడు పురపాలక సంఘాల్లో విలీనం చేసింది. తాజాగా మిగిలిన 34 గ్రామ పంచాయతీలను కూడా మూడు పురపాలక సంఘాలుగా ఏర్పాటయ్యాయి. కొత్తగా ఏర్పడిన మూడు పురపాలక సంఘాలతో కలిపి మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 16 పురపాలక సంఘాలయ్యాయి.

మాయం కానున్న శాఖలు..

జిల్లా పరిషత్ (జెడ్పీ)తో పాటు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ), ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ శాఖలు మాయం కానున్నాయి. దీంతో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులు నిలిచిపోతాయా? లేక కొనసాగిస్తారా? అనే విషయంపై సందిగ్ధత నెలకొంది.

16కు చేరిన పురపాలక సంఘాలు

మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లాలో ప్రస్తుతం 13 పుర పాలక సంఘాలు ఉండగా, తాజాగా ఏర్పడిన కొత్త మూడు పురపాలక సంఘాలు కలిపి.. మొత్తం 16 పురపాలక సంఘాలు అయ్యాయి. ఇందులో నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు కాగా, మేడ్చల్, తూముకుంట, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, కొంపల్లి, దుండిగల్, కొత్తవి అలియాబాద్, ఎల్లంపేట, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయి.

గ్రేటర్‌ను క్లీన్.. గ్రీన్

సిటీగా తీర్చిదిద్దాలి

మేయర్ విజయలక్ష్మి

మొక్కలు నాటిన అనంతరం చిన్నారులతో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్ తదితరులు



సుభాష్‌నగర్: గ్రేటర్ నగరాన్ని క్లీన్, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం గాజుల రామారం డివిజన్ షిరిడీ హిల్స్ కాలనీలో వన మహోత్సవంలో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి మేయర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో ఈ ఏడాది 25 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. లక్ష్య సాధనకు నగరంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. మొక్కలు నాటడంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతీ పౌరుడూ 'ఏక్ పేడ్.. మాకే నామ్' అనే నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్క నాటాలన్నారు. మొక్కలను నాటడమే కాదు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆకుపచ్చని హైదరాబాద్ లక్ష్యంగా గ్రేటర్ పరిధిలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, యూబీడీ అదనపు కమిషనర్ సుభద్రా దేవి, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు 'చుక్కలే'

- పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిర్వహణ
- కీలక నిర్ణయం తీసుకున్న సిటీ ట్రాఫిక్ చీఫ్

ఇక ఆకస్మికంగా డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు



నగరంలో బుధవారం మధ్యాహ్నం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు ఏ సమయంలో ఎక్కడెక్కడ జరుగుతుంటాయి అనేది మందుబాబులకు కొట్టిన పిండిగా మారింది. 2011 నుంచి ఈ విధానం కొనసాగిస్తుండటమే దీనికి కారణం. దీంతో మద్యం తాగి వాహనాలు నడిపే వాళ్లు ఆయా సమయాలు, మార్గాలను వదిలి వెళుతూ చిక్కకుండా తప్పించుకుంటున్నారు. ఇలాంటి వాళ్లే కొన్నిసార్లు ప్రమాదాలకు లోనవుతూ, కారకులుగా మారుతున్నారు. తమ ప్రాణాలు కోల్పోవడమో, ఎదుటి వారి ప్రాణం తీయడమో చేస్తున్నారు. గత నెలలో పాఠశాల బస్సులపై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించారు. అప్పట్లో బడి బస్సులు నడిపే 35 మంది డ్రైవర్లు సైతం మద్యం మత్తులో చిక్కారు. ఈ విషయాలు గమనించిన నగర ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమయం, ప్రాంతం, సందర్భాలతో సంబంధం లేకుండా ఆకస్మికంగా డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు చేయాలని ప్రతిపాదించారు. ఈ విధానానికి నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ఆమోదముద్ర వేయడంతో బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సైతం అనేక ప్రాంతాల్లో డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు చేపట్టారు. మైనర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కితే కఠిన చర్యలు తీసుకోవాలని, వారితో పాటు వాహన యజమాని, మద్యం విక్రయించిన వ్యాపారి పైనా కేసులు నమోదు చేయనున్నారు. మైనర్ డ్రైవింగ్ పైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇలా చిక్కిన 4500 మందిపై కేసులు నమోదు చేశారు. 2800 వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు కోసం సిఫార్సు చేయగా... ఆర్టీఏ అధికారులు ఇప్పటికే 863 రద్దు చేసినట్లు జోయల్ డెవిస్ ప్రకటించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ చిక్కితే వారికి 25 ఏళ్ల వచ్చే వరకు లైసెన్సు రాదని స్పష్టం చేశారు.

మింట్ కాంపౌండ్‌లో స్పెషల్ డ్రంకన్ డ్రైవ్

ఖైరతాబాద్: నగర సీపీ ఆదేశాల మేరకు పగటి పూట కూడా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డెవిస్ తెలిపారు. బుధవారం సాయంత్రం మింట్ కాంపౌండ్‌లో ఆకస్మికంగా డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా చేపడుతున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా షాకింగ్ కలిగించే విషయాలు బయటపడ్డాయని, ముఖ్యంగా స్కూలు బస్సు, స్కూల్‌కు ఆటోలలో పిల్లల్ని తీసుకువెళ్లే డ్రైవర్లు తాగి డ్రైవ్ చేస్తున్నారని చెప్పారు. నెల రోజుల్లో 35 కేసులు నమోదు చేశామని, ఓ స్కూల్ బస్సు డ్రైవర్‌కు 400 రీడింగ్ వచ్చిందని తెలిపారు. నగరంలో ఆకస్మికంగా పగటి పూట కూడా డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ రాములు, సెంట్రల్ జోన్ ఏసీపీ మోహన్ కుమార్, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటుకు చర్యలు

- స్లమ్ ఏరియాల్లో జాయింట్ టీం సర్వే
- గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటు కోసం జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు స్లమ్ ఏరియాలలో జాయింట్ సర్వే నిర్వహించాలని గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ మోడల్ కాలనీల నేపథ్యంలో మురికి వాడల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వివరాలు అందజేయాలని సూచించారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్లు మంజూరు కాగా, జిల్లాల్లో దాదాపు లక్షా యాభై వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ఇందిరమ్మ మోడల్ కాలనీలు ఏర్పాటు చేసి భవన సముదాయాలు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 106 స్లమ్స్‌లో తాత్కాలికంగా నిర్మించుకున్న ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇళ్లు నిర్మించేందుకు సంసిద్ధంగా ఉందని, జాయింట్ టీం పక్కాగా సర్వే చేసి త్వరలో నివేదికలు అందించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముకుంద రెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, సూపరింటెండెంట్ ఇంజినీర్ (హౌసింగ్) వెంకట్ దాసు రెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, పీడీ హౌసింగ్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బకాయిల షాక్!

గ్రేటర్‌లో 3.29 లక్షల బిల్‌స్టాప్ కనెక్షన్లు!

- ఎల్‌టీ విభాగంలో రూ.67.05 కోట్లు..
- హెచ్‌టీలో రూ.200 కోట్లకుపైగా బకాయిలు
- వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన డిస్కం



గ్రేటర్‌లో పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు, బకాయిలు

సర్కిల్	హెచ్‌టీ కనెక్షన్లు	(రూ.కోట్లలో)	ఎల్‌టీ కనెక్షన్లు	(రూ.కోట్లలో)
బంజారాహిల్స్	08	10.70	21,963	2.17
సైబర్ సిటీ	37	10.77	32,075	6.81
హబ్సిగూడ	50	12.24	49,224	5.35
హైదరాబాద్ సెంట్రల్	13	8.11	31,527	7.06
హైదరాబాద్ సౌత్	10	2.65	42,396	20.55
మేడ్చల్	51	13.17	32,196	3.72
రాజేంద్రనగర్	96	140.59	57,159	13.72
సరూర్‌నగర్	23	2.36	34,349	5.58
సికింద్రాబాద్	-	-	28,762	2.09

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో బిల్‌స్టాప్ కనెక్షన్ల సంఖ్య భారీగా పేరుకుపోయింది. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో డిస్కం ఆయా కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసింది. తొమ్మిది సర్కిళ్ల పరిధిలో లో టెన్షన్ (ఎల్‌టీ కేటగిరీ–2, 3) బిల్‌స్టాప్ కనెక్షన్లు 3,29,651 ఉండగా, వీటి నుంచి రూ.67.05 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. 288 హైటెన్షన్ (హెచ్‌టీ) కనెక్షన్ల నుంచి రూ.200.59 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. పెద్ద మొత్తంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల వసూళ్లకు డిస్కం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా ఆయా కనెక్షన్లు/సంస్థలు/ భవనాల ముందు బకాయి చెల్లింపుల కోసం హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేస్తోంది. అంతేకాకుండా ఏళ్ల తరబడి బిల్లులు వసూలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన, బిల్‌స్టాప్ కనెక్షన్లకు కొత్త కనెక్షన్లు జారీ చేసిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తోంది. ఇప్పటికే అకౌంట్స్ విభాగంలోని ఐదుగురు అధికారులకు హెచ్‌టీ కనెక్షన్లకు సంబంధించిన విషయంలో సంజాయిషీ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఎల్‌టీ కేటగిరిలోని కనెక్షన్లను తనిఖీ చేస్తే మరికొంత మంది అధికారులు చిక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అక్రమార్కులకు బిగుస్తున్న ఉచ్చు..

ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 63 లక్షలకు చేరుకుంది. వీటిలో 53 లక్షలకుపైగా గృహ విద్యుత్, 8 లక్షల వరకు వ్యాపార, వాణిజ్య కనెక్షన్లు ఉన్నట్లు అంచనా. భారీ, మధ్యతరహా చిన్న పరిశ్రమల కనెక్షన్లు మరో 45 వేల వరకు ఉన్నట్లు అంచనా. వీటి నుంచి నెలకు విద్యుత్ బిల్లుల రూపంలో రూ.1200 కోట్లకుపైగా వసూలవుతోంది.

- ప్రతి నెలా కొత్తగా మరో 2,500 కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. ఇప్పటికే కనెక్షన్లు పొంది.. నెలల తరబడి బిల్లులు చెల్లించిన వారి కనెక్షన్లను క్షేత్రస్థాయి సిబ్బంది తొలగించారు. వారి నుంచి బకాయిల వసూళ్లను విస్మరించారు. ఇదే సమయంలో కొంత మంది అధికారులు ఆయా పారిశ్రామిక వేత్తలతో మిలాఖతై.. అదే భవనం /సంస్థకు గుట్టుగా కొత్త కనెక్షన్ (పేరులో స్వల్ప మార్పులు చేసి) జారీ చేశారు. ఉద్దేశపూర్వకంగానే సంస్థకు పెద్ద మొత్తంలో నష్టాలను తెచ్చిపెట్టారు.
- ఎప్పటికప్పుడు విద్యుత్ డిమాండ్, బిల్లుల వసూళ్లపై సమీక్ష నిర్వహించాల్సిన అధికారులు పట్టించుకోకపోగా, సరికొత్త అక్రమార్కులతో కలిసి సరికొత్త దందాకు తెరతీసినట్లు ఇప్పటికే పలు సర్కిళ్లలో అంతర్గతంగా నిర్వహించిన తనిఖీల్లో స్పష్టమైంది. తాజాగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో బకాయిదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అధికారులపై చర్యలకు డిస్కం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఇంటికో ఇంకుడు గుంత

భూగర్భ జలాల పెంపు ప్రధాన లక్ష్యం

- సర్కిళ్ల వారీగా అవగాహన కార్యక్రమాలు
- 16 వేల గృహ సముదాయాలకు నోటీసులు
- జలమండలి 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ

సాక్షి, సిటీబ్యూరో: కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న మహా నగరంలో భూగర్భ జలాల పెంపు కోసం 'ప్రతి ఇంటా ఇంకుడు గుంత' పేరిట 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికకు జలమండలి సిద్ధమైంది. వాన చినుకు భూమిలో ఇంకే పరిస్థితి లేక భూగర్భ జలాలు అడిగంటిపోవడం సర్వసాధారణమైంది. ట్యాంకర్ల ద్వారా నిత్యావసరాలకు వినియోగించే నీళ్లను కూడా సరఫరా జలమండలికి తలకు మించిన భారంగా తయారైంది. వాస్తవంగా విస్తరిస్తున్న నగరంలో పెరుగుతున్న జనావాసాలకు తగ్గట్లు ప్రధాన జలాశయాల నుంచి నీటి కేటాయింపు లేకున్నా.. పదేళ్ల క్రితం నాటి కేటాయింపుల ప్రకారం తరలిస్తున్న నీటినే సర్దుబాటు చేస్తూ వస్తోంది. కేవలం తాగు నీటి అవసరాలకు ప్రస్తుతం 690 ఎంజీడీల వరకు డిమాండ్ ఉన్నా 555 ఎంజీడీలను మాత్రమే సరఫరా చేస్తోంది. భూగర్భ నీటిమట్టం పాతాళంలోకి చేరడంతో నీటి సరఫరా భారం జలమండలిపై పడుతోంది. దీంతో భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంటా ఇంకుడు గుంతల ఏర్పాటు శాశ్వతం మార్గం భావించింది. ఈసారి కూడా వర్షాభావ పరిస్థితులలో పలు ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.

ఇంకుడు గుంతలపై సర్వే..

జలమండలి వేసవి కంటే ముందు ఇంకుడు గుంతలపై సర్వే నిర్వహించింది. వాస్తవంగా గత వేసవిలో ట్యాంకర్లను అధికంగా బుక్ చేసిన ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి, మణికొండ, నిజాంపేట, హఫీజ్‌పేట, అల్వాల్ మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, సాహెబ్‌నగర్, మారేడుపల్లి, నారాయణగూడ, రాజేంద్రనగర్, బోడుప్పల్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తే బోరుబావుల మీద ఆధారపడి భూగర్భ జలాలు అడుగంటి ట్యాంకర్ల మీద ఆధారపడినట్లు సుమారు 42,206 వేల నివాసాలను గుర్తించింది. అందులో 17,393 గృహ సముదాయాల ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు లేవని, మిగతా నివాసాల్లో ఉన్నా.. ప్రతిఏటా వర్షాకాలంలో సరైన స్థితిలో నిర్వహించడం లేదని సర్వేలో బహిర్గతమైంది. ఇప్పటి వరకు ఇంకుడు గుంతలు లేని సుమారు 16,066 నివాస సముదాయాలకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఎన్జీఓల సహాయంతో సుమారు 12 వేల ఇంకుడు గుంతల నిర్మాణం, పునర్నిర్మాణం (మెయింటనెన్స్) పూర్తి చేసింది.

కీలక నిర్ణయం..

ఈసారి ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఏర్పాటుపై జలమండలి సీరియస్‌గా తీసుకుంది. సుమారు 200 చదరపు గజాలకు పైగా విస్తీర్ణమున్న ప్రతి నివాసంలో, 300 చ.గజాలు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలోని భవన సముదాయాలకు ఇంకుడు గుంత తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఓఆర్ఆర్ పరిధిలోని గృహ సముదాయాల విస్తీర్ణాన్ని మాత్రం 200 చ.గజాలకు పరిమితం చేసింది. వాల్టా చట్టం ప్రకారం కూడా ఇంకుడు గుంతల నిర్మాణం చేపటాల్సిందే. వానా కాలంలో ఇంకుడు గుంతలు నిర్మిస్తేనే కురిసిన ప్రతి వర్షపు చుక్క భూగర్భంలో ఇంకుతుందని గృహ సముదాయాల వాసులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలకు జలమండలి సిద్ధమైంది.



ఇంకుడు గుంతలపై అవగాహన

ప్రతి వర్షపు చుక్కా.. భూమిలో ఇంకాల్సిందే

భూగర్భజలాల పెంపునకు ప్రతి వర్షం చుక్కను భూమిలో ఇంకించేలా ప్రయత్నించడం అందరి కర్తవ్యం. ప్రతి నివాస ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి. ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోడానికి ఈ వర్షాకాలమే సరైన సమయం. నిర్మాణాలకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తాం.

– అశోక్ రెడ్డి, ఎండీ, జలమండలి

నాతో రాకపోతే చంపేస్తా..

● యువకుడి వేధింపులు.. మనస్తాపంతో యువతి ఆత్మహత్య..

బంజారాహిల్స్: తనతో కలిసి ఉండకపోతే చంపేస్తానని ఓ యువతిని బెదిరించడమే గాక తరచూ ఆమె పనిచేస్తున్న చోటుకు వెళ్లి వేధింపులకు గురిచేస్తుండడంతో మనస్తాపానికి గురైన బాధితురాలు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా, వట్టికం మన్‌పహాడ్ గ్రామానికి చెందిన బానోతు రంగమ్మ హౌస్‌కీపింగ్ పనిచేస్తూ శ్రీకృష్ణానగర్‌లో తన కుమార్తె రేణుక (20)తో కలిసి ఉంటోంది. రేణుక సమీపంలోని ల్యాండ్ రిడ్జ్‌లో పని చేసేది. రెండేళ్ల క్రితం ఆమెకు చల్లా వినయ్‌కుమార్ అనే యువకుడితో పరిచయం కావడంతో ఇద్దరూ ప్రేమించుకున్నారు. అయితే డ్రగ్స్‌కు అలవాటు పడిన వినయ్‌కుమార్ ఆవారాగా తిరుగుతూ రేణుక జీతాన్ని బలవంతంగా లాక్కునేవాడు. దీంతో ఆమె అతడిని దూరం పెట్టింది. ఈ నెల 9న రేణుక డ్యూటీకి వెళ్లింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో వినయ్‌కుమార్ రేణుక పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి ఆమెతో పాటు అక్కడ పనిచేస్తున్న దివ్య అనే యువతిని కూడా బలవంతంగా లాక్కొచ్చి రేణుక స్కూటీ పైనే వారిని ఎక్కించుకుని వెళ్తుండగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. మద్యం మత్తులో ఉన్న వినయ్‌కుమార్ బైక్ నడుపుతుండడంతో కేసు నమోదు చేసిన పోలీసులు బైక్‌ను సీజ్ చేశారు. ఇంటికి వెళ్లిన రేణుకను బైక్ విషయమై తల్లి ప్రశ్నించగా రిపేర్‌కు ఇచ్చానని తల్లికి అబద్ధం చెప్పింది.దీంతో మనస్తాపానికి లోనైన ఆమె ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురి ఆత్మహత్యకు వినయ్‌కుమార్ కారణమని తల్లి రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న అతడి కోసం గాలిస్తున్నారు.

మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి


దొడ్ల మల్లేష్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుండ్లపోచంపల్లికి చెందిన దొడ్ల మల్లేష్(54)కు ఇద్దరు భార్యాలు. కొంత కాలంగా వారి నుంచి దూరంగా ఉంటున్నాడు. మద్యానికి బానిసైన మల్లేష్ బుధవారం మద్యం మత్తులో గుండ్లపోచంపల్లిలోని నారాయణ చెరువు కట్ట పైనుంచి వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడటంతో మృతి చెందాడు. మృతుడి అక్క లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దాడులు.. కేసులు.. అరెస్టులు

దడ పుట్టిస్తున్న డ్రగ్ కంట్రోల్ అధికారులు

● నకిలీ మందుల విక్రేతలపై ఉక్కుపాదం మోపుతున్న డీసీఏ


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ మందులు తయారీ, సరఫరా ఏజెన్సీలపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు దాడులు ఉధృతం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో మెడికల్ షాపులు, సరఫరా ఏజెన్సీలపై పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నకిలీ మందులు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తున్నారు. దీంతో నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డ్రగ్ సరఫరా ఏజన్సీలు, మెడికల్ దుకాణాల యాజమాన్యాల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. నకిలీల ఏరివేతపై ఉక్కుపాదం మోపుతున్నారు.

ప్రపంచానికి యాక్టీవ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్స్ (ఏపీఐఎస్) పిలిచే బల్క్ డ్రగ్స్ సరఫరాలో హైదరాబాద్ వాటా సుమారు 40 శాతంగా ఉంటోంది. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో చైనా ఆధిపత్యాన్నిఅధిగమించింది. అనేక ప్రఖ్యాత పరిశ్రమలు హైదరాబాద్ కేంద్రంగా ఔషధాలను తయారు చేసి, ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాల పట్ల నమ్మకం సొంతం చేసుకుంది. ఇంత వరకు బాగానే ఉన్నా ఇక్కడే అసలు చిక్కు వచ్చిపడింది. ప్రముఖ కంపెనీల పేర్లతో స్థానికంగా కొందరు నకిలీ మందులు తయారు చేసి మార్కెట్‌లో సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారం చాపకింద నీరులా క్షేత్ర స్థాయికి చేరుతోంది. దీంతో అప్రమత్తమైన డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు నకిలీలపై దృష్టిసారించారు. ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎవరు అమ్ముతున్నారు..తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఖచ్చితమైన సమాచారంతో దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కాలంలో నగరంలోని తనిఖీలు చేపట్టగా రెండు ఏజెన్సీలలో నకిలీ మందులు విక్రయిస్తున్నారని తేలింది. దీంతో ఆయా ఏజెన్సీ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఇద్దరు అరెస్టు చేశారు. అబార్షన్ కిట్ల అక్రమ అమ్మకాలపై దృష్టి సారించిన అధికారులు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు నిర్వహించారు. మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టోల్ ట్యాబ్లెట్లు, మొదలైన అబార్షన్ కిట్లను అనధికారికంగా అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. 149 మెడికల్ దుకాణాలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. అయితే హైదరాబాద్‌లోనే సుమారు 15 వేలకుపైగా మెడికల్ దుకాణాలు ఉన్నాయి. వీటిని సక్రమ పద్ధతిలో తనిఖీలు నిర్వహించడానికి డ్రగ్ కంట్రోల్ అథారిటీ వద్ద సరిపడా సిబ్బంది లేకపోవడంతో దుకాణ యజమానులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్న 11 మంది ఇన్‌స్పెక్టర్లతో మెడికల్ దుకాణాల తనిఖీ అనేది అసాధ్యమైన పని. దీంతో నిఘా వర్గాల సమాచారంతో ఖచ్చితంగా దాడులు నిర్వహించి, నకిలీలను ఏరివేస్తున్నారు. భవిష్యత్తులోనూ ఈ దాడులు కొనసాగుతాయని డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వ్యాపారలావాదేవీలు నిర్వహించే సందర్భంలోఆయా ఏజెన్సీల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొట్టి పాస్‌పోర్ట్ లాక్కెళ్లారు..

ఫిలింనగర్: బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడమే కాకుండా తమ కారుకు గీతాలు పడ్డాయంటూ దౌర్జన్యంగా ఇంటికి వచ్చి బలవంతంగా ద్విచక్ర వాహనదారుడి పాస్‌పోర్ట్ తీసుకెళ్లిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే..మణికొండ, జైహింద్‌నగర్ కాలనీకి చెందిన షేక్ డానిష్ ఈ నెల 14న బైక్‌పై బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 నుంచి ఇంటికి వెళ్తున్నాడు. సినీ హీరో మోహన్‌బాబు ఇంటి నుంచి ఫిలింనగర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దగ్గరకు రాగానే వెనుక నుంచి వచ్చిన ఓ కారు అతడి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో షేక్ డానిష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అయితే తమ కారుకు గీతలు పడ్డాయంటూ కారులో ఉన్న వ్యక్తులు ఒక్కసారిగా షేక్ డానిష్‌పై విరచుకుపడ్డారు. బలవంతంగా అతని ఇంటి అడ్రస్ తెలుసుకుని అక్కడికి వెళ్లారు. మొబైల్ ఫోన్, పాస్‌పోర్ట్ లాక్కున్నాడు. అక్కడి నుంచి అతడిని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సమీపంలోని కార్యాలయానికి తీసుకెళ్లి క్షమాపణ లేఖపై సంతకం చేయమని బలవంతం చేశారు. కారుపై ఉన్న గీతలు మరమ్మతులు చేయడానికి రూ.22,000 ఖర్చవుతుందని, ఆ మొత్తాన్ని చెల్లించి పాస్‌పోర్ట్ తీసుకువెళ్లాలని బెదిరించి పంపారు. బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌ఓసీతో చిక్కిన సైబర్ నేరగాడు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రాష్ట్రాల, కేంద్ర పోలీసు విభాగాల పేర్లు చెప్పి... మనీ లాండరింగ్, డ్రగ్స్ కేసుల పేరుతో 'డిజిటల్ అరెస్టులు' చేసి అందినకాడికి దండుకునే సైబర్ నేరగాళ్ల సహాయకులు రాష్ట్రంలోనూ ఉన్నారు. బాధితుల నుంచి నగదు డిపాజిట్ చేయించుకునేందుకు అవసరమైన బ్యాంక్ ఖాతాలను సమకూరుస్తున్న వ్యక్తులతో పాటు ఖాతాదారులను గుర్తిస్తున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేస్తున్నారు. గత ఏడాదిలో నమోదైన కేసులో వాంటెడ్‌గా ఉన్న సరూర్‌నగర్ వాసి సుధాకర్‌పై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేశారు. దీని ఆధారంగా ఇతగాడు ముంబై ఎయిర్‌పోర్టులో చిక్కగా బుధవారం సిటీకి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు. నగరానికి చెందిన ఓ మహిళకు (48) గత ఏడాది నవంబర్ 12న కాల్ వచ్చింది. కొద్దిసేపట్లో టెలికాం సేవలు ఆగిపోతాయని, అలా కాకుండా ఉండాలంటే '9' నొక్కాలని అవతలి వ్యక్తులు చెప్పారు. ఆమె అలానే చేయడంతో ముంబై సీబీఐ అధికారినంటూ ఓ సైబర్ నేరగాడు మాట్లాడాడు. ఆర్థిక నేరగాడు నరేష్ గోయల్ కేసుతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ వ్యవహారంలో ఆమె పేరు వెలుగులోకి వచ్చినట్లు చెప్పాడు. బాధితురాలి వివరాలతో ముంబైలోని కెనరా బ్యాంక్‌లో తెరిచిన ఖాతా ద్వారా ఈ లావాదేవీలు జరిగినట్లు భయపెట్టాడు. అరెస్టు కాకుండా ఉండాలంటే 24 గంటల్లో నిర్ణీత మొత్తం చెల్లించాలని డిజిటల్ అరెస్టు చేసి భారీ మొత్తం గుంజారు. బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాధితురాలు నగదు చెల్లించిన ఖాతాల్లో కొన్ని రాష్ట్రంలోనే ఉన్నట్లు గుర్తించారు. దీంతో గత ఏడాది డిసెంబర్ 21న సూర్యాపేట జిల్లా చేవ్వెమ్లకు చెందిన పేరిణి నృత్య కళాకారుడు ధరావత్ రాజ్‌కుమార్, కరీంనగర్ జిల్లా వాసి కలువల అభిలాష్ రెడ్డి, గట్టు పవన్, మహబూబాబాద్ వాసి అల్లాడి తరుణ్‌లను అరెస్టు చేశారు. వీరి విచారణలో అలుదాసు సుధాకర్ పేరు వెలుగులోకి రావడంతో లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేశారు. వీరంతా టెలిగ్రాం యాప్ సహా వివిధ సోషల్‌మీడియా ఖాతాల ద్వారా సూత్రధారులకు పరిచయం అయ్యారని తేలింది. కమీషన్లను ఆశపడి బ్యాంకు ఖాతాలు తెరిపించి వాటి వివరాలు అందించారు.

యువ దంపతుల ఆత్మహత్య


హసీంఖాన్, పవన్ కుమావత్ (ఫైల్)

అంబర్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో యువ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన బుధవారం రాత్రి అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..గోల్నాకలో నివసించే ఉత్తర ప్రదేశ్‌కు చెందిన హసీంఖాన్ (29), పవన్ కుమావత్ (21)లు బతుకుదెరువు కోసం నగరానికి చేరుకున్నారు. వీరికి నాలుగు నెలల క్రితం వివాహమైంది. అద్దెకుంటున్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో దంపతులిద్దరూ సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు ఇద్దరి మధ్య గత కొంతకాలంగా నెలకొన్న చిన్న చిన్న తగాదాలే ఇందుకు కారణమని తెలిసింది. వీరి ఇంటి నుంచి ఎలాంటి అలికిడి లేకపోవడాన్ని ఇంటి యజమాని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృత దేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఐఏఎస్ ఆర్పీ సింగ్‌పై కేసు

● నిందితులుగా ఆయనతో సహా ముగ్గురు ● బుధవారం విచారించిన సీసీఎస్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఓ భూవివాదానికి సంబంధించి మాజీ ఐఏఎస్ అధికారి ఆర్పీ సింగ్‌పై సిటీ సీసీఎస్‌లో కేసు నమోదైంది. ఇందులో ఆయన, భార్య హర్వీందర్ కౌర్‌తో పాటు మరొకరు నిందితులుగా ఉన్నారు. కేసు విచారణలో భాగంగా ఆర్పీ సింగ్ బుధవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరయ్యారు. ప్రస్తుతం గుర్గావ్‌లో ఉంటున్న మాజీ ఐఏఎస్ అధికారి రాజేందర్ పాల్ సింగ్‌తో పాటు (ఆర్పీ సింగ్) ఆయన భార్య హర్వీందర్ కౌర్, రాయదుర్గానికి చెందిన మోహినీ చావ్లాలకు ఖాజాగూడ సర్వే నెం.19లో ఉన్న 10 ఎకరాల 32 గుంటల స్థలం ఉంది. ఈ స్థలం నుంచి మూడు ఎకరాల 24 గుంటలు హర్వీందర్ కౌర్ తన కుమార్తె చేతన కౌర్‌కు 2001లో గిఫ్ట్ డీడ్ ఇచ్చారు. ఈ విషయాన్ని దాచి పెట్టిన యజమానులు 2019లో మొత్తం స్థలాన్ని అభివృద్ధి చేయాలంటూ సాస్ ఇన్‌ఫ్రా డైరెక్టర్ వెంకటేశ్వరరావు గూడెతో ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారం ఆ స్థలం కమర్షియల్ టవర్స్ నిర్మించాల్సి ఉంది. అనుమతి పొందిన సాస్ ఇన్‌ఫ్రా నిర్మాణం చేపట్టింది. ఇందులో అనేక మంది కమర్షియల్ స్పేస్‌లు ఖరీదు చేస్తూ పెట్టుబడులు పెట్టారు. కొన్నాళ్లకు ఆ స్థలం నుంచి మూడు ఎకరాల 24 గుంటలు మరొకరి పేరుతో గిఫ్ట్ డీడ్ అయి ఉన్నట్లు వెలుగులోకి రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. అప్పటికే పెట్టుబడులు పెట్టిన వారు సాస్ ఐ టవర్స్ ఇన్వెస్టర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. తమకు జరిగిన అన్యాయంపై అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.చక్రధారి సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో గత నెల 21న ఆర్పీ సింగ్, హర్వీందర్ కౌర్, మోహినీ చావ్లాపై కేసు నమోదైంది. బాధితుల్లో న్యాయవాదులు, వ్యాపారులతో పాటు ప్రవాస భారతీయులు దాదాపు 60 మందికి పైగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులను నోటీసులు జారీ చేశారు. బుధవారం సీసీఎస్‌కు వచ్చిన నిందితులను అధికారులు సుదీర్ఘంగా విచారించారు. మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని నోటీసులు జారీ చేసి పంపారు. కాగా వాస్తవానికి ఈ వివాదంలో తామే బాధితులమని ఆర్పీ సింగ్ సీసీఎస్ పోలీసులకు తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై తాము ఈ ఏడాది సైబరాబాద్ ఈఓడబ్ల్యూలో ఫిర్యాదు చేశామని, కేసు కూడా నమోదైందని దర్యాప్తు అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఆ కేసుకు సంబంధించిన పత్రాలను చూపించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల దుర్వినియోగం కేసులో నిందితుల రిమాండ్


జోగుల నరేష్‌కుమార్


బాలగోని వెంకటేష్

బంజారాహిల్స్: సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను గోల్‌మాల్ చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..సికింద్రాబాద్ మెట్టుగూడలో నివసించే కిరాణా వ్యాపారి జోగుల నరేష్‌కుమార్, నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న బాలగోని వెంకటేష్, ఖమ్మం జిల్లా తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కొర్లపాటి వంశీ, గోదావరిఖని కేసీఆర్‌కాలనీకి చెందిన డ్రైవర్ పులిపాక ఓంకార్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు నలుగురూ కలిసి దురుద్దేశపూర్వకంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తమ ఖాతాల్లోకి మళ్లించుకుని మోసానికి పాల్పడ్డారు. దీనిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు కార్యాలయంలో పనిచేస్తున్న నరేష్‌కుమార్ 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయిన తర్వాత అప్పటికే మంజూరైన 230 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తన వద్దే ఉంచుకుని తన స్నేహితుల ద్వారా వాటిని దారి మళ్లించాడు. అయితే కొందరు తమకు సీఎంఆర్‌ఎఫ్ మంజూరైనా చెక్కులు ఇవ్వలేదని తెలిసి ఆరా తీయగా వారికి అప్పటికే చెక్కులు ఇచ్చినట్లుగా రికార్డుల్లో నమోదై ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన జూబ్లీహిల్స్ పోలీసులు విచారణ చేపట్టగా వీరు నలుగురూ వివిధ పేర్లపై అకౌంట్లు తెరిచి నకిలీ పత్రాలతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు కాజేసినట్లు గుర్తించారు. ఈ తరహాలో రూ.8.71 లక్షలు డ్రా చేసినట్లు గుర్తించారు. మొత్తం 19 చెక్కులు ఇలా అడ్డదారిలో మళ్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు కేసుల్లో ఈ నలుగురితో పాటు మరో మహిళను జైలుకు పంపించగా, ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా తాము మోసపోయినట్లుగా వెంకట్, సంతోష్ తదితర వ్యక్తులు రెండు రోజుల క్రితం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నరేష్‌కుమార్, వెంకటేష్‌లను రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు వంశీ, ఓంకార్‌లతో పాటు మరో మహిళ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

● నగర శివారు 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 29,963 మహిళా సంఘాలకు రూ.29.69 కోట్లు
● ఇందిరా మహిళా శక్తి పథకం కింద నిధులు మంజూరు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ద్వారా చిన్న తరహా వ్యాపారాలు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళా సభ్యులకు ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా వడ్డీ లేని రుణాలను అందజేస్తోంది. రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో 96 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 3,27,635 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.299.39 కోట్లు వడ్డీ లేని రుణాలను అందజేయనున్నారు. ఈ మేరకు గురువారం నుంచి ఆయా నియోజకవర్గాల్లో పంపిణీకి సన్నాహాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నగర శివారులోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్(మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా),రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కొడంగల్, కల్వకుర్తి(రంగారెడ్డి జిల్లా),పటాన్‌చెరువు, సంగారెడ్డి(సంగారెడ్డి జిల్లా) పరిధిలోని 29,963 మహిళా సంఘాలకు రూ.29.69 కోట్లు అందజేసేందుకు సంబంధిత అధికార యంత్రాంగం షెడ్యూల్ ఖరారు చేసింది.

పంపిణీకి ప్రణాళిక..

నగర శివారుల్లోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 29,963 మహిళా స్వయంసహాయక సంఘాలకు ఆయా జిల్లాల అధికార యంత్రాంగం గురువారం నుంచి రూ.29.69 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 3,698 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.1.79 కోట్లు వడ్డీ లేని రుణాలను అందజేయటానికి శామీర్‌పేట మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాలులో మహిళా శక్తి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ,రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు , ప్రభుత్వ చీఫ్‌విప్ ,ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ,స్థానిక ఎమ్మెల్యే ,మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి చేతుల మీదుగా వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కులు అందజేయనున్నారు. రంగారెడ్డి ,సంగారెడ్డి జిల్లాల్లోనూ గురువారం నుంచే రుణాలు పంపిణీ చేయనున్నారు.

కల్తీ కల్లు బాధితుల్లో మరో ఐదుగురు డిశ్చార్జి

నిమ్స్‌లో 13 మందికి కొనసాగుతున్న చికిత్స

లక్డీకాపూల్ : కల్తీ కల్లు ఘటనలో అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుల్లో మరో ఐదుగురు డిశ్చార్జి అయ్యారు. ఈ మేరకు బుధవారం మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యానారాయణ వివరాలు వెల్లడించారు. ఆస్పత్రిలో మొత్తం 36 మంది అడ్మిట్ కాగా వారిలో 23 మందికి ఆరోగ్యం మెరుగుపడడంతో ఇప్పటికే డిశ్చార్జి చేశామన్నారు. ఇంకా ఆస్పత్రిలో 13 మంది చికిత్స పొందుతున్నారని, వారిలో ఆరుగురు బాధితులకు డయాలసిస్ అందిస్తున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఉన్నారన్నారు. ఇదిలా ఉండగా కల్తీ కల్లు తాగి ఆస్పత్రి పాలైన వారు, కల్లు మానేయడంతో మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనతో ప్రభుత్వం కల్లు కాంపౌండ్లపై ఆంక్షలు విధించింది. ఫలితంగా కల్లు దొరక్క దానికి అలవాటుపడిన వారు అనారోగ్యానికి గురవుతున్నారని.. ఇలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నట్లు వైద్య నిపుణులు పేర్కొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు


అంబోత్ రమేశ్

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమె ఆత్మహత్యకు కారకుడైన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ. 25వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి బుధవారం తీర్పు చెప్పారు. ఏపీపీలు సునీత, రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్బీనగర్ ఠాణా పరిధిలో మన్సురాబాద్‌లో మైనర్ బాలిక(17) తన కుటుంబంతో కలిసి నివసించేది. 2020 ఆగస్టు 20న ఆమె తన నాయనమ్మ ఇంటికి వెళ్లేందుకు ఎల్బీనగర్ చౌరస్తాలో నిలబడి ఉండగా అక్కడికి వచ్చిన ఆటో డ్రైవర్ రమేశ్ మరో ఇద్దరి స్నేహితులతో కలిసి బాలికను కిడ్నాప్ చేసి హయత్‌నగర్‌కు తీసుకుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం ప్రధాన నిందితుడైన రమేశ్‌కు పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

వారం రోజులు కలిసి పనిచేసి..

నగదు, నగలతో చోరీ

ఫిలింనగర్: వారం రోజులు కలిసి పనిచేసిన చనువుతో ఇంటికి రాకపోకలు సాగించిన ఓ యువకుడు ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలతో పరారైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫిలింనగర్ బీజేఆర్‌నగర్‌కు చెందిన అమీనాఫాతిమా చికెన్ పకోడి వ్యాపారం చేసేది. గతంలో గౌతమ్ అనే యువకుడు వారం రోజులు ఆమెతో కలిసి పని చేశాడు. ఈ క్రమంలో పలుమార్లు ఇంటికి వచ్చి వెళ్లేవాడు. ఇదిలా ఉండగా ఈ నెల 14న మధ్యాహ్నం అమీనాఫాతిమా, ఆమె భర్త మహ్మద్‌గౌస్‌పాషా ఇంటికి తాళం వేసి వ్యాపార నిమిత్తం వెళ్లిపోయారు. సాయంత్రం వారి పిల్లలు రిజ్వాన్, మొహమ్మద్ రేహాన్ స్కూల్ నుంచి వచ్చేసరికి వారి ఇంటి టెర్రస్‌పై గౌతమ్ ఉండడాన్ని గమనించారు. వారు ఇంట్లోకి వెళ్లగానే కిందికి వచ్చిన గౌతమ్ తన దుస్తులు, బ్రాస్‌లెట్ కనిపించడం లేదని చెప్పి వెతకడం ప్రారంభించాడు. 10 నిమిషాలు వెతికినట్లు నటించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని రిజ్వాన్ తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంటనే ఇంటికి వెళ్లి అల్మారాను పరిశీలించగా హ్యాండిల్ విరిగిపోయి కనిపించింది. అందులోని రూ.40,000 నగదు, 1.5 తులాల బరువు ఉన్న బంగారు తాళి, ఒక జత చెవిపోగులు కనిపించలేదు. దీంతో గౌతమ్ వాటిని తీసుకుని పారిపోయి ఉంటాడని అమీనాఫాతిమా ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దాడి...

ఇద్దరికి తీవ్ర గాయాలు

కేపీహెచ్‌బీకాలనీ: మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వెళుతున్న ముగ్గురు వ్యక్తులను అడ్డుకుని దాడి చేయడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన సూర్యకాంత్, రత్నాకర్ అన్నదమ్ములు. వీరు హౌస్ కీపింగ్ పనిచేస్తూ కేపీహెచ్‌బీ కాలనీలోకి 5వ ఫేజ్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి వారు తమ స్నేహితుడు కామేశ్వర్ రాజ్‌తో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ తమ గదికి వెళుతున్నారు. దారిలో మద్యం మత్తులో ఉన్న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వీరిని అడ్డుకుని ఎక్కడికి వెళుతున్నారని ప్రశ్నించి వారిపై దాడి చేశారు. సూర్యకాంత్, కామేశ్వర్ వారి నుంచి తప్పించుకుని పారిపోగా రత్నాకర్‌ను పట్టుకుని విచక్షణ రహితంగా కొట్టడంతో అతను స్పృహ తప్పి పడిపోయాడు. దీనిని గుర్తించి స్థానికులు 100కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న రత్నాకర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీస్ వాహనాన్ని చూసిన సూర్యకాంత్ అక్కడికి వచ్చి తమపై దాడి చేసిన వారిని పట్టుకుని శిక్షించాలని, అకారణంగా దాడి చేసి తనను, తన సోదరుడు, స్నేహితుడిని గాయపరిచారని ఫిర్యాదు చేశాడు. పోలీసులు అతడిని కూడా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు బోనాల ఆహ్వానం..



ఎమ్మెల్యే దానంను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ నేతలు..

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ బస్తీలో కొలువుదీరిన శ్రీబంగారు ఎల్లమ్మ తల్లి ఆలయంలో నిర్వహించనున్న బోనాల పండుగకు హాజరుకావాలంటూ జ్ఞానీజైల్‌సింగ్‌నగర్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావుతో పాటు యూత్ అసోసియేషన్ సభ్యులు సాయికిరణ్, పృధ్వీ, వెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని జలమండలి బంజారాహిల్స్ సెక్షన్ కార్యాలయంలో బుధవారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు కలిసి భోజనాలు చేశారు. సెక్షన్ మేనేజర్ శివకుమార్, డివిజన్ -6 జీఎం ప్రభాకర్, తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద వసతులు కల్పించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: బోనాల పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్‌లోని దేవాలయాలకు ఏర్పాటుచేసే తాత్కాలిక లైట్లను 150 వరకు పెంచాలంటూ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బుధవారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. అమ్మవారి దేవాలయాలకు వచ్చే భక్తులకు తగిన సదుపాయాలు కూడా కల్పించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

వెంకటేశ్వరకాలనీ: జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో పనిచేస్తున్న శానిటేషన్ స్వీపర్లు, సూపర్‌వైజర్లకు బుధవారం రక్షణ కిట్లు పంపిణీ చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–7లోని వెంకటేశ్వరకాలనీ వార్డు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుమారు 700 మంది పారిశుధ్య కార్మికులకు ఈ కిట్లను అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో రెయిన్‌కోట్‌తో పాటు ఇతరత్రా సామాగ్రిని వీరికి అందజేశారు. స్వీపర్లు తప్పనిసరిగా వీటిని ఉపయోగించుకోవాలని అధికారులు కోరారు.

బోనాలకు ముస్తాబవుతున్న ఆలయాలు



సాయిబాబానగర్ పోచమ్మ ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న బస్తీ అధ్యక్షుడు రమేశ్‌నాయక్

రహమత్‌నగర్: ఈ నెల 20న జరిగే బోనాల ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో అమ్మవారి ఆలయాలకు రంగులు వేస్తూ తీర్చిదిద్దుతున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

నేరాల అదుపునకు సహకరించాలి

లాలాపేట: శాంతిభద్రతల విషయంలో పోలీసులకు విధి నిర్వాహణలో ప్రజలు సహకరించాలని లాలాగూడ పోలీసులు పేర్కొన్నారు. లాలాపేటలోని కామన్ వీధిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరాలను అదుపు చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా నేరాలను అదుపు చేయడంలో సీసీటీవి కెమెరాల ప్రాధాన్యత, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే 100 డైల్ ద్వారా సమాచారాన్ని ఇవ్వడం ఎంతో కీలకం అన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు అమర్ సింగ్, యుగేందర్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'బుధవారం' బస్తీబాట

ప్రతివారం ఒక్కో బస్తీలో పర్యటించనున్న విద్యుత్ అధికారులు

అక్కడికక్కడే పరిష్కారానికి కృషి..



బంజారాహిల్స్-11 ఉదయ్‌నగర్‌లో కరెంటు సమస్యలు తెలుసుకోవడానికి బస్తీ బాట పట్టిన విద్యుత్ అధికారులు..

బంజారాహిల్స్: బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా సంబంధిత అధికారులు ప్రతి బుధవారం బస్తీ బాట పడుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగి నుంచి పైస్థాయి ఉద్యోగి వరకు బృందంగా ఏర్పడి ఒక్కో వారం తమ పరిధిలోని ఒక్కో బస్తీలో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడుతూ అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా తుప్పుపట్టి, ఒకవైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను గుర్తిస్తూ వాటిని తొలగించి కొత్తవి వేసే ప్రణాళికలు అక్కడికక్కడే అమలుచేస్తున్నారు.

- కరెంటు వైర్లు వేలాడుతూ తెగిపోవడానికి సిద్ధంగా ఉండి ప్రమాదకరంగా ఉంటే వాటిని తొలగించి ఆ స్థానంలో కేబుల్ వైర్లు వేయాలని నిర్ణయం తీసుకుంటున్నారు.
- బంజారాహిల్స్ ఏడీఈ పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్, బంజారాహిల్స్, మాదాపూర్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట సెక్షన్ల పరిధిలో ప్రతి బుధవారం ఒక్కో బస్తీలో ఈ అధికారుల బృందం పర్యటించనుంది.
- టీజీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కరుణాకర్‌బాబు, డీఈ హనుమంతరెడ్డి, ఏడీఈ జీ రమేష్, ఏఈ వై.రమేష్‌కుమార్‌తో పాటు ఆయా సెక్షన్ల పరిధిలోని లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఫోర్ మెన్లు ఈ బృందంలో ఉంటున్నారు.
- బస్తీబాటలో అక్కడికి వెళ్లిన అధికారులు స్థానికులతో కూడా మాట్లాడుతున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు.



- బిల్లుల్లో లోపాలు ఉంటే వాటిని అక్కడికక్కడే సరిజేయడానికి యత్నిస్తూ అవసరమైతే సెక్షన్ కార్యాలయానికి రావాలని సూచిస్తున్నారు.
- దీని వల్ల వినియోగదారులు కరెంటు సమస్యలు, బిల్లుల హెచ్చుతగ్గులు, ఇతర లోపాలు సరిజేసుకోవడానికి బస్తీ బాట కార్యక్రమం విశేషంగా దోహదపడుతున్నది. కార్యాలయం వద్దకు వెళ్లకుండానే తమ వద్దకే వస్తున్న అధికారులు వాటిని పరిష్కరిస్తుండడంతో బస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- విద్యుత్ సమస్యలు ఎక్కువగా బస్తీల్లోనే ఉంటుండడంతో ప్రతి బుధవారం బస్తీబాట నిర్వహించాలని విద్యుత్ ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో ఆయా సెక్షన్ల పరిధిలో ఏ రోజు ఎక్కడ పర్యటించాలో స్థానిక అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటు న్నారు.
- అధికారులు సందర్శించే బస్తీకి ముందస్తుగానే సమాచారం ఉండడంతో స్థానికులు కూడా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది.

బకాయిలు చెల్లించని షాపుల సీజ్..



కేబీఆర్ పార్కింగ్ స్థలంలో షాపులు సీజ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్–2లోని కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న గేటు నెంబర్–2, గేట్ నెంబర్–3లలోని పార్కింగ్ స్థలాల్లో అద్దె చెల్లించకుండా కొనసాగిస్తున్న షాపులను జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు పర్యటించి లీజుదారుడు అద్దె చెల్లించకుండా నోటీసులు ఇచ్చినా స్పందించకుండా పెద్ద మొత్తంలో అద్దె బకాయి పడడంతో వీటిని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. గేట్ నెంబర్–2లో కాసా డీలాటె షాపు యజమాని పర్వత్ మస్కతీ రూ.37 లక్షలు బకాయి పడ్డారు. అలాగే గేటు నెంబర్–3 వద్ద చిచ్చాస్‌ను ఆనుకుని సితార రెస్టారెంట్స్ ఏర్పాటుచేసిన షాపు రూ.25 లక్షలు బకాయి పడింది. ఈ మొత్తాన్ని చెల్లించకుండా సదరు లీజుదారులు షాపులను నడిపిస్తుండడంతో వీటిని సీజ్ చేశారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ప్రొ.బాగయ్య, చిత్రంలో నర్సింహ్మ

హిమాయత్‌నగర్: అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న గంగిరెద్దుల కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని బీసీప కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొ.బాగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గంగిరెద్దుల సంచార కులం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లెల నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ప్రొ.బాగయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎన్నోసార్లు వినతి పత్రాలు అందించినప్పటికీ అవీ మూసిలో పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి గ్రామంలోని 750 గంగిరెద్దుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలకు భూమిని కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం పట్ల వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీలు పరిశీలించిన ఏసీపీ



పగటిపూట డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు..

బంజారాహిల్స్: ఉదయం, పగలు, సాయంత్రం కూడా ఎప్పుడైనా, ఎక్కడైనా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పగటిపూట ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఇటీవల కాలంలో అంబులెన్స్ డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు పగటిపూట కూడా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ నేపథ్యంలో ప్రతిరోజూ డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

బస్తీ బాటతో ప్రజా సమస్యల పరిష్కారం



ప్రజలతో మాట్లాడుతున్న డీఎంసీ రజనీకాంత్, సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: బస్తీ బాట కార్యక్రమం ప్రజా సమస్యలు తీర్చే ఒక మంచి కార్యక్రమమని జీహెచ్‌ఎంసీ సర్కిల్19 డీఎంసీ రజనీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. డీఎంసీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి రహమత్‌నగర్ డివిజన్‌లో బుధవారం బస్తీ బాటను కార్పొరేటర్ సీఎన్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరి ష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

చెట్టు కొమ్మలను తొలగించిన కాలనీ వాసులు

వెంగళరావునగర్: ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మధురానగర్‌కాలనీ వాసులే రోడ్లను శుభ్రం చేసుకున్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో దాదాపు పదిరోజుల క్రితం విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డు వస్తున్నాయని విద్యుత్‌శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో చెట్లకొమ్మలు నరికి అక్కడే వేశారు. ఇప్పటి వరకు తొలగించకపోవడంతో కాలనీ అసోసియేషన్ నేతలు బుధవారం పరిసరాలను శుభ్రం చేశారు. ఆ చెత్తను ట్రాక్టర్స్‌లో నింపి డంపింగ్‌కు తరలించారు.



ఒడిశా విద్యార్థి ఆత్మహత్యకు బాధ్యులను శిక్షించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఒడిశాలోని ఎఫ్‌ఎం కాలేజీ విద్యార్థి సౌమ్యశ్రీ బిషీ ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నాయకులు ఓయూలో ఆందోళన చేపట్టారు. బుధవారం ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ సౌమ్యశ్రీ బిషీని లైంగిక వేధింపులకు గురిచేసిన కాలేజీ అధ్యాపకుడు, విభాగం హెడ్‌పై అత్యాచార, హత్య కేసును నమోదు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు దృహస్, శివశంకర్, నగర కార్యదర్శి పృథ్వీతేజ, రాష్ట్ర నాయకులు అలివేలి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.27, నల్లవంకాయ.28, పొడుగువంకాయ.28, బెండకాయ.55, పచ్చిమిర్చి.65, బజ్జీమిర్చి.60, క్యాప్సికం.75, పచ్చికాకరకాయ.38, పందిరిబీర.38, క్యాబేజీ.18, క్యారెట్.40, దొండకాయ.35, గుండు బీన్స్ 75, గింజచిక్కుడు.75, గోకరకాయ.50, కీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.27, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.25, చామగడ్డ.25, మొరంగడ్డ.28, కందగడ్డ.35, క్యాలిఫ్లవర్.23, సొరకాయ.13, పొట్లకాయ.23, అరిటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.45, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.45. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

చేనేత కళాకారులకు చేయూతనివ్వాలి



రమ్యారావు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్–12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రచార జాయింట్ కన్వీనర్ రమ్యారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాల్‌లో కొలువుదీరిన చేనేతకారుల వస్త్ర ఉత్పత్తులను తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకున్నారు.ఈ ప్రదర్శన ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.

'మాగంటి'సేవలు మరువలేనివి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన సేవలు మరవలేనివని, మూడు పర్యాయాలు నియోజకవర్గంతో ఎనలేని బంధం ఉందని ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం గణపతికాంప్లెక్స్ సమీపంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ ప్రజల నాయకుడని, ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారినికి కృషి చేశారని పేర్కొన్నారు. మాగంటి సతీమణి మాగంటి సునీత మాట్లాడుతూ బోరబండ సైట్–3లో ఈనెల 27న పీజేఆర్ గ్రౌండ్స్‌లో సంతాపసభను నిర్వహిస్తున్నామని, బీఆర్ఎస్ కార్యకర్తలు, మాగంటి అభిమానులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని గవర్నమెంట్ మోడల్ ప్రైమరీ స్కూల్‌తో పాటు స్ట్రీట్ నెం.15లో గల జీఎస్‌హెచ్‌పీఆర్ విద్యాలయలో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ పి.విజయా రెడ్డి విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ సుమంత్, జీఎస్‌హెచ్‌పిఆర్ ప్రిన్సిపాల్ మురళి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి

హిమాయత్‌నగర్: ఉద్యమకారుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ(టీయూజేఏసీ) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన టీయూజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రఫుల్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా చంద్రన్న ప్రసాద్, ఏవి.రావు, బాకారం లావణ్య, ఉపాధ్యక్షులుగా సుధామల్ల అంజలి, సుజీ, మోహన్ బైరాగి, డి.అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గా తులిజా రెడ్డి, సలహాదారులుగా శంకర్ రావు, సభ్యులు హరిప్రసాద్, అనురాధ, సుచరిత తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

9న సామూహిక ఏకకాల హనుమాన్ చాలీసా పారాయణం



సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: చత్రపతి శివాజీ మహరాజ్ మండల్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో సామూహిక ఏకకాల హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చత్రపతి శివాజీ మహారాజ్ మండల్ వ్యవస్థాపక అధ్యక్షులు నూనెముంతల రవీందర్ గౌడ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. 1108 గొంతుకలతో ఏకకాలంలో, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు తెలిపారు.

ప్రణవ గ్రూప్ ముందు షేర్ హోల్డర్ల ఆందోళన

పంజగుట్ట: ప్రణవ గ్రూప్ షేర్ హోల్డర్స్ అయిన తమనే ప్రాజెక్టు లోనికి రానివ్వడంలేదని బుధవారం ఎర్రమంజిల్ లోని ప్రణవ ప్రాజెక్టు ముందు పలువురు ధర్నా నిర్వహించారు. షేర్ హోల్డర్స్‌ను లోనికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని షేర్ హోల్డర్స్‌ను లోనికి రానివ్వకపోవడం బాధాకరమని తెలిపారు. బుధవారం కూడా తాము లోనికి వెళ్లేందుకు యత్నించగా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బాధితులు అక్కడే బైఠాయించడంతో పోలీసులు వారిని అడ్డుకుని సముదాయించి పంపించారు.



ఆర్టిజన్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించండి



కేటీఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు

బంజారాహిల్స్: విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్లను పర్మినెంట్ చేసే అంశంపై అసెంబ్లీలో మాట్లాడాలని విద్యుత్ శాఖ ఆర్టిజన్లు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం అందజేశారు. బుధవారం బంజారాహిల్స్‌లో తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కరణం ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలపై అసెంబ్లీతో పాటు ప్రజా వేదికలపై మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సురేష్ రాజు,ఉపాధ్యక్షురాలు స్వాతి, వసంత, లింగం, అనూష తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల గురించి పట్టించుకోని ప్రభుత్వం

అడ్డగుట్ట: పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఊసే మరిచిందని విహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు అన్నారు. అడ్డగుట్ట ఏ సెక్షన్లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద బుధవారం వికలాంగులు, వృద్ధులు, వితంతువుల సమావేశం విహెచ్‌పీఎస్ సికింద్రాబాద్ కార్యదర్శి పులిపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన అందె రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు వికలాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచుతామని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికుల పెన్షన్ రూ. 2వేల నుండి రూ. 4వేలు పెంచుతామన్నారు. అదే విధంగా కండరాలతో బాధపడుతున్న వారికి పదిహేను వేలు పెన్షన్ ఇస్తామని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిందన్నారు. బడ్జెట్ లేదని, నిధులు లేవని సాకులు చెబుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పించుకుంటున్నదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరును ఎండగాడుతూ ఈనెల 22న అంబర్పేట్ లోని రాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ లో వృద్ధులు, వితంతువులు, వికలాంగుల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలతో లబ్ధిపొందండి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: అర్హులైన పేద ప్రజలు తమకు లబ్ధి చేకూర్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనతనగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బుధవారం బాలానగర్ తహశీల్దార్ కార్యాలయ పరిధిలోని సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన 12 మంది లబ్దిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ పథకం కింద ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఆడపడుచు పెళ్లికి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా భారంతో కూడుకున్నదని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నుండి యుగ తులసి పార్టీ పోటీ



ఎస్పీఆర్‌హిల్స్‌లో మాట్లాడుతున్న శివకుమార్

రహమత్‌నగర్: తెలంగాణలో గోహత్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో యుగ తులసి పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నట్లు అ పార్టీ అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు.ఎస్పీఆర్‌హిల్స్‌లో పలు బస్తీల్లో బుధవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.. గోవును జాతీయ ప్రాణిగా గుర్తించి, కబేళాలు మూసి వేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

సనత్‌నగర్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్ సహకారంతో విద్యార్థినులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది విద్యార్థినులకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించారు.

ప్రేమిస్తున్నానని వెంటపడి..ఆపై గర్భవతిని చేసి..

సనత్‌నగర్: ప్రేమిస్తున్నానంటూ వెంటపడి ఓ మైనర్ బాలికను మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు..అమీర్‌పేట ప్రాంతానికి చెందిన బాలిక (16) అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌కు తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేసిన సిబ్బంది బాలిక ఆరు నెలల గర్భవతి అని తేల్చారు. కుటుంబ సభ్యులు బాలికను ప్రశ్నించడంతో తమ గ్రామంలోని ఓ యువకుడు బలవంతంగా లైంగిక దాడికి చేసి తనను మోసం చేశాడని జరిగిన విషయాన్ని వెల్లడించింది. గత అక్టోబర్‌లో వరంగల్‌లోని స్వస్థలానికి వెళ్లిన సమయంలో ప్రశాంత్ (20) అనే యువకుడు ప్రేమిస్తున్నానంటూ బాలిక వెంటపడ్డాడు. ఈ సంవత్సరం జనవరిలో మరోసారి గ్రామానికి వెళ్లినప్పుడు ఇంట్లో బాలిక ఒంటరిగా ఉన్న సమయం చూసుకుని బలవంతంగా లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు బాలికను బలవంతం చేశాడు. బాలిక పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చేసరికి నాలుగు నెలలుగా ఫోన్ లిఫ్ట్ చేయకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివిన వారికి 'ఫీజు' రాయితీ

రాయదుర్గం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు పాలిటెక్నిక్‌లలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ప్రాధాన్యం ఉంటుందని రాయదుర్గం గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ బుధవారం వెల్లడించారు. పాలీసెట్–2025లో అర్హత సాధించిన వారు వెంటనే సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్(హెచ్‌ఎల్‌సీ)లను సందర్శించి తమ ధ్రువీకరణపత్రాలను సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థలలో చదివిన వారికి తెలంగాణ ప్రభుత్వ ఆదేశంపై 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో కూడా ఈ హెచ్‌ఎల్‌సీ కేంద్రం కొనసాగుతోందని తెలిపారు.

కో లివింగ్ హాస్టళ్లను మూసివేయాలి

డీజీపీకి విన్నవించిన ఓయూ జేఏసీ చైర్మన్ రాజు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో కో లివింగ్ హాస్టళ్లను వెంటనే మూసివేయాలని ఓయూ జేఏసీ చైర్మన్ రాజు అన్నారు. అక్రమ హాస్టళ్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా కో లివింగ్ హాస్టళ్లు ఏర్పాటు చేస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం నగరానికి వచ్చిన వారిని వివిధ ఆఫర్లతో ఆకర్షిస్తున్నారని తెలిపారు. ఈ హాస్టళ్లకు ఎలాంటి అనుమతులు లేవని, లాభాపేక్షతో యథేచ్ఛగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. వీటి వల్ల మాదకద్రవ్యాల వాడకం, గన్ కల్చర్ పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట రాజు, మణికంఠ, జగన్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

– మంత్రి వివేక్‌కు వినతి

పంజగుట్ట: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 లక్షల భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కమిటీ సభ్యులు ద్యాగటి హరీష్, బత్తుల రాజశేఖర్ బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల క్లెయిమ్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. కొందరు బోర్డు అధికారుల అనాలోచిత, స్వార్థపూరిత నిర్ణయాల వల్ల కార్మికుల సంక్షేమ నిధులు పక్కదారి పడుతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గణేష్, ఎల్లారెడ్డి, రాజు, శ్రీధర్, స్వామి, మొగులయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో తొలి ఆస్తి అటాచ్‌మెంట్

గచ్చిబౌలి: బీఎన్‌ఎస్‌ఎస్ అమలులోకి వచ్చిన తర్వాత సైబరాబాద్‌లో తొలి ఆస్తి అటాచ్‌మెంట్ చేసినట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ బుధవారం తెలిపారు. వివరాలు... కొండాపూర్‌లోని తెలుగు ఫుడ్స్ కార్యాలయంలో పనిచేసే వేణుగోపాల్ డబ్బులను దారి మళ్లించినట్లు మూడు నెలల క్రితం గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టగా పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. వేణుగోపాల్ తమ బంధువుల అకౌంట్లోకి డబ్బులు వేసి వారికి కొంత కమిషన్ ఇచ్చి భారీ ఎత్తున డబ్బు కూడబెట్టినట్లు పోలీసులు గుర్తించారు. కొల్లగొట్టిన డబ్బుతో ఎన్టీఆర్ జిల్లా వినన్నపేట మండలంలో 14 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు తేలింది. ఈ మేరకు ఆ ఆస్తిని అటాచ్ చేయాలని మాదాపూర్ డీసీపీ వినీత్ మేజిస్ట్రేట్‌కు నివేదించారు. దీంతో కూకట్‌పల్లి పదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రాచర్ల షాలిని 14 ఎకరాల భూమిని అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కేసు పకడ్బందీగా దర్యాప్తు చేసిన గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓ హబీబుల్లాఖాన్, ఎస్‌ఐ అనిల్ కుమార్‌ను డీసీపీ అభినందించారు.


దంపతుల మధ్య గొడవ.. భర్త ఆత్మహత్య

జవహర్‌నగర్: దంపతుల గొడవతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ఈర్ల జగదీశ్ (35), భార్య హేమ, ఇద్దరు పిల్లలతో కలిసి కాప్రా శివసాయినగర్‌లో నివాసముంటున్నారు. స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఓ ఇంటికి జగదీశ్ కాపలాదారుగా పనిచేస్తున్నాడు. భార్య హేమ ఇళ్లల్లో పనులు చేస్తోంది. జగదీష్, హేమ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో పెద్దల సమక్షంలో సర్ది చెప్పినా మళ్లీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన జగదీశ్ గుడిసెలో ఉరేసుకున్నాడు. తమ కుమారుడు జగదీష్ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చుట్టుముట్టి.. కుట్టికుట్టి..!

నగరంలో విజృంభిస్తున్న దోమలు.. విషజ్వరాలు

- ఆసుపత్రుల్లో పెరుగుతున్న విషజ్వరాల పీడితులు
- కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతున్న ఫాగింగ్
- వైద్యారోగ్య శాఖ, జీహెచ్‌ఎంసీల మధ్య సమన్వయలోపం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో దోమల కథ పెద్దది. రోగుల జాబితా అంతకంటే పెద్దది. ఎక్కడ చూసినా దోమలే. చుట్టుముట్టి కుడుతూ నగరవాసిని బెంబేలెత్తిస్తున్నాయి. చాలామంది రోగాలపాలై మంచం పడుతున్నారు. రోజురోజుకూ జ్వర పీడితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆసుపత్రుల్లో కేసులు అధికమవుతున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా ఫాగింగ్, లార్వా నివారణ కార్యక్రమాలు అంతంతగానే ఉండటం వల్లే విషజ్వరాలు విజృంభిస్తున్నాయని పలువురు వైద్యులు అంటున్నారు. జీహెచ్‌ఎంసీ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖల మధ్య సమన్వయ లోపం సగటు నగరజీవికి శాపంగా మారుతోంది.

1,078 డెంగీ కేసులు నమోదు

గ్రేటర్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కలిపి నాలుగు వేలకుపైగా ఉన్నాయి. అనధికారిక క్లినిక్‌లు, ఆర్ఎంపీలు వీటికి అదనం. ఇవి కాకుండా ప్రైవేటు రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు మరో వెయ్యి వరకు ఉంటాయి. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి, గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌ల్లో బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళనకరంగా మారింది. ఇప్పటి వరకు నగరంలో 1,078 డెంగీ కేసులు నమోదు కాగా, 250 వరకు చికున్ గున్యా కేసులు ఉన్నాయి. మలేరియా, టైఫాయిడ్, ఇతర విష జ్వరాల బాధితులు సుమారు 55 వేల మంది వరకు ఉంటారని అంచనా. బస్తీలు, కాలనీలే కాకుండా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, ఓల్డ్ సిటీ, ఉప్పల్, మియాపూర్, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో బాధితులు ఉన్నారు. డెంగీ పరీక్షలు చేపట్టిన తరువాత పాజిటివ్ వచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాల నుంచి ప్రభుత్వానికి సరైన సమయంలో సమాచార మార్పిడి జరగడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెంగీ కేసు నిర్ధారణ అయితే 24 గంటల్లో బాధితుడి ఇంటితోపాటు చుట్టుపక్కల ఎంటమాలజీ విభాగం సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేయాలి. ముున్ముందు ఈ వ్యాధి విస్తరించకుండా, కొత్తగా కేసులు నమోదు కాకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ ఉపయోగకరంగా ఉంటుంది.

నివారణ చర్యలు తూతూమంత్రంగా..?

తొలకరితో చేరిన నీటిపై డెంగీ కారక దోమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. అందుకని ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని ప్రభుత్వం చెబుతోంది. దీనిపై ప్రజల్లో అవగాహన చేపట్టాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా, చేసీ చేయనట్లుగా వ్యవరిస్తున్నారు. డ్రై డేను అధికారులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. మూసీతో పాటు వరద కాల్వలు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, చెరువులు, కుంటల్లోనూ దోమలు, లార్వా నివారణ మందు పిచికారీ చేయాల్సి ఉంటుంది. దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. లార్వా నివారణ రసాయనాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ చల్లాల్సి ఉంది. ఈ రెండు విభాగాల్లోనూ పనులు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, ప్రముఖుల కాలనీల్లో ఫాగింగ్ చేసే జీహెచ్‌ఎంసీ సిబ్బంది సాధారణ ప్రజలు నివసించే కాలనీలు, బస్తీల్లో ఆరు నెలలకు ఒక దఫా చుట్టం చూపుగా వచ్చి పోతున్నారు. జీహెచ్‌ఎంసీ, వైద్యారోగ్యశాఖ అధికారులు దస్త్రాల్లో మాత్రమే వంద శాతం లక్ష్యాలను పూర్తి చేస్తున్నారు.

జీవో 282 రద్దు చేయాలని బీఆర్‌టీయూ ధర్నా



కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రాంబాబు, నారాయణ తదితరులు

చిక్కడపల్లి: కార్మికులకు నష్టదాయకమైన జీవో నంబర్ 282 రద్దు చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబుయాదవ్ మాట్లాడుతూ జీవో రద్దు కోసం అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కులను, వేతన భద్రతను భంగపరిచే విధంగా ఈ జీవో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. 1934 నుంచి 8 గంటల పనివిధానం అమలవుతుండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాన్ని రద్దు చేసి పనిగంటలు పెంచారని విమర్శించారు. కనీస వేతనాల మండలి మాజీ చైర్మన్ పి.నారాయణ మాట్లాడుతూ గత 18 నెలలుగా కార్మిక శాఖకు మంత్రి లేరని, ఇప్పుడు మంత్రిని నియమించిన వెంటనే కార్మికులకు వ్యతిరేకంగా జీవో తీసుకొచ్చారని మండిపడ్డారు. అనంతరం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, నాయకులు సాంబశివరావు, శివశంకర్, ఎల్లేష్, లక్ష్మయ్య, రమేష్, అనిల్, మధు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

బీసీ రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం ఆపాలి: జాజుల



జాతీయ ఓబీసీ మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చినా, ఆర్డినెన్స్ తెచ్చినా కోర్టులో నిలవదంటూ రిజర్వేషన్లపై తమ వ్యతిరేకతను చాటుకుంటున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఆగస్టు 7వ తేదీన గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీ మహాసభల పోస్టర్‌ను ఆయన వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లలోనే 10 శాతం ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. రాంచందర్‌రావు విద్యార్థి దశ నుంచే బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని, మండల్ కమిషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గిస్తే ప్రశ్నించని బీఆర్ఎస్ బీసీ నేతలు ఇప్పుడు బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కుందారం గణేష్ చారి, కనకాల శ్యామ్, శ్రీనివాస్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో ఏజీ వర్సిటీ విద్యార్థులు



ఏజీ వర్సిటీ: హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ఏఐ డిజిటల్ నైపుణ్యాల ద్వారా యువశక్తి సాధన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫైనలియర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా జాతీయ చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో విశ్వవిద్యాలయం నుంచి సలీం పాషా, తేజశ్రీ, శ్రీజ, కావ్య, ప్రవళిక పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టుల గురించి వివరించారు. వ్యవసాయం, ఇతర రంగాల్లో డిజిటల్ పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా ముందడుగు వేశామన్నారు.


ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు

దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజీవ్ కుమార్ శ్రీవాస్తవ



కాచిగూడ: రైల్వే ప్రయాణికులకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో మరిన్ని వసతులతోపాటు మెరుగైన సేవలను అందించే విధంగా కృషి చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే నూతన జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్‌లతో కలిసి బుధవారం రాత్రి ఆయన కాచిగూడ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ప్రయాణికులకు ఫిల్టర్ వాటర్, నాణ్యమైన ఆహారం అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, మంచినీటి సౌకర్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ స్టేషన్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.ముత్యాల నాయుడు, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా నేతకు రాంచందర్‌రావు పరామర్శ



శ్రీధర్‌ను పరామర్శిస్తున్న బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు

లక్డీకాపూల్: పోలీసుల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ను బుధవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పరామర్శించారు. ఖమ్మంలో జరిగిన నిరసన ప్రదర్శనపై పోలీసులు దాడులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలని నిమ్స్ వైద్యులను కోరారు. ఆయన వెంట బీజేపీ నేత రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

–మంత్రి శ్రీధర్‌బాబు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని మహా ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్లాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. మాజీ సైనికులు, ఎన్‌ఎస్‌ఎస్, యువసేనల ఆధ్వర్యంలో నిర్వహించే వన మహోత్సవం వాల్‌పోస్టర్‌ను మంత్రి బుధవారం బషీర్‌బాగ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, వన మహోత్సవం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. మాజీ సైనికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని డివిజన్లలో ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు 50 వేల మంది మాజీ సైనికులు పాల్గొని 79 వేల మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు.



బీటీఎన్‌జీవోస్‌కు స్థలం అప్పగించే దాకా ఉద్యమం

– సర్వసభ్య సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్

గచ్చిబౌలి: భాగ్యనగర్ టీఎన్‌జీవోస్‌కు తిరిగి స్థలం అప్పగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం గోపన్‌పల్లి సర్వే నెంబర్ 36లోని భాగ్యనగర్ టీఎన్‌జీవోస్ కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2008లో అప్పటి ప్రభుత్వం అపెక్స్ సొసైటీకి 180.11 ఎకరాల స్థలం కేటాయించగా అందులో ఏపీఎన్‌జీవోస్‌కు 142.15 ఎకరాలను కేటాయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం అవతరించిన తరువాత ఏపీ ఎన్‌జీవోస్‌ను భాగ్యనగర్ టీఎన్‌జీఓస్ మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీగా మార్చినట్లు చెప్పారు. లేఅవుట్ కూడా అప్రూవ్ అయిందని, అభివృద్ధి కోసం రూ.18 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. ఈ క్రమంలో వినాయక కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని తెర మీదికి తీసుకొచ్చి బీఎన్‌జీవోస్‌కు చెందిన 22 ఎకరాల స్థలాన్ని అప్పజెప్పడం సరికాదని అన్నారు. బీఎన్‌జీవోస్ సొసైటీ అధ్యక్షుడికి తెలియకుండా సర్వే, ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. ఈ సమస్యపై ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, ఉద్యోగ సంఘాల సెక్రెటరీ జనరల్ శ్రీనివాస్, బీటీఎన్‌జీవోస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వినాయక్ సొసైటీ పేరిట ఇప్పటికే దాదాపు 40 ఎకరాల స్థలాన్ని ఆధీనంలోకి తీసుకుని రాత్రి పగలు తేడా లేకుండా ఇటాచ్‌లతో చదును చేస్తూ, ఫెన్సింగ్ వేసి బోర్డులు పాతే ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది.

విద్యార్థుల జీవితాలతో సర్కారు చెలగాటం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

శంషాబాద్: విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలంటూ ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ పెద్దఎత్తున ర్యాలీ తీసిన అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలు రాయనీయడం లేదని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లించాలంటూ తీవ్ర ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. స్కాలర్‌షిప్‌లు కూడా విడుదల చేయకపోవడంతో బలహీనవర్గాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు బి.శంకర్, శ్రీకాంత్, చరణ్, అరుణ్, వంశీ, తరంగ్, విప్లవ్, చరణ్ ప్రసాద్, కౌశిక్, తనిష్క, తరుణ్, ఉదయ్, శ్రీను, సాయి హర్ష, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'గిర్మిటియా లెగసీ'పై ఐసీఎస్ఎస్ఆర్ పరిశోధన



ప్రొఫెసర్ గజేంద్రపాథక్

రాయదుర్గం: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) రూపకల్పన చేసిన ప్రాజెక్టులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి భాగస్వామ్యం కల్పించారు. 'మూలాలను తిరిగి అనుసంధానించడం: గిర్మిటియా లెగసీ'పై రూపొందించిన ప్రాజెక్టుకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. 'బ్రిటీష్ వలస పాలనలో భారతీయ కార్మికుల వలసల సాంస్కృతిక చరిత్ర'పై ఐసీఎస్ఎస్ఆర్ పరిశోధనా ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు ఐసీఎస్ఎస్ఆర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ప్రాజెక్టు డైరెక్టర్లుగా ప్రొఫెసర్

ప్రాజెక్టులో హెచ్‌సీయూకు భాగస్వామ్యం

గజేంద్ర పాథక్(హెచ్‌సీయూ), డాక్టర్ చందన్ శ్రీవాత్సవ(బీహెచ్‌యూ), డాక్టర్ రచన విశ్వకర్మ(సీయూఎస్‌బీ), డాక్టర్ అనుపమ పాండే(ఇండియన్ హైకమిషన్–లండన్), ఓంప్రకాశ్‌సింగ్(మారిటైమ్ ఎక్స్‌పర్ట్, పారిశ్రామికవేత్త, లండన్)కు అవకాశం కల్పించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా వారణాసిలోని మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠ్ ప్రొఫెసర్ నిరంజన్ సహే వ్యవహరిస్తారు. గిర్మిటియా అనే పదం 1830 నుంచి 20వ శతాబ్దం ప్రారంభం వరకు బ్రిటీష్ సామ్రాజ్యం ద్వారా ఫిజీ, మారిషస్, ట్రినిడాడ్, గయానా, సురినామ్, దక్షిణాఫ్రికా వంటి వివిధ దేశాలకు రవాణా అయిన మిలియన్ల మంది భారతీయ ఒప్పంద కార్మికులను సూచిస్తుంది.

కేబీఆర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సచితానంద్ రెడ్డి



కేబీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్టాత్మక కేబీఆర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.సచితానంద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం బంజారాహిల్స్‌లోని జింఖానా క్లబ్‌లో నూతన కమిటీ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా బీబీ నగర్ సురేందర్ మోహన్, మారగంటి రాజేందర్ రెడ్డి, కార్యదర్శిగా విజయ మనోహర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా చొక్కా సంజీవయ్య, కోశాధికారిగా జె.బాలరాజు, పలువురు ఈసీ కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సచితానంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతినిత్యం సుమారు ఐదు వేల మంది వరకు పార్కులో వాకింగ్ చేస్తుంటారని, ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పార్కు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. రెండు సంవత్సరాల పాటు ఈ కమిటీ కొనసాగుతుందని వాకర్ల సమస్యలపై అధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జూ పార్క్‌లో ప్రపంచ స్నేక్స్ డే

చార్మినార్: ప్రపంచ పాముల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో వివిధ రకాల పాములపై అవగాహన కల్పించారు. రెప్టైల్ హౌస్ యాంఫీ–థియేటర్ అవగాహన కార్యక్రమంలో దాదాపు 700 మంది పాఠశాల విద్యార్థులతోపాటు 600 మంది సందర్శకులు పాల్గొన్నారు. నెహ్రూ జూలాజికల్ పార్క్ విద్యా అధికారి ఎం.దీపక్ తరుణ్, ప్రత్యక్ష పాములను వాటి నివాస స్థలం, జీవనశైలి, విషపూరిత, విషరహిత పాముల మధ్య వ్యత్యాసం, పాము కాటుకు ముందు జాగ్రత్త చర్యలు, పాము గుర్తింపు గురించి వివరించారు. నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో 20 రకాల పాములు ఉన్నాయి. వీటిలో కింగ్ కోబ్రా, స్పెక్టాకిల్డ్ కోబ్రా, బాంబూ పిట్ వైపర్, రస్సెల్స్ వైపర్, క్రైట్, ఇండియన్ రాక్ పైథాన్, ఎలుక పాము, ఇసుక బోవా, గ్రీన్ ఇగ్వానా, చామెలియన్, ఫ్లాప్ షెల్ తాబేలు, స్టార్ తాబేలు, బెంగాల్ మానిటర్ బల్లి, వాటర్ మానిటర్ బల్లి వంటి ఇతర సరీసృపాలు ఉన్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ జూ పార్క్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్ మాట్లాడుతూ నెహ్రూ జూలాజికల్ పార్క్ దేశంలోనే గాజు అవరోధం లోపల సరీసృపాల గృహాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదటి జూ పార్క్ అని అన్నారు. ఇది సందర్శకులకు మెరుగైన వీక్షణ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

23న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల బంద్



పంజగుట్ట: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కాలేజీల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల ప్రతినిధులు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బంద్‌కు పిలుపునిచ్చిన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్ఓ, ఏఐపీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీల నాయకులు కసిరెడ్డి మణికంఠ, పుట్టా లక్ష్మణ్, కిరణ్, అశోక్, ఎస్.అనిల్, నాగరాజు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని పేర్కొన్నారు. పేరుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేశారని, వారి సలహాలు, సూచనలు ఎప్పుడైనా తీసుకున్నారా అని ప్రశ్నించారు. వెంటనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ, పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌ల నిధులను వెంటనే విడుదల చేయాలని, అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నితీష్, అనిల్, మురళి, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌ । గురువారం ।
17 । జూలై । 2025

సందడిగా జావా, యెజ్డీ డే..



సాక్షి, సిటీబ్యూరో: బైక్‌ రైడర్స్‌ కోసం దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్నేషనల్‌ జావా యెజ్డీ రైడర్స్‌ డే నగరంలోనూ సందడిగా సాగింది. దశాబ్దాలుగా ఈ బైక్స్‌ను వినియోగిస్తూ పలు రైడింగ్‌ క్లబ్స్‌లో సభ్యులుగా ఉన్న బైకర్స్‌తో పాటు కొత్త బైక్స్‌, అలాగే 1990ల నాటి బైక్స్‌ను ప్రదర్శిస్తూ ఉత్సాహంగా వీధుల్లో విహరించారు. నగర శివార్లలోనూ రైడ్స్‌ నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు క్లబ్స్‌ ద్వారా దాదాపుగా 6వేల మంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని, 12 రాష్ట్రాలకు చెందిన 20 నగరాల నుంచి 18 రైడింగ్‌ కమ్యూనిటీస్‌ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని ఈ సందర్భంగా ఎంపిక చేసిన రైడర్స్‌కు హెల్మెట్స్‌ కూడా అందజేశామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఆసక్తికరంగా సాగిన ఏఐపై చర్చ

విజేత.. జాన్సన్‌ గ్రామర్‌ స్కూల్‌

సాక్షి, సిటీబ్యూరో: సీఐఎస్‌సీఈ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫ్రాంక్‌ ఆంథనీ మెమోరియల్‌ ఇంటర్‌ స్కూల్‌ డిబేట్‌ కాంపిటీషన్‌ ఆసక్తికరంగా సాగింది. కుంట్లూర్‌లోని జాన్సన్‌ గ్రామర్‌ స్కూల్‌ ప్రాంగణంలో సాగిన ఈ పోటీలో జంట నగరాలలోని 16 ఐసీఎస్‌ఈ పాఠశాలల నుంచి 9వ, 10వ తరగతుల విద్యార్థులు బృందాలుగా పాల్గొన్నారు. ఏఐ ఒక సాధనం కావచ్చు, కానీ అది విద్యా విధానం కాదు అనే అంశంపై చర్చలో పాల్గొని, తమ తర్కం, వాద, ప్రతివాద నైపుణ్యం ప్రదర్శించారు. ఒక్క గంట ప్రిపరేషన్‌ టైమ్‌ మాత్రమే ఉండే ఫార్మాట్‌లో, నిబంధనలకు అనుగుణంగా ఒక్కో బృందం తీర్మానానికి అనుకూలంగానూ, వ్యతిరేకంగానూ మాట్లాడింది. ఈ పోటీలో హబ్సిగూడకు చెందిన జాన్సన్‌ గ్రామర్‌ స్కూల్‌ విజేతగా గెలుపొందగా, సికింద్రాబాద్‌లోని గీతాంజలి దేవ్‌ శాలా రన్నరప్‌గా నిలిచింది.





కెరీర్‌.. వెరీ కేర్‌ఫుల్‌



ప్రస్తుతం నగరం చదువుల ఉత్సాహంతో ఉప్పొంగిపోతోంది. ఎక్కడ చూసినా నోటిఫికేషన్లు, ఎంట్రెన్స్‌ ఫలితాలు, ర్యాంకుల ఆధారంగా కాలేజీ ఎంపికలు, సీట్ల కేటాయింపులు, కౌన్సెలింగ్‌ల ప్రక్రియల చర్చలు హోరెత్తుతున్నాయి. ఈ వాతావరణంలో విద్యార్థులూ, వారి తల్లిదండ్రులూ సందేహాలు, అనుమానాలతో ముందస్తు మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ సమయంలో పలు కోర్సులపై, కాలేజీలపై, కెరీర్‌ అవకాశాలపై స్పష్టత లేనిదే నిర్ణయాలు తీసుకుంటే.. అది భవిష్యత్తు పట్ల ప్రమాదకరంగా మారుతుంది. ఈ నేపథ్యంలో చదువుల ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, వివిధ కోణాల్లో విశ్లేషించడం తప్పనిసరిగా మారింది. ఇది కేవలం చదువు గురించి కాదు.. జీవితం గురించి. ఒక నిర్ణయం మీ జీవితానికి దిశ చూపుతుంది. మరి ఆ నిర్ణయం, నిజమైన సమాచారం ఆధారంగా ఉండాలి. ట్రెండ్‌లు చూసో, ఇష్టమైన రంగం అనో కాకుండా వాస్తవ పరిస్థితుల ఆధారంగా ముందుకు సాగడం ముఖ్యమని నిపుణుల సూచన.

\- సాక్షి, సిటీబ్యూరో

విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో అనేక సందేహాలు

ఏ కాలేజీ, ఏ గ్రూప్‌ ఉత్తమం అనే మీమాంస

ఇదే అదనుగా మభ్యపెడుతున్న పలు వేదికలు


అవగాహన అవసరమంటున్న కౌన్సెలర్లు

అధికారిక వెబ్‌సైట్లు, నిపుణుల సూచనలు మేలు

సిటీలో 'చదువుల' సందడి.. ఎటు చూసినా హడావుడి

విద్యార్థులు ఏ కోర్సు ఎంచుకోవాలి? ఎలాంటి కాలేజీ ఏ రంగానికి బాగా అనుకూలం? జాబ్‌ మార్కెట్‌లో ఏ రంగానికి డిమాండ్‌ ఉంది? ఇవన్నీ తెలుసుకోవడమే మొదటి మెట్టు. సమాచారం మూడు మార్గాల్లో సులభంగా లభిస్తుంది. ముఖ్యంగా ఎంట్రన్స్‌ పరీక్షల తేదీలు, అప్లికేషన్లు, కౌన్సెలింగ్‌, సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌ తదితర తేదీలను ఎప్పటికప్పుడు అధికారిక వెబ్‌సైట్లలో తెలుసుకుంటుండాలి.

1. **ప్రభుత్వ వెబ్‌సైట్లు (తప్పనిసరిగా చూడాల్సినవి):** టీజీ ఈఏపీసీఈటీ, నీట్‌, సీయూఈటీ వంటి పరీక్షల అధికారిక వెబ్‌సైట్లు, ఏఐసీటీఈ, యూజీసీ వంటి ప్రభుత్వ శిక్షణ సంస్థల వెబ్‌సైట్లు.
2. **నిపుణుల సలహాలు:** కెరీర్‌ కౌన్సెలర్లు, సబ్జెక్ట్‌ నిపుణులు, సైకాలజిస్టులు విద్యార్థుల ప్రొఫైల్‌ ఆధారంగా సరైన మార్గదర్శనం అందించగలరు. ఉదాహరణకు 'యూనివర్సిటీ, కెరీర్‌ ల్యాబ్స్‌, బైజూస్‌ కెరీర్‌ కౌన్సెలింగ్‌, టీసీఎస్‌ ఐఆన్‌' వంటి ప్లాట్‌ఫాంలు ఉపయుక్తం.
3. పూర్వ విద్యార్థుల అనుభవాలు: ఆయా కాలేజీల పూర్వ విద్యార్థులను సంప్రదించడం వల్ల కాలేజీ రియాలిటీ, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్‌, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ వంటి విషయాల్లో స్పష్టత వస్తుంది.



కార్యాచరణ సూచనలు..

- నాకు ఏవైనా ఆసక్తులు ఉన్నాయా? నేనేం బాగా చేయగలను? అనే స్వీయ విశ్లేషణ అవసరం.
- స్కూల్‌, కాలేజీ కౌన్సెలర్లు/సీనియర్ల ప్రాథమిక గైడెన్స్‌ తీసుకోవడం
- ఆన్‌లైన్‌లో సర్టిఫైడ్‌ కౌన్సెలింగ్‌ పొందడం.
- చివరి ఎంపికకు ముందు కనీసం ఇద్దరు–ముగ్గురు నిపుణులను సంప్రదించండి.

తప్పక తెలుసుకోవాల్సిన కోర్సులు..

- **ఇంజినీరింగ్‌ (బీ.టెక్‌):** సీఎస్‌సీ, ఈసీఈ, ఏఐఎంఎల్‌, సైబర్‌ సెక్యూరిటీ వంటి కొత్త స్పెషలైజేషన్లు డిమాండ్‌లో ఉన్నాయి. జేఎన్‌టీయూ, ట్రిపుల్‌ ఐటీ హైదరాబాద్‌, సీబీఐటీ, వీఎన్‌ఆర్‌ వంటి కాలేజీలు మంచి పేరు తెచ్చుకున్నాయి.
- **మెడిసిన్‌ (ఎంబీబీఎస్‌, బీడీఎస్‌, బీఏఎమ్‌ఎస్‌, బీహెచ్‌ఎమ్‌ఎస్‌):** నీట్‌ ఆధారంగా అఖిల భారత, రాష్ట్రస్థాయి కోటాలో సీట్లు లభిస్తాయి. ప్రైవేట్‌ కాలేజీలు ఫీజులు చాలా ఎక్కువ. ప్రభుత్వ కాలేజీలు అయితే అత్యుత్తమమైనవి.
- **లిబరల్‌ ఆర్ట్స్‌, మాస్‌ కమ్యూనికేషన్‌, డిజైన్‌:** ఎన్‌ఐడీ, నిఫ్ట్‌, ఎఫ్‌ఎల్‌ఏమ్‌ఈ యూనివర్సిటీ వంటి సంస్థలు ఆర్ట్స్‌కి ప్రాధాన్యతనిచ్చే విద్యార్థులకు అనుకూలం.
- **వృత్తి విద్యా కోర్సులు(డిప్లొమా, ఐటీఐ, పారామెడికల్‌):** తక్కువ ఖర్చుతో, త్వరగా ఉపాధి అవకాశాలు ఇవ్వగలిగే కోర్సులు కావాలంటే ఇవి బెస్ట్‌. రాష్ట్ర ప్రభుత్వాల మేనేజ్డ్‌ ఐటీఐ, పాలిటెక్నిక్‌ విద్యా సంస్థలు ఈ కోణంలో మంచి పనితీరు కనబరుస్తున్నాయి.
- **డిగ్రీ (అండర్‌ గ్రాడ్యుయేషన్‌–యూజీ):** ఇది విద్యార్థి కెరీర్‌కు బేసిక్‌గా పనిచేసే దశ. మూడేళ్ల (బీఏ, బీఎస్సీ, బీకాం) నుంచి నాలుగేళ్ల (బీటెక్‌, బీ.ఫార్మా) వరకు కోర్సులు ఉన్నాయి. యూజీలో ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న బీఎస్సీ డేటా సైన్స్‌, న్యూట్రీషన్‌, ఫోరెన్సిక్‌ సైన్స్‌.. బీకాం ఫిన్‌టెక్‌, బిజినెస్‌ అనలైటిక్స్‌.. బీఏ సైకాలజీ, మాస్‌ కమ్యూనికేషన్స్‌ వంటి రంగాలపై దృష్టి పెట్టాలి. డిగ్రీలో నేర్చుకున్న ఫౌండేషన్‌ బలంగా ఉంటే పీజీలో విశ్లేషణాత్మక విద్యనూ, పరిశోధనాత్మక దృక్పథాన్నీ పొందొచ్చు.
- **పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌):** పీజీ అనేది యూజీలో పొందిన జ్ఞానాన్ని మరింత లోతుగా తెలుసుకునే దశ. ఇది రెండు సంవత్సరాల కోర్సు. ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చుకోవడానికి లేదా అధ్యాపక వృత్తిలోకి రావడానికి పీజీ ఉపయోగపడుతుంది.

తల్లిదండ్రుల పాత్ర..

పిల్లల కలలు మీ కోరికలు కావొద్దు. పిల్లల ఆసక్తులు, సామర్థ్యాలు, నైపుణ్యాలు, వ్యక్తిత్వ లక్షణాల ఆధారంగా గైడెన్స్‌ ఇవ్వాలి. ఎదుటివారి పిల్లలు చేసినట్లు చేయాలని అనడం ద్వారా పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దు.

ఎవరి మాట నమ్మాలి..?

ఫేక్‌ ఎడ్యుకేషన్‌ కన్సల్టెంట్లు: వీరి మాటలు చాలాసార్లు మోసం చేస్తాయి. వారి చెప్పినంతగా స్కాలర్‌షిప్స్‌, సీట్లు ఉండవు.

సోషల్‌ మీడియాలో డైరెక్ట్‌ యాడ్స్‌: వీరిని నమ్మొద్దు.. గుర్తింపు లేని సంస్థల్లో అవకతవకలు ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వ టోల్‌ ఫ్రీ నంబర్లలో సమాచారం ఉత్తమం.

కొన్ని కోర్సులకు ప్రత్యేక ఎంట్రెన్స్‌ అవసరం:

- క్యాట్‌–ఎంబీఏ, సీయూఈటీ పీజీ లేదా టీజీ సీపీజీఈటీ–ఎమ్‌ఏ, ఎమ్మెస్సీ, ఎమ్‌కాం, గేట్‌–ఎమ్‌టెక్‌, నీట్‌ పీజీ–మెడికల్‌ పీజీ కోర్సులు.
- పీహెచ్‌డీ (డాక్టరల్‌ రీసెర్చ్‌): పరిశోధన రంగం అంటే సీరియస్‌గా గమనించాల్సిన అంశం. పీహెచ్‌డీ విద్యార్థి కొంత కాలం లోతుగా ఒక సబ్జెక్ట్‌ మీద పరిశోధన చేస్తూ సొంత థీసిస్‌ అందజేసే దశ. అభ్యాసం, పరిశోధన మీద ఆసక్తి ఉన్నవారికి మాత్రమే పీహెచ్‌డీ సరైన మార్గం.
- యూజీసీ–నెట్‌, సీఎస్‌ఐఆర్‌–నెట్‌, గేట్‌, జేఆర్‌ఎఫ్‌ వంటి పరీక్షల ద్వారా **స్కాలర్‌షిప్‌తో చేరొచ్చు. హై–ఎండ్‌ కార్పొరేట్‌ ఆర్‌అండ్‌డీ, యూనివర్సిటీలలో ప్రొఫెసర్‌ ఉద్యోగాలు సాధించాలంటే పీహెచ్‌డీ అవసరం.**



పాటలతో సందడి చేయనున్న రామ్‌ మిరియాల

18న మాలిబు వేదికగా లైవ్‌ మ్యూజిక్‌ కన్సర్ట్‌

సాక్షి, సిటీబ్యూరో: స్వర సంచలనం రామ్‌ మిరియాల ఈ నెల 18న తన పవర్‌ హౌస్‌ పాటలతో మరోసారి నగరాన్ని హోరెత్తించనున్నారు. నగరంలోని మాలిబు వేదిక మ్యూజిక్‌ లవర్స్‌ను తన లైవ్‌ మ్యూజిక్‌ కన్సర్ట్‌తో అలరించనున్నారు. తెలుగు, హిందీ భాషల్లో టాలీవుడ్‌, బాలీవుడ్‌ పాటలతో తన వైవిధ్యాన్ని ప్రదర్శించనున్నారు. కాక్‌టెయిల్‌, కల్చరల్‌ వైబ్‌తో సరికొత్త వినోదాన్ని నగరవాసులకు అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ లైవ్‌ మ్యూజిక్‌ కన్సర్ట్‌కు సంబంధించిన పాస్‌లు బుక్‌ మై షోలో అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు.





నగరానికి.. కుమార్‌ సాను

సాక్షి, సిటీబ్యూరో: గుర్తుందా.. 1942: ఏ లవ్‌ స్టోరీ చిత్రంలోని కుచ్‌ నా కహో కుచ్‌ హో నా కహో.. పాట? ఆషికి చిత్రంలోని బస్‌ ఏక్‌ సనమ్‌ చాహియే పాట? సడక్‌ సినిమాలోని అబ్‌ తేరే బిన్‌, సాజన్‌ చిత్రంలోని జియతో జియే కైసే.. ఇలాంటి 20వేలకు పైగా పాటలను పాడి, మెలోడీ కింగ్‌గా రొమాంటిక్‌ పాటల రారాజుగా ప్రసిద్ధి చెందిన కుమార్‌ సాను(కేదార్‌నాథ్‌ భట్టాచార్య) మరోసారి నగరానికి రానున్నారు. తన సూపర్‌ హిట్‌ సాంగ్స్‌ ద్వారా నగరంలోనూ పలువురు అభిమానులను సంపాదించుకున్న ఆయన గతంలో 2018లో నగరంలో ప్రదర్శన ఇచ్చారు. చాలా విరామం తర్వాత మరోసారి ఈ 65 ఏళ్ల నేపథ్య గాయకుడు నగరంలో వీనులవిందు చేయనున్నారు. దాదాపు 4గంటల పాటు సాగే సంగీత ప్రదర్శనలో ఆయన తన సూపర్‌హిట్‌ బాలీవుడ్‌ పాటలను పాడనున్నారు. పలు తెలుగు సినిమా పాటల ద్వారా కూడా ఇక్కడి ప్రేక్షకులకు సైతం పరిచయమైన కుమార్‌ సాను.. శంషాబాద్‌లోని క్లాసిక్‌ కన్వెన్షన్‌ త్రీ వేదికగా ఈ నెల 26న తన ప్రదర్శన అందించనున్నారు. ఈ మెలోడీ కింగ్‌ మ్యూజిక్‌ కన్సర్ట్‌ సాయంత్రం 5.30గంటలకు ప్రారంభం కానుంది.

ఏషియన్‌ పవర్‌ లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌ మెడల్‌

మనోజ్‌ గంగపుత్రను అభినందించిన రాజేష్‌ ఖన్నా



లక్డీకాపూల్‌: ఏషియన్‌ పవర్‌ లిఫ్టింగ్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో పాల్గొన్న మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌ చెందిన దీటి మనోజ్‌ కుమార్‌ గంగపుత్ర గోల్డ్‌ మెడల్‌ సాధించారు. గంగపుత్ర సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దీటి గణేష్‌ గంగపుత్ర కుమారుడు మనోజ్‌ పవర్‌ లిఫ్టింగ్‌లో తన సత్తాచాటి గంగపుత్ర సంఘం ఖ్యాతిని మరింత పెంచారని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్‌ గంగపుత్ర హౌసింగ్‌ సొసైటీ డైరెక్టర్‌ టుంగుటూరి రాజేష్‌ ఖన్నా అన్నారు. మనోజ్‌కు బుధవారం ఆయన పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేష్‌ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో భారత్‌ తరపున పాల్గొన్న మనోజ్‌ భవిష్యత్తులో దేశాన్ని ప్రపంచ స్థాయిలో మొదటి స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.

తప్పుడు కేసులకు భయపడం

మేమెప్పుడూ ప్రజాపక్షం

చంద్రబాబు తప్పుడు విత్తనం వేస్తున్నారు.. అది చెట్టవుతుంది.. అప్పుడు వ్యవస్థ ఎవరి చేతుల్లోనూ ఉండదు

ఇప్పటికైనా తప్పు తెలుసుకుని మేలుకో: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ హెచ్చరిక

చంద్రబాబూ.. మాపై నువ్వు ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదు. ప్రజల తరఫున మా పోరాటం ఆగేది లేదు. మీ ప్రభుత్వం మహా అయితే మూడేళ్లు ఉంటుంది. మళ్లీ అధికారంలోకి వచ్చేది మా ప్రభుత్వమే. నువ్వు పెట్టే తప్పుడు కేసులకు నీతోపాటు నీకు పావులుగా మారిన వారందరికీ వడ్డీతో సహా చెల్లిస్తాం.. ఇది మాత్రం మర్చిపోవద్దు. ఎందుకంటే ఇప్పుడు నువ్వు దుష్ట సంప్రదాయానికి తెరతీస్తూ వేసిన విత్తనమే రేపు విష వృక్షమవుతుంది. రేపు మేం అధికారంలోకి వచ్చాక మీతోపాటు టీడీపీ నేతల పరిస్థితి ఏమిటి? ఈ రోజు దెబ్బతిన్న వారు రేపు ఊర్కోరు కదా.. నేను చెప్పినా సరే మావాళ్లు వినే పరిస్థితి ఉండదు. దెబ్బ తగిలిన వాళ్లకే ఆ బాధ తెలుస్తుంది. ఇప్పుడైనా మేలుకో.. తప్పు తెలుసుకో.. తప్పుడు సంప్రదాయాన్ని సరిదిద్దుకో.. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ అయిన బీసీ మహిళ హారికకు ఆత్మగౌరవం లేదా అని చంద్రబాబును ప్రశ్నిస్తున్నా. చేతిలో అధికారం ఉంది కదా అని చంద్రబాబు శాడిజం ప్రదర్శిస్తున్నారు. ఇంతటి హేయమైన దాడి చేసి, సిగ్గులేకుండా దుర్భాషలాడి ఒక బీసీ మహిళను పట్టుకుని మహానటి అని టీడీపీ వాళ్లు ఎగతాళి చేస్తున్నారు. మీరు తప్పు చేసి, కారు అద్దాలు పగలగొట్టి.. తిరిగి ఆమెను మహానటి అంటారా? (దాడి చేసిన వీడియో క్లిప్పింగ్ ప్రదర్శిస్తూ). ఎవరు మహా నటులు? దాన వీర శూర కర్ణ కంటే గొప్పగా యాక్టింగ్ చేస్తున్న చంద్రబాబు కాదా! చంద్రబాబు లైవ్ యాక్టింగ్ చూసి ఎన్టీఆర్ ఎక్కడికో వెళ్లిపోవాలి. ఈ ఘటనలో నాగార్జున యాదవ్ అనే మరో జెడ్పీటీసీ భర్తను దారుణంగా కొట్టారు.

– వైఎస్ జగన్

> ప్రజలకు ఏ సమస్య వచ్చినా చంద్రబాబు ఎలాగూ చేయడని తెలిసే ఆయన్ను ఎవ్వరూ కలవడం లేదు. మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీనే అని మా తలుపులు తడుతున్నారు. మా దగ్గరకు వచ్చి ప్రజలు వాళ్లకు జరిగిన అన్యాయాలు, సమస్యల గురించి చెబుతుంటే చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. అందుకే ప్రతిపక్ష పార్టీని అణచి వేయాలని, తద్వారా ప్రజల గొంతు నొక్కేయడానికి కుట్రలు చేస్తున్నారు. ఇందులో భాగంగా విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.
>
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ఉన్నది ఒకే ఒక ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ. టీడీపీ, జనసేన, బీజేపీ అధికారపక్షంగా ఉన్నాయి. ప్రజల అభిప్రాయాలను సమీకరించడం.. ప్రజలకు సంఘీభావంగా వారితో గొంతు కలపడం.. ప్రజలకు తోడుగా నిలబడి వారి పక్షాన పోరాటం చేయడం ప్రతిపక్షం ధర్మం. విశాల ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రతిపక్షంగా మా ధర్మాన్ని మేం నిర్వర్తిస్తున్నాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఎన్నికల్లో ఇచ్చిన 143 హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను అడ్డగోలుగా మోసం చేసి పరిపాలన సాగిస్తున్నారని ఎత్తి చూపారు. 'చంద్రబాబుపై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయింది.. ఏ సమస్య వచ్చినా చంద్రబాబు పరిష్కరించండని.. ఆయన్ను కలిసినా వృథాయేనని ప్రజలకు బాగా అర్థమైంది. గట్టిగా మూడేళ్లు కళ్లు మూసుకుంటే చంద్రబాబు ఓడిపోతాడు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ప్రజలు మా తలుపులు తడుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అన్యాయాలు, సమస్యల గురించి ప్రజలు మాకు చెబుతుంటే చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. ప్రతిపక్ష పార్టీని అణచి వేయాలని, తద్వారా ప్రజల గొంతు నొక్కాలని కుట్రలు చేస్తున్నారు. విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తప్పుడు ఫిర్యాదులు.. వాంగ్మూలాలు.. సాక్ష్యాలతో వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారు' అంటూ మండిపడ్డారు. చంద్రబాబు ఇప్పటికైనా తప్పు తెలుసుకుని పద్ధతి మార్చుకోకపోతే, రేపు తాము అధికారంలోకి వచ్చాక తగిన మూల్యం చెల్లించక తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన రాష్ట్రంలో పరిస్థితిపై మీడియాతో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు మాట వినకుంటే వేధింపులే

- మా ప్రభుత్వ హయాంలో పోలీసులు అత్యుత్తమ పనితీరుతో తలెత్తుకుని సేవలందించారు. మా సంస్కరణలతో పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్ నడిచింది. స్పందన కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమస్యల కంటే పోలీసులు, కలెక్టర్లు టీడీపీ వారి సమస్యలనే ఎక్కువగా పరిష్కరించే వారు. వివక్ష చూపించకుండా ఎవరికి ఏ సమస్య వచ్చినా పోలీసింగ్ అనేది పరిష్కరించడంలో ముందుండేది. ఈ రోజు అలాంటి అధికారులు చంద్రబాబు మాట వినకుంటే.. వాళ్ల పరిస్థితి దారుణంగా మారుతోంది.

డీఐజీ ఓ మాఫియా డాన్

- చంద్రబాబు తన మోచేతి నీళ్లు తాగే అధికారులను పెట్టుకుని, వాళ్లను అవినీతిలో భాగస్వాములను చేసుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఏమంటే.. డీఐజీ అనే వ్యక్తి ఓ మాఫియా డాన్. ఆ జోన్‌లో ఆయన కింద సీఐలు, ఓ డీఎస్పీ ఉంటారు. అదే ఆయన ఆర్మీ. సదరు నియోజకవర్గంలో ఇసుక, మద్యం, బెల్టుషాపుల అనుమతులు, పరిశ్రమల నుంచి మామూళ్ల వసూళ్లు, పేకాట క్లబ్బులు నడిపే విషయంలో డీఐజీ ఆధ్వర్యంలో సీఐలు డబ్బులు వసూలు చేయడమే పని.
- ఇక్కడ పోలీసులు వసూలు చేసి రివర్స్‌లో ఎమ్మెల్యేలకు ఇవ్వడం విచిత్రం. సగం ఎమ్మెల్యేలకు ఇస్తున్నారు. మిగిలిన సగ భాగం పైన ఉన్న పెద్దబాబు, చిన్నబాబుకు తీసుకెళ్తున్నారు. ఇలా వసూళ్ల దందాను డీఐజీలతో నడిపిస్తున్నారు. ఇవన్నీ చూసి భరించలేక కొంత మంది ఐపీఎస్ అధికారులు.. సిద్ధార్థ కౌశల్ యంగ్‌స్టర్ రాజీనామా చేసి వీఆర్ఎస్ తీసుకుని వెళ్లిపోతున్నారు. ఢిల్లీకి పోవడానికి చంద్రబాబు రిలీవ్ చేయడు.. ఇక్కడే ఉండి వేధింపులు ఎందుకని రాజీనామాలు చేస్తున్నారు.

రైతులు రౌడీషీటర్లా?

- మరోక వైపు ధరల్లేక తీవ్ర కష్టాల్లో మామిడి రైతులుంటే.. వారికి సంఘీభావం తెలిపేందుకు నేను జూలై 9న చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం వెళ్లాను. మా ప్రభుత్వ హయాంలో ఇదే తోతాపురి మామిడి ధర కిలో రూ.25–29 ఉంది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రూ.2–3కు పడిపోయింది. మే 10–15 తేదీల్లో తెరవాల్సిన ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలను జూన్ 2వ, 3వ వారమైనా తెరవలేదు. ఫ్యాక్టరీలు నెల ఆలస్యంగా తెరవడం, ఒకేసారి పంట మార్కెట్‌కు రావడం, సప్లయి ఎక్కువ కావడంతో రేటు పడిపోయింది. ఇది మానవ తప్పిదం కాదా?
- చంద్రబాబు తనకు సంబంధించిన బినామీలు.. గల్లా ఫుడ్స్, శ్రీని ఫుడ్స్ వంటి వాటికి మేలు చేసేందుకే ఇదంతా చేశారు. మీరు ప్రకటించిన ధర ప్రకారం ఎంత మంది రైతులకు కిలోకు రూ.12 వచ్చింది. ఇది కూడా రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాని ధర. పొరుగునున్న కర్ణాటకలో కేంద్ర మంత్రి కుమారస్వామి లేఖ రాస్తే కిలో రూ.16 చొప్పున కేంద్రం కొనుగోలు చేస్తోంది. నువ్వు మాత్రం ఇక్కడ కిలో రూ.12కు కొనిపిస్తానని చెబుతున్నావు.
- 2.20 లక్షల ఎకరాల్లో 6.50 లక్షల టన్నుల పంట అమ్ముకునే దారి లేక 76 వేల రైతు కుటుంబాలు చంద్రబాబు పుణ్యమా అని అల్లాడిపోతున్నాయి. వారికి సంఘీభావం తెలిపేందుకు నేను అక్కడకు వెళ్తే.. తప్పా? నేను వెళ్లడం ఏమైనా నేరమా? బంగారుపాళ్యం పర్యటనలో రైతులు పాలుపంచుకోవడం తప్పా? ఈ పర్యటనలో వందల మందిని నిర్బంధించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 2 వేల మందికి ఎందుకు నోటీసులు ఇచ్చారని అడుగుతున్నా?

ఈనాడు.. అదీ ఒక పేపరేనా?
టాయిలెట్ పేపర్‌కు ఎక్కువ.. టిష్యూ పేపర్‌కు తక్కువ

- రైతుల కోసం, రైతుల తరఫున, రైతులకు సంఘీభావం తెలిపేందుకు చేపట్టిన కార్యక్రమం అది. ఇదేదో నేరమన్నట్టుగా రైతులను, ప్రతిపక్షాన్ని పట్టుకొని రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఈనాడు.. అదీ ఒక పేపరేనా? ఈనాడు పేపరు చూస్తుంటే 'టాయిలెట్ పేపర్‌కు ఎక్కువ.. టిష్యూ పేపర్‌కు తక్కువ' అన్నట్టుగా ఉంది. ఏమిటా రాతలు? ఓ పక్క ధర లేక రైతులు రోడ్డు మీదకు వస్తుంటే రైతులందరూ బ్రహ్మాండంగా కేరింతలు కొడుతున్నారని రాస్తున్నారు.
- మామిడి పండ్లను రోడ్లపై వేసినందుకు వాళ్లపై కేసులు పెట్టారు. తమకు అన్యాయం జరిగిందని రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రశ్నించకూడదు. రోడ్డెక్కి నిలదీయకూడదన్నట్టుగా ఉంది చంద్రబాబు పాలన తీరు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌తో సహా 143 హామీలన్నీ నెరవేర్చేశామని ప్రజలంతా భావించాలట! వారంతా ఆనందంగా కేరింతలు కొడుతున్నట్టుగా భావించాలన్నది చంద్రబాబు ఉద్దేశం. కాదు.. కుదరదు అని ఎవరైనా ప్రశ్నిస్తే తప్పుడు కేసులు.. తప్పుడు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు.. అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేయడం. పాలకుడని చెప్పుకునేందుకు చంద్రబాబుకు, మీడియా అని చెప్పుకునేందుకు ఈ ఎల్లో మీడియాకు సిగ్గుండాలి.

అలాగైతేనే.. పోలవరంలో మిగులు జలాల

మళ్లింపు సాధ్యం

45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా నిర్మిస్తేనే అవకాశం

- ఆ మేరకు నీటిని నిల్వ చేశాకే గోదావరి జలాల మళ్లింపుపై ఆలోచన చేయాలి
- పోలవరంలో నీటి నిల్వ ఎత్తును 41.15 మీటర్లకు కుదించేందుకు చంద్రబాబు అంగీకరించారు
- దీనివల్ల గోదావరి జలాలు కృష్ణాకు తరలించే అవకాశం ఉండదు
- తొలుత 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా పోలవరం పూర్తి చేయాలి
- ఆ దిశగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలి
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేసేలా పూర్తి చేస్తేనే గోదావరి మిగులు జలాలు ఇతర నదీ పరీవాహక ప్రాంతాల(బేసిన్)కు మళ్లించడానికి అవకాశం ఉంటుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఆ ప్రాజెక్టులో నీటి నిల్వ చేసే ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించేందుకు సీఎం చంద్రబాబు రాజీపడ్డారని గుర్తు చేశారు. దీని కారణంగా కృష్ణా నదికి గోదావరి జలాలను తరలించే అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జాతీయ మీడియా అడిగిన ప్రశ్నకు వైఎస్ జగన్ స్పందిస్తూ.. ''గోదావరికి ప్రాణహిత, ఇంద్రావతి ప్రధాన ఉపనదులు. ఇప్పటికే ఎగువ రాష్ట్రాలు ప్రాణహిత జలాలను గరిష్ఠ స్థాయిలో వాడుకునేలా ప్రాజెక్టులు నిర్మిస్తున్నాయి. తాజాగా ఇంద్రావతి జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవడానికి ఛత్తీస్‌గఢ్ బోధ్‌ఘాట్ బహుళార్థ సాధక ప్రాజెక్టును చేపట్టింది. దీనికి రూ.50 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ నేపథ్యంలో తొలుత పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా పూర్తి చేయాలి'' అని రాష్ట్ర ప్రభుత్వానికి వైఎస్ జగన్ సూచించారు. అందుకు భూ సేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి అవసరమైన నిధులు ఇచ్చేలా కేంద్రాన్ని ఒప్పించాలని పేర్కొన్నారు. కేంద్రం అంగీకరించని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.15 వేల కోట్లను సమీకరించి.. భూ సేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించి పోలవరంలో 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా పూర్తి చేయాలన్నారు. ప్రాణహిత, ఇంద్రావతికి అడ్డుకట్ట వేస్తే.. పోలవరంలో మిగులు, వరద జలాల లభ్యత ఏ స్థాయిలో ఉంటుందన్నది అంచనా వేయాలన్నారు. మిగులు, వరద జలాల లభ్యత ఉంటుందని తేల్చిన తర్వాత పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని వైఎస్ జగన్ సూచించారు. నీళ్లు లేకుండా ఆ ప్రాజెక్టును చేపడితే రూ.80 వేల కోట్లు వృథా అవుతాయన్నారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

13 నెలల్లోనే

రూ.1.75 లక్షల కోట్ల అప్పా?

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఒక్క పథకమూ అమలు చేయలేదు..

మరి డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్లింది?

చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్ జగన్

గోదావరి బోర్డు సభ్యకార్యదర్శిగా కనోడియా

సభ్యుడిగా అజగేషన్ బదిలీ

సాక్షి, హైదరాబాద్: గోదావరినది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సభ్యకార్యదర్శి ఆర్.అజగేషన్‌ను బోర్డు సభ్యుడిగా కేంద్ర జలశక్తి శాఖ బదిలీ చేసింది. బోర్డు సభ్యుడు ఆర్‌కే కనోడియాను సభ్యకార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ఇద్దరు అధికారులను పరస్పరం బదిలీ చేస్తూ కేంద్ర జలశక్తి శాఖ ఈనెల 11న ఉత్తర్వులు జారీ చేసింది. గోదావరి బోర్డులో ఏపీ, తెలంగాణ నుంచి డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఇంజనీర్ల పట్ల సభ్య కార్యదర్శి అజగేషన్ దురుసుగా వ్యవహరిస్తున్నారని రెండు రాష్ట్రాల ఇంజనీర్లతో పాటు ఆయా రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులు కూడా కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అజగేషన్‌ను సభ్యకార్యదర్శి పోస్టు నుంచి ప్రాధాన్యం లేని సభ్యుడి పోస్టుకు బదిలీ చేసినట్టు తెలుస్తోంది.

రేపు ఇందిరాపార్క్ వద్ద సర్పంచుల మహా ధర్నా

సాక్షి, హైదరాబాద్: తమ పెండింగ్ బిల్లుల సాధనకు 18న ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహా ధర్నా చేపట్టనున్నట్టు రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తమ పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

టీబీజీకేఎస్ ఇన్‌చార్జిగా కొప్పుల

- సింగరేణి కార్మిక నేతల సమావేశంలో కేటీఆర్ వెల్లడి
- బొగ్గు గనులపై కాంగ్రెస్, బీజేపీ కుట్రలు
- కార్మికుల సమస్యలపై పోరాటానికి కార్యాచరణ
- త్వరలో సింగరేణి కార్మికులతో విస్తృత సమావేశం



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కార్యకలాపాలను ఇకపై సంఘం వ్యవస్థాపక సభ్యుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పార్టీ పక్షాన ఇన్‌చార్జిగా పర్యవేక్షిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సింగరేణి ప్రాంతానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, మాజీ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం టీబీజీకేఎస్ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కొప్పుల ఆధ్వర్యంలో సంఘం కార్యకలాపాలను ముందుకు తీసుకుపోవడంతోపాటు కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. సింగరేణి బొగ్గు గనులపై కాంగ్రెస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్రలపై గళమెత్తాలని పిలుపునిచ్చారు. పార్టీకి అనుబంధంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ద్వారా సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేంత వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఈ భేటీలో నిర్ణయించారు. కార్మికులకు ప్రభుత్వం చేసే అన్యాయాలపై పోరాడేందుకు పార్టీ లీగల్ సెల్ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో త్వరలో విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని ప్రకటించారు.

'టాక్ జర్నలిజం'ఈవెంట్‌కు కేటీఆర్

దేశంలోని ప్రముఖ జర్నలిస్టులు, మేధావులు, రాజకీయ నాయకులు ప్రతిష్టాత్మక 'టాక్ జర్నలిజం 2025'కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 19, 20 తేదీల్లో రాజస్తాన్‌లోని జైపూర్ వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. దక్షిణ భారత రాజకీయాల్లో ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని బలంగా వినిపిస్తున్న, విజన్ ఉన్న వినూత్న నాయకుడిగా పేరు తెచ్చుకున్న కేటీఆర్‌ను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. మీడియా రంగంలోని మార్పులు, ధోరణులు, సవాళ్లపై చర్చించేందుకు దేశ విదేశాలకు చెందిన జర్నలిస్టులు కలుసుకునే వేదికగా 'టాక్ జర్నలిజం'ని లుస్తోంది. గతంలో సచిన్ పైలట్, అసదుద్దీన్ ఒవైసీ, సుబ్రమణ్య స్వామి, జీవీఎల్ నరసింహారావు, రాఘవ్ చద్దా, డి.రాజా, ప్రియాంకా చతుర్వేది తదితరులు పాల్గొన్నారు. ఈసారి కేటీఆర్ తన ప్రసంగంలో ప్రాంతీయ అసమానతలు, సమాఖ్య విధానం, మారుతున్న భారత రాజకీయాల దిశ వంటి అంశాలను ప్రస్తావించనున్నారు.

25 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు కావాలి

- అప్పటి వరకు పోరాడుతాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్లుగా 25 వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం ఆమె బంజారాహిల్స్‌లోని తన నివాసంలో యూపీఎఫ్ నాయకులు, 72 కులాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీసీ బిడ్డలకు రాజకీయ పదవులు దక్కితే అందులో సగం పదవులు ఆడబిడ్డలకే వస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఇప్పటి వరకు రాజకీయంగా ఎలాంటి అవకాశం దక్కని కులాలకు రాజకీయ రిజర్వేషన్ల ఫలాలు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమో, అందులో సబ్ కోటా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. కాగా, బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో కేవియట్ వేయకుంటే ఎవరైనా కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు అడ్డు తగిలే ప్రమాదముందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు.

ఎడ్లబండే అంబులెన్స్

- బురద రోడ్డులో గర్భిణికి నరకయాతన
- అంబులెన్స్ రాలేకపోవడంతో ఎడ్లబండిపై ఇంటికి చేరుకున్న తల్లీబిడ్డ



ప్రసవం అనంతరం ఎడ్లబండిలో వెళ్తున్న పుష్పలత


దహెగాం (సిర్పూర్): గిరిజన పల్లెల్లో మహిళలకు ప్రసవ బాధలు తప్పడం లేదు. వర్షాలకు రోడ్లు బురదమయంగా మారడంతో గ్రామాలకు అంబులెన్స్‌లు కూడా వెళ్లడం లేదు. అత్యవసర సమయంలో ఎడ్లబండ్లే వారికి అంబులెన్స్‌లుగా మారుతున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ గర్భిణి బిడ్డకు జన్మనిచ్చేందుకు ఆరుగంటల పాటు ప్రసవ వేదనతో ఇబ్బంది పడింది. దహెగాం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన లోహకు చెందిన సిడాం రామయ్య, చిన్నక్క దంపతుల రెండో సంతానమైన పుష్పలత గర్భం దాల్చడంతో కాన్పు కోసం రెండు నెలల క్రితం లోహలోని పుట్టింటికి వచ్చింది. మంగళవారం పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. బెజ్జూర్ నుంచి అంబులెన్స్ బయలుదేరగా కర్జి గ్రామం దాటిన తర్వాత రోడ్డు బురదతో అధ్వానంగా ఉండటంతో మధ్యలోనే ఆగిపోయింది. పురిటినొప్పులతో బాధపడుతున్న పుష్పలతను కుటుంబ సభ్యులు ఎడ్లబండిలో ఎక్కించి లోహ నుంచి ఆరు కిలోమీటర్ల వరకు తీసుకురాగా, అక్కడి నుంచి అంబులెన్స్‌లో దహెగాం పీహెచ్‌సీకి తరలించారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. బుధవారం మధ్యాహ్నం ఆస్పత్రి నుంచి ఇద్దరినీ డిశ్చార్జ్ చేశారు. అనంతరం పీహెచ్‌సీలోని అంబులెన్సులో ఏఎన్ఎం సాయంతో లోహకు తరలించే ఏర్పాట్లు చేశారు. మళ్లీ కర్జి గ్రామం దాటిన తర్వాత వాహనం ముందుకు కదలకపోవడంతో లోహకు మూడు కిలోమీటర్ల దూరంలోనే తల్లీబిడ్డను దింపేశారు. అక్కడి నుంచి మళ్లీ ఎడ్లబండిలో ఇంటికి చేరుకున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఇంటికి చేరడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

హైదరాబాద్–అమరావతి కొత్త రైలు మార్గం

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త లైన్ ప్రారంభమవుతుంది.

- ఎర్రుపాలెం–పెద్దాపురం–చెన్నారావుపాలెం–పరిటాల–అమరావతి–కొప్పురావూరు–నంబూరు వరకు ఈ లైన్ కొనసాగుతుంది.
- గుంటూరు–విజయవాడ లైన్‌లో ఉన్న నంబూరు స్టేషన్‌తో ఇది అనుసంధానమవుతుంది. ఈ నిడివి 56.53 కి.మీ.గా ఉంటుంది.
- ఇటు కాజీపేట–విజయవాడ లైన్, అటు గుంటూరు–విజయవాడ లైన్.. ఈ రెండింటిని అనుసంధానిస్తూ మధ్యలో ఈ కొత్త గ్రీన్‌ఫీల్డ్ లైన్ నిర్మితమవుతుందన్నమాట.
- హైదరాబాద్ నుంచి అమరావతి వరకు వెళ్లాలంటే.. సికింద్రాబాద్ స్టేషన్‌లో బయలు దేరే రైలు కాజీపేట మీదుగా ఖమ్మం, మధిర, ఎర్రుపాలెం వరకు ప్రస్తుతం ఉన్న లైనులో వెళ్లి అక్కడి నుంచి కొత్త మార్గంలోకి మళ్లి పెద్దాపురం, పరిటాల మీదుగా అమరావతి చేరుకుంటుంది. అక్కడి నుంచి ముందుకు సాగి ప్రస్తుతం ఉన్న గుంటూరు–విజయవాడ లైనుతో అనుసంధానమై విజయవాడ చేరుకుంటుంది. ఈ రెండు పాత లైన్లను అనుసంధానించటం వల్ల చాలా రైళ్లను ఎటునుంచైనా దారి మళ్లించొచ్చు.
- ప్రస్తుత మార్గాల్లో సామర్థ్యానికి మించి రైళ్లు నడుస్తున్నందున, ఈ కొత్త మార్గం అందుబాటులోకి వస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. ప్రయాణికుల రైళ్లకే కాకుండా సరుకు రవాణా రైళ్లకు కూడా ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.



భారీ వంతెన ప్రత్యేకం..

ఈ మార్గంలో కృష్ణానదిపై భారీ వంతెనను నిర్మించనున్నారు. అమరావతి–పరిటాల సెక్షన్ల మధ్య వడ్డమాను–కొత్తపల్లి గ్రామాలను అనుసంధానిస్తూ కృష్ణానదిపై 3.3 కి.మీ. నిడివితో ఈ వంతెన నిర్మిస్తారు. 55 స్పాన్స్‌తో ఉండే ఈ వంతెన నిర్మాణానికి రూ.550 కోట్లు ఖర్చు కానుంది. విజయవాడలో కృష్ణానదిపై ఉన్న రైల్వే వంతెనకంటే ఇది చాలా పెద్దది కావటం విశేషం.

భారీ వ్యయం..

ఈ లైన్ నిర్మాణానికి రూ.2300 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. పనులు జరిగేకొద్దీ ఈ మొత్తం మరింత పెరగనుంది. ఈ పనులను రెండు దశల్లో నిర్మిస్తారు.

ఫేజ్–1:
నంబూరు–కొప్పురవూరు (5.5 కి.మీ.)
కొప్పురవూరు– అమరావతి (12.75 కి.మీ)

ఫేజ్–2:
ఎర్రుపాలెం–పెద్దాపురం (5.1 కి.మీ)
పెద్దాపురం–చెన్నారావుపాలెం (4.7 కి.మీ.)
చెన్నారావుపాలెం–పరిటాల (8.65కి.మీ)
పరిటాల–అమరావతి (20.29 కి.మీ.)

- ఈ ప్రాజెక్టు కోసం 361 హెక్టార్ల భూమిని సేకరిస్తున్నారు. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ తుది దశలో ఉంది.
- కృష్ణానదిపై భారీ వంతెనతోపాటు ఈ మార్గంలో 32 పెద్ద వంతెనలు, 92 చిన్న వంతెనలు, రెండు ఆర్‌ఓబీలు, 10 ఆర్‌యూబీలు ఉంటాయి. ఎక్కడా వాహనాలు రైలు పట్టాల మీదుగా దాటి పోవాల్సిన పని ఉండదు. దేశంలో రైల్వే లెవల్ క్రాసింగ్స్ లేకుండా ప్రత్యామ్నాయంగా వంతెనలు నిర్మిస్తున్నందున, కొత్తగా నిర్మించబోయే మార్గాల్లో లెవల్ క్రాసింగ్స్ లేకుండా చూడాలని రైల్వేశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా అమరావతి కొత్త మార్గంలో లెవల్ క్రాసింగ్స్ ఉండకూడదన్న ఉద్దేశంతో ఇన్ని వంతెనలకు ప్రణాళికలు రూపొందించారు.
- అమరలింగేశ్వరస్వామి దేవాలయం, అమరావతి స్తూపం, ధ్యాన బుద్ధ విగ్రహం, ఉండవల్లి గుహలు.. తదితర ఆధ్యాత్మిక ప్రాంతాలకు రైలు అందుబాటులోకి వస్తుంది.
- మచిలీపట్నం పోర్టు, కాకినాడ పోర్టు, కృష్ణపట్నం పోర్టులకు మరిన్ని రైళ్లు వచ్చేందుకు వీలు కలుగుతుంది.

కాజీపేట మినీకోచ్ ఫ్యాక్టరీ గందరగోళానికి తెర

19న ఆ యూనిట్‌ను సందర్శించనున్న రైల్వేశాఖ మంత్రి వైష్ణవ్

సాక్షి, హైదరాబాద్: స్వయంగా ప్రధానమంత్రి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేసిన కాజీపేట మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ అప్‌గ్రేడేషన్‌కు రైల్వే బోర్డు ఆమోదముద్ర వేయకపోవటంతో నెలకొన్న గందరగోళం సమసిపోబోతోంది. రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ శనివారం ఆ యూనిట్ పనులను స్వయంగా తనిఖీ చేయబోతున్నారు. ఈ సందర్భంగా ఆ యూనిట్‌లో కోచ్‌ల ఉత్పత్తిపై స్పష్టతనివ్వబోతున్నారు. కాజీపేటకు గతంలో మంజూరైన వ్యాగన్ తయారీ కేంద్రాన్ని మినీ కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో దాని నిర్మాణ అంచనావ్యయాన్ని రూ.362 కోట్ల నుంచి రూ.522 కోట్లకు పెంచింది. గత జూలైలో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో ఆ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. కానీ, ఈ అంచనావ్యయం పెంపునకు రైల్వే బోర్డు ఆమోదముద్ర వేయలేదు. ఫలితంగా జపాన్‌లోని టైకిషా కంపెనీ నుంచి కొనుగోలు చేయాల్సిన ఆధునిక యంత్రాలను రైల్వే సమకూర్చుకోలేకపోయింది. దీంతో యూనిట్ నిర్మాణ పనులు పూర్తి కావొచ్చినా, ఉత్పత్తి ప్రారంభించటంలో జాప్యం తప్పదన్న భావన వ్యక్తమవుతోంది. ఇటీవల ఇదే విషయాన్ని వివరిస్తూ సాక్షి దినపత్రిక కథనాన్ని వెలువరించింది. దీనికి స్పందించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం విషయంపై రైల్వే బోర్డును ఆరా తీశారు. త్వరలో ఆధునిక యంత్రాలకు వర్క్ ఆర్డర్ ఇవ్వనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. కానీ, ఇప్పటి వరకు సమస్య అలాగే ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ఆ యూనిట్‌ను సందర్శించబోతున్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వస్తున్న ఆయన, పనిలోపనిగా కాజీపేట మినీ కోచ్ ఫ్యాక్టరీని సందర్శించబోతున్నారు. ఇక్కడ వందేభారత్ రైలు కోచ్‌ల ఉత్పత్తికి వీలుగా ఓ లైన్ కూడా నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించారు. త్వరలో అన్ని ప్రధాన కేంద్రాల్లో వందేభారత్ స్లీపర్ కోచ్‌ల తయారీ మొదలుకానుండగా, ఇక్కడ కూడా వాటి తయారీపై నిర్ణయం తీసుకునే అవకాశముంది.

జోధ్‌పూర్‌కు రైలు సేవలు

హైదరాబాద్‌లో పెద్దసంఖ్యలో రాజస్తాన్ రాష్ట్రానికి చెందినవారు ఉన్నందున నగరం నుంచి జోధ్‌పూర్‌కు ప్రత్యేక రైలు సర్వీసు ప్రారంభించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. రైల్వేశాఖ మంత్రి పర్యటనలో భాగంగా ఈ రైలు సేవలను జెండా ఊపి ప్రారంభించే వీలుంది. అయితే, దీనిపై అధికారికంగా రైల్వే శాఖ వివరాలు వెల్లడించలేదు.



సిరికాకొలనులో సీత

గుణశేఖర్ 'రామాయణం' గుర్తుందా?
రాముడుగా జూ. ఎన్టీఆర్‌తోపాటు సీతగా.. స్మితామాధవ్ ప్రేక్షక మనసులను కట్టిపడేసింది!
సినిమాల్లో కనిపించకపోయినా.. నాట్యంతో, గానంతో కళాభిమానులను అబ్బురపరుస్తూనే ఉంది!
ఇటీవల 'సిరికాకొలను చిన్నది' నృత్యరూపకంతో మరోసారి తన ప్రతిభను చాటుకుంది.
ఈ నేపథ్యంలో.. హైదరాబాద్ వాసి స్మిత గురించి మరిన్ని విషయాలు, విశేషాలు ఆమె మాటల్లోనే..

''నిజానికి.. వేటూరి సుందర రామ్మూర్తి 'సిరికాకొలను చిన్నది' రేడియో డ్రామాను కె. విశ్వనాథ్‌గారు సినిమాగా తీయాలనుకున్నారట. ఎందుకనో కుదరలేదట. 2019 ఎండింగ్‌లో ఆయన ఆ స్క్రిప్ట్‌ను నాకు ఇచ్చి నన్ను చేయమన్నారు. కోవిడ్ రావడంతో ఆ ప్రాజెక్ట్ లేట్ అయింది. నేను చేసిన ఆ నృత్యరూపకానికి చాలా ప్రశంసలు అందాయి. కె. విశ్వనాథ్‌గారు ఉండి ఉంటే చాలా మురిసిపోయేవారు. నా ప్రదర్శనకు వాళ్ల అబ్బాయి వాళ్లంతా వచ్చారు.. సంతోషమేసింది. విశ్వనాథ్‌గారున్నప్పుడు చేయలేకపోయాననే బాధ మాత్రం ఉంది. వారంటే నాకు చాలా అభిమానం, గౌరవం. వారి సినిమాల్లో నటించాలనే ఆసక్తి, ఆలోచన వచ్చేప్పటికే ఆయన సినిమాలు తగ్గించేసుకున్నారు. నా పెర్ఫార్మెన్సెస్ చాలా వాటికి వచ్చారు. కళ పట్ల నాకున్న కమిట్‌మెంట్‌ను మెచ్చుకునేవారు. నాకు ఊహ తెలిసేప్పటికల్లా భరతనాట్యం, కర్ణాటక సంగీతం క్లాసెస్‌లో ఉన్నాను. ఒకరకంగా చెప్పాలంటే మాది కళల నేపథ్యం ఉన్న కుటుంబం. మా అమ్మమ్మ, నానమ్మ పాడేవారు. అమ్మ (హేమ) పాడుతారు.. వీణా వాయిస్తారు. అన్నయ్య సిద్ధార్థ వీణ, వయొలిన్ నేర్చుకున్నాడు. అయితే మా ఇంట్లో ఆర్ట్‌ని ప్రొఫెషన్‌గా తీసుకుంది మాత్రం నేనే! భరతనాట్యంలో నా గురువు రాజేశ్వరీ సాయినాథ్, సంగీత గురువు లలితమ్మ.

తాతను అమెరికా పంపిన నానమ్మ..
మా నాన్న (పీజీ మాధవ్) వాళ్లు అయిదుగురు తోబుట్టువులు. వాళ్ల చిన్నప్పుడే ఏదో ఆరోగ్య సమస్యతో మా తాత (పీజీ కృష్ణస్వామి)గారు చూపుకోల్పోవడంతో ఆయన చేస్తున్న క్లర్క్ జాబ్ కూడా పోయింది. అప్పుడు మా నానమ్మ (సుగంధ కృష్ణస్వామి) తన నగలన్నీ అమ్మి.. తాతగారిని అమెరికా పంపించారు బ్రెయిలీలో టీచర్ ట్రైనింగ్ కోసం. ఆయన అమెరికా నుంచి వచ్చేసరికి నానమ్మ కూడా తన పిల్లలతో పాటు చదువుకొనసాగించి. ట్యూషన్స్ చెబుతూ కుటుంబాన్ని పోషించింది. తనూ ఎం.ఎ. ఎం.ఈడీ. చేసింది. తాతగారు ఇండియా వచ్చేసమయానికే కేంద్రప్రభుత్వం డెహ్రాడూన్‌లో బ్లైండ్ స్కూల్‌ను స్టార్ట్ చేసింది. దేశంలో అదే ఫస్ట్ బ్లైండ్ స్కూల్. దానికి తాతగారే ప్రిన్సిపల్. మా నానమ్మ దూరదృష్టికి నిదర్శనం అది.

తాతగారి వల్లే సీత..
నా అరంగేట్రం గురించి పత్రికలో వచ్చిన కథనాన్ని చదివి, నా గురించి వాకబు చేసి మా ఇంటికి వచ్చారు నిర్మాత, కవి ఎమ్మెస్ రెడ్డి. 'మేము తీయబోయే 'రామాయణం' సినిమాలో మీ అమ్మాయిని సీతగా అనుకుంటున్నాం.. మీకు సమ్మతమేనా' అని నాన్నగారిని అడిగారు. దాని మీద మా ఇంట్లో పెద్ద చర్చే జరిగింది. మా తాతగారే చొరవ తీసుకుని 'మంచి అవకాశం... పంపించండి' అని తేల్చేశారు. అలా తాతగారి వల్లే ఆ సినిమాలో సీతగా నటించాను. రామాయణం తర్వాత, హీరోయిన్‌గానూ చాలా అవకాశాలే వచ్చాయి. కానీ ఇటు డాన్స్ అండ్ మ్యూజిక్, చదువు, అటు సినిమాలు.. బ్యాలెన్స్ చేసుకోవడం కుదరలేదు. అందుకే సినిమాల మీద దృష్టి పెట్టలేదు. నేను చదువులో కూడా క్వయిట్ గుడ్. లా (ఉస్మానియా యూనివర్సిటీ)లో గోల్డ్ మెడలిస్ట్‌ని. కర్ణాటిక్ మ్యూజిక్, భరతనాట్యం(మద్రాస్ యూనివర్సిటీ)లో మాస్టర్స్ చేశాను. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశాను. వీలున్నప్పుడల్లా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి గెస్ట్ ఫ్యాకల్టీగా వెళ్తుంటాను భరతనాట్యం అండ్ కర్ణాటిక్ మ్యూజిక్‌లో. బాలినీస్ డాన్స్ కూడా నేర్చుకున్నాను. అనేక రకాల అంశాలలోమన దేశానికి, ఇండోనేషియాకు ఉన్న సంబంధం వల్ల నాకు ఆ దేశపు బాలినీస్ డాన్స్ అంటే ఆసక్తి పెరిగింది. అందుకే బాలీ (ఇండోనేషియా)వెళ్లి..కొన్నాళ్లుండి ఆ డాన్స్ నేర్చుకుని వచ్చాను.

అండర్ ప్రివిలేజ్డ్‌కు ఫ్రీగా..
ఇరవై ఏళ్ల కిందటే అంటే కాలేజ్ డేస్‌లోనే 'వర్ణా ఆర్ట్స్ అకాడమీ' పేరుతో డాన్స్ అండ్ మ్యూజిక్ స్కూల్ స్టార్ట్ చేశాను. దాదాపు వంద మంది స్టూడెంట్స్ ఉంటారు. అందులో అండర్‌ప్రివిలెజ్డ్ పిల్లలూ ఉన్నారు. వాళ్లందరికీ ఫ్రీగానే నేర్పిస్తాను. అయితే మిగతా పిల్లలెవరికీ వాళ్లు అండర్ ప్రివిలెజ్డ్ అని తెలియనివ్వం. అందరూ ఈక్వలే! ఎవరి ఆత్మవిశ్వాసమూ దెబ్బతినకూడదు కదా! అంతే కాదు మా ఆర్ట్‌స్కూల్‌కి అన్ని మతాలకు చెందిన పిల్లలూ వస్తుంటారు. అందరికీ అంతే శ్రద్ధతో నేర్పిస్తాం. చాలామంది దర్శకులూ వస్తుంటారు చైల్డ్ ఆర్టిస్టల కోసం. 24 క్రాఫ్ట్స్‌తో కూడిన సినిమా అంటే నాకు ముందునుంచీ క్రేజే! ఇప్పుడు నాకు తగ్గ పాత్రలు వస్తే తప్పకుండా చేస్తాను.

జూనియర్‌తో జుగల్‌బందీ..
ఆ సినిమా షూటింగ్ ఏడాదిన్నర కంటే ఎక్కువే జరిగింది. ఎదిగే వయసు కదా.. ఇప్పుడు కుట్టించిన కాస్ట్యూమ్స్ రెండు నెలలకు పొట్టిపోయేవి. పిల్లలమంతా లిటరల్లీ కోతివేషాలతో చాలానే విసిగించుంటాం. అప్పుడు నేను చాలా సైలెంట్. జూ.ఎన్టీఆర్ చాలా యాక్టివ్ అండ్ కాన్ఫిడెంట్. ఇప్పుడు నాకనిపిస్తోంది అతను బార్న్ హీరో అని! ఆ సినిమా తర్వాత నేను, తను కలిసి స్టేజ్ మీద జుగల్ బందీ (భరతనాట్యం, కూచిపూడితో) ప్రదర్శనలిచ్చాం కూడా.

స్త్రీల సమస్యలు కళ ద్వారా..
'సిరికాకొలను చిన్నది' కంటే ముందు కూడా తమిళ్, సంస్కృత నృత్యరూపకాలు చాలా చేశాను. పర్సనల్‌గా ఫీలై.. నాకు నచ్చితే సబ్జెక్ట్, భాషా భేదాలు చూడను. 'సిరికాకొలను చిన్నది' కోసం చాలా కష్టపడ్డాను. ఎన్నో హర్డిల్స్ ఎదురయ్యాయి. 'ఇంత కష్టపడ్డం అవసరమా?'అనడిగారు శ్రేయోభిలాషులు చాలామంది. అవసరమే! ఎందుకంటే అంతలా కనెక్ట్ అయ్యాను ఆ ప్రాజెక్ట్‌తో. అలా నచ్చితే వెనక్కి తగ్గను. నేనెప్పుడూ ఓల్డ్ ఇన్ ద న్యూ.. న్యూ ఇన్ ద ఓల్డ్‌ని చూస్తాను. ఈ కోవలోనే మహిళలు, పిల్లలకు సంబంధించి అంశాలనూ నాకొచ్చిన కళద్వారా ఫోకస్ చేయడానికి ప్రయత్నిస్తాను. మేనేజ్‌మెంట్ స్కూల్స్ నా ప్రోగ్రామ్స్ కండక్ట్ చేస్తుంటాయి. ఆ ప్రోగ్రామ్స్‌లోనూ వాళ్ల సమస్యలను రామాయణ, మహాభారతాల్లో ఉన్న స్టోరీస్‌కి అనుసంధానించి ప్రదర్శిస్తుంటాను. సమాజానికి కళలు అవసరం.. కళలకు సమాజం అవసరం. కళలు ఒత్తిడిని జయించేలా చేస్తాయి. అయితే దానికి పోటీని చేర్చకూడదు. పోటీ వల్ల సాంత్వన స్థానంలో స్ట్రెస్ చేరుతుంది. అందుకే ఒకటే చెబుతాను కళలు గురువులు నేర్పుతారు సంస్కారం మాత్రం పేరెంట్సే నేర్పాలి. పిల్లలను పిల్లలుగానే ఉండనివ్వాలి. వాళ్ల బాల్యాన్ని లాక్కోకూడదు'' అని ముగించారు స్మితామాధవ్.

– సరస్వతి రమ

కర్నాటక విద్యార్థిని రితుపర్ణకు దిగ్గజ సంస్థ రోల్స్ రాయిస్ 72 లక్షల ప్రీ ప్లేస్‌మెంట్ ఇచ్చి భారీ జీతం పొందిన అండర్ గ్రాడ్యుయేట్‌గా వార్తల్లో నిలిచింది. సహ్యాద్రి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో రోబొటిక్స్ అండ్ ఆటోమేషన్ చదువుతున్న రితుపర్ణ గతంలో చేసిన ప్లేస్‌మెంట్ ప్రయత్నాలు విఫలమైనా పట్టుదలతో ఇంత భారీ అవకాశాన్ని పొందగలిగింది. ఈ కాలపు యువతకు స్ఫూర్తిని ఇవ్వదగ్గ రితుపర్ణ పరిచయం...





సెమిస్టర్ స్టూడెంట్ 72 లక్షల జీతం

రితుపర్ణ కథ అచ్చు సినిమా కథలాగే మలుపులతో ఉంటుంది. సామాన్యమైన అమ్మాయని అందరూ అంచనా వేస్తే అసామాన్యురాలిగా కనిపించి, నిరూపించి నివ్వెర పరిచింది. అర్హతలున్నాయా అని ప్రశ్నించిన చోటే ఆశ్చర్యపోయే అంగీకారం పొందింది. మరి ప్రఖ్యాత రోల్స్ రాయిస్ సంస్థ నుంచి ఏడాదికి రూ.73.3 లక్షల ప్రీ–ప్లేస్‌మెంట్ ఆఫర్ పొందడం అంటే మాటలా? దేశంలో ఈ అవకాశాన్ని పొందిన అతి కొద్దిమంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులలో ఒకరు కె.ఎస్. రితుపర్ణ.

డాక్టర్ కాబోయి...
కర్నాటకలోని తీర్థహళ్లి తాలూకా కోడూరుకు చెందిన కె.ఎస్.సురేష్, గీత దంపతుల కుమార్తె రితుపర్ణ. ఆమె చెల్లెలు రిత్విక. రితుపర్ణ పీయూసీ పూర్తి చేసిన తర్వాత మెడిసిన్ చదవాలని అనుకుంది. ఆ తర్వాత యూపీఎస్సీ రాసి సివిల్ సర్వీసెస్‌లో చేరాలన్నది ఆమె కల. ఇందు కోసం 2002లో నీట్ రాసింది. అయితే ఆమెకు ప్రభుత్వ సీటు రాలేదు. ప్రైవేటులో చదివేంత స్థోమత లేదు. ఆ సమయంలో ఇంజనీరింగ్‌లో చేరమని ఆమె తండ్రి సలహా ఇచ్చారు. ఇంజనీరింగ్ చదివితే ప్రభుత్వ ఉద్యోగం పొందవచ్చని సలహా ఇచ్చారు. అలా సీఈటీ కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ సీటు సంపాదించి సహ్యాద్రి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్‌లో చేరింది రితుపర్ణ. మొదట్లో బి.టెక్ పట్ల అంత ఆసక్తి చూపకపోయినా రాను రాను ఆసక్తి పెంచుకొని ఉన్నతి సాధించింది. రోబొటిక్స్ కోర్సు ఆసక్తికరంగా అనిపించి కొత్తగా ఆలోచించడం, కొత్త మార్గాలు అన్వేషించడం ఆమెకు ఉత్సాహాన్ని ఇచ్చింది.

ఆమె ఆవిష్కరణ
దేశానికి వెన్నెముకగా నిలిచే రైతు వ్యవసాయంలో ఇంకా శ్రమపడుతూ ఉన్నాడు. అతని శ్రమను తగ్గించే క్రమంలో ఏదైనా కొత్తగా కనుక్కుంటే బాగుంటుందని ఆమె భావించింది. ప్రధానంగా వక్కలు పండించడం చాలా శ్రమతో కూడుకున్న పని అని ఆమె గమనించింది. ఆ శ్రమను తగ్గించేందుకు తన బృందంతో కలిసి రోబోటిక్ హార్వెస్టర్ స్ప్రేయర్ మోడల్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఆవిష్కరణ గోవా ఐనెక్స్ పోటీలో బంగారు, వెండి పతకాలను గెలుచుకుంది. ఇది ఆమె తొలి విజయం. తరువాత ఎన్ఐటీకే సూరత్కల్‌లోని పరిశోధనా బృందంలో రితుపర్ణ చేరింది. అక్కడ ఆమె ప్రాజెక్టులు ప్రయోగశాలకే పరిమితం కాలేదు. డిప్యూటీ కమిషనర్ ముల్లై ముహిలన్‌ను కలిసింది. ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఒక యాప్ అభివృద్ధికి కృషి చేసింది. అందరూ తన ప్రతిభను మెచ్చుకుంటున్నా రితుపర్ణ దృష్టి మాత్రం అంతర్జాతీయ గుర్తింపుపైనే ఉంది.

రోల్స్ రాయిస్ సందేహం
తన ప్రతిభకు తగిన గుర్తింపు కోసం ఇంటర్న్‌షిప్ కోరుతూ రోల్స్ రాయిస్‌ను సంప్రదించింది రితుపర్ణ. అయితే అక్కడి నుంచి ఆమెకు విచిత్రమైన సమాధానం వచ్చింది. 'మీరు మా సంస్థలో భాగం కావడానికి అర్హత ఉన్నాయా?' అని మొదలుపెట్టి, 'ఒక నెలలో మేం చెప్పే పనుల్లో ఒక్కటి కూడా మీరు పూర్తి చేయలేరని' అని వాళ్లు సమాధానం ఇచ్చారు. దీంతో కంపెనీ తన అర్హతను ప్రశ్నిస్తోందని ఆమె అర్థం చేసుకుంది. అయినా నిరుత్సాహపడకుండా ధైర్యంగా తనను తాను నిరూపించుకోవడానికి అవకాశం కోరింది. కంపెనీ అంగీకరించి ఒక నెల గడువుతో కూడిన పనిని అప్పగించింది. దీక్ష, పట్టుదల, సంకల్పంతో నెల రోజుల గడువున్న ఆ పనిని ఆమె వారంలోనే పూర్తి చేసింది. ఆమె వేగం, కచ్చితత్వం, పట్టుదలకు రోల్స్ రాయిస్ యాజమాన్యం ఆశ్చర్యపోయింది. ఆమెపై నమ్మకంతో మరిన్ని పనులు అప్పగించారు. అలా ఎనిమిది నెలల పాటు ఒక పక్క కళాశాలకు వెళ్తూనే మరో వైపు వారిచ్చిన పనులన్నీ సకాలంలో పూర్తిచేసింది. గతేడాది డిసెంబర్‌లో రోల్స్ రాయిస్ ఆమెకు వారి జెట్ ఇంజిన్ తయారీ విభాగంలో ప్రీ–ప్లేస్‌మెంట్ అవకాశాన్ని అందించింది. దీంతో అర్ధరాత్రి నుంచి ఉదయం 6 గంటల మధ్య ఆ కంపెనీలో పనిచేస్తూ, ఉదయం కాలేజీకి వెళ్లి వచ్చేది రితుపర్ణ. ఆమె పని తీరు గమనించి తన ప్రారంభ ప్యాకేజీని సంవత్సరానికి రూ.39.6 లక్షల నుండి రూ.72.3 లక్షలకు పెంచింది కంపెనీ. ఏడో సెమిస్టర్ పూర్తి చేసిన తర్వాత, రితుపర్ణ అధికారికంగా అమెరికాలోని టెక్సాస్ యూనిట్‌లో చేరనుంది.

'ఈ విజయం మీకెలా ఉంది' అని రితుపర్ణని అడిగితే, 'ప్రముఖ సంస్థలు కేవలం పట్టణం, నగరంలో చదివే విద్యార్థులకు మాత్రమే అవకాశాలు ఇస్తాయని చాలా మంది అనుకుంటారు. అది అబద్ధమని నిరూపించడం ఆనందంగా ఉందని' పేర్కొంది. ప్రభుత్వ సీటు పొందిన స్థాయి నుండి రోల్స్ రాయిస్‌లో ఉద్యోగిగా ఎదగడం వరకూ ప్రోత్సహించిన తన అమ్మానాన్నలు, కుటుంబసభ్యులు, అధ్యాపకులు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపింది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 16న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,310
బంగారం (22 క్యారెట్లు)	91,755
వెండి	1,14,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,550
బంగారం (22 క్యారెట్లు)	91,000
వెండి	1,14,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,280
బంగారం (22 క్యారెట్లు)	91,000
వెండి	1,24,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,550
బంగారం (22 క్యారెట్లు)	93,730
వెండి	1,14,300
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,800
బంగారం (22 క్యారెట్లు)	89,980
వెండి	1,12,800
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,270
బంగారం (22 క్యారెట్లు)	91,000
వెండి	1,24,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● మన(సు)లో మాట

విమాన ప్రయాణమంటే భయం..!

నేను ఒక మల్టీ నేషనల్ కంపెనీలో సేల్స్ హెడ్‌గా పని చేస్తున్నాను. నా జాబ్‌లో భాగంగా నేను తరచుగా వేరే రాష్ట్రాలకు వెళ్ళాల్సి ఉంటుంది. తొందరగా వెళ్ళి రావడం కోసం ఎక్కువగా విమానంలో ప్రయాణం చేస్తాను. విమాన ప్రయాణం అంటే ఇంతకు ముందు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే పోయిన నెలలో అహమ్మదాబాద్‌లో విమానం కూలిపోయి చాలామంది చనిపోయారు కదా, ఆ సంఘటనకి సంబంధించిన వీడియోలు పదేపదే నేను టీవీలో, ఫోన్‌లో చూశాను. అప్పటి నుండి విమాన ప్రయాణం అంటే నాకు విపరీతంగా భయం వేస్తోంది. అసలు విమానం అనే పదం విన్నా, విపరీతమైన ఆందోళన, భయం వేస్తుంది. ఇప్పుడు ప్రస్తుతం ఇండియాలో ఏ రాష్ట్రంలో మీటింగ్ ఉన్నా ట్రైన్ లేదా బస్సులోనే వెళ్తున్నాను. ఒక్కొక్కసారి కారు డ్రైవర్‌ను తీసుకొని వెళ్తున్నాను. నా గురించి బాగా తెలిసిన వాళ్ళందరూ నేను ఇలా భయపడటం చూసి ఆశ్చర్యపోతున్నారు. ఒక స్నేహితుడి సలహాతో హైదరాబాద్‌లో ఒకాయన హిప్నో థెరపీ చేస్తా అంటే వెళ్ళి కలిసాను. రెండు మూడు సెషన్స్‌కి వెళ్ళాను కానీ నాకు పెద్దగా ఉపయోగమనిపించలేదు. నాకు సైకియాట్రీ మందులు అంటే ఉన్న భయం వల్ల డాక్టర్‌ని కలవకూడదు అని ముందు అనుకున్నా, ఇంక నావల్ల కాక, ధైర్యం చేసి మీకు ఈ ఉత్తరం రాస్తున్నాను. నన్ను ఈ సమస్యనుండి ఎలాగైనా బయటపడవేయండి.

రాజేష్, హైదరాబాద్

–ముందుగా మీరు ధైర్యంగా మీ సమస్యను మాతో పంచుకున్నందుకు అభినందనలు. మనలో ఎవరైనా పెద్ద ప్రమాదాన్ని లేదా భూకంపాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలకి ప్రత్యక్షంగా గురైనపుడు లేదా అలాంటి తీవ్ర సంఘటనల గురించి పదే పదే వార్తల్లో, టీవీలో, ఫోన్లో చూసినప్పుడు మన మెదడు ఒక రకమైన షాక్‌కి లోనవుతుంది. దీనిని సైకాలజీ పరిభాషలో 'అక్యూట్ స్ట్రెస్ రియాక్షన్' అంటారు.

ఇలాంటి పరిస్థితిలో మనసుకి విపరీతమైన ఆందోళన, భయం, పీడకలలు రావడం, నిద్ర పట్టకపోవడం, ప్రమాదం జరిగిన ప్రదేశం లేదా ఆ రకమైన వాహనాన్ని చూసినప్పుడు తీవ్ర భయం కలగడం చూస్తుంటాం. ఇది మొదలుకొని కొన్నిసార్లు దీర్ఘకాలిక 'పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్' కి దారి తీయవచ్చు. మీరు ఇటీవల జరిగిన విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలను పదే పదే చూసిన కారణంగా మీ మెదడు 'విమాన ప్రయాణం అంటే ప్రమాదం' అనే సంకేతాన్ని ముద్రించుకుంది. దీన్ని 'క్లాసికల్ కండిషనింగ్' అంటారు. ఈ పరిస్థితి వల్ల మీరు 'ఏరో ఫోబియా' అంటే విమాన ప్రయాణ భయం అనే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఇది తీవ్రమైన సమస్యగా అనిపించినా, మంచి చికిత్స ద్వారా పూర్తిగా తగ్గించే వీలుంది. చికిత్సలో భాగంగా గ్రాడ్యుయేటెడ్ ఎక్స్‌పోజర్ థెరపీ, 'కాగ్నిటివ్ రీ స్ట్రక్చరింగ్' వంటి చికిత్సలు తీసుకోవాల్సి ఉంటుంది. 'వర్చువల్ రియాలిటీ' వంటి ఆధునిక వైద్య విధానాలు కూడా ఇపుడు అందుబాటులోకి వచ్చాయి. మిమ్మల్ని వివరంగా పరీక్షించిన తర్వాత మీ సమస్య తీవ్రతని బట్టి అవసరమైతే కొన్ని మందులు తాత్కాలికంగా వాడాల్సి రావచ్చు.

అయితే ఈ చికిత్సలు అన్నీ కూడా నిపుణులైన సైకియాట్రిస్ట్, లైసెన్స్ పొందిన క్లినికల్ సైకాలజిస్ట్ పర్యవేక్షణలో మాత్రమే తీసుకోవల్సి ఉంటుంది. ఓపికగా, నమ్మకంగా చికిత్స కొనసాగిస్తే మీరు మళ్ళీ మునుపటిలా విమాన ప్రయాణాలు చేయగలరు.

ఆల్ ది బెస్ట్ !



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

కాస్త సరదా కోసం' అన్నట్లుగా కనిపించే ఇమోజీలు ఇప్పుడు సామాజిక విషయాలపై కూడా దృష్టి పెడుతున్నాయి. స్త్రీ సాధికారత, శక్తికి పెద్ద పీట వేస్తున్నాయి...

నేడు వరల్డ్ ఇమోజీ డే

సరదా మాత్రమే కాదు... స్త్రీ సాధికారత కూడా



'వంద మాటలేల... ఒక ఇమోజీ చాలదా!' అనుకోవడం వల్ల ఇమోజీలకు డిమాండ్ అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. వరల్డ్ ఆన్‌లైన్ పాపులేషన్‌లో 90 శాతం మంది ఇమోజీలను ఉపయోగిస్తున్నారు. సరదా సమయాలలో, భావోద్వేగ ప్రతీకలుగా ఉపయోగించే ఇమోజీలను స్త్రీ సాధికారత, శక్తిని ప్రతిబింబించే ప్రతీకలుగా తీర్చిదిద్దే ధోరణి పెరిగింది.

'వైవిధ్యమైన కెరీర్‌లో మహిళలు' అనే అంశాన్ని ప్రతిబింబించేలా ఇమోజీలు వచ్చాయి.

స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, బోట్ రైడింగ్... ఇలా వివిధ ఆటల్లో మహిళల శక్తిసామర్థ్యాలను ప్రతిఫలించే ఇమోజీలు వచ్చాయి. 'స్టెమ్' కెరీర్‌లలో రాణించడానికి అమ్మాయిలకు కావాల్సింది ఏమిటి? అని చెప్పే ఇమోజీలు, సాంకేతికరంగంలో మహిళలు సత్తా చాటుతున్నారు అని చెప్పే ఇమోజీలు వచ్చాయి.

మహిళల సమస్యలను ప్రతిబింబించే ఇమోజీలు...
కరోనా కల్లోల సమయంలో స్త్రీలపై ఒత్తిడి, గృహహింస బాగా పెరిగింది. సంస్థలు, ఇతరుల నుంచి సహాయం తీసుకోవడం కూడా కష్టంగా ఉన్న సమయం అది. ఆ కల్లోల పరిస్థితికి అద్దం పట్టేలా 'వయొలెన్స్ ఆన్ ఉమెన్ అండ్ గర్ల్స్' ఇమోజీ వచ్చింది. కోవిడ్ సమయంలో హెల్త్, సోషల్ కేర్ వర్కర్‌లుగా మహిళలు ముందు వరుసలో ఉండి పనిచేశారు. ప్రాణాలను లెక్క చేయకుండా వృత్తి నిబద్ధత చాటుకున్నారు. వారి వృత్తి నిబద్ధత మాట ఎలా ఉన్నా వేతనాలు, నాయకత్వ స్థానాలకు సంబంధించి మహిళలపై వివక్ష కనిపించింది. ఈ సమస్యను గురించి చెప్పే ఇమోజీ... జెండర్ పే గ్యాప్.



కోవిడ్ కాలంలో విద్యాసంస్థలు మూతపడడం వల్ల చాలామంది ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వైపు వెళ్లారు. అయితే సరైన సదుపాయాలు లేకపోవడం, పేదరికం వల్ల అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో వెనకబడిపోయారు. దీని గురించి చెప్పే ఇమోజీ... డిజిటల్ జెండర్ డివైడ్. కోవిడ్ కల్లోలం మహిళల ఆదాయం, జీవనోపాధిని బాగా దెబ్బతీసింది. ఎకనామిక్ యాక్టివిటీ లేకుండా పోయింది. దీని గురించి చెప్పే ఇమోజీ... ఇన్‌ఫార్మల్ వర్క్ అండ్ ఇన్‌స్టెబిలిటీ.

పీరియడ్స్‌కు సంబంధించి మహిళలు ఎదుర్కొనే సమస్యలపై 'పీరియడ్ పావర్టీ అండ్ స్టిగ్మా' ఇమోజీ వచ్చింది. కోవిడ్ సమయంలో పురుషులతో పోల్చితే ఫిమేల్ హెల్త్‌కేర్ వర్కర్‌లు ఇన్‌ఫెక్షన్, అనారోగ్యం బారిన పడ్డప్పటికీ ప్రాణభయంతో వెనకడుగు వేయలేదు. అయినప్పటికీ విధాన నిర్ణయాలలో వారికి తగిన ప్రాతినిధ్యం లభించలేదు. ఈ విషయాన్ని చెప్పే ఇమోజీ... అండర్ రిప్రెజెంటేషన్ యాజ్ లీడర్స్ ఇన్ హెల్త్.

బ్రెస్ట్ ఫీడింగ్ ఇమోజీ
టెక్నికల్ ఆర్గనైజేషన్ యూనికోడ్ కన్సార్టియం తొలిసారిగా బ్రెస్ట్ ఫీడింగ్ ఇమోజీని తీసుకువచ్చింది. ఇది ఇమోజీ లైబ్రరీలో భాగం అయింది.

ట్విట్టర్(ఎక్స్)లాంటి సామాజిక మాధ్యమాలు అంతర్జాతీయ మహిళా దినోత్సవంలాంటి సందర్భాలలో ప్రత్యేక ఇమోజీలు తీసుకువచ్చాయి.

కొన్ని సంవత్సరాల క్రితం...
'పెళ్లికూతురు ఇమోజీలు తప్ప వివిధ వృత్తులకు సంబంధించిన మహిళల ఇమోజీలు కనిపించవు. ఇమోజీ ప్రపంచంలో లింగ వివక్ష కనిపిస్తుంది' అనే విమర్శలు ఉండేవి. ఇలాంటి విమర్శల నేపథ్యంలో పురుషులతో సమానంగా మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి, స్త్రీ సాధికారతకు అద్దం పట్టే ఇమోజీలకు పట్టం కట్టే ప్రయత్నం జరుగుతోంది. మార్పు మంచిదే కదా!

● బ్యూటిప్స్



చల్లటి నీరు మంచి ఆస్ట్రింజెంట్‌గా పనిచేస్తుంది. చర్మానికి తాజాదనాన్నిస్తుంది. ఫ్రిజ్‌లో చల్లబరిచిన నీటితో ముఖం కడిగితే చర్మం టోనప్ అవుతుంది.



కమలాపండు రసంతో ముఖానికి మర్దనచేస్తే చర్మం కాంతులీనుతుంది.

● ఇంటిప్స్

ఎండుకొబ్బరి ఎక్కువకాలం తాజాగా...

మరింత రుచికోసం కూరలు, స్వీట్లలో ఎండుకొబ్బరిని వినియోగిస్తుంటాం. దీనికోసం కొబ్బరిని ఇంట్లో నిల్వచేసుకుంటూ ఉంటాం. కానీ కొద్దిరోజులకే కొబ్బరిచిప్ప లోపల బూజులాగా రావడం, కొన్నిసార్లు లోపల తెల్లగా ఉన్నప్పటికీ చేదుగా మారడం జరుగుతుంటుంది. ఇలా కాకుండా ఉండాలంటే ...

- మార్కెట్ నుంచి తెచ్చిన ఎండు కొబ్బరి చిప్పలను శుభ్రంగా గుడ్డతో తుడిచి, గంటసేపు ఎండలో ఆరబెట్టాలి. ఆరిన చిప్పలను ఉప్పునీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఇప్పుడు కొద్దిగా కొబ్బరి నూనెను వేళ్లతో తీసుకుని చిప్పకు రాసి నిమిషం పాటు రుద్దాలి. ఈ చిప్పలను రెండురోజుల పాటు ఎండలో ఉంచి ఆ తర్వాత కవర్‌లో మూటకట్టాలి. ఈ మూటను గాలిచొరబడని డబ్బాలో నిల్వచేసుకోవాలి.



- టేబుల్ స్పూను పటికపొడిని కప్పు నీటిలో కలపాలి. పటిక కరిగిన తరువాత ఈ నీటిలో చిన్న గుడ్డను ముంచి కొబ్బరి చిప్పల లోపలా బయటా తుడవాలి. అలా తుడిచిన చిప్పలను ఎండలో ఆరబెట్టి, కవర్‌లో వేసి ఉంచాలి. ఈ మూటను గాలిచొరబడని డబ్బాలో నిల్వచేస్తే ఎక్కువ రోజులు చిప్పలు తాజాగా ఉంటాయి.



హంపి, హారిక, వైశాలి గేమ్‌లు ‘డ్రా’

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ నాకౌట్ చెస్ టోర్నీ ప్రీక్వార్టర్ ఫైనల్లో భారత క్రీడాకారిణులు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ రాణించారు. బుధవారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌లలో హంపి, హారిక, వైశాలి తమ ప్రత్యర్థులను నిలువరించగా... దివ్య విజయం సాధించింది. ప్రపంచ మాజీ విజేత అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో జరిగిన గేమ్‌ను నల్ల పావులతో ఆడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి 33 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకుంది. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన గేమ్‌ను నల్ల పావులతో ఆడిన హైదరాబాద్ ప్లేయర్ హారిక 50 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించింది. మెరూర్ట్ కమలిదెనోవా (కజకిస్తాన్)తో జరిగిన గేమ్‌ను తెల్ల పావులతో ఆడిన తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ వైశాలి 29 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించింది. చైనాకు చెందిన జు జినెర్‌తో జరిగిన గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన ప్రపంచ జూనియర్ చాంపియన్, మహారాష్ట్ర అమ్మాయి దివ్య 49 ఎత్తుల్లో గెలిచింది. జినెర్‌తో నేడు జరిగే గేమ్‌ను దివ్య ‘డ్రా’ చేసుకుంటే క్వార్టర్ ఫైనల్ చేరుకుంటుంది. హంపి, హారిక, వైశాలి పోటీపడే గేమ్‌లలో గెలిచిన వారు ముందంజ వేస్తారు. ‘డ్రా’ అయితే శుక్రవారం టైబ్రేక్ గేమ్‌లతో విజేతలను నిర్ణయిస్తారు.



సింధుకు మళ్లీ నిరాశే

- తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్
- జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



టోక్యో: ఈ ఏడాది భారత బ్యాడ్మింటన్ స్టార్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీ నుంచి ప్రపంచ 16వ ర్యాంకర్ సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ప్రపంచ 14వ ర్యాంకర్ సిమ్ యు జిన్ (దక్షిణ కొరియా)తో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 30 ఏళ్ల సింధు 15–21, 14–21తో ఓడిపోయింది. గతంలో సిమ్ యు జిన్‌తో ఆడిన మూడుసార్లూ గెలిచిన సింధు నాలుగో ప్రయత్నంలో తొలిసారి ఓటమి చవిచూసింది. 38 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌లో ఒకదశలో 3–9తో వెనుకబడింది. ఆ తర్వాత తేరుకొని ఆధిక్యాన్ని 12–13కు తగ్గించింది. అయితే కీలకదశలో కొరియా ప్లేయర్ పైచేయి సాధించి సింధుకు అవకాశం ఇవ్వలేదు. ఇక రెండో గేమ్‌లో మూడుసార్లు ఇద్దరి స్కోరు సమమయ్యాయి. స్కోరు 11–11వద్ద ఉన్నపుడు సిమ్ యు జిన్ వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 15–11తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని నిలబెట్టుకొని సింధుపై ఆమె తొలిసారి విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది సింధు ఇండోనేసియా మాస్టర్స్, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్, స్విస్ ఓపెన్, మలేసియా మాస్టర్స్ టోర్నీల్లోనూ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. తదుపరి సింధు వచ్చే మంగళవారం మొదలయ్యే చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. మరోవైపు భారత్‌కే చెందిన ఉన్నతి హుడా 8–21, 12–21తో చోచువోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోగా... అనుపమ 21–15, 18–21, 21–18తో సహచరిణి రక్షిత శ్రీపై గెలిచి ప్రీక్వార్టర్ ఫైనల్ చేరింది.

సాత్విక్–చిరాగ్ జోడీ శుభారంభం

పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–18, 21–10తో కాంగ్ మిన్ హైయుక్–కి డాంగ్ జు (దక్షిణ కొరియా) జోడీని ఓడించింది. రూబన్ కుమార్–హరిహరన్ (భారత్) ద్వయం 15–21, 9–21తో కిమ్ వన్ హో–సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ (భారత్) 21–11, 21–18తో వాంగ్ జెంగ్ జింగ్ (చైనా)పై గెలిచి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

భారత మహిళలదే తొలి వన్డే

4 వికెట్లతో ఇంగ్లండ్‌పై ఘన విజయం ● రాణించిన దీప్తి శర్మ, జెమీమా



సౌతాంప్టన్: ఇంగ్లండ్ మహిళలతో టి20 సిరీస్‌ను గెలుచుకున్న భారత మహిళల జట్టు వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. ‘బర్త్‌డే గర్ల్’ సోఫియా డంక్లీ (92 బంతుల్లో 83; 9 ఫోర్లు), అలైస్ డేవిడ్సన్ (73 బంతుల్లో 53; 2 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 48.2 ఓవర్లలో 6 వికెట్లకు 262 పరుగులు చేసి గెలిచింది. దీప్తి శర్మ (64 బంతుల్లో 62 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (54 బంతుల్లో 48; 5 ఫోర్లు) రాణించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 86 బంతుల్లో 90 పరుగులు జోడించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలవగా, రెండో వన్డే శనివారం లార్డ్స్ మైదానంలో జరుగుతుంది.

శతక భాగస్వామ్యం...

భారత పేసర్, మధ్యప్రదేశ్‌కు చెందిన క్రాంతి గౌడ్ ఆరంభంలోనే ఇంగ్లండ్‌ను కట్టడి చేసింది. తన తొలి ఓవర్లోనే ఎమీ జోన్స్ (1)ను బౌల్డ్ చేసిన ఆమె, తన తర్వాతి ఓవర్లో బీమాంట్ (5)ను ఎల్బీగా పంపడంతో ఇంగ్లండ్ స్కోరు 20/2 వద్ద నిలిచింది. ఈ దశలో నాట్ సివర్ బ్రంట్ (52 బంతుల్లో 41; 5 ఫోర్లు), ఎమా ల్యాంబ్ (50 బంతుల్లో 39; 4 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 87 బంతుల్లో 71 జత చేశారు. అయితే ఆఫ్‌స్పిన్నర్ స్నేహ్ రాణా ఇంగ్లండ్‌ను దెబ్బ కొట్టింది. తన వరుస ఓవర్లలో ఆమె ల్యాంబ్, నాట్ సివర్‌లను పెవిలియన్‌కు పంపించడంతో భారత్ పైచేయి సాధించింది. అయితే డంక్లీ, అలైస్ చక్కటి బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న వీరు ఐదో వికెట్‌కు 23.4 ఓవర్లలో 106 పరుగులు జోడించారు. ఎట్టకేలకు అలైస్‌ను అవుట్ చేసి ఆంధ్ర బౌలర్ శ్రీచరణి ఈ జోడీని విడగొట్టింది. చివర్లో సోఫీ ఎకెల్‌స్టోన్ (19 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు) వేగంగా ఆడటంతో స్కోరు 250 దాటింది. ఆఖరి 5 ఓవర్లలో ఇంగ్లండ్ 49 పరుగులు సాధించింది. భారత ఫీల్డర్లు మూడు క్యాచ్‌లు వదిలేయడం కూడా ప్రత్యర్థికి కలిసొచ్చింది.

కెప్టెన్ విఫలం...

ఛేదనను భారత ఓపెనర్లు ధాటిగా మొదలుపెట్టారు. తొలి వికెట్‌కు ప్రతీక రావల్ (51 బంతుల్లో 36; 3 ఫోర్లు)తో కలిసి 8 ఓవర్లలోనే 48 పరుగులు జోడించిన అనంతరం స్మృతి మంధాన (24 బంతుల్లో 28; 5 ఫోర్లు) వెనుదిరిగింది. ఆ తర్వాత 8 పరుగుల వ్యవధిలో ప్రతీక, హర్లీన్ డియోల్ (27; 4 ఫోర్లు) పెవిలియన్ చేరారు. నిర్లక్ష్యంగా పరుగెత్తిన హర్లీన్ అనూహ్యంగా రనౌటైంది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17) విఫలమైంది.





స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బీమాంట్ (ఎల్బీ) (బి) క్రాంతి 5; ఎమీ జోన్స్ (బి) క్రాంతి 1; ఎమా ల్యాంబ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రాణా 39; నాట్ సివర్ (సి) జెమీమా (బి) రాణా 41; డంక్లీ (బి) అమన్‌జోత్ 83; అలైస్ డేవిడ్సన్ (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) శ్రీచరణి 53; ఎకెల్‌స్టోన్ (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 258. వికెట్ల పతనం**: 1–8, 2–20, 3–91, 4–97, 5–203, 6–258. **బౌలింగ్:** అమన్‌జోత్ 10–0–58–1, క్రాంతి గౌడ్ 9–0–55–2, దీప్తి శర్మ 10–0–58–0, శ్రీచరణి 10–0–46–1, స్నేహ్ రాణా 10–0–31–2, ప్రతీక 1–0–7–0.

ఎనిమిదోసారి ‘టాప్ ర్యాంక్’లో రూట్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 34 ఏళ్ల రూట్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 888 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ స్థానంలో నిలిచాడు. భారత జట్టుతో లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో రూట్ తొలి ఇన్నింగ్స్‌లో 104 పరుగులు... రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో రూట్ తన కెరీర్‌లో ఎనిమిదోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. అంతేకాకుండా కుమార సంగక్కర (శ్రీలంక; 37 ఏళ్లు... 2014 డిసెంబర్‌లో) తర్వాత వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ సాధించిన అతిపెద్ద వయస్కుడిగా రూట్ గుర్తింపు పొందాడు. ‘టాప్’ ర్యాంక్‌లో ఉన్న హ్యారీ బ్రూక్ రెండు స్థానాలు పడిపోయి మూడో ర్యాంక్‌కు చేరుకోగా... న్యూజిలాండ్ స్టార్ విలియమ్సన్ రెండో స్థానంలో నిలిచాడు. భారత జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మూడు స్థానాలు కోల్పోయి తొమ్మిదో ర్యాంక్‌లో ఉండగా... యశస్వి జైస్వాల్ నాలుగు నుంచి ఐదో స్థానానికి... రిషభ్ పంత్ ఏడు నుంచి ఎనిమిదో స్థానానికి పడిపోయారు. టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బుమ్రా నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

దీపికకు ‘మ్యాజిక్ స్కిల్’ అవార్డు



న్యూఢిల్లీ: భారత జట్టు ఫార్వర్డ్ దీపిక ‘పాలీగ్రాస్ మ్యాజిక్ స్కిల్’ అంతర్జాతీయ హాకీ అవార్డును సొంతం చేసుకుంది. మైదానంలో అసాధారణ నైపుణ్యంతో ప్రత్యర్థి డిఫెండర్లను, గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి చేసే గోల్‌కు గుర్తింపుగా ఈ అవార్డును యేటా అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) ఇస్తుంది. 2024–25 ప్రొ లీగ్ సీజన్ సందర్భంగా ప్రపంచ నంబర్‌వన్ నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంతో నేర్పుగా దీపిక చేసిన ఫీల్డ్ గోల్‌ను ఎఫ్‌ఐహెచ్ జ్యూరీ, అభిమానులు ఓటింగ్‌లో ‘బెస్ట్ గోల్’గా ఎంపిక చేశారు. ‘ఈ అవార్డు దక్కడం గౌరవంగా భావిస్తున్నా. నెదర్లాండ్స్ లాంటి జట్టుపై ఆ గోల్ చేయడం ప్రత్యేక క్షణం. దానికి ఈ విధంగా గుర్తింపు దక్కడం చాలా ఆనందంగా ఉంది. ఎప్పటికప్పుడు స్ఫూర్తి నింపుతున్న సహచరులు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ధన్యవాదాలు. ఈ పురస్కారం నా ఒక్కదానిది కాదు. ఇది మొత్తం భారత జట్టుది’ అని దీపిక వెల్లడించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అందమైన గూడే చెదిరే..!


● సత్యదేవ్, విజయ్ దేవరకొండ

‘‘చిన్నతనమే ఏమైపోయే ... నన్ను వదిలే నీదే చేయే... అంతా కలలాగే కరిగే... కథ కదలక ఆగే... అందమైన గూడే చెదిరే...’’ అంటూ సాగుతుంది ‘కింగ్‌డమ్’ సినిమాలోని ‘అన్న అంటేనే...’ పాట. విజయ్ దేవరకొండ, భాగ్య శ్రీ బోర్సే హీరో, హీరోయిన్లుగా, సత్యదేవ్ కీలక పాత్రలో నటించిన చిత్రం ఇది. ఈ చిత్రంలో అన్నదమ్ములుగా నటించారు సత్యదేవ్, విజయ్ దేవరకొండ. ఈ సినిమాలోని ‘అన్నంటే...’ అనే ఎమోషనల్ సాంగ్ లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. కృష్ణకాంత్ లిరిక్స్ అందించిన ఈ పాటను ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ పాడారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది.

నువ్వు నదివే...

‘‘వెలుగా ఇలా... నిశి పూసినా... వెలివేసినా... మది వీడునా... గుండె కనుమూసిన... విధి రాసిన..., నదివే... నువ్వు నదివే’’ అంటూ సాగుతుంది ‘ది గర్ల్ ఫ్రెండ్’ సినిమాలోని ‘నదివే...’ పాట. రష్మికా మందన్నా లీడ్ రోల్‌లో, దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటించిన చిత్రం ‘ది గర్ల్‌ఫ్రెండ్’. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని ‘నదివే..’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. రాకేందు మౌళి సాహిత్యం అందించిన ఈ పాటను ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్ పాడారు. త్వరలో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.


● రష్మిక, దీక్షిత్

రవితేజకు పితృవియోగం


● తండ్రి రాజగోపాల్‌తో రవితేజ

హీరో రవితేజ తండ్రి రాజగోపాల్ రాజు (90) కన్నుమూశారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యల వల్ల మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని రవితేజ నివాసంలో రాజగోపాల్ రాజు తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన రాజగోపాల్ ఫార్మసిస్ట్‌గా చేశారు. ఉద్యోగరీత్యా ఎక్కువగా ఉత్తర భారతదేశంలో నివాసం ఉన్నారాయన. ఈ కారణంగానే రవితేజ విద్య జైపూర్, ఢిల్లీ, ముంబై, భోపాల్ వంటి పలు ప్రాంతాల్లో సాగింది. రాజగోపాల్ రాజుకి ముగ్గురు కుమారులు సంతానం. వారిలో పెద్ద కుమారుడు రవితేజ హీరోగా బిజీగా ఉన్నారు. రెండో కుమారుడు భరత్ 2017లో జరిగిన ఓ కారు ప్రమాదంలో మృతి చెందారు. మూడో కుమారుడు రఘు నటుడిగా కొనసాగుతున్నారు. రాజగోపాల్ రాజు మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. బుధవారం రాజగోపాల్ రాజు అంత్యక్రియలు జరిగాయి.

కౌంట్ డౌన్ స్టార్ట్


● హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ

‘‘వెండితెరపై యుద్ధానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. 30 రోజుల్లో బాక్సాఫీస్ విధ్వంసానికి ‘వార్ 2’’ సిద్ధం అంటూ చిత్రయూనిట్ పేర్కొంది. హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా హీరో ఎన్టీఆర్ హిందీ చిత్ర పరిశ్రమకి పరిచయమవుతున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో పాన్ ఇండియా ఫిల్మ్‌గా విడుదల కానుంది. ‘వార్ 2’ ముప్పై రోజుల్లో రానుందని తెలిసేలా తాజాగా ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ పాత్రల్ని చూపించేలా డిజైన్ చేశారు. ‘‘యాక్షన్ ఓరియంటెడ్ స్పై డ్రామాగా రూపొందిన చిత్రం ‘వార్ 2’’ అని చిత్రబృందం పేర్కొంది.

జూనియర్ చిన్న సినిమా అనుకున్నా...

కానీ పెద్ద సినిమా చేశారు

- దర్శకుడు రాజమౌళి


● సాయి కొర్రపాటి, సెంథిల్, కిరీటి, రాజమౌళి, రాధాకృష్ణ, శ్రీలీల, దేవిశ్రీ ప్రసాద్, జెనీలియా

‘‘సాయిగారు ‘జూనియర్’ మొదలుపెట్టినప్పుడు... మంచి కథతో చిన్న చిత్రం ప్రారంభిస్తున్నారనుకున్నాను. అయితే శ్రీలీల, జెనీలియా, రవిచంద్రన్‌గారు... ఇలా నటీనటుల లిస్ట్ పెరుగుతూనే ఉంది. దేవిశ్రీ సంగీతం, సెంథిల్ సినిమాటోగ్రఫీ, ఫైట్‌మాస్టర్ పీటర్ హెయిన్స్... ఇలా ఒక్కొక్కరు యాడ్ అవుతూ ఉంటే ఓ పెద్ద సినిమాకి ఎలాంటి నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంచుకుంటామో అలా ‘జూనియర్’కి కూడా పెట్టుకుంటూ వెళ్లారు. అలా చిన్న సినిమా అయినా పెద్ద సినిమా చేశారు’’ అని ప్రముఖ దర్శకుడు రాజమౌళి అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయమవుతున్న చిత్రం ‘జూనియర్’. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల కథానాయిక. డా. రవిచంద్రన్, జెనీలియా ఇతర పాత్రలు పోషించారు. వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎస్ రాజమౌళి బిగ్ టికెట్ లాంచ్ చేసిన అనంతరం మాట్లాడుతూ– ‘‘పెద్ద సినిమా అంటే బడ్జెట్ గురించి కాదు... ‘జూనియర్’ సినిమా వెయ్యికి పైగా స్క్రీన్స్‌లలో రిలీజ్ అవుతోందంటే అందుకు ప్రేక్షకుల్లో ఉండే ఆసక్తే కారణం. ఈ చిత్రాన్ని తొలి రోజే, లేకుంటే తొలి వారమే మేము చూడాలని ఆడియన్స్‌కి ఆసక్తి ఉన్నప్పుడే అది ఎగ్జిబిటర్స్ వద్ద నుంచి డిస్ట్రిబ్యూటర్స్ వద్దకు వచ్చి ఆ తర్వాత నిర్మాత వద్దకు వచ్చి వెయ్యి స్క్రీన్‌లలో విడుదలవుతోంది. చిన్న సినిమాగా స్టార్ట్ అయిన ఈ సినిమాని ఈ స్థాయికి తీసుకొచ్చిన సాయిగారికి అభినందనలు. నేను కూడా ఈ చిత్రం చూసేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. తన పాటలతో సినిమాని ఎలివేట్ చేయడం దేవిశ్రీకి బాగా తెలుసు. ‘వైరల్ వయ్యారి...’ పాట ఎంత వైరల్ అయ్యింది, ఎంత క్రేజ్ తీసుకొచ్చిందనే విషయం గురించి నేను చెప్పక్కర్లేదు. సెంథిల్ తను అనుకున్న ఔట్‌పుట్ వచ్చేవరకు ఎక్కడ కూడా రాజీపడడు. పీటర్ హెయిన్స్ క్రేజీ మ్యాన్... విపరీతంగా కష్టపడతాడు. కిరీటి చాలా బాగా చేశాడని సెంథిల్, పీటర్ వంటి వారు ప్రశంసించారంటే ఇక ఇండస్ట్రీలో నీకు(కిరీటి) ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదు. ఎంతో అంకితభావంతో రాధాకృష్ణ ఈ సినిమాని ఈ స్థాయికి తీసుకొచ్చారు. ఈ చిత్రాన్ని అందరూ తప్పకుండా థియేటర్లలో చూడండి. మీ టికెట్ డబ్బులకు కచ్చితంగా పైసా వసూల్ సినిమాలా ఉంటుంది’’ అని చెప్పారు.

డూప్ లేని యాక్షన్


● మహేశ్‌బాబు

హీరో మహేశ్‌బాబు–దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను కెన్యాలో ప్లాన్ చేశారట రాజమౌళి. కానీ కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ సౌతాఫ్రికాలో జరగనుందని సమాచారం. అక్కడ కీలకమైన టాకీ పార్ట్, ఓ సాంగ్, ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట. ఈ షెడ్యూల్‌కు సంబంధించిన షూటింగ్ రిహార్సల్స్‌తో ప్రస్తుతం యూనిట్ బిజీగా ఉందని తెలిసింది. అంతేకాదు... ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను మహేశ్‌బాబు ఎటువంటి డూప్ లేకుండా చేస్తున్నారని, దీంతో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ సమయంలో యూనిట్ తగిన జాగ్రత్తలు పాటిస్తోందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మరో కీలక పాత్రలో మాధవన్ నటిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది.

ఈ సినిమాలో ఉన్నది మనకు తెలిసిన పాత్రలే

- హీరో రానా


● ప్రవీణ, రానా

‘‘కొత్తపల్లిలో ఒకప్పుడు’ చిత్రాన్ని తొలిసారి చూసినప్పుడు ఇందులోని పాత్రలు చాలా సజీవంగా కనిపించాయి. అన్నీ మనకు తెలిసిన పాత్రలే, మన చుట్టూ ఉన్న పాత్రలే అనిపించాయి. ఇంత మంచి సినిమా ఇచ్చిన ప్రవీణకు థ్యాంక్స్’’ అని హీరో రానా అన్నారు. మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కొత్తపల్లిలో ఒకప్పుడు’. రానా సమర్పణలో పరుచూరి ప్రవీణ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రానా మాట్లాడుతూ– ‘‘ప్రవీణ కార్డియాలజిస్ట్‌గా పని చేస్తూనే ఈ సినిమా తీశారు. అలాగే మనోజ్ కూడా ఉద్యోగం చేస్తూనే ఈ సినిమాలో నటించాడు. ఈ సినిమాను అందరూ థియేటర్స్‌లో చూసి, సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను’’ అని అన్నారు.

మా ప్రపంచం మారిపోయింది


● సిద్ధార్థ్, కియారా

‘‘మా మనసు ఆనందంతో నిండిపోయింది. ఇప్పుడు మా ప్రపంచం మారిపోయింది. మాకు పాప పుట్టడం ఓ ఆశీర్వాదం’’ అంటూ తమకు కుమార్తె పుట్టిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు హీరోయిన్ కియారా అద్వానీ, హీరో సిద్ధార్థ్ మల్హోత్రా. ముంబైలోని రిలయన్స్ ఆసుపత్రిలో కియారా పాపకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తని వారిద్దరూ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. ఇక కియారా, సిద్ధార్థ్ ‘షేర్షా’ చిత్రంలో తొలిసారి కలిసి నటించారు. ఆ సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ పుట్టిందట. 2023 ఫిబ్రవరి 7న ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో రాజస్థాన్‌లో వీరి పెళ్లి జరిగింది. వివాహం తర్వాత కూడా వీరిద్దరూ తమ సినిమాలతో బిజీ బిజీగా ఉన్నారు.

ప్రేమలో రెండోసారి...


● రమణ, వనిత

రమణ సాకే, వనితా గౌడ జంటగా నటించిన చిత్రం ‘ప్రేమలో రెండోసారి’. సత్య మార్క దర్శకత్వంలో సాకే రామయ్య సమర్పణలో సాకే నీరజ లక్ష్మి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత సి. కల్యాణ్ విడుదల చేశారు. రమణ సాకే మాట్లాడుతూ– ‘‘నేటి యువతీ యువకులకు మా చిత్రకథ బాగా కనెక్ట్ అవుతుంది’’ అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	64	82,634
నిఫ్టీ ▲	16	25,212

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,694	▲	16
డోజోన్స్	44,146	▲	122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,927	▼	12
డాక్స్	24,009	▼	51
షాంఘై	3,504	▼	1
నికాయ్	39,663	▼	15

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	85.60	86.62
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	114.10	117.06
€	యూరో	ఒక్కటి	98.64	101.38
¥	జపాన్ యెన్ (100)	ఒక్కటి	57.11	58.57
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	55.10	57.32
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	65.55	68.16
SAR	సౌదీ రియాల్	ఒక్కటి	22.04	23.53
UAE D	యూఏఈ దిర్హామ్	ఒక్కటి	22.51	23.75
¥	చైనా యువాన్	ఒక్కటి	11.09	12.91

కొలువుల పండుగ!

- ద్వితీయార్థంలో జోరుగా హైరింగ్
- 2.16 లక్షల తాత్కాలిక ఉద్యోగాల కల్పన
- రిటైల్, ఈ–కామర్స్, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో నియామకాలు
- అడెకో ఇండియా నివేదిక



ముంబై: ఈసారి పండుగ సీజన్‌లో కంపెనీలు పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించుకోనున్నాయి. దీంతో 2025 ద్వితీయార్థంలో 2.16 లక్షల పైచిలుకు గిగ్, తాత్కాలిక ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే కొలువులు 15–20 శాతం పెరగనున్నాయి. రిటైల్, ఈ–కామర్స్, బీఎఫ్‌ఎస్‌ఐ, లాజిస్టిక్స్, ఆతిథ్య, ట్రావెల్, ఎఫ్‌ఎంసీజీ తదితర రంగాల్లో ఈ ఉద్యోగాలు రానున్నాయి. వర్క్‌ఫోర్స్ సొల్యూషన్స్ సంస్థ అడెకో ఇండియా రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వివిధ వేదికల్లో తమ క్లయింట్లు పోస్ట్ చేసే ఖాళీలు, పరిశ్రమ నివేదికలు మొదలైన డేటా ఆధారంగా అడెకో ఇండియా దీన్ని రూపొందించింది. రాఖీ, దసరా, దీపావళిలాంటి పండుగలతో పాటు పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా అమ్మకాలు పెరుగుతాయనే ఉద్దేశంతో నియామకాలు పుంజుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. సాధారణం కంటే ఈసారి పండుగ సీజన్ మెరుగ్గా ఉంటుందనే అంచనాలతో కంపెనీలు హైరింగ్ ప్రక్రియను కాస్తంత ముందుగానే మొదలుపెట్టాయని వివరించింది. వినియోగదారుల సెంటిమెంటు మెరుగుపడటం, సానుకూల వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకోవడం, ఆర్థిక పరిస్థితులపై ఆశావహ అంచనాలు నెలకొనడం, సీజనల్ అమ్మకాల విషయంలో కంపెనీలు దూకుడుగా ప్రచారం చేస్తుండటం వంటి అంశాలు ఈసారి హైరింగ్‌కి దన్నుగా నిలుస్తున్నట్లు నివేదిక వివరించింది. 'ఈ పండుగ సీజన్‌లో డిమాండ్ చాలా వేగంగా పెరుగుతోంది. దానికి తగ్గట్లుగా పరిశ్రమ కూడా సన్నాహాలు చేసుకుంటోంది. గతంలో కంపెనీలు సంఖ్యాపరంగా ఎంత మందిని తీసుకున్నాం అనేదే చూసేవి. కానీ ఇప్పుడు, అభ్యర్థులు ఎంత త్వరగా ఉద్యోగంలో చేరగలరు, ఎంత సన్నద్ధంగా ఉన్నారు, వివిధ ప్రాంతాల్లో పరిస్థితులకు ఎంత వేగంగా సర్దుకోగలరులాంటి అంశాలపై కూడా కంపెనీలు దృష్టి పెడుతున్నాయి' అని అడెకో ఇండియా డైరెక్టర్ దీపేశ్ గుప్తా తెలిపారు.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, పుణెలాంటి పెద్ద నగరాల్లో సీజనల్ హైరింగ్ డిమాండ్ ఎక్కువగా ఉంది. గతేడాదితో పోలిస్తే అవకాశాలు 19% అధికం.
- లక్నో, జైపూర్, కోయంబత్తూర్, నాగ్‌పూర్, భువనేశ్వర్, మైసూరు, వారణాసిలాంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో కూడా డిమాండ్ 42% పెరిగింది. విజయవాడ, కాన్పూర్, కొచ్చిలాంటి వర్ధమాన హబ్‌లలోనూ హైరింగ్ అంచనాలు మెరుగ్గా న్నాయి.
- మెట్రో మార్కెట్లలో వేతనాలు 12–15%, వర్ధమాన నగరాల్లో 18–22% స్థాయిలో పెరగవచ్చు.
- స్వల్పకాలిక ఈ ఏడాది సీజనల్ హైరింగ్‌లో మహిళల వాటా 23 శాతం పెరగనుంది.
- పండుగ సీజన్‌లో డిమాండ్ భారీగా ఉన్న సమయాల్లో కంపెనీలు లాస్ట్–మైల్ కార్యకలాపాలను (కస్టమర్ల ఇంటి దగ్గరకే ఉత్పత్తులను చేర్చడం) కూడా పటిష్టపర్చుకోనుండటంతో లాజిస్టిక్స్, డెలివరీల్లో హైరింగ్ 30–35% ఎగబాకనుంది.
- బీఎఫ్‌ఎస్‌ఐ రంగాన్ని తీసుకుంటే .. క్రెడిట్ కార్డుల అమ్మకాలు, పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) ఇన్‌స్టాలేషన్ల కోసం (ముఖ్యంగా ద్వితీయ.. తృతీయ శ్రేణి నగరాల్లో) కంపెనీలు పెద్ద స్థాయిలో నియామకాలు చేపడుతున్నాయి. ఈ విభాగంలో డిమాండ్ 30 శాతం పెరుగుతుందని అంచనాలు ఉన్నాయి.
- హాస్పిటాలిటీ, ట్రావెల్ సెగ్మెంట్లలో రిక్రూట్‌మెంట్ డిమాండ్ 20–25% ఉండొచ్చు.
- మొత్తం సీజనల్ ఉద్యోగాల కల్పనలో 35–40% వాటాతో రిటైల్, ఈ–కామర్స్ విభాగాల ఆధిపత్యం కొనసాగనుంది.
- డిజిటల్‌పై పట్టు, బహుభాషా సామర్థ్యాలు, కస్టమర్లను హ్యాండిల్ చేయగలిగే నైపుణ్యాలకు కంపెనీలు పెద్దపీట వేస్తున్నా యి. ఇన్–స్టోర్ సేల్స్, క్రెడిట్ కార్డ్ ప్రమోషన్లు, డెలివరీ ఉద్యోగాల కోసం ఈ నైపుణ్యాలను చూస్తున్నాయి.

మారుతీ ఎర్టిగా, బాలెనో ధరలు పెరిగాయ్..



ముంబై: మారుతీ సుజుకీ ఎర్టిగా, బాలెనో కార్ల ధరలు పెంచింది. ఈ మోడళ్లలో స్టాండర్డ్‌గా ఆరు ఎయిర్ బ్యాగులు అందిస్తున్న కారణంగా వీటి ధరలను పెంచుతున్న ట్లు ప్రకటించింది. ఎర్టిగా ఎక్స్‌షోరూమ్ ధర 1.4% మేర పెరగ్గా.. బాలెనో ధర 0.5% పెరిగిందని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. జూలై 16 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో ధర రూ.6.7 లక్షలు – రూ.9.92 లక్షలుగా ఉంది. ఎర్టిగా ధర రూ.8.97 లక్షల నుంచి ప్రారంభమై రూ.13.25 లక్షల వరకు ఉంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోనస్ బొనాంజా!

- ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ సైతం
- 19న బోర్డు సమావేశంలో ప్రకటన



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వాటాదారులకు బోనస్ షేర్ల జారీ సహా.. ప్రత్యేక మధ్యంతర డివిడెండ్ చెల్లింపునకు ప్రతిపాదించింది. ఈ నెల 19న(శనివారం) నిర్వహించనున్న సమావేశంలో బోర్డు ఈ అంశాన్ని పరిశీలించనున్నట్లు బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసిక(ఏప్రిల్–జూన్) ఫలితాలను సైతం శనివారం సమావేశంలో బ్యాంక్ ప్రకటించనుంది. కాగా.. గతేడాది(2024–25)కి ప్రచురించిన వార్షిక నివేదికలో పరిశ్రమకు అనుగుణంగా ఈ ఏడాది రుణాల్లో వృద్ధి నమోదుకానున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 1% బలపడి రూ. 1,996 వద్ద ముగిసింది. గత 6 నెలల కాలంలో దాదాపు 22% లాభపడటం గమనార్హం!

టెక్ మహీంద్రా లాభం జూమ్

క్యూ1లో రూ. 1,141 కోట్లు

- ఉద్యోగుల సంఖ్య @ 1,48,517



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2025–26, క్యూ1)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 34% జంప్‌చేసి రూ.1,141 కోట్లను తాకింది. కమ్యూనికేషన్స్, ఫైనాన్షియల్ సర్వీస్ విభాగాల వృద్ధి ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 852 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 3% స్వల్ప వృద్ధితో రూ.13,351 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ.13,006 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో 80.9 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది. క్యూ1లో 897 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1,48,517కు చేరింది. ఉద్యోగ వలసల రేటు 12.6%గా నమోదైంది.

ఆటుపోట్లలోనూ..

ఆటుపోట్ల వాతావరణంలోనూ ప్రణాళికలకు అనుగుణంగా వృద్ధి బాటలో సాగడం ద్వారా పటిష్ట పనితీరు చూపగలిగినట్లు టెక్ మహీంద్రా సీఈవో, ఎండీ మోహిత్ జోషీ పేర్కొన్నారు. బీఎఫ్‌ఎస్‌ఐ విభాగం 4.7 శాతం, రిటైల్, లాజిస్టిక్స్ 3.8 శాతం, కమ్యూనికేషన్స్ 2.5 శాతం చొప్పున పుంజుకోవడం ద్వారా క్యూ1 ఆదాయానికి దన్నునిచ్చినట్లు కంపెనీ తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు 2 శాతం లాభపడి రూ. 1,609 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఐపీవోకు ఇందిరా ఐవీఎఫ్	భారత్–సింగపూర్ మధ్య నిధుల బదిలీ సులభతరం

రుణ రేట్లను తగ్గించిన ఐవోబీ

Indian Overseas Bank
(A Government of India Undertaking)
Good People to Grow with

చెన్నై: ప్రభుత్వరంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ) మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్ఆర్) 10 బేసిస్ పాయింట్ల (0.10 శాతం) మేర తగ్గించినట్టు ప్రకటించింది. అన్ని రకాల కాలవ్యవధి కలిగిన ఎంసీఎల్ఆర్ రుణాలకు ఇది వర్తిస్తుందని తెలిపింది. జూలై 15 నుంచే ఇది అమల్లోకి వచ్చినట్టు పేర్కొంది. సవరణ అనంతరం ఓవర్‌నైట్ కాల వ్యవధి ఎంసీఎల్ఆర్ 8.15 శాతం, ఒక నెల ఎంసీఎల్ఆర్ 8.40%, మూడు నెలల ఎంసీఎల్ఆర్ 8.55 శాతం, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.80 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ 9 శాతానికి దిగొచ్చాయి. ఆటో, వ్యక్తిగత తదితర కన్జ్యూమర్ రుణాలకు ఎంసీఎల్ఆర్‌ను బ్యాంకులు అమలు చేస్తుంటాయి.

స్వల్ప లాభాలు

సెన్సెక్స్ 64 పాయింట్లు ప్లస్



ముంబై: పరిమిత శ్రేణిలో ట్రేడైన స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. టారిఫ్ సంబంధిత అనిశ్చితులు, అంతర్జాతీయ మార్కెట్లలోని బలహీన సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఫలితంగా సెన్సెక్స్ 64 పాయింట్లు పెరిగి 82,634 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్లు ఎగసి 25,212 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా రెండోరోజూ లాభాల ముగింపు. సెన్సెక్స్ 82,343 – 82,785 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 25,121 వద్ద కనిష్టాన్ని, 25,255 వద్ద గరిష్టాన్ని తాకింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 16 పైసల నష్టంతో 85.92 వద్ద స్థిరపడింది.

- కమోడిటీస్, క్యాపిటల్ గూడ్స్, మెటల్, ఇండస్ట్రియల్స్, ఫార్మా షేర్లు నష్టపోయాయి. ఐటీ, పీఎస్‌యూ బ్యాంకులతో పాటు రియల్టీ, సర్వీసెస్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- హెచ్‌డీబీ ఫైనాన్స్ షేరు 3% నష్టపోయి రూ.815 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 4% పతనమై రూ.808 వద్ద కనిష్టాన్ని తాకింది. క్యూ1లో లాభం 2.4% తగ్గడం షేరు పతనానికి ప్రధాన కారణం.

ఐటీసీ హోటల్స్ లాభం హైజంప్

- క్యూ1లో రూ. 134 కోట్లు
- కొత్తగా 8 హోటళ్లు షురూ



న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ దిగ్గజం ఐటీసీ హోటల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 53 శాతం జంప్‌చేసి రూ. 134 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 87 కోట్లు ఆర్జించింది. 2030కల్లా 220 హోటళ్ల నిర్వహణ ద్వారా 20,000 గదులకుపైగా అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 706 కోట్ల నుంచి రూ. 816 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 8 హోటళ్ల ద్వారా 700 గదులను అదనంగా జత చేసుకున్నట్లు తెలిపింది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ హోటల్స్ షేరు 4.5 శాతం జంప్‌చేసి రూ. 239 వద్ద ముగిసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

సీపీగెట్‌కు దరఖాస్తు చేశారా!

» పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్ట్
» దరఖాస్తులకు చివరి తేది: 17.07.2025

ఎంట్రెన్స్ టెస్ట్

తెలంగాణలోని ఎనిమిది విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు సీపీగెట్(కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్)–2025 నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా ఎంచుకున్న యూనివర్శిటీ, అనుబంధ కళాశాలల్లో నచ్చిన కోర్సు చదవొచ్చు. పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో(సీబీటీ) ఆగస్టు మొదటి వారంలో ప్రారంభమవుతాయి. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు, శాతవాహన, జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీలు, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇందులో పాల్గొంటున్నాయి. దీనిద్వారా ఆయా వర్సిటీల్లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఈడీ, ఎంపీఈడీ, ఇంటిగ్రేటెడ్‌తో కలిపి దాదాపు 50 కోర్సుల్లో చేరొచ్చు.

అర్హత

సీపీగెట్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్నవారూ దరఖాస్తుకు అర్హులే.

పరీక్ష విధానం

ఈ పరీక్ష మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో 100 ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు. ప్రతి సబ్జెక్టుకూ సిలబస్‌ను నిర్దేశించారు. అందులోనుంచే ప్రశ్నలు వస్తాయి. కోర్సును అనుసరించి ప్రశ్నపత్రం మారుతుంది.

క్యాంపస్ సీట్లు

విద్యార్థికి సీటు కేటాయింపు అనేది తను ఎంచుకున్న సబ్జెక్టు, ఆ సబ్జెక్టులో పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య, తన ర్యాంకు, క్యాటగిరీ, ఉన్న సీట్ల సంఖ్య.. తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇందులో 80శాతం మార్కులు సాధిస్తేనే యూనివర్శిటీ క్యాంపస్‌లో సీటు లభించే అవకాశం ఉంటుంది. దీన్నిబట్టి విద్యార్థి అంచనా వేసుకుని ప్రిపరేషన్ సాగించాలి.

సన్నద్ధత ఎలా

ఈ పరీక్షకు సంబంధించి ప్రశ్నలు మొత్తం సిలబస్ నుంచే వస్తాయి. అందులో ఉన్న టాపిక్స్ బాగా చదువుకుంటే సరిపోతుంది. మంచి ర్యాంకు రావాలంటే.. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం చాలా ముఖ్యం. డిగ్రీలో చదివిన సబ్జెక్టు కాకుండా.. వేరే సబ్జెక్టులో పీజీ సీటు కావాలి అనుకుంటే సన్నద్ధతకు ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉంటుంది. డిగ్రీలో చదివిన అంశాలే అయితే పాతనోట్సును మళ్లీ చదవడం ఉపకరిస్తుంది. సిలబస్‌ను పూర్తిగా చదివాక.. పరీక్షలో ఏ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉందో తెలుసుకోవాలి. అంటే గత సంవత్సరాల ప్రశ్నపత్రాలకు ఒకసారి జవాబులు రాయాలి. దాన్నిబట్టి ఏది ఎంతవరకూ చదవాలో అవగాహన పెరుగుతుంది. ప్రాథమిక అంశాలను నేర్చుకోవడానికి అకాడమీ పుస్తకాలు చదవాలి. మాదిరి ప్రశ్నలు సాధన చేయడానికి నచ్చిన పబ్లికేషన్ పుస్తకాలు ఎంచుకోవచ్చు.

ఇంటర్ తర్వాత కూడా

ఇంటర్ అర్హతతో బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎకనమిక్స్, ఎంబీఏ, ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశించొచ్చు. ఇది విద్యార్థులకు చక్కని అవకాశం. అభ్యర్థులు దరఖాస్తు చేసేటప్పుడు ఒకేరోజు పరీక్ష ఉన్న రెండు సబ్జెక్టులను ఎంపిక చేసుకోకుండా జాగ్రత్త పడాలి. తాజాగా తీసుకున్న ఆదాయ, కుల ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలి. దరఖాస్తుల్లో ఎటువంటి తప్పులు చేయకుండా జాగ్రత్తపడాలి.

మాక్ టెస్టులు

అధికారిక వెబ్‌సైట్‌లో మాక్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి. వాటిని రాస్తే పేపర్ సరళి ఎలా ఉంటుందనే విషయంపై అవగాహన పెరుగుతుంది. అభ్యర్థి ఎంపిక చేసుకున్న సబ్జెక్టును బట్టి ప్రశ్నపత్రం మారుతుంది. ఏ కోర్సుకు ఏ సిలబస్ చదవాలి, కోర్సునుబట్టి ఏ సబ్జెక్టు నుంచి ఎలాంటి ప్రశ్నలు వస్తాయనే పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:17.07.2025
- ఆలస్య రుసుముతో: 28.07.2025 వరకు.
- వెబ్‌సైట్: https://cpget.tgche.ac.in/CPGET_HomePage.aspx

లోకల్ బ్యాంక్ ఆఫీసర్

సర్కారీ బ్యాంకుల్లో ఉద్యోగాల పరంపర కొనసాగుతోంది. మరో ప్రభుత్వ రంగ బ్యాంకు.. బ్యాంక్ ఆఫ్ బరోడా 2500 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీతోపాటు కనీసం ఒక సంవత్సరం అనుభవం ఉన్న అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఆకర్షణీయ వేతనంతోపాటు ఉజ్వల కెరీర్ సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో... బ్యాంక్ ఆఫ్ బరోడా లోకల్ బ్యాంక్ ఆఫీసర్ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 2500 పోస్టుల భర్తీకి బ్యాంక్ ఆఫ్ బరోడా నోటిఫికేషన్
» ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, జీడీ/ఇంటర్వ్యూతో ఎంపిక

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కెరీర్ కోరుకునే వారికి బ్యాంక్ ఆఫ్ బరోడా లోకల్ బ్యాంక్ ఆఫీసర్ నోటిఫికేషన్ చక్కటి అవకాశం. ఇప్పటికే ఐబీపీఎస్, ఎస్‌బీఐ పీవో వంటి బ్యాంకు పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు దీన్ని అందిపుచ్చుకోవచ్చు. అదే ప్రిపరేషన్‌తో బ్యాంక్ ఆఫ్ బరోడా పోస్టులకు పోటీపడి విజేతలుగా నిలిచే వీలుంది.

- **నోటిఫికేషన్:** బ్యాంక్ ఆఫ్ బరోడా–లోకల్ బ్యాంక్ ఆఫీసర్.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 2500.
- **రాష్ట్రాల వారీగా పోస్టుల వివరాలు:** గోవా–15, గుజరాత్ –1160, జమ్మూకాశ్మీర్–10, కర్ణాటక –450, కేరళ–50, మహారాష్ట్ర –485, ఒడిశా–60, పంజాబ్–50, సిక్కిం–3, తమిళనాడు–60, పశ్చిమ బెంగాల్–50, అరుణాచల్ ప్రదేశ్–6, అస్సాం–64, మణిపూర్–12, మేఘాలయ –7, మిజోరాం–4, నాగాలాండ్–8, త్రిపుర–6.

అర్హతలు

- 01.07.2025 నాటికి అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చార్టెడ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్, ఇంజనీరింగ్, మెడికల్ వంటి ప్రొఫెషనల్ డిగ్రీలు ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అభ్యర్థి ఏదైనా ఒక రాష్ట్రానికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆ రాష్ట్రంలోని స్థానిక భాషలో మాట్లాడటం, రాయడం, చదవడం వచ్చి ఉండాలి.
- అర్హత కోర్సు ఉత్తీర్ణులైన తర్వాత ఏదైనా షెడ్యూల్ కమర్షియల్ బ్యాంక్ లేదా రీజనల్ రూరల్ బ్యాంక్‌లో కనీసం ఏడాది పాటు ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి.

వయసు

01.07.2025 నాటికి 21 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్యలో వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

మూల వేతనం నెలకు రూ.48,480–85,920 లభిస్తుంది. దీంతోపాటు ఇతర అలవెన్సులు, సౌకర్యాలు పొందేఅవకాశముంది. ఒక సంవత్సరం పని అనుభవం ఉంటే.. ఒక అదనపు ఇంక్రిమెంట్ అందుతుంది. కాని సర్వీస్ సీనియారిటీకి మాత్రం పని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోరు.

ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్,గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

పరీక్ష విధానం

- ఆన్‌లైన్ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల విధానంలో 120 ప్రశ్నలు–120 మార్కులకు జరుగుతుంది. ఇందులో ఇంగ్లిస్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులకు, బ్యాంకింగ్ నాలెడ్జ్ 30 ప్రశ్నలు–30 మార్కులకు, జనరల్/ఎకనామిక్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు–30 మా ర్కులకు,రీజనింగ్ ఎబిలిటీ అండ్ క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 30ప్రశ్నలు–30మార్కులకు ఉంటాయి.
- ప్రతి విభాగానికి 30 నిమిషాల చొప్పున మొత్తం 120 నిమిషాల సమయం ఈ పరీక్షకు కేటాయించారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా మిగతా విభాగాల ప్రశ్నలు ఇంగ్లిష్ / హిందీలో(ద్విభాష)లో ఉంటాయి.
- ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.
- ఈ పరీక్షలోని ప్రతి విభాగంలో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 40 శాతం, రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు సాధించాలి.
- అభ్యర్థులు ప్రతి విభాగంలో సాధించిన స్కోర్‌ను కలిపి ఉత్తమ ప్రతిభ చూపిన వారితో కేటగిరీల వారిగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు. వీరికి తదుపరి దశల ఎంపిక ప్రక్రియకు అనుమతి లభిస్తుంది.

సైకోమెట్రిక్ టెస్ట్

ఎంపిక ప్రక్రియ రెండో దశలో సైకోమెట్రిక్ టెస్టును నిర్వహిస్తారు. బ్యాంక్ విలువలు, పనివిధానానికి అనుగుణంగా మారే తత్వం అభ్యర్థిలో ఉందా, అభ్యర్థి వ్యక్తిత్వం సేల్స్ జాబ్ రోల్స్‌కు సరిపోతుందా అనే విషయాన్ని సైకోమెట్రిక్ టెస్టులో భాగంగా పరిశీలిస్తారు. సేల్స్‌లో రాణించే దృక్పథంతోపాటు, బ్యాంక్ విలువలకు సరిపోయే వ్యక్తిత్వమున్న అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యం ఇస్తారు.

గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ టెస్టులో చూపిన ప్రతిభ ఆధారంగా గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

బ్యాంక్ జాబ్స్



ఇందులో అభ్యర్థి వ్యక్తిత్వం, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార నైపుణ్యం, సేల్స్ నైపుణ్యాలు, సమర్థత తదితర అంశాలను పరిశీలిస్తారు.

ప్రొబేషన్

ఎంపికైన అభ్యర్థులకు విధుల్లో చేరిన తేదీ నుంచి ఒక ఏడాది పాటు ప్రొబేషన్ పిరియడ్‌గా పేర్కొంటారు. అదేవిధంగా కనీసం మూడేళ్లపాటు బ్యాంక్‌లో పనిచేస్తామని రూ.5లక్షల విలువైన సర్వీస్ బాండ్‌ను అభ్యర్థి ఇవ్వాల్సి ఉంటుంది.

పోస్టింగ్

ఎంపికైన అభ్యర్థులకు దరఖాస్తు చేసుకున్న రాష్ట్రంలోనే పోస్టింగ్ ఇస్తారు. 12ఏళ్ల సర్వీసు పూర్తయ్యే వరకూ సొంత రాష్ట్రంలోని బ్యాంక్ బ్రాంచ్‌లోనే బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆ తర్వాత బ్యాంకు అవసరాలకు అనుగుణంగా బ్యాంకు నిర్ణయం మేరకు ఎక్కడికైనా బదిలీ చేసే అవకాశముంది.

ప్రిపరేషన్ ఇలా

- ఇంగ్లిష్‌లో ఎక్కువ స్కోర్ చేసేందుకు రీడింగ్ కాంప్రహెన్షన్, గ్రామర్‌పై పట్టు సాధించాలి. ఇందులో వొక్యాబులరీ, సెంటెన్స్ కరెక్షన్, క్లోజ్ టెస్ట్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, జంబుల్డ్ సెంటెన్సెస్, మిస్‌స్పెల్ట్ వర్డ్స్ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి.
- బ్యాంకింగ్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్ విభాగం కోసం బ్యాంకింగ్ రంగ తాజా పరిణామాలు, ఎకానమీ, బ్యాంకింగ్ టెర్మినాలజీ, జాతీయ, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్‌ను తెలుసుకోవాలి. దీనికోసం ఏదైనా ప్రామాణిక దినపత్రికను అనుసరిస్తే సరిపోతుంది.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ విభాగంలో మంచి స్కోర్ కోసం అరిథమెటిక్, నంబర్ సిరీస్, సింప్లిఫికేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. 8,9,10వ తరగతి గణితం పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత సాధ్యమైనన్ని గత ప్రశ్నలు,మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, కోడింగ్–డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, డేటా సఫీషియన్సీ అంశాలపై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 24.07.2025
- పరీక్ష కేంద్రాలు: ముంబయి, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్.
- వెబ్‌సైట్: www.bankofbaroda.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్‌లో 3,501 గ్రూప్-బీ, సీ పోస్టులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. కామన్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్(సీఆర్‌ఈ)–2025 ద్వారా వివిధ ఎయిమ్స్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలలో గ్రూప్–బీ, గ్రూప్–సీ నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3,501.
» **పోస్టుల వివరాలు:** డైటీషియన్, అసిస్టెంట్ డైటీషియన్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్, క్యాషియర్, ఓటీ అసిస్టెంట్, రేడియోగ్రాఫర్, ఈసీజీ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్, అటెండెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్/ఎంటెక్/బీఈ, డీఎంఎల్‌టీ, బీఎంఎల్‌టీ, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి. కొన్ని పోస్టులకు సంబంధిత డిపార్ట్‌మెంట్‌లో అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** పోస్టును అనుసరించి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.07.2025.
» **సీబీటీ పరీక్ష తేదీలు:** 25.08.2025, 26.08.2025.
» **వెబ్‌సైట్:** https://rrp.aiimsexams.ac.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం –జనరల్ స్టడీస్–జాగ్రఫీ
» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్



ఉరి వేస్తారా... ఊపిరి ఇస్తారా!

యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయ నర్స్ నిమిష ప్రియ పేరు దేశవ్యాప్తంగా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిమిష ప్రియలా విదేశీ జైళ్లలో మగ్గుతున్న భారతీయులు ఎందరో తెలుసా? 86 దేశాల్లోని జైళ్లలో ఏకంగా 10,152 మంది బందీలుగా ఉన్నారు. వీరిలో 49 మందికి మరణ శిక్ష ఖరారైంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

విదేశీ జైళ్లలో మగ్గుతున్న మన వలస పక్షులు

86 దేశాల్లో 10,152 మంది భారతీయులు

అత్యధికంగా సౌదీ అరేబియా, యూఏఈలో

మొత్తం బందీల్లో 49 మందికి ఉరిశిక్ష ఖరారు

హత్యలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గూఢచర్యం, మతపరమైన ఉల్లంఘనలు.. ఇలాంటి నేరాల కారణంగా 10 వేల మందికిపైగా భారతీయుల విదేశీ జైళ్లలో మగ్గుతున్నారు. ఇటీవలి కాలంలో సౌదీ అరేబియా, కువైట్‌లలో మరణశిక్షకు గురైన అనేక మంది భారతీయులు మాదకద్రవ్యాల సంబంధిత నేరాలకు పాల్పడినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ ఏడాది మార్చిలో రాజ్యసభలో తెలిపింది. 2025 మార్చి నాటికి ఎనిమిది దేశాల్లో 49 మంది భారతీయులు మరణశిక్షను ఎదుర్కొంటున్నారని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇందులో యూఏఈలో 25 మంది, సౌదీ అరేబియాలో 11, మలేషియాలో ఆరుగురు, కువైట్, ఇండోనేషియా, ఖతార్, యూఎస్, యెమెన్‌లలో ఇతరులు ఉన్నారు.

వైఎస్ జగన్ చొరవతో..

పాకిస్తాన్ జైళ్లలో మగ్గుతున్న 22 మంది మత్స్యకారుల దీనగాథను.. వారి కుటుంబాలు 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని కలిసి విన్నవించారు. అధికారంలోకి రాగానే వారిని విడిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. 22 కుటుంబాల్లో ఆనందం నింపారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయమూ చేశారు.

జైలు సందర్శనలు మొదలుకుని అనువాదకుల ఏర్పాటు, అప్పీళ్లు లేదా క్షమాభిక్ష పిటిషన్లకు సహాయం చేయడం వరకు దౌత్య, చట్టపరమైన సహాయాన్ని అందించడంలో విదేశాల్లోని భారత దౌత్య కార్యాలయాలు నిమగ్నమై ఉన్నాయి. కానీ యెమెన్ వంటి దేశాలలో హౌతీ పాలనను భారత్ గుర్తించడం లేదు.

అవగాహన లేకే..

అధికారిక మార్గాలు లేకపోవడంతో ఈ ప్రాథమిక సేవలను కూడా అందించడం కష్టంగా మారింది. చాలామంది భారతీయ పౌరులు.. ముఖ్యంగా వలస కార్మికులు చట్టపరమైన చిక్కుల్లో చిక్కుకుంటున్నారు. వారికి స్థానిక చట్టాలపై అవగాహన లేకపోవడం సమస్యను తీవ్రం చేస్తోంది. నిరంకుశ పాలనలు లేదా నిత్యం సంఘర్షణలు జరిగే దేశాలలో న్యాయ విచారణలు, పారదర్శక చట్టపర ప్రక్రియలు అమలు కావడం చాలా అరుదు.

విచారణ ఎదుర్కొంటున్న, శిక్ష అనుభవిస్తున్న 10,152 మంది ఖైదీల్లో అత్యధికంగా సౌదీ అరేబియా జైళ్లలో 2,633, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 2,518 మంది ఉన్నారు. సౌదీ, యూఏఈ వంటి దేశాలు లక్షలాది మంది భారతీయ వలసదారులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. ఇదే స్థాయిలో చట్టపరమైన ఇబ్బందుల్లో మనవాళ్లు అధికంగా చిక్కుకుంటున్నారు. యూఏఈలోని ఖైదీల్లో 25 మందికి మరణశిక్ష విధించారని భారత విదేశాంగ శాఖ తెలిపింది.

సౌదీలోనే... అధికం

యూఏఈలో బహిరంగ ఉరిశిక్షకు సంబంధించిన సమాచారం లేకపోవడం వల్ల పరిణామాలను పర్యవేక్షించడానికి భారత అధికారులు అనధికారిక, స్థానికులు ఇచ్చే సమాచారంపై ఆధారపడతారు. పని ఒత్తిడి పరిస్థితులు, కార్మిక వివాదాలు, అక్రమ రవాణా కార్యకలాపాలు, తప్పుడు గుర్తింపు వంటి చట్టపర సమస్యలు తరచూ ఎదురవుతున్నాయి. చాలా సందర్భాలలో వ్యక్తులు చట్టవిరుద్ధ నెట్‌వర్క్‌లలో చిక్కుకుంటున్నారు. తప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్నవారూ ఉన్నారు.

2023లో సౌదీ అరేబియా, కువైట్‌లలో ఐదుగురు భారతీయులు ఉరికంబం ఎక్కారు. 2024లో ఈ రెండింటిలో ఒక్కో దేశంలో కనీసం మూడు ఉరిశిక్షలు నమోదయ్యాయి. భారత ప్రభుత్వం నిరంతరం తన పౌరులకు మద్దతు ఇస్తున్నప్పటికీ.. విదేశీ అధికార పరిధిలోని తీర్పులను అధిగమించడానికి మన దేశానికి అధికారం లేదు.

నిర్ణయం వారిదే..

క్షమాభిక్ష అభ్యర్థనలకు సంబంధించి అప్పీళ్లకు మద్దతు ఇవ్వడం, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకోవడం, అభ్యర్థన ప్రక్రియలను సులభతరం చేయడం వంటి వాటిని భారత ప్రభుత్వం చేస్తోంది. ఆతిథ్య దేశ న్యాయవ్యవస్థ లేదా పాలకుల చేతుల్లోనే క్షమాభిక్ష తుది నిర్ణయం ఆధారపడి ఉంటోంది.

విదేశాలలో ఉన్న భారతీయుల భద్రత, శ్రేయస్సు ప్రాధాన్యంగా కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ.. ప్రపంచవ్యాప్తంగా నిర్బంధంలో ఉన్న 10,000 కంటే ఎక్కువ మంది ఖైదీల విషయంలో కేసుల వారీగా జోక్యం చేసుకోవడం అంత సులభమైన వ్యవహారం కాదు. అయితే ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్ వంటి సమూహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నిమిష ప్రియ విషయంలో

అంత సులభం కాదు..

బ్లడ్ మనీ (క్షమా ధనం) కోసం నిధులను సేకరించడం, యెమెన్ లోని గిరిజన షేక్‌లతో చర్చలకు సహాయపడ్డాయి. భారతీయ వలసదారులకు.. ముఖ్యంగా కఠిన చట్టపరమైన వ్యవస్థలు ఉన్న దేశాలకు వెళ్లేవారికి అక్కడి పరిస్థితులపై ముందుగా పూర్తి అవగాహన కల్పించాలని నిపుణులు, న్యాయవాదులు స్పష్టం చేస్తున్నారు. స్థానిక చట్టాలు, హక్కులు, సాంస్కృతిక నిబంధనలను వివరించడం ద్వారా కేసులను తగ్గించవచ్చన్నది వారి వాదన.

ఖైదీల సంఖ్యా పరంగా టాప్-10 దేశాలు

సౌదీ అరేబియా	2,633
యూఏఈ	2,518
నేపాల్	1,317
ఖతార్	611
కువైట్	387
మలేషియా	338
యూకే	288
పాకిస్తాన్	266
బహ్రెయిన్	181
చైనా	173
ఇతర దేశాలు	1,440

ఆధారం: 2025 మార్చిలో లోక్‌సభలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ



చెక్ పాయింట్‌లోకి డబ్బులు తీసుకువెళ్తున్న ఓ డ్రైవర్



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

ఓవైపు తనిఖీలు.. మరోవైపు లంచాలు..

పొందుర్తి ఆర్టీఏ చెక్ పాయింట్‌లో ఏసీబీ దాడులు

- విచారణ సమయంలోనూ కొనసాగిన అక్రమ వసూళ్లు
- అదుపులో ఏఎంవీఐ, నలుగురు ప్రైవేటు ఏజెంట్లు

కామారెడ్డి క్రైం/భిక్కనూర్: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని పొందుర్తి ఆర్టీఏ చెక్ పాయింట్‌లో ఏసీబీ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇక్కడి సిబ్బంది ప్రైవేటు వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. ఏసీబీ అధికారులు వచ్చిన సమయంలో చెక్ పాయింట్‌లో ఎంవీఐ నాగలక్ష్మి, ఏఎంవీఐ స్యామ్ రిచర్డ్సన్, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏఎంవీఐ స్యామ్ రిచర్డ్సన్ నుంచి రూ.16 వేలు, ప్రైవేటు ఏజెంట్ శివకుమార్ నుంచి రూ.9 వేలు, ఫైళ్ల మధ్య దాచిఉంచిన మరో రూ.4 వేలు, విచారణ కొనసాగిన సమయంలో లారీల డ్రైవర్‌లు మామూళ్ల రూపంలో ఇచ్చి వెళ్లిన మరో రూ.51 వేలు కలిపి మొత్తం రూ.80 వేలను, 38 సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం ఐదుగురు ప్రైవేటు వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకుని ఈ చెక్ పాయింట్‌లో అక్రమ వసూళ్లు చేపడుతున్నట్లు గుర్తించామని, వారిలో నలుగురు వ్యక్తులు విధుల్లో ఉన్నారని అన్నారు. ఏఎంవీఐ, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, అనంతరం నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

అధికారుల ఎదుటే వసూళ్లు..

ఉదయాన్నే కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు విధుల్లో ఉన్న రవాణా శాఖ అధికారులు, సిబ్బందిని విచారించడం మొదలుపెట్టారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఏసీబీ తనిఖీలు జరుగుతున్న సమయంలోనే ప్రతి వాహనం అక్కడకు వచ్చి ఆగడం, అందులో నుంచి డ్రైవర్ డబ్బులు తీసుకుని రావడం, సిబ్బందికి చూపించి వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాలో వేయడం, ఇలా మొత్తం వ్యవహారం ఏసీబీ అధికారుల కళ్ల ముందే జరిగింది. రాత్రి 7 గంటల వరకు విచారణ కొనసాగింది.

అవినీతి ఇంజనీర్లపై ఈడీ నజర్

- మురళీధర్‌రావు, హరిరాం, శ్రీధర్‌పై ఏసీబీ కేసులు... ఈ ముగ్గురు అధికారుల అక్రమార్జనపై ఈడీ ఫోకస్
- ఏసీబీ నుంచి కేసుల వివరాలు కోరనున్న ఈడీ



సాక్షి, హైదరాబాద్: అవినీతి ఇంజనీర్ల అక్రమార్జనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా పనిచేసిన రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)లు మురళీధర్ రావు, భూక్యా హరిరాం, చొప్పదండి ఎస్సారెస్పీ డివిజన్-8 ఈఈ నూనె శ్రీధర్‌లపై ఏసీబీ అధికారులు ఇటీవల అక్రమాస్తుల కేసులు నమోదు చేయగా, వీరిపై ఈడీ కూడా దృష్టి సారించింది. ఏసీబీ సోదాల్లో ఈ ఇంజనీర్లకు అత్యంత ఖరీదైన విల్లాలు, ఫ్లాట్లు, ప్రైమ్ లొకేషన్లలో ఖాళీ నివాస స్థలాలు, బ్యాంకు డిపాజిట్లు, బంగారం సహా విలువైన ఆభరణాలు భారీగా ఉన్నట్లు తేలింది. మంగళవారం నాటి సోదాల్లో మురళీధర్‌రావు పెద్ద మొత్తంలో అక్రమాస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ గుర్తించింది. అవినీతి సొమ్మును బినామీల పేరిట దాచిపెట్టడంతోపాటు కుటుంబ సభ్యులకు చెందిన వ్యాపారాల్లోకి మళ్లించినట్టు ప్రాథమిక ఆధారాల ద్వారా తెలుస్తోంది. కొంత మంది అధికారులు మనీలాండరింగ్‌కు పాల్పడడంతోపాటు విదేశాల్లోనూ లగ్జరీ ఖర్చులు చేసినట్టు ఆధారాలు బయటికి వచ్చాయి. వీటన్నింటిపైనా ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. వీరి అక్రమార్జనపై లోతుగా ఆరా తీయాలని భావిస్తున్నారు. మురళీధర్‌రావు కాళేశ్వరం, ఇతర కీలక ప్రాజెక్టులను పర్యవేక్షించిన సమయంలో తన కుమారుడు అభిషేక్‌రావు బినామీగా కాంట్రాక్టు సంస్థలకు మేలు చేసేలా కోట్లాది రూపాయల కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. అభిషేక్‌రావు కంపెనీల్లోకి పెద్ద మొత్తంలో అవినీతి సొమ్ము వెళ్లినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ కోణంలో మరో కేసు నమోదు చేసే యోచనలో ఈడీ ఉన్నట్టు తెలిసింది. ఈఈ నూనె శ్రీధర్ కుమారుడి వివాహం (డెస్టినేషన్ వెడ్డింగ్) విదేశాల్లో ఘనంగా నిర్వహించేందుకు చేసిన ఖర్చుపైనా ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. భూక్యా హరిరాం అక్రమార్జనపైనా ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. వీరిపై ఏసీబీ నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లు, ఇతర ఆధారాల వివరాలు ఇవ్వాలని ఏసీబీని కోరేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి అధికారికంగా లేఖ రాయనున్నట్టు ఈడీ వర్గాల ద్వారా తెలిసింది. వివరాలు సేకరించిన తర్వాత ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్)లు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు.

డాక్టర్ మరాఠీ బలరాంకు ఫిలిప్పీన్స్ ప్రభుత్వ పేటెంట్

హైబ్రిడ్ వరి పరిశోధనకు దక్కిన గౌరవం



సాక్షి, హైదరాబాద్/ఏజీవర్సిటీ: హైబ్రిడ్ వరి పరిశోధనలో జరిపిన ఆవిష్కరణలకు గాను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠీ బలరాంకు ఫిలిప్పీన్స్ ప్రభుత్వ పేటెంట్ మంజూరైంది. ఇప్పటికే ఇదే అంశానికి సంబంధించి ఆయనకు అమెరికా, భారతదేశాల పేటెంట్ హక్కులు లభించాయి. ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఆర్ఆర్ఐ)లో చేసిన పరిశోధనలకు గాను ఈ పేటెంట్ దక్కింది. 2036 జూన్ 5వ తేదీ వరకు ఈ పేటెంట్ చెల్లుబాటు అవుతుంది. ఈ ఆవిష్కరణ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ సంస్థలు హైబ్రిడ్ వరి విత్తనాల ఉత్పత్తి పెంచడానికి వీలు ఏర్పడుతుంది. తద్వారా హైబ్రిడ్ వరి విత్తనాలు రైతులకి తక్కువ ధరలకే లభిస్తాయి. దానివల్ల ఎక్కువ విస్తీర్ణంలో హైబ్రిడ్ వరి సాగు చేయడానికి అవకాశం ఏర్పడుతుందని డాక్టర్ మరాఠీ బలరాం వివరించారు. ఈ పేటెంట్ సాధించడంపై పీజేటీఏయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య బలరాంను అభినందించారు.

టుడేస్ గ్రాఫిక్

టెస్లా.. పోటీ ఇలా?

భారత్ మార్కెట్లోకి టెస్లా అడుగుపెట్టింది. ఇప్పటికే మార్కెట్లో రూ.40-70 లక్షల ధరల శ్రేణిలో లభిస్తున్న మిగతా ఎలక్ట్రిక్ వాహనాలతో దీన్ని ఓసారి పోల్చి చూస్తే..



మోడల్(వేరియంట్), బ్రాండ్	ధర (రూ. లక్షల్లో)*	రేంజ్ (కి.మీ.లలో)*	బ్యాటరీ (కేడబ్ల్యూహెచ్-కిలోవాట్ హవర్స్)
ఈవీ6(జీటీ లైన్) కియా	66.0	650	84
మోడల్ వై(ఆర్‌డబ్ల్యూడీ) టెస్లా	59.9	575	75
ఈసీ40 ఎలక్ట్రిక్ వోల్వో	59.0	530	78
ఐఎక్స్1 ఎల్‌డబ్ల్యూబీ బీఎండబ్ల్యూ	49.0	531	64.8
సీలియాన్ 7(ప్రీమియం) బీవైడీ	48.9	567	82.56
ఐయానిక్ 5 హుందాయ్	46.3	631	72.6
సీల్(డైనమిక్) బీవైడీ	41.0	510	61.44

* ఎక్స్ షోరూం ధరలు.. * ప్రామాణిక పరిస్థితుల్లో సింగిల్ ఫుల్ చార్జితో ప్రయాణించగలిగే అత్యధిక దూరం

ఏసీబీ వలలో పీఆర్ ఈఎన్సీ

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా పనిచేస్తున్న వీరవల్లి కనకరత్నం అనే అధికారి ఇంజనీర్ల బదిలీల్లో పోస్టింగ్ కోసం లంచం తీసుకుంటూ బుధవారం అవినీతి నిరోధక శాఖ వలకు చిక్కారు. ఈ మధ్యనే పదవీ విరమణ చేసిన కనకరత్నం సేవలను గుర్తించి మరో ఏడాది పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఈ మధ్యనే ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. అవినీతి నిరోధక శాఖ సిటీ రేంజ్-2 అధికారులు ఆయనను వలపన్ని పట్టుకున్నారు. తాండూరు నుంచి వికారాబాద్ బదిలీ కోరిన డివిజనల్ ఇంజనీర్‌ను బదిలీ చేయడానికి ఈ మొత్తాన్ని డిమాండ్ చేయడం గమనార్హం. బాధితుడి నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా ప్రత్యక్షంగా అధికారులు పట్టుకున్నారు. ఆయనను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మంగళవారం నీటిపారుదల శాఖలో పదవీ విరమణ చేసిన ఈఎన్సీ మురళీధర్‌రావును ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న ఆరోపణలపై జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించిన సంగతి విదితమే.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 17-7-2025

ఎల్లలు దాటిన పోతుగల్ స్వీట్లు


పేరుగాంచిన పోతుగల్ స్వీట్లు

స్వీట్ల వ్యాపారంలో సత్తాచాటుతున్న పోతుగల్ యువకుడు

- ఒకప్పటి ఎస్టీడీ బూత్‌బాయ్ నేటి యువ పారిశ్రామికవేత్త
- పుట్టిన ఊరు 'పోతుగల్' పేరుతోనే స్వీటు వ్యాపారం
- హైదరాబాద్, దుబాయ్‌లలో దుకాణాలు
- 600 మందికి ఉపాధి కల్పిస్తున్న వైనం
- యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్న దొంతినేని బాలకృష్ణ



ముస్తాబాద్ (సిరిసిల్ల): ఉద్యోగం చేయడం కాదు.. పది మందికి ఉపాధి ఇవ్వాలన్న లక్ష్యం.. ఎంత ఎదిగినా పుట్టిన ఊరిని మరువవద్దన్న వినయం.. కొత్తగా చేయాలన్న తపన.. ఆ యువకుడిని విజయతీరాలకు చేర్చింది. ఊరి పేరును బ్రాండ్‌గా మార్చుకున్న రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన యువకుడు దొంతినేని బాలకృష్ణ తన ఊరి పేరుతో స్వీట్ల వ్యాపారాన్ని దేశ, విదేశాల్లో విస్తరించాడు. ఎస్టీడీ బూత్‌బాయ్‌గా పనిచేసిన కుర్రాడు యువ పారిశ్రామికవేత్తగా ఎదిగిన తీరు నేటి యువతరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. కరోనా సంక్షోభంలో వ్యాపారం ప్రారంభించి.. విజయవంతంగా దూసుకెళ్తున్న బాలకృష్ణ సక్సెస్‌స్టోరీ.

పల్లె నుంచి పట్నానికి..

రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన దొంతినేని మాధవరావు, శ్యామల కుమారుడు దొంతినేని బాలకృష్ణ పదో తరగతి వరకు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్, బీఎస్సీ బయోటెక్నాలజీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. చదువుకుంటున్న సమయంలో తల్లిదండ్రులకు భారం కావద్దని నల్లకుంటలో ఎస్టీడీ బూత్‌లో పనిచేశాడు. ఢిల్లీ, డెహ్రాడూన్‌లో మెడికల్ యూనివర్సిటీలో పనిచేశారు. ఏది చేసిన అందులో తృప్తి లేదని గ్రహించిన బాలకృష్ణ.. వినూత్నంగా ఆలోచించాడు. 2020లో కరోనాతో ఉద్యోగాలు పోవడం చూసి మనమే ఎందుకు ఉద్యోగాలు ఇవ్వద్దు అని ఆలోచించి హైదరాబాద్‌కు తిరిగొచ్చాడు. అక్కాచెల్లెళ్లు సునీత, అనిత, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్నేహితుల అండతో రూ.20 లక్షల పెట్టుబడితో స్వీట్ వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. ఏదైనా బ్రాండ్ ప్రజల్లోకి సులభంగా వెళ్లేలా ఉండాలని తన ఊరు పేరుతో 'పోతుగల్ స్వీట్స్'ను 2021లో సరూర్‌నగర్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బ్రాంచ్ ఓపెన్ చేశారు. హైదరాబాద్‌లోని కొంపల్లి, హైటెక్‌సిటీ, కొత్తపేట, కర్మాన్‌ఘాట్‌లలో బ్రాంచ్‌లు ప్రారంభించారు. స్వీట్స్ వ్యాపారంతోపాటు తంగెడు పేరుతో రెస్టారెంట్, గునుగు పేరుతో క్యాటరింగ్ నిర్వహిస్తున్నారు. దుబాయ్‌లో నెల రోజుల కిందట పోతుగల్ స్వీట్స్‌షాప్ ప్రారంభించాడు.

సంప్రదాయాలకు పెద్దపీట

నాణ్యత, స్వచ్ఛతలకు తోడు కస్టమర్ల నమ్మకానికి ప్రాధాన్యం కల్పిస్తూ పనిచేస్తున్నాం. పండుగలు, వేడుకలకు వినియోగించే స్వీట్లను అంతే పవిత్రతతో అందిస్తున్నాం. ఆ నమ్మకమే వంద కోట్ల వ్యాపారానికి నాంది వేస్తుంది. ఎయిర్‌పోర్టులు, విదేశాల్లో బ్రాంచ్‌లు ఓపెన్ చేస్తాం. వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తాం.

– దొంతినేని బాలకృష్ణ, పోతుగల్ స్వీట్స్ యజమాని



ఏ వ్యాపారం ప్రారంభించినా నాణ్యత.. రుచి.. శుచితోనే విజయం సాధిస్తామని నమ్మి బాలకృష్ణ పోతుగల్ స్వీట్స్‌ను నడిపిస్తున్నారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా కస్టమర్ల నమ్మకాన్ని చూరగొన్నాడు. స్వీట్స్ రంగంలో అప్పటికే మార్కెట్‌లో పేరు గడించిన వ్యాపారులతో పోటీని తట్టుకొని రూ.వంద కోట్ల వ్యాపారం వైపు అడుగులు వేస్తున్నాడు. స్నేహితులు

రుచి.. శుచి.. నాణ్యతలే ప్రామాణికం

రఘునాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి అండతో స్వీట్స్ వ్యాపారం చేస్తూ 600 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నాడు. కస్టమర్లు 'పోతుగల్ ట్రెడిషన్ అండ్ హెరిటేజ్ స్వీట్స్' పేరుతో సంప్రదాయ మిఠాయిలకు కేరాఫ్ అడ్రస్‌గా బాలకృష్ణ బ్రాంచీలు నిలుస్తున్నాయి. తనకు కేటీఆర్ రోల్ మోడల్ అని కష్టపడి పనిచేసి నిజాయితీగా వ్యాపారం చేస్తే అది విజయతీరాలకు చేరుస్తుందని బాలకృష్ణ అంటున్నాడు. వెయ్యి మందికి ఉపాధి కల్పించి.. అమెరికా, బ్రిటన్‌లలో పోతుగల్ స్వీట్స్ ప్రారంభించే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్నట్లు పేర్కొన్నాడు.

ప్రపంచ నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగాం

- భారత్‌కు అర్జెంటీనా విశ్వసనీయమైన భాగస్వామి
- అర్జెంటీనాతో వివిధ రంగాల్లో కలిసి ముందుకెళ్తాం
- అర్జెంటీనా స్వాతంత్య్ర దిన వేడుకల్లో ప్రసంగించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ నాలుగో ఆర్థిక శక్తిగా నిలిచిన భారతదేశం.. గ్లోబల్ సౌత్ దేశాల అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. భారత్, అర్జెంటీనా దేశాల మధ్య బలమైన దౌత్య సంబంధాలున్నాయని.. వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, ఈ సంబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల అర్జెంటీనా పర్యటన సందర్భంగా అర్జెంటీనా అధ్యక్షుడు క్సావియర్ మిలేయితో పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు నిర్వహించినట్లు కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. అర్జెంటీనా స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్జెంటీనా ప్రభుత్వానికి, ప్రజలకు, భారత్‌లోని అర్జెంటీనా ఎంబసీ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్, అర్జెంటీనా మధ్య చాలా అంశాల్లో సారూప్యత ఉందని, ఇరుదేశాల్లో పర్యాటకం, సంస్కృతి, క్రీడలు (ఫుట్‌బాల్) తదితర అంశాల్లో ప్రజల మధ్య సంబంధాలున్నాయన్నారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు అయిన మారడోనా, మెస్సీలకు భారతదేశంలో వీరాభిమానులున్నారని, 2022లో అర్జెంటీనా సాకర్ ప్రపంచ కప్‌ను గెలుచుకున్న సందర్భంలో భారతదేశంలో క్రీడాభిమానులు సంబురాలు జరుపుకున్న విషయాన్ని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. భారతదేశంలో పెరుగుతున్న క్రిటికల్ మినరల్స్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అర్జెంటీనాతో ఈ రంగంలో వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నామని వివరించారు. క్రిటికల్ మినరల్స్‌లో భారతదేశానికి అర్జెంటీనా విశ్వసనీయమైన భాగస్వామిగా ఉందన్నారు. ఇటీవలే అర్జెంటీనా దేశంలోని కెటమార్కా ప్రావిన్స్‌లో 5 లిథియమ్ బ్లాక్స్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాబిల్ ద్వారా త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. రక్షణ, తయారీ, స్పేస్ టెక్నాలజీ, ఫార్మాసూటికల్, వైద్య రంగాల్లో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఉద్భవిస్తోందని, ఈ రంగాల్లో అర్జెంటీనాతో బలమైన భాగస్వామ్యానికి భారత్ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో భారతదేశంలో అర్జెంటీనా రాయబారి మారియానో అగస్టిన్ కౌచినో, అర్జెంటీనా ఎంబసీ అధికారులతోపాటు, ఢిల్లీలోని వివిధ దేశాల అంబాసిడర్లు, పారిశ్రామిక రంగ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



చేనులోంచి తీసి.. తలకు కట్టుకున్నారు..

ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా వేసవిని మించి ఎండలు దంచికొడుతున్నాయి. ఎండ, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతుండగా.. పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు అవస్థ పడుతున్నారు. ప్రస్తుతం పత్తి చేన్లలో కలుపు తీసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలులో కూలీలు పత్తి చేనులో కలుపులు తీసే సమయంలో ఎండ వేడికి తట్టుకోలేక తలపై కలుపు గడ్డి కట్టుకున్న దృశ్యం బుధవారం కనిపించింది. తలపై పచ్చని కలుపు మొక్కలు కట్టుకుని చేనులో అదే కలుపు తొలగిస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది.

- బూర్గంపాడు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)



మంగళవారం రాత్రి అధికారిక కార్యక్రమాలు ముగించుకుని వస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు.. హైదరాబాద్ కేబుల్ బ్రిడ్జి సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుడిని చూసి చలించిపోయారు. వెంటనే బాధితుడి వద్దకు వెళ్లి ధైర్యం చెప్పారు. స్వయంగా అతడిని ఆటోలో నిమ్స్ ఆస్పత్రికి పంపించారు. ఏదైనా అవసరమైతే తనకు ఫోన్ చేయాలని చెప్పడంతోపాటు నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

దళిత బంధు పేరిట ఇచ్చిన చెక్కులే చెల్లలేదు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మండిపాటు



సాక్షి, హైదరాబాద్: దళిత బంధు పథకం గురించి బీఆర్‌ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. దళితులపై నిజంగా ఆయనకు ప్రేమ ఉంటే పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో దళితబంధు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో గెలవాలని దళితబంధు స్కీం పెట్టారని, అక్కడి వాళ్లకు ఇచ్చిన చెక్కులు కూడా చెల్లకుండా పోయాయని ఎద్దేవా చేశారు. బుధవారం సత్యం మీడియాతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం స్కీంలు పెట్టడం మినహా దళితులపై బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి లేదని, తెలంగాణలో దళితుడే తొలి ముఖ్యమంత్రి అని చెప్పి మోసం చేశారన్నారు. మూడెకరాల భూమి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని, సబ్‌ప్లాన్ నిధులు మళ్లించి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దళితుల పట్ల కాంగ్రెస్ పార్టీకి కమిట్‌మెంట్ ఉందని, తమ పార్టీ జాతీయ అధ్యక్షుడే దళితుడని, తెలంగాణలో ఉపముఖ్యమంత్రితో పాటు ముగ్గురు దళితులను మంత్రులను చేశారన్నారు. కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే దళితుడికి బీఆర్‌ఎస్ అధ్యక్ష స్థానం లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డైటీషియన్ పదోన్నతులపై అసత్య ప్రచారం

- తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ నిజామొద్దీన్

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో డైటీషియన్ పదోన్నతులపై అసత్య ప్రచారం చేయడం తగదని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ నిజామొద్దీన్ పేర్కొన్నారు. పదేళ్లుగా పదోన్నతులకు నోచుకోని డైటీషియన్‌లకు మేలు చేసేలా ప్రభుత్వం 40 రోజుల క్రితం ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాను విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీలలో డిప్లొమా చేసిన వారే అర్హులని స్పష్టం చేశారు. కానీ కొన్ని శక్తులు పనిగట్టుకొని డైటీషియన్ పోస్టులలో లక్షలు చేతులు మారాయని, అనర్హులకు పదోన్నతి కల్పిస్తున్నారని ప్రచారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మంత్రి ఉత్తమ్‌కు హైకోర్టులో ఊరట

- ఎన్నికల కేసులో ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిబంధనల ఉల్లంఘన కింద నమోదైన మూడు కేసుల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఇందులో ఒక కేసును కొట్టివేయగా, రెండు కేసుల్లో ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. వాయిదా వేసిన రెండు పిటిషన్లలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2019 హుజూర్‌నగర్ ఉప ఎన్నిక సమయంలో తన భార్య పద్మావతికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి రోడ్ షో నిర్వహించినందుకు, మఠంపల్లి చౌరస్తాలో భారీ జనసమూహం మధ్య ప్రసంగం చేసినందుకు ఆయనపై కేసులు నమోదు చేశారు. చట్టవిరుద్ధంగా తనపై నమోదు చేసిన మూడు కేసులను కొట్టివేయాలని కోరుతూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కక్షలో భాగంగా గత ప్రభుత్వం తనపై పెట్టిన కేసులను కొట్టివేయాలని ఆయన కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదనలు వినిపించారు. ఈ వాదనలు విన్న న్యాయమూర్తి.. నేరేడుచర్లలో నమోదైన ఓ కేసును కొట్టివేశారు. మరో రెండు కేసుల్లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చితేనే మోక్షం

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చడం తప్ప మరో మార్గం లేదని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. న్యాయకోవిదుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా బీసీ రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు పంపడం దురదృష్టకరమన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ నేతలతో కలిసి శ్రీనివాస్ గౌడ్ బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి గతంలోనే అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదానికి పంపిన విషయాన్ని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. ఈ బిల్లును ఆమోదించాలని సీఎం రేవంత్ ఇప్పటి వరకు రాష్ట్రపతిని ఎందుకు కలవలేదని ప్రశ్నించారు. ఈ నెల 21 నుంచి పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి బీసీ బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. ఆర్డినెన్స్‌పై ఎవరూ కోర్టుకు వెళ్లొద్దని బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అది ఎలా సాధ్యమవుతుందని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ మోసగిస్తోందని వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు, పార్టీ నాయకులు నందికంటి శ్రీధర్, కె.కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

మా ఉత్తర్వుల అమల్లో జాప్యమెందుకు?

- పశుసంవర్థక శాఖ ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: తాము ఇచ్చిన ఉత్తర్వులను ఎందుకు అమలు చేయడం లేదో, జాప్యానికి కారణమేంటో నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని పశుసంవర్థక శాఖ స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆలా, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనివాస్, నాగర్‌కర్నూల్, వనపర్తి, కలెక్టర్లను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారికి ఫామ్–1 నోటీసులను జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 30కి వాయిదా వేస్తూ.. న్యాయస్థానానికి వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. 2023–24 సంవత్సరానికి తాము అందజేసిన ఫిష్ సీడ్స్‌కు సంబంధించిన నగదు చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని, తమకు రూ.28 లక్షలు ఇవ్వాలంటూ.. వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలం శాకాపూర్ గ్రామానికి చెందిన పుట్టా ఫిష్ సీడ్ ఫామ్ యజమాని బాలరాజు హైకోర్టులో పిటిషన్ వేశారు. మరికొందరు కూడా ఇలాగే పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న న్యాయమూర్తి.. 2023–24 చేప సీడ్స్ పంపిణీకి సంబంధించిన మొత్తాల చెల్లింపుపై మూడు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న నిర్ణయాన్ని పిటిషనర్లకు తెలియజేయాలని ఈ ఏడాది జనవరి 8న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నెలలు గడిచినా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అధికారులు అమలు చేయడం లేదని, ఉద్దేశపూర్వంగానే ఉల్లంఘిస్తున్నారంటూ బాలరాజు సహా మరికొందరు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ శ్రావణ్ కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది డీఎల్ పాండు హాజరై వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులైన అధికారులకు ఫామ్–1 నోటీసులు జారీ చేశారు. నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఏసీబీ వలలో కనకరత్నం..

- పీఆర్ శాఖలో విస్మయం

సాక్షి, హైదరాబాద్: పీఆర్ శాఖలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్–ఇన్–చీఫ్ (ఈఎన్‌సీ) కనకరత్నం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. ఎర్రమంజిల్‌లోని పీఆర్ ఈఎన్‌సీ కార్యాలయంలోనే ఆయన రూ.50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఈ ఏడాది మార్చి 31తో కనకరత్నం ఈఎన్‌సీగా ఉద్యోగ విరమణ చేశారు. ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించింది. శాఖాపరంగా ఉన్నతస్థానంలో ఉంటూ, ఏడాది సర్వీస్ పొడిగింపులో ఉన్న పీఆర్ ఇంజనీరింగ్ అధి కారి ఈ విధంగా ఏసీబీ చిక్కడంతో.. పీఆర్‌ఆర్‌డీ శాఖ ఉద్యోగుల ప్రతిష్ట కూ డా దిగజారినట్టయ్యిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సొంత శాఖలో ఒక డీఈ బదిలీ విషయంలో ఈఎన్‌సీ లంచం డిమాండ్ చేయడంతో సదరు అధికారి ఏసీబీని ఆశ్రయించారు. బుధవారం ఈ మేరకు ఈఎన్‌సీ కార్యాలయంలో ఆ డీఈ నుంచి లంచం డబ్బు స్వీకరిస్తుండగా కనకరత్నంను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సదరు డీఈ తనను తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ చేయాలని కోరగా.. కనకరత్నం రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కనకరత్నంను ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని డబ్బును స్వాధీనం చేసుకుంది. పీఆర్ కార్యాలయం, కేపీహెచ్‌బీ కాలనీలోని ఆయన నివాసంలోనూ సోదాలు నిర్వహించింది. అనంతరం కనకరత్నంను అరెస్ట్ చేసినట్టు ఏసీబీ వెల్లడించింది.

కాళేశ్వరం దోపిడీదారుల ఆస్తులు జప్తు చేయాలి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో దోపిడీ చేసిన వారి ఆస్తులను జప్తు చేసి రాష్ట్ర ప్రజలకు పంచాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె.మదన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన వారిలో ఎవరి ఆస్తులను లెక్క కట్టినా.. అంచనాలకు మించి ఉంటున్నాయని ఆరోపించారు. ప్రజా వినియోగ కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన.. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ఈఎన్‌సీగా పనిచేసిన మురళీధర్‌రావు దగ్గరే రూ.500 కోట్లు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ లెక్కన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల దగ్గర ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల 'పని' విధానాన్ని రద్దు చేయాలి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు పని (హవర్లీ బేస్) విధానాన్ని రద్దు చేయాలని డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ కోరింది. గతేడాది పనిచేసిన ప్రతీ డిగ్రీ గెస్ట్ లెక్చరర్‌ను రెన్యువల్‌తో కంటిన్యూ చేయాలని డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్ర ఈశ్వర్ లాల్, ప్రధాన కార్యదర్శులు భగ్గు, నరేందర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ట్రెజరర్ శివ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఎస్సీ గురుకులంలో అనర్హులకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు టిగారియా ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ గురుకుల సొసైటీలో అనర్హులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించారని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టిగారియా) కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్దన్, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ పరిపాలన అంశంతో పాటు ఉద్యోగుల సర్వీసు నిబంధనల విషయంలో నిర్ణయాధికారం గతంలో సొసైటీ చైర్మన్‌కే ఉండేదని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఈ నిబంధన మారడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే 2014, 2018లో చేపట్టిన ప్రిన్సిపాళ్ల పదోన్నతుల్లో నకిలీ సర్టిఫికెట్లు, గుర్తింపు లేని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ చదివిన వారికి పదోన్నతులు ఇచ్చారన్నారు. దీంతో అసలైన అర్హులకు అన్యాయం జరిగిందని, సంస్థలో జోనల్, డిప్యూటీ సెక్రటరీ పదోన్నతుల్లో మేల్, ఫిమేల్ నిష్పత్తి సరిగా లేకపోవడం అసమానతలకు దారితీస్తోందని తెలిపారు. ఇలాంటి అంశాలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ బుధవారం టిగారియా ప్రతినిధులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

అబార్షన్ కిట్ల విక్రయాలపై ప్రత్యేక దాడులు

- 149 మెడికల్ షాపులకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా అబార్షన్ కిట్లు విక్రయిస్తున్న మందుల దుకాణాలపై ప్రత్యేక దాడులు నిర్వహించినట్లు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 149 మెడికల్ షాపుల్లో బుధవారం తనిఖీలు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా సదరు దుకాణదారులు గర్భ విచ్ఛిత్తి మందులను విక్రయిస్తున్నట్లు తేలిందని తెలిపారు. మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టాల్ ట్యాబ్లెట్లను విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. గర్భ విచ్ఛిన్నానికి వినియోగించే మందుల విక్రయాలను అరికట్టేందుకు ఈ ప్రత్యేక దాడులు కొనసాగిస్తామని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పేర్కొన్నారు.

ప్రభంజన్ యాదవ్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టుగా, మేధావిగా ప్రభంజన్ యాదవ్ క్రియాశీలకంగా పనిచేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రభంజన్ యాదవ్ మహాత్మా పూలే, అంబేడ్కర్ సామాజిక తాత్విక ఆలోచనా దృక్పథంతో బీసీల హక్కులు, ప్రగతి కోసం నిరంతరం తపించాడన్నారు. ఆయన మరణంతో తెలంగాణ ఒక గొప్ప తాత్వికున్ని, సామాజిక ఉద్యమకారున్ని కోల్పోయిందని కేసీఆర్ విచారం వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, కల్వకుంట్ల కవిత వేర్వేరు ప్రకటనల్లో ప్రభంజన్ యాదవ్ మరణం పట్ల సంతాపం ప్రకటించారు.



ప్రయాణం... ఆహ్లాదం

ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు నుంచి చీమకుర్తికి వెళ్లే రహదారి ప్రయాణికులకు చక్కటి అనుభూతినిస్తోంది. రోడ్డుకు ఇరువైపుల ఎప్పుడో నాటిన చెట్లు...వాటి నుంచి వచ్చే నీడలో..ఎండ తీవ్రత తెలియకుండా వాహనచోదకులు ఆహ్లాదకరమైన ప్రయాణాన్ని సాగిస్తున్నారు.



బాబోయ్.. ఎండలు

ఓ వైపు వర్షాకాలం వచ్చినా...ఎక్కడా వరుణిడి జాడ కనిపించడం లేదు. దీనికి తోడు పగటి ఉష్ణోగ్రతలు ఎండాకాలాన్ని మరిపిస్తుండటంతో విశాఖ వాసులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక నగరంలోని ఓ చిన్నారి గొడుగు నీడన పాఠశాల నుంచి వస్తున్న దృశ్యమిది.



వాహనాలు ఇలా..చెత్త సేకరణ ఎలా?

నెల్లూరులో చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఖాళీ ప్రదేశంలోని పిచ్చి చెట్ల మధ్య అధికారులు ఉంచేశారు. దీంతో వాహనాలు తుప్పపట్టి పాడైపోతున్నాయని తక్షణం వాటికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

రైతులను పట్టించుకోకుండా భూ సేకరణ ప్రకటనలా..!

రైతు స్వరాజ్య వేదిక విమర్శ

సాక్షి, అమరావతి: కర్ణాటక ప్రభుత్వం భూసేకరణను నిలిపివేసిన ఏరోస్పేస్ పరిశ్రమకు ఆంధ్రప్రదేశ్‌లో 8,000 ఎకరాల భూమిని కేటాయిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనను రైతు స్వరాజ్య వేదిక తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు సులభంగా లభిస్తాయని, పాలనా విధానాలను మరింత సులభతరం చేస్తామని, సామాజిక మాధ్యమాల ద్వారా పరిశ్రమను ఆహ్వానిస్తూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనను ఆ వేదిక రాష్ట్ర కమిటీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ మేరకు వేదిక అధ్యక్షుడు విస్సా కిరణ్ కుమార్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ, కర్ణాటకలో 1,200 రోజులుగా రైతులు తీవ్రంగా వ్యతిరేకించి తిరస్కరించిన పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌కు తెచ్చే ప్రయత్నం చేయడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. ఎందుకు ఆ రాష్ట్రం తిరస్కరించిందో పరిశీలించకుండా, ఇక్కడి రైతులు, ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా అడుగులు వేయడం బాధాకరమని అన్నారు. రైతుల నిధులు, భూములు, జీవనాధారాలపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే ముందు కనీస స్థాయిలో వారిని సంప్రదించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

మసాల్చీల దినసరి వేతనం పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ కోర్టులలో దినసరి వేతనంతో పనిచేస్తున్న మసాల్చీల (సహాయక సిబ్బంది) దినసరి వేతనాన్ని రూ.300 నుంచి రూ.570కి పెంచుతున్నట్లు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ వెల్లడించారు. అంతేకాకుండా వేతనాన్ని నెలలో 26 రోజుల పాటు వర్తింపజేస్తున్నామని బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మసాల్చీలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న వేతన సమస్యను పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు. ఇక నుంచి వారు నెలకు రూ.14,820 వరకు వేతనం పొందుతారన్నారు.

62 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయుల సేవలు కొనసాగింపు

ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: మహాత్మ జ్యోతిరావుపూలే, ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్ల సేవలను ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 62 మంది టీజీటీ, పీజీటీ, ఇతర టీచర్ల సేవలను 2025 జూన్ 1 నుంచి 2026 ఏప్రిల్ 30 వరకు (11 నెలల కాలానికి) పునరుద్ధరించినట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైద్య బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తగదు: వైఎస్సార్‌టీఏ

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వైద్య ఖర్చుల బిల్లులు వెంటనే చెల్లించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డి శేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యవసర పరిస్థితిలో ప్రభుత్వ గుర్తింపు లేని ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న ఉద్యోగుల బిల్లులు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. జిల్లాల నుంచి పంపిన దాదాపు 2 వేలకు పైగా బిల్లులు గతేడాది ఆగస్టు నుంచి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. ఆస్పత్రుల్లో ముందస్తుగా ఖర్చులు పెట్టి ఆర్థికంగా, ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే మెడికల్ బిల్లుల రీ ఇంబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

సీఎస్ఈకి..సై

వెబ్ ఆప్షన్లలో ఆ కోర్సుపై విద్యార్థుల మక్కువ

ఇంజినీరింగ్ అంటేనే సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్) అనేలా విద్యార్థులు ఎక్కువ మంది ఈ బ్రాంచ్‌పైనే మక్కువ చూపుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు డోకా ఉండదని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. పేరు పొందిన కంపెనీల్లో జాబ్ కొడితే రూ.లక్షల్లో ప్యాకేజీలు ఉంటాయనే ఆశతో సీఎస్ఈ బ్రాంచ్‌పై అందరి చూపు అటు వైపే నిలుస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు కళాశాలల్లో సీఎస్ఈ కోర్సు డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్నాయి. మేనేజ్‌మెంట్ సీట్ల పరిమితి లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచుకొని రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఇప్పటికే పేరుపొందిన కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయనే ప్రచారం విద్యార్థుల్లో నడుస్తోంది.



సీఎస్ఈ తరువాత ఏఐ, డేటాసైన్స్, ఎమ్ఎల్, ఎస్ఎస్ కోర్సులకు డిమాండ్

- ఇదే అదునుగా రెచ్చిపోతున్న ప్రైవేటు కళాశాలలు
- ఏడాదికి రూ.3 నుంచి రూ.4 లక్షలు వసూలు చేస్తున్న వైనం
- పేద విద్యార్థులకు దూరంగా సీఎస్ఈలోని అధునాత కోర్సులు
- మిగిలిన కోర్సులకు వెబ్ ఆప్షన్ పెడితే చాలు సీటు పక్కా



తిరుపతి సిటీ : రాష్ట్రంలో ఇంజినీరింగ్ అడ్మిషన్ల హడావుడి ప్రారంభమైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎవరితో మాట్లాడినా వెబ్ ఆప్షన్ల ఎంపికపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏపీ ఈఏఎమ్‌సెట్–2025 వెబ్ ఆప్షన్ల ప్రక్రియ రెండు రోజుల నుంచి ప్రారంభం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతో నెట్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. సెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన 90 శాతం మంది విద్యార్థులు సీఎస్ఈ గ్రూప్‌నే తమ వెబ్ ఆప్షన్లలో తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండవ ప్రాధాన్యంగా ఈసీఈ కోర్సును ఎంచుకుంటున్నారు. అయితే ఒకప్పుడు తిరుగులేని గ్రూపులుగా వెలుగొందిన ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సులపై కనీసం 10 శాతం మంది కూడా తొలి ప్రాధాన్యం ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో ఈ ఏడాది అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో కన్వీనర్ కోటాలో ఏదో ఒక కళాశాలలో సీటు పక్కా వచ్చేందుకు వీలుంటుందని విద్యా శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.

20 వేల మందికి ఇదే కోర్సుకు ..

ఇప్పుడంతా సీఎస్ఈ బ్రాంచ్ చుట్టూ తిరుగుతోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే ప్రచారంతో పాటు పేరొందిన కంపెనీలలో లక్షల ప్యాకేజీలతో మెట్రోపాలిటన్ సిటీలలో ఉద్యోగం లభిస్తుందన్న ఆశతో ఆ గ్రూప్‌నకు డిమాండ్ పెరుగుతోంది. ఇందులో ప్రధానంగా సీఎస్ఈ జనరల్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్ టెక్నాలజీ వంటి కోర్సుల హవా కొనసాగుతోంది. తిరుపతి జిల్లాలో సుమారు 25 వేల మంది వరకు ఏపీఈఏఎమ్‌సెట్ పరీక్షకు హాజరు కాగా ఇందులో 22,500 మంది అర్హత సాధించారు. ఇందులో ఇప్పటివరకు సుమారు 22 వేల మందికి పైగా విద్యార్థులు సీఎస్ఈ బ్రాంచ్‌లోని పలు కోర్సులకు దరఖాస్తు చేసుకున్నారంటే డిమాండ్ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రైవేటు కళాశాలలు సొమ్ము చేసుకుంటూ..

సీఎస్ఈ కోర్సుకు ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఇదే అదునుగా రెచ్చిపోతూ ఫీజుల పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. అన్ని ప్రైవేటు, కార్పొరేట్, డీమ్డ్, అటానమస్ విద్యా సంస్థలలో సీఎస్ఈ కన్వీనర్ కోటా సీట్లు తప్ప మేనేజ్‌మెంట్, పేమెంట్ సీట్లను పూర్తి స్థాయిలో ఇప్పటికే అమ్ముడు పోయాయి. ఏఐసీటీఈ గత ఏడాది సీట్ల పరిమితిపై ఉన్న సీలింగ్‌ను ఎత్తి వేయడంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా తమ కళాశాలలో డిమాండ్ ఉన్న కోర్సులకు సీట్లు పెంచుకుంటున్నాయి. కళాశాల స్థాయి, పేరు ప్రతిష్టల ఆధారంగా యాజమాన్యాలు ఒక్కో కోర్సుకు ఏడాదికి సుమారు. రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విద్యార్థుల నుంచి వసూలు చేసి కేవలం రూ.70 వేలకు రసీదులు ఇచ్చి పంపుతున్నారు. తిరిగి మాట్లాడితే విద్యార్థికి సీటు లేదంటూ వెనక్కి పంపుతారనే భయంతో తల్లిదండ్రులు ఏమీ చేయలేని స్థితిలో వారు అడిగినంతా ఫీజు చెల్లించి వెనుదిరుగుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాల ఇష్టారాజ్యాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న ఉన్నత విద్యామండలి అధికారులు ఏమీ చేయలేమని చేతులెత్తి కూర్చోవడం గమనార్హం.

పేదలకు దూరంగా అధునాతన కోర్సులు

డిమాండ్ ఉన్న కోర్సులుగా వెలుగొందుతున్న సీఎస్ఈ బ్రాంచ్‌లోని ఏఐ, డేటా సైన్స్, ఎమ్ఎల్, ఎస్ఎస్ కోర్సులు పేద విద్యార్థులకు అందనంత దూరంలో నిలిచాయి. ఏపీఈఏఎమ్ సెట్‌లో సీటు సాధించినా ప్రైవేటు కళాశాలలో సీటు దొరకడం కష్ట తరమవుతోంది. లక్షలలో ఫీజుల చెల్లించలేని పేద విద్యార్థులు ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. సీఎస్ఈ కోర్సు కేవలం ధనవంతుల కోర్సుగా మిగిలిపోయిందని మేధావులు, విద్యావంతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏఐ కోర్సు చేయాలని..



ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్‌లలో సీఎస్ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చాను. ఏఐకి క్రేజ్‌తో పాటు భవిష్యత్తు ఉంది. కష్టపడి చదివితే మంచి ప్యాకేజ్‌తో ఉన్నత స్థాయి ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఉంది. ఏఐ కోర్సుకు ఎస్వీయూ పరిధిలో పేరొందిన కళాశాలలకు తొలి ప్రాధాన్యతగా పెట్టుకున్నా.

–ప్రవల్లిక, విద్యార్థిని, తిరుపతి

డేటా సైన్స్, ఏఐ ఆప్షన్లు పెట్టాను



ఏపీఈఏఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ వచ్చింది. డేటా సైన్స్ లేదా ఏఐ చేయాలని ఉంది. ఈ క్రమంలో తొలి ప్రాధాన్యం డేటా సైన్స్, రెండో ప్రాధాన్యం ఏఐకి ఇచ్చాను. కచ్చితంగా నేను అనుకున్న కళాశాలలో సీటు వస్తుందని ఆశిస్తున్నా. ఫారిన్‌లో ఎమ్ఎస్ చేయాలని ఉంది.

– పృథ్వీ, విద్యార్థి, తిరుపతి

రక్త పోటు.. చక్కెరతో చేటు



మారిన జీవన శైలితో జబ్బుల బారిన జనం

- 30 ఏళ్లకే బీపీ బారిన పడుతున్న వైనం
- ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్న మధుమేహం

- ధర్మవరానికి చెందిన 32 ఏళ్ల సచివాలయ ఉద్యోగి ఇటీవల జ్వరంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు మధుమేహం (షుగర్) వచ్చిందని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. అయితే తమ ఇంట్లో ఎవరికీ షుగర్ లేదని, అయినా ఇంత చిన్న వయసుకే తనకు ఎలా వస్తుందని వైద్యులతో వాదనకు దిగాడు. మరోచోట పరీక్షించుకున్నా ఫలితంలో మార్పులేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.
- హిందూపురం పట్టణానికి చెందిన 37 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగికి వారం రోజుల పాటు నిరంతరంగా తలనొప్పి రావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికెళ్లి చికిత్స చేయించుకున్నాడు. రక్తపోటు అధికమైందని వైద్యులు చెప్పారు. ఒకే విషయాన్ని పదే పదే ఆలోచించడం.. ఆహారపు అలవాట్లలో తేడా కారణంగా బీపీ పెరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. మసాలా, కారం, ఉప్పు తగ్గించాలని సూచించారు.

సాక్షి, పుట్టపర్తి

మారిన ఆహార అలవాట్లు, జీవన శైలి మనిషిని జబ్బుల బారిన పడేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడితో కూడిన ఉద్యోగాలతో చాలా మంది చిన్న వయస్సులోనే రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే నలుగురు కలిస్తే అందులో ఇద్దరికి బీపీ, మధుమేహం ఉంటోంది. ఇక వయసు మీద పడే కొద్దీ రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

మూడు పదుల వయస్సులోనే...

మారిన జీవనశైలి కారణంగా మూడు పదుల వయసులోనే.. బీపీ, షుగర్ బారిన పడుతున్న వారి సంఖ్య కూడా రోజురోజుకూ రెట్టింపు అవుతోంది. ఇక తీవ్ర ఒత్తిడితో మానసికంగా ఇబ్బందులు పడుతున్న వారు చాలా మందే ఉన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి రంగంలోనూ పోటీ పెరిగింది. ఫలితంగా ప్రతి ఒక్కరూ ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలోనే సమయానికి ఆహారం తీసుకోకపోవడం.. ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడటం తదితర కారణాలతో లేని పోని రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. అయితే తాము బీపీ, షుగర్ బాధితులమని సగం మందికి తెలియకపోవడం గమనార్హం. ఏదైనా అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వెళ్తే.. ఉన్నఫలంగా ఈ రెండూ బయటపడుతున్నాయి. ఆ తర్వాత పదే పదే ఆరోగ్యం గురించి ఆలోచించడంతో మరిన్ని రోగాలు వెంటాడుతున్నాయి.

చిన్న వయసులోనే ఆస్పత్రుల చుట్టూ..

పుట్టుకతోనే ఆస్పత్రులు చూడాల్సిన కాలంలో బతుకుతున్న సమాజంలో.. డాక్టర్ల చుట్టూ తిరగడం నిరంతర ప్రక్రియగా మారింది. చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరిన వెంటనే ఏదో రోగం వెంటాడుతోంది. మానసిక ఒత్తిళ్లతో బీపీ, షుగర్ వెంటనే పలకరిస్తున్నాయి. కంప్యూటర్ కాలంలో నిత్యం బిజీబిజీగా గడిపే వారంతా రోజులో గంటసేపు కూడా శారీరక వ్యాయామం గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఎక్కువ మంది మధుమేహం బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

పట్టణాల్లోనే అధికం

రక్తపోటు, మధుమేహం బాధితుల సంఖ్యను ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. గ్రామాల కంటే పట్టణాలోనే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఆహారపు అలవాట్లతో పాటు ప్రతి ఒక్కరూ శారీరకంగా శ్రమిస్తారు. అలాగే మసాలా, ఫాస్ట్ ఫుడ్ అందుబాటులో ఉండవు. సమయానికి తింటూ నిత్యం ఏదో పనిలో ఉంటారు. అయితే పట్టణ ప్రజలు నిత్యం బిజీగా ఉండటంతో పాటు సమయానికి భోజనం తినరు. శారీరక వ్యాయామం చేయరు. పైగా పిజ్జాలు, ఫాస్ట్‌ఫుడ్, మసాల ఆహారానికి అలవాటు పడుతున్నారు. దీంతో చిన్న వయసులోనే బీపీ, షుగర్ రోగాల బారిన పడుతున్నారు.



నియంత్రణే శ్రీరామరక్ష

ప్రతి మనిషికీ ఆరోగ్యమే ప్రధానం. ఆరోగ్యం బాగుంటే కుటుంబంలో అందరూ ప్రశాంతంగా ఉంటారు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే రోగాల బారిన పడకుండా ఉండవచ్చు. ఆహారపు అలవాట్లు బాగుంటే రోగాలు దరి చేరవు. శారీరక శ్రమ అవసరం. సోమరితనంతో లేనిపోని రోగాలు రావడం ఖాయం. ముందస్తు నియంత్రణ మార్గాలే ఆరోగ్యానికి శ్రీరామరక్ష.

– ఫైరోజాబేగం, శ్రీసత్యసాయి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

బదిలీల పేరుతో బంతాట!

- బదిలీ చేసిన చోట చేరడానికి సచివాలయాల ఉద్యోగులకు రాజకీయ ఇబ్బందులు
- ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వద్దన్నారంటూ చాలాచోట్ల విధుల్లో చేర్చుకోని దుస్థితి
- దివ్యాంగులకు సైతం తప్పని తిప్పలు
- పోస్టింగ్ కోసం ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్న వందలాది మంది ఉద్యోగులు



సాక్షి, అమరావతి: ఉమ్మడి కృష్ణా జిల్లా పెనమలూరు మండలంలో పని చేస్తున్న దివ్యాంగ కేటగిరీకి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఇబ్రహీంపట్నం మండలంలోని ఒక గ్రామ సచివాలయానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. అక్కడ విధుల్లో చేరేందుకు ఆయన రెండు రోజుల కిందట వెళ్లారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలో వేచి ఉన్నా, ఆయన నుంచి జాయినింగ్ రిపోర్టు తీసుకోలేదు. కారణం అడిగితే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని సచివాలయ సిబ్బంది బదులిచ్చారు. ఈ విషయాన్ని సదరు వెల్ఫేర్ అసిస్టెంట్ జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తే... మరోచోటకు బదిలీ చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది సచివాలయాల ఉద్యోగులు ఇదే రకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఎమ్మెల్యే కార్యాలయం ఆదేశాలు లేకపోతే ఉద్యోగులు విధుల్లో కూడా చేరలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


వారం కిందటే బదిలీల ప్రక్రియ ముగిసినా...

సచివాలయాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ అధికారికంగా వారం రోజుల కిందటే ముగిసింది. సినియారిటీతో సంబంధం లేకుండా అధికార పార్టీ నేతల సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని వేలాది మంది ఉద్యోగులను ఇష్టానుసారం బదిలీ చేశారు. అయితే, బుధవారం నాటికి కూడా చాలాచోట్ల బదిలీ అయిన స్థానాల్లో ఉద్యోగులను విధుల్లో చేర్చుకోవడం లేదు. తమను ఎందుకు విధుల్లో చేర్చుకోవడం లేదని సచివాలయాల ఉద్యోగులు ప్రశ్నిస్తే... 'మిమ్మల్ని చేర్చుకోవద్దని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది' అంటూ అక్కడ పనిచేసే తోటి పర్యవేక్షణ సిబ్బంది బదులిస్తున్నారు. దీంతో వివిధ కేటగిరీలకు చెందిన వందలమంది ఉద్యోగులు తమ బదిలీల ఉత్తర్వుల కాపీలను పట్టుకొని పోస్టింగ్‌ల కోసం జిల్లా శాఖాధిపతుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇందులో దివ్యాంగులు కూడా ఉన్నారు. అధికార పార్టీ నేతలు తమ రాజకీయ స్వార్థం కోసం సచివాలయ ఉద్యోగులతో చెలగాటం ఆడుతున్నారని ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 73,020 మంది స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.19 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అయ్యప్పకు విశేష పూజలు



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

జాతకంలో కాలసర్ప దోషం, కళత్ర దోషాలు ఉంటే ఆ దోషాలను తొలగించుకునేందుకు శ్రీకాళహస్తి వెళ్లి రాహుకేతు దోష పూజలు చేయించుకోవడం తెలుగువారి మరి తమిళ తంబీలకు..? వాళ్లకు కూడా ఇలాంటి క్షేత్రం ఒకటి ఉంది. అదే తిరుప్పాంపురం. రాహుకేతువులు ఏకశరీరంగా ఉన్న మహా మహిమాన్వితమైన సర్పక్షేత్రమిది. ఉత్తర శ్రీకాళహస్తిగా పేరు పొందిన ఈ క్షేత్రం తమిళులకు అత్యంత పవిత్రమైనది. తమిళులే కాదు.. ఇరుగు పొరుగు రాష్ట్రాల వారు కూడా ఈ క్షేత్రాన్ని దర్శించుకుని సర్పదోషనివారణ పూజలు చేయించుకుని ఉపశమనం పొందుతుంటారు.



తమిళుల కాళహస్తి తిరుప్పాంపురం

తిరుక్కాళత్తి, కుడండై, తిరునాగేశ్వరం, నాగూర్, కీయ్ పెరుపల్లం తదితర అయిదు పుణ్యక్షేత్రాల గొప్పతనాన్ని ఒక్కటిగా కలిగి ఉన్న పవిత్ర స్థలమే తిరుప్పాంపురం. సాక్షాత్తూ సర్పాలే తమకు కలిగిన దోషాన్ని ఇక్కడకు వచ్చి తొలగించుకున్న గాథలు ఉన్నాయి. తిరుప్పాంపురం ఆలయంలో ఉన్న దైవం పేరు శేషపురీశ్వరుడు. అమ్మవారు వండుచేర కుయిలి. ఇక్కడ ఉన్న పుణ్య తీర్థం ఆదిశేష తీర్థం. ఈ ఆలయ విశిష్టతను తమిళ వాల్మీకిగా కొనియాడబడిన తిరునావుక్కరుసు వంటివారు కొనియాడారు.









స్థలపురాణం: ఒకసారి కైలాసంలో శివుడిని వినాయకుడు పూజిస్తున్నాడు. అప్పుడు శివుడి మెడలోని పాములు తమనూ కలుపుకుని పూజిస్తున్నట్లు గర్వపడ్డాయి. అది గ్రహించిన శివుడు ఆగ్రహించి, ఇక మీదట నాగుపాములన్నీ తమ దివ్యశక్తులను కోల్పోయి సామాన్య సర్పాలవలె మానవుల చేత చిక్కి నానాహింసల పాలూ అయి మరణిస్తాయని శపించాడు. దీంతో శివుడి మెడలోని వాసుకితోపాటు రాహుకేతువులు తదితర సర్పాలు తమ శక్తిని కోల్పోయి తల్లడిల్లాయి. అవి తమ తప్పును తెలుసుకుని తమకు శాపవిమోచనం కల్పించవలసిందిగా పరమేశ్వరుని ప్రాధేయపడ్డాయి. దాంతో బోళాశంకరుడి మనసు కరిగిపోయింది. మహాశివరాత్రి రోజున తిరుప్పాంపురం వెళ్లి అక్కడ కొలువై ఉన్న తనను ఆరాధిస్తే శాపవిమోచనం కలుగుతుందని చెప్పాడు.

అప్పుడు వాసుకి, ఆదిశేషుడు తదితర అన్ని నాగులూ కలసి ఆ ఏడాది మహాశివరాత్రిరోజు తెల్లవారు ఝామునే తిరునాగేశ్వరంలోని నాగనాథ స్వామిని, తిరుప్పాంపురంలోని పాంబునాథుడిని, నాగూరులోని నగనాథుని ఆరాధించాయి. తిరుప్పాంపురం క్షేత్రంలో ఆరాధించిన వెంటనే నాగుల శాపం తొలగిపోయింది. ఇక్కడ ఈశ్వరుడిని ఆరాధించేందుకు వచ్చిన సర్పాలు ఒక పుణ్యతీర్థాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఆ తీర్థానికే ఆదిశేష తీర్థమని పేరు. బ్రహ్మ, ఇంద్రుడు, అగస్త్యుడు, గంగాదేవి వంటి వారు ఇక్కడి ఆలయాన్ని సందర్శించి ధన్యులైనట్లు పురాణగాథలున్నాయి.

ఇక్కడ ఉన్న మూడవ కుళోత్తుంగ చోళుడి శిలాఫలకాన్ని బట్టి చూస్తే ఈ ఆలయం సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం నాటిదని చెప్పవచ్చు. తంజావూరును పాలించిన శరభోజి చక్రవర్తి పాలనలో ఈ ఆలయానికి వసంతమండపాన్ని, తూర్పుదిక్కుగా రాజగోపురాన్ని నిర్మించారు. ఈ గోపురానికి ఎదురుగానే ఆదిశేష తీర్థం ఉంది. ఇక్కడ ఉన్న వినాయక విగ్రహానికి కూడా పూజలు నిర్వహిస్తారు. ఇక్కడి స్వామికి శేషపురీశ్వరుడు, పాంబుపుర నాథుడు, పాంబుపురీశ్వరుడు తదితర నామాలున్నాయి. గర్భగుడిలో శివుని పూజించే రీతిలో ఉన్న ఆదిశేషుని విగ్రహం కనువిందు చేస్తుంది. వెలుపలి ప్రాకారానికి ప్రదక్షిణ మార్గంలో భైరవుడు, సూర్యుడు, దుర్గ, శనీశ్వరుడు, రాహువు, కేతువు తదితర సన్నిధులున్నాయి. ఇక్కడ ఉన్న రావిచెట్టుకింద అసంఖ్యాకంగా సర్పశిలలున్నాయి. ఆలయంలో ఈశాన్య దిక్కు మూలలో రాహుకేతువులు ఒకే సన్నిధిలో కనిపిస్తారు. ఇక్కడ రాహుకాల పూజలు విశేషంగా జరుగుతాయి. అలాగే సర్పదోష పరిహార పూజలకు ఈ ఆలయం పెట్టింది పేరు. రాహుకాలంలో ఆలయం తెరిచిన వెంటనే నేతిదీపాలు కొని వెలిగిస్తారు. రాహు, కేతు దోషాల పరిహారపూజలకు తగిన సంభారాలు ఇక్కడే లభిస్తాయి. సర్పదోష నివృత్తి కోసం వచ్చిన భక్తులు ఆలయంలో పూజలు చేయించుకుంటూ కనిపిస్తారు. జాతకంలో సర్పదోషం ఉన్నవారు, రాహుకేతువులకు మొక్కుకుని, తిరుప్పాంపురంలో పూజలు చేయించుకునే వారు అధిక సంఖ్యాకంగా కనిపిస్తుంటారు.

– డి.వి.ఆర్. భాస్కర్

ఎలా వెళ్లాలంటే..?

తమిళనాడులోని కుంభకోణం నుంచి కారైక్కాల్ వెళ్లే దారిలో ప్రధాన రహదారికి మూడు కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. చెన్నై సెంట్రల్ నుంచి కుంభకోణానికి రైళ్లు, బస్సులు ఉన్నాయి. కుంభకోణం వరకు వెళ్తే అక్కడ నుంచి తిరుపాంపురం వరకు వెళ్లడానికి మినీ బస్సులు, ఆటోలు, ప్రైవేటు వాహనాలు, ఆర్టీసు బస్సులు ఉన్నాయి.

చూడదగ్గ ఇతర ప్రదేశాలు: సాధారణంగా తమిళనాడులోని నవగ్రహాలయానికి వెళ్లే వారు ఇక్కడికి వస్తుంటారు లేదంటే ఇక్కడికి వచ్చినవారు నవగ్రహాలయానికి వెళ్తారు. అలాగే కుంభకోణంలోని ఐరావతీశ్వరన్ ఆలయం, ఉప్పిలియప్పన్ ఆలయం, ఆది కుంభేశ్వరన్ ఆలయం, సారంగపాణి ఆలయం, అరుల్‌మిగు స్వామినాథన్ ఆలయం, సూర్యనాయర్ కోయిల్, పట్టీశ్వరం ఆలయం తదితరాలున్నాయి.

● నిర్మల వాణి

శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం - విశిష్టత

శ్రీ మహావిష్ణువు అవతారమైన శ్రీ హయగ్రీవుడిని రహస్యంగా భావించే సహస్రనామాలను తనకు ఉపదేశించమని అగస్త్య మహర్షి అభ్యర్థిస్తాడు. హయగ్రీవుడు శ్రీ లలితా సహస్రనామాలకు గల అనంత శక్తి కారణంగా దానిని యోగ్యులైన పుణ్యాత్ములకు మాత్రమే తెలియజేయవలసి ఉంటుందని, అతనికి శ్రీ లలితా సహస్రనామ మూలాన్ని ఉపదేశిస్తాడు.

దీనికి స్వరకర్తలు వసిని మొదలైన వాగ్దేవతలు. శ్రీ లలితా దేవి ఆజ్ఞపై వసినీ మొదలైన వాక్ దేవతలు శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రాన్ని రచించారు. వారు రహస్య మంత్రాలతో కూడిన వేయి నామాలను కూర్చారు. శ్రీ లలితా దేవి ఆస్థానంలో మొదటి సారిగా వాక్ దేవతలు సకల దేవతలు మంత్రిణి, దండిని ఇతర శ్రీ మాత అనుచరుల సమక్షంలో ఈ సహస్ర నామాన్ని పఠించారు.

శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం విని ముగ్ధురాలైన అమ్మ వారు తన భక్తులను అనుగ్రహించేందుకు ఈ విధముగా ప్రకటించింది 'ఈ నామాలను ఎవరు అనుసరిస్తారో/ ఆచరిస్తారో.. ఎవరు ప్రతిరోజు ఈ లలిత సహస్ర నామ స్తోత్రాన్ని చదువుతూ ఉంటారో, వారి యందు నాకు ప్రీతి కలిగి వారికి సంబంధించిన సమస్త యోగ క్షేమాలను నేనే స్వయంగా చూసుకుంటాను' అని. కాబట్టి ఈ స్తోత్రం అమ్మ వారి పూర్ణానుగ్రహం తప్ప మరొకటి కాదు.



శ్రీ మాత స్వయంగా చెప్పినట్లు, శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం అన్ని రకాల సమస్యలను నయం చేసే శక్తివంతమైన పరిష్కారం.

ఈ స్తోత్రం చివరలో బ్రహ్మాండ పురాణంలో స్తోత్రం ఉనికి గురించిన ప్రకటన ఉంది.

ఇతి శ్రీ బ్రహ్మాండపురాణే, ఉత్తరఖండే, శ్రీ హయగ్రీవాగస్త్య సంవాదే, శ్రీలలితా రహస్య నామ సాహస్ర స్తోత్ర కథనం నామ ద్వితీయోధ్యాయః

శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం బ్రహ్మాండ పురాణం 36వ అధ్యాయం 'లలితోపాఖ్యానం'లో ఉంది. ఇందులో శ్రీ లలితాదేవిని సకల శక్తిస్వరూపిణిగాను, సృష్టిస్థితిలయాధికారిణిగాను వర్ణించారు. ఈ స్తోత్రం గురించి తెలియని వారు ఎవరూ ఉండరు. నిత్యం ఈ స్తోత్రాన్ని పారాయణం చేసేవారు చాలా మంది ఉంటారు. అయితే ఇందులో ఉన్న అమ్మవారి నామాలను అర్థం చేసుకొని వాటిని ధ్యానంలో ప్రత్యక్షంగా అనుభూతి చెందుతూ అనన్యమైన భక్తి శ్రద్ధలతో పారాయణం చేసేవారు చాలా తక్కువ మంది ఉంటారు.

మీరు జాగ్రత్తగా గమనిస్తే శ్రీ లలితా సహస్రనామ స్తోత్రంలో మన సూక్ష్మ శరీరంలో ఉన్న వివిధ శక్తి కేంద్రములు లేదా చక్రముల వద్ద శక్తి స్వరూపిణి అయిన అమ్మ వారు ఏ విధంగా విరాజిల్లుతుంటారో వర్ణించబడి ఉంటుంది. ఈ చక్రములన్నీ మన శరీరంలోనే ఉంటాయి. అంటే అర్థము మన దేహము లోనే విభిన్న చక్రాలలో విభిన్న రూపాలలో అమ్మవారు కొలువై ఉంటారు.

ఇప్పుడు విద్యుత్ శక్తి వలన ఎలాగయితే మన చుట్టూ ఉన్న ఫ్యాన్ లు, లైట్ లు, ఎ.సి.లు వంటి అనేక విద్యుత్ ఉపకరణాలు పని చేస్తూ ఉంటాయో, అదే విధంగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి శక్తి వలన మానవుని సూక్ష్మ శరీరంతో పాటు అండ పిండ బ్రహ్మాండముతో నిండిన ఈ చరాచర జగత్తు మొత్తం నడుస్తుంది.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

– డా. పి. రాకేష్
(సహజ యోగ సంస్థాపకురాలు, పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి ప్రవచనాల ఆధారంగా)

● పరిహారం

అవరోధాలు, అపజయాలు కుంగదీస్తున్నాయా?



అవరోధాలు, అపజయాలు, ఆశాభంగాలు, ఆర్థిక నష్టాలు, ఆరోగ్య సమస్యలు ఎలాంటి వారినైనా మానసికంగా కుంగదీస్తాయి. ఎలాంటి సమస్యలూ లేకుండా జీవితం సాఫీగా సాగిపోవాలనే ఎవరైనా కోరుకుంటారు. జాతకంలోని గ్రహాల బలాబలాల మేరకు కొన్ని కొన్ని దశలలో, కొన్ని కొన్ని గోచార పరిస్థితుల్లో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. ఇలాంటి సమస్యలు బాధించకుండా ఉండాలంటే...

- రోజువారీ విధి నిర్వహణ కోసమే కావచ్చు లేదా ఏదైనా ప్రత్యేకమైన పనిమీదనే కావచ్చు... ఇంటి నుంచి బయటకు వెళ్లినవారు ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఖాళీ చేతులతో రావద్దు. ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు పండ్లు లేదా పూలు లేదా మిఠాయిలు వంటివి తీసుకురావడం మంచిది.
- చిన్న రాగినాణేన్ని ఎర్రని వస్త్రంలో చుట్టి, దానిని వీధిగుమ్మం దగ్గర తోరణానికి వేలాడదీయండి. ప్రతికూల శక్తుల నుంచి రక్షణగా ఉంటుంది.
- ప్రతిరోజూ ఉదయాన్నే పక్షులకు తృణధాన్యాలను ఆహారంగా వేయండి. ఆర్థిక సమస్యలు శీఘ్రంగా తొలగిపోతాయి.
- గురువారం రోజున ఇష్టదైవానికి చెందిన గుడికి వెళ్లడం మాత్రమే కాదు, ఆ రోజున గురువులను, గురు సమానులను కలుసుకొని వారికి మీ శక్తి మేరకు దక్షిణ తాంబూలాదులను సమర్పించి, వారి ఆశీస్సులు తీసుకోండి.
- పూజ కోసం వినియోగించే అగరొత్తులు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలను శుక్రవారం లేదా ఆదివారం రోజుల్లో కొనుగోలు చేయండి.

– సాంఖ్యాయన

● ఇస్లాం వెలుగు

కాపాడిన దైవం

హజ్రత్ అబ్దుల్ ఖాదర్ జీలానీ రహ్మతుల్లాహ్ అలైహ్ గొప్పదైవభక్తుడు. అనునిత్యం దైవధ్యానంలో నిమగ్నమై ఉంటూ, ప్రజలకు ధార్మికబోధ చేస్తూ ఉండేవారు. ఒకనాటి రాత్రి ఆయన యధాతథంగా దైవారాధనలో నిమగ్నమై ఉన్నారు. అంతలో ఒక మహోజ్వలమైన వెలుగు కనిపించింది . హజ్రత్ అబ్దుల్ ఖాదర్ జీలానీ రహ్మ బయటికి వెళ్ళి చూశారు. ఆకాశం వైపునుండి ఒక సింహాసనం జాజ్వల్యమానంగా వెలుగులు విరజిమ్ముతూ భూమ్మీదకు దూసుకువస్తోంది. అసలు అది ఏమిటో కూడా చూడలేనంత వెలుగు భూమండలంపై పరచుకుంటోంది. అంతలో 'అబ్దుల్ ఖాదర్ జీలానీ..! మేము నీ దైవభక్తిని, నీ ఆరాధనను మెచ్చుకున్నాము. ఇకనుండి ఇతరులకు ధర్మబద్ధం కానివి నీకు ధర్మబద్ధం చేశాము. అంటే హరాం విషయాలను నీకు హలాల్ గా చేశాము.'అన్న అదృశ్య వాణి వినిపించింది.



అప్పుడు హజ్రత్ జీలానీ రహ్మ, హరామ్ వస్తువులు హలాల్ చేయడం ఎవరికిసాధ్యం? ఇదేమైనా షైతాన్ పన్నాగం కాదుకదా..?.. అని ఆలోచిస్తూ...,' ఇంతకూ నువ్వు ఎవరివి? దైవానివా, సృష్టికర్తవా..?'అని ప్రశ్నించారు. ఈప్రశ్నకు అటు వైపునుండి ఎటువంటి సమాధానమూ రాలేదు. నేను దేవుణ్ణి అని చెప్పేధైర్యం షైతాన్ కులేదు. వాడు నేనే దైవాన్ని అని చెప్పలేదు. మౌనమే సమాధానమైంది. వెంటనే ఆయన, ఇదంతా షైతాన్ కల్పించిన భ్రమ మాత్రమే.. అని పసిగట్టి,'శాపగ్రస్తుడా..దుర్మార్గుడా..దూరంగా పారిపో..'అంటూ.. అల్లాహ్ శరణు వేడుకున్నారు.

అప్పుడు షైతాన్ మరో పాచిక విసురుతూ..'జీలానీ ..నిన్నునీ జ్ఞానం కాపాడింది.' అని పలికాడు. 'కాదు.. కాదు.. నా జ్ఞానం కాదు..నాప్రభువు కాపాడాడు.'అన్నారు హజ్రత్ జీలానీ రహ్మ వెంటనే.. ఈ విధంగా షైతాన్ చివరి అస్త్రం కూడా పనిచేయకుండా పోయింది.

దీనివల్ల మనకు అర్థమయ్యేదేమిటంటే, మనమేదో దైవభక్తులమని, దానధర్మాలు చేస్తుంటామని, ఇతరసత్కార్యాలెన్నో చేస్తూ ఉంటామని, విద్యావిజ్ఞానాలు ఉన్నాయని, అందరికంటే నాలుగాకులు ఎక్కువే చదివామని ఎవ్వరూ భ్రమపడకూడదు. అంతా దైవానుగ్రహమని మాత్రమే భావించాలి తప్ప దైవభక్తిపరులమని ప్రత్యేకతలు ఆపాదించుకొని గర్వించకూడదు.

– మదీహా

● కథానీతి

ఏం కావాలన్నా ఇస్తావా?



ఒకరోజు ఒక మహారాజు సాయం సంధ్యా సమయంలో నదీ తీరం వెంబడి ప్రయాణిస్తూ అక్కడ తన గురుదేవులు కౌపీనమునకు పడిన చిల్లులను సూదీదారంతో కుట్టుకోవటం చూశాడు.

గురువును సమీపించి ''గురుదేవా! మీరు మీరు ఇలా కౌపీనం కుట్టుకోవటం బాగోలేదు. కౌపీనం అంతా చిల్లుల మయంగా ఉంది'' అన్నాడు.

గురువుగారు ''అయితే?'' అని ప్రశ్నించారు.

దానికి సమాధానంగా ''నేను మహారాజును, మీకు ఏమి కావాలన్నా ఇస్తాను'' అని ఏం కావాలో కోరుకోమన్నాడు.

ఆ గురువుగారు రాజులో ఉన్న అహాన్ని మాటల ద్వారా గ్రహించారు. ఆయన ''రాజా నువ్వు ఏమైనా ఇవ్వగలవా!'' అని ప్రశ్నించారు.

''ఓ! ఇస్తాను'' అని గర్వంగా అన్నాడు రాజు.

గురువు తన చేతిలో ఉన్న సూదిని నదిలోకి విసిరి దానిని తీసుకురమ్మన్నాడు.

రాజు నివ్వెరపోయాడు. తనలోని అజ్ఞానం అర్థమైంది. గురువు పాదాలకు సవినయంగా నమస్కరించి అక్కడ నుండి నిష్క్రమించాడు.

మనలో మనకు తెలియకుండా నిద్రాణమై ఉన్న అహాన్ని తొలగించేది గురువు మాత్రమే. మనలోని మాలిన్యాలను తొలగించి వ్యక్తిగా తయారు చేయడం ఒక్క గురువుకే సాధ్యం.

● బౌద్ధ వాణి

మిగాలోపుని మరణం

పూర్వం మగధ రాజధాని రాజగృహ నగర సమీపంలో ఒక పెద్ద పర్వతం ఉండేది. దాని మీద గరుడ జాతి పక్షులు నివసిస్తూ ఉండేవి. ఆ పక్షుల పేరు మీద దానికి గృధ్రకూట పర్వతం అనే పేరు వచ్చింది. ఆ పర్వతం మీద అపనందుడు అనే గరుడుడు ఉండేవాడు. మంచి బలశాలి కావడం వల్ల ఆకాశంలో అవలీలగా ఎగిరి రాగలిగేవాడు. అతని పుత్రుడు మిగాలోపుడు. అతను కూడా తండ్రిని మించిన రెక్కబలం కలవాడు. కుర్రతనపు జోరు మీద కన్నూమిన్నూ కానేవాడు కాదు. ఆకాశంలో రకరకాల విన్యాసాలు చేస్తూ ఉండేవాడు. కంటికాననంత దూరం ఎగిరి వచ్చేవాడు.

ఈ విషయం తండ్రికి తెలిసింది. బిడ్డను పిలిచి– ''కుమారా! మిగాలోపా! నీ విహంగ విన్యాసాల గురించి విన్నాను. మంచిదే! కానీ, నాయనా! ఒక్కో జీవికి ఒక్కో హద్దు ఉంటుంది. అలాగే పక్షులకు కూడా! మన గరుడ పక్షులకూ ఒక హద్దు ఉంది. ఆకాశంలో మనం లేచిపోయి నేలను చూసినప్పుడు ఈ ప్రాంతం నాలుగు మూలలా కనిపించేంత వరకే మనం పోవాలి. ఆ హద్దు దాటి పోతే, మన ప్రాణాల మీదికి మనం తెచుకున్నట్లే. నింగి నుండి నేలరాలడం తప్పదు. ఇకనుండి వేగంలో, ఎత్తులో నీ హద్దుల్లో నీవుండు'' అని చెప్పాడు.

తండ్రి చెప్పాడే కానీ, తనయుడు దాన్ని చెవికెక్కించుకోనేలేదు. ఒక రోజున మిగిలిన పక్షులు వద్దని వారించినా వినకుండా సహజ వాతావరణ పరిధిని దాటి ఇంకా పైపైకి పోయాడు మిగాలోపుడు.

అక్కడ మేఘాల్లో సుడిగాలి రేగింది. ఆ సుడిలో చిక్కుకున్న అతని దేహం ఛిద్రమైపోయింది. ప్రాణాలు కోల్పోయిన మిగాలోపుని శరీర భాగాలు గాలిలోనే ఎటో కొట్టుకుపోయాయి. అతని మరణం అతని పరివారాన్ని కుంగదీసింది. తండ్రి తల్లడిల్లాడు. అతని మీద ఆధారపడ్డ భార్యాబిడ్డలు భుక్తి కోల్పోయారు.



గృధ్రకూట పర్వతం మీద ఛిద్రమైన పక్షి కుటుంబాలు ఇంకా ఎన్నో ఉన్నాయి.

పెద్దల మాట వినకపోవడం, తమ హద్దులు తాము తెలుసుకోలేకపోవడం, నిర్లక్ష్యం, లెక్కలేనితనం ఎంతటి విపత్తును కలిగిస్తాయో బుద్ధుడు చెప్పిన గొప్ప కథ ఇది.


– డా. బొర్రా గోవర్ధన్

● సువార్త

ఆరాధనతోనే దేవుని ప్రత్యక్షత

దేవుని మందిర నిర్మాణం చేయతలపెట్టిన ఇశ్రాయేలీయుల మహారాజైన దావీదు సంకల్పాన్ని అంగీకరించలేదు యెహోవా దేవుడు. కానీ ప్రత్యామ్నాయంగా ఆయన కుమారుడైన సలోమాను రాజు చేత మందిర నిర్మాణం జరుగుతుందని యెహోవా దావీదురాజుకు తెలియపరిచాడు.

పూర్వం దైవారాధన ఇశ్రాయేలీయుల పితామహుడైన అబ్రాహాము యెహోవా నామము పేరిట బలిపీఠం కట్టించడంతోపాటు ఆయన నామమున ప్రార్థించారని బైబుల్ ప్రబోధిస్తుంది (ఆ. కా. 12:8). తాత్కాలికంగా దైవ నామస్తుతి ఆరాధన ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రాల పేరిట పండ్రెండు రాతిస్తంభాలు పాతి కట్టిన పర్ణశాలలలో ఆరాధనలు జరుపుకునేవారు. ఆ విధంగా వారే కాదు సృష్టి కూడా దేవుని ఆరాధించిందని సంకీర్తనలు 29 :3, 8, 19, 104 అధ్యాయాలలో చూడగలం. ఆకాశములు దేవుని మహిమను వివరిస్తున్నవి, అంతరిక్షం ఆయన చేతి పనిని ప్రచుర పరచుచున్నది. పగటికి పగలు బోధించుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానం తెలుపుచున్నదన్న వాక్యం (సం–కీర్తనలు 19 :2)లో ప్రచురపరచింది.



దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆత్మతోను, సత్యంతోను ఆరాధించాలి. ఇదే విషయాన్ని యేసుప్రభువుల వారు సమరయ స్త్రీతో చెప్పాడు. (యోహాను 4:23, 24)

క్రైస్తవ్యం మతం కాదు ఆధ్యాత్మిక విప్లవం. భారతదేశ సాంప్రదాయంలో పుష్పం, ఫలం, తోయం, నైవేద్యం, దీపారాధనతో దైవ ఆరాధన చేసుకుంటారు. విగ్రహారాధన అనగా నిగ్రహం కోల్పోయి దేవుని కంటే అతిగా ప్రేమించే వాంఛ, కోరిక. దేవుడు సర్వాంతర్యామి, విశ్వమంతా వున్నాడు. సంఘమంటే నాలుగు గోడలతో కూడిన నిర్మాణం కాదు. సంఘమంటే ప్రజలు. దేవుని మందిరంలో ప్రవేశించడానికి కొన్ని నియమాలు, నిబంధనలు వున్నాయి. పాదరక్షలతో చర్చీలలోకి ప్రవేశించరాదు. తోటి జనుల వైపు అటూ ఇటూ చూడకూడదు. ఆత్మ నడిపింపును సత్యంతోను, ఆత్మ నడిపింపుతో దేవునిలో లీనమవ్వాలి. దేవుని మందిరం, ఆలయం ఏదైనా పవిత్రమైనది, పరిశుద్ధమైనందున ఆరాధించువారు దేవుని మందిరంలో పరిశుద్ధంగా వుండాలి. అప్పుడే దైవారాధనతో దేవుని ప్రత్యక్షత పొందగలం. ఈ అంశంలో రెండు ప్రధానాంశాలు – ఒకటి ఆరాధన. రెండు దేవుని ప్రత్యక్షత. ఆరాధనలో అబ్రాహాము ఆది 18:2లో ఆయన ముగ్గురు మనుష్యులను చూశాడు. కానీ దర్శనం ఇచ్చినది ఒక్కరే. అప్పుడు అబ్రాహాము వంగి నమస్కారం చేశాడు. మన భారతీయ సంస్కారంలో సాష్టాంగ నమస్కారం మరియు శ్రవణం, మననం, ధ్యానం.

ఎట్టకేలకు సలోమాను రాజు మందిరాన్ని నిర్మాణం చేసి ప్రార్థన చేశాడు. ఆ ప్రార్థనను 1రాజులు గ్రంథ 8:22, 23, 29 – 30లలో పరిశీలించగా సలోమానురాజు యెహోవా బలిపీఠం ఎదుట నిలబడి చేతులెత్తి 'దేవా! నీ దాసుడు చేయు ప్రార్థనను దయతో అంగీకరించుము, మా విన్నపములు అంగీకరించి నీ నేత్రములు రేయిబవళ్ళు తెరవబడి యుండును గాక' అని ప్రార్థించాడు.

అపోస్తలుడైన పౌలు క్రైస్తవులను హింసిస్తుండగా, అప్పుడాయన సైన్యాధిపతి. ఒకరోజు డమస్కు వద్ద గుర్రం మీద నుండి పడినప్పుడు వెలుగును చూశాడు. ప్రభువు స్వరం విని నీవెవడని అడగ్గా, నీవూహిస్తున్న క్రీస్తునని శబ్దంతో ప్రభువు దర్శించాడు. (అపో కా. 9 :1–9). అలాగే పంజాబ్లోని రాంపూర్లో 3–9–1889లో జన్మించిన సాదు సుందరసింగ్ సిక్కు మతస్థుడు. నిజమైన దేవుని దర్శనం కానరానందున రైలు కింద పడి చనిపోదలచాడు. కానీ పిరికివాడై గృహానికి చేరుకున్న ఆయనకు ప్రభువు దర్శనం కలిగింది. ఆయన సర్వసంగపరిత్యాగియైన క్రైస్తవ సన్యాసిగా దేశవిదేశాలను దర్శించాడు. ఆయన ముఖరూపం క్రీస్తురూపం చూసినట్టుగా వుండేది. దైవారాధనతో దేవుని ప్రత్యక్షత పొందుదురు గాక.

– కోట బిపిన్ చంద్రపాల్

బిజినెస్ రీల్

వరుసగా రెండో రోజూ నష్టపోయిన పసిడి



న్యూఢిల్లీ: పసిడి వరుసగా రెండో రోజూ నష్టపోయింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.500 నష్టంతో రూ.98,870 స్థాయికి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.400 తగ్గి రూ.98,400 స్థాయికి పరిమితమైంది. వెండి కిలోకి రూ.1,000 తగ్గడంతో రూ.1,11,000 స్థాయికి వచ్చింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 16 డాలర్ల మేర పెరిగి 3,341 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. "ఈ నెలాఖరు నుంచి ఫార్మా, సెమీకండక్టర్లపై టారిఫ్‌లు అమలు చేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నుంచి తాజా హెచ్చరికలు రావడం బంగారం ధరలకు మద్దతు నిచ్చింది. ఆగస్ట్ 1 నుంచి 25 దేశాలను టారిఫ్‌లకు లక్ష్యంగా ఎంచుకోవడంతో రిస్క్ ధోరణి తగ్గింది" అని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కేనత్ చైన్‌వాలా తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో వెండి స్పాట్ ధర ఔన్స్‌కు ఒక శాతం వరకు పెరిగి 38 డాలర్ల స్థాయిని చేరుకుంది "కొన్ని వారాలుగా వెండి ఉత్పత్తుల్లోకి పెట్టుబడుల రాక స్థిరంగా కొనసాగింది. కీలక నిరోధ స్థాయిలను అధిగమించడంతో టెక్నికల్ ట్రేడర్ల నుంచి కూడా కొనుగోళ్ల మద్దతు లభించింది" అని జూలియస్ బేర్ ఎకనామిక్స్ హెడ్ కార్‌స్టెన్ మెంకే తెలిపారు.

జియో బ్లాక్ రాక్ నుంచి ఐదు కొత్త ఫండ్స్

న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా ఐదు మ్యూచువల్ ఫండ్స్ పథకాల ఎన్ఎఫ్‌వోలను చేపట్టేందుకు సెబీ అనుమతి మంజూరు చేసింది. జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ 8-13 జీ-సెక్ ఇండెక్స్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ నిఫ్టీనెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్‌కు అనుమతి లభించింది. వీటిల్లో నాలుగు ఈక్విటీ ఆధారిత ఇండెక్స్ పథకాలు కాగా, ఒక్కటి డెట్ ఆధారిత ఇండెక్స్ ఫండ్. జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ మొదటిసారి 3 డెట్ ఫండ్స్ ఎన్ఎఫ్‌వోల (లిక్విడ్ ఫండ్, ఓవర్‌నైట్ ఫండ్, మనీ మార్కెట్ ఫండ్) రూపంలో రూ.17,800 కోట్లను సమీకరించినట్టు ఈ నెల 7న ప్రకటించడం తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	496-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	3,203.00	2.38
WIPRO	263	2.18
TECHM	1,608.50	1.87
NESTLEIND	2,458.00	1.73
SBIN	830.5	1.72

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	668.2	-2.37
ETERNAL	262.1	-1.63
SUNPHARMA	1,704.00	-1.36
CIPLA	1,470.70	-1.35
TATASTEEL	157.3	-1.07

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,663
ఎన్ఎస్ఈ	94,738
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,38,994
ఎఫ్ఐఐ	- 1,858
డీఐఐ	+ 1,223

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	66.54	$	66.52
బ్రెంట్	68.69	$	68.71

ఇళ్ల అమ్మకాలకు ధరల సెగ!

- హైదరాబాద్‌లో 6 శాతం డౌన్
- టాప్-8 నగరాల్లో 14 శాతం తగ్గిన విక్రయాలు
- ప్రాప్ టైగర్ నివేదిక విడుదల



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల అమ్మకాలు జూన్ త్రైమాసికంలో పడిపోయాయి. ధరల పెరుగుదల ప్రభావం విక్రయాలపై చూపించింది. 11,513 యూనిట్ల అమ్మకాలు హైదరాబాద్‌లో నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే మూడు నెలల్లో అమ్మకాలు 11,065 యూనిట్లుగా ఉండడం గమనార్హం. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా టాప్-8 నగరాల్లోనూ ఇళ్ల అమ్మకాలు జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 14 శాతం తగ్గి 97,674 యూనిట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఈ నగరాల్లో అమ్మకాలు 1,13,768 యూనిట్లుగా ఉన్నాయి. ప్రాప్ టైగర్ సంస్థ ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. అత్యధికంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), పుణెలో కలిపి అమ్మకాలు 30 శాతం పడిపోయాయి.

- ఏప్రిల్-జూన్ కాలంలో ఎంఎంఆర్‌లో ఇళ్ల అమ్మకాలు 25,939 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 38,266 యూనిట్లతో పోల్చితే 32 శాతం తగ్గాయి.
- పుణెలో ఇళ్ల అమ్మకాలు 27 శాతం తగ్గి 15,962 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- అహ్మదాబాద్‌లో కేవల ఒక శాతమే తగ్గాయి. 9,451 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 9 శాతం తగ్గి 10,051 యూనిట్లుగా ఉన్నాయి.
- బెంగళూరులో మాత్రం ఇళ్ల అమ్మకాలు 16 శాతం పెరిగి 15,628 యూనిట్లకు చేరాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 13,495 యూనిట్లుగా ఉన్నాయి.
- చెన్నై మార్కెట్లోనూ 33 శాతం పెరిగి 5,283 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- కోల్‌కతా మార్కెట్లో 19 శాతం అధికంగా 3,847 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- ఎంఎంఆర్ పరిధిలో ముంబై, నవీ ముంబై, థానే మార్కెట్ల గణాంకాలు కలసి ఉన్నాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో గురుగ్రామ్, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ అమ్మకాలు కలసి ఉన్నాయి.

ధరల ఒత్తిళ్లు..

"ఇళ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టడానికి డిమాండ్ బలహీనత కంటే మార్కెట్లో వచ్చిన మార్పుల ఫలితం వల్లేనని తెలుస్తోంది. ముఖ్యంగా ధరల పరమైన ఒత్తిళ్లు నెలకొనడంతో బడ్జెట్, మధ్యాదాయ ఇళ్ల విభాగాల్లో కొనుగోళ్ల పరంగా అప్రమత్తత నెలకొంది" అని ప్రాప్ టైగర్ సేల్స్ హెడ్ శ్రీధర్ శ్రీనివాసన్ తెలిపారు.

ప్లాట్‌లకు గిరాకీ...

- మూడేళ్లలో రూ.2.44 లక్షల కోట్లు
- ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: కరోనా అనంతరం ఇళ్ల స్థలాలకు గిరాకీ పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా రూ.2.44 లక్షల కోట్ల విలువైన ప్లాట్లను గత మూడేళ్లలో ఆవిష్కరించినట్టు ప్రాప్ ఈక్విటీ సంస్థ వెల్లడించింది. 2022 జనవరి నుంచి 2025 మే మధ్యకాలంలో దేశంలోని అగ్రగామి టాప్-1, 2 నగరాల్లో 4.7 లక్షల ఇళ్ల ప్లాట్లతో కూడిన ప్రాజెక్టులను డెవలపర్లు ప్రారంభించినట్టు వెల్లడించింది. హైదరాబాద్, ఇండోర్, బెంగళూరు, చెన్నై, నాగ్‌పూర్, జైపూర్, కోయింబత్తూర్, మైసూరు, రాయిపూర్, సూరత్ నగరాల గణాంకాలతో ప్రాప్ ఈక్విటీ నివేదికను విడుదల చేసింది. అపార్ట్‌మెంట్లతో పోల్చినప్పుడు పెట్టుబడి విలువలో అధిక వృద్ధికి తోడు లిక్విడిటీ మెరుగ్గా ఉండడం (వేగంగా విక్రయించుకునే వెసులుబాటు)తో ఇళ్ల ప్లాట్లకు డిమాండ్ పెరిగినట్టు ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజ తెలిపారు. తమకు నచ్చిన విధంగా ఇంటిని నిర్మించుకోవాలన్న దృష్టితో కస్టమర్లు ప్లాట్లకు ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు.

తగ్గిన సరఫరా

ఒకవైపు ప్లాట్లకు డిమాండ్ నెలకొనగా, మరోవైపు 2024లో వీటి సరఫరా తగ్గడం గమనార్హం. ఈ 10 నగరాల్లో సరఫరా 2024లో 1,26,556 ప్లాట్లుగా ఉంది. 2023లో సరఫరా 1,63,529 ప్లాట్లుగా ఉంది. ఇక ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో (జనవరి-మే) 45,591 ఇళ్ల ప్లాట్లను డెవలపర్లు ప్రారంభించినట్టు ప్రాప్ ఈక్విటీ నివేదిక తెలిపింది. "డెవలపర్లకు ప్లాట్లు వేగంగా అమ్ముడుపోతాయి. వేగంగా నగదు చేతికి అందుతుంది. అపార్ట్‌మెంట్లతో పోల్చితే పెట్టుబడి అవసరం కూడా తక్కువే" అని ఈ నివేదిక వివరించింది. పది నగరాల్లో చదరపు అడుగు ధర 2024లో రూ.3,679గా ఉంది. అంటే చదరపు గజం రూ.33,111గా ఉన్నట్టు. ఈ నివేదికపై స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వ్యవస్థాపకుడు, ఎండీ అయిన కీర్తి చిలుకూరి స్పందిస్తూ.. దేవవ్యాప్తంగా ప్లాట్ల అభివృద్ధి పుంజుకోవడం అన్నది సొంతంగా ఇళ్లు కలిగి ఉండాలన్న ఆకాంక్ష పెరిగినట్టు సూచిస్తోందన్నారు.

ఐపీవోకు ఇందిరా ఐవీఎఫ్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- గోప్యతా విధానానికే ఓటు



న్యూఢిల్లీ: ఫెర్టిలిటీ సర్వీసుల దిగ్గజం ఐవీఎఫ్ హాస్పిటల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి గోప్యతా మార్గంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇటీవల కొంతకాలంగా అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ(ఏఆర్‌టీ) రంగంపట్ల దేశీయంగా ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఇందిరా ఐవీఎఫ్ ప్రాస్పెక్టస్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ రంగంలో సుప్రసిద్ధమైన మరో సంస్థ గౌడియం ఐవీఎఫ్ అండ్ ఉమన్ హెల్త్ సైతం లిస్టింగ్ యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ఇందిరా ఐవీఎఫ్ ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ఐపీవోకు ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. అయితే మార్చిలో డాక్యుమెంట్స్‌ను వెనక్కి తీసుకుంది. కంపెనీ వ్యవస్థాపకుడు అజయ్ ముర్దియాపై బాలీవుడ్ బయోపిక్ రిలీజ్ నేపథ్యంలో వెనకడుగు వేసింది. తద్వారా పరోక్షంగా కంపెనీ సొంత ప్రమోషన్‌కు అవకాశమున్నట్లు సెబీ అభిప్రాయపడటంతో ఇందిరా ఐవీఎఫ్ ఐపీవోను విరమించుకున్నట్లు తెలుస్తోంది. అయితే కంపెనీ ప్రతినిధి ఒకరు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాస్పెక్టస్‌ను ఉపసంహరించినట్లు తెలియజేశారు. సెబీ ఆదేశాలతో అన్నది సరికాదని స్పష్టం చేశారు. ఇటీవల ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం టాటా క్యాపిటల్‌సహా.. ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్ కంపెనీ షాడోఫాక్స్ టెక్నాలజీస్, గాజా ఆల్టర్నేటివ్ ఏఎంసీ, షిప్‌రాకెట్, ఫిజిక్స్‌వాలా, బోట్ బ్రాండ్ మాతృ సంస్థ ఇమేజిన్ మార్కెటింగ్ సైతం గోప్యతా విధానంలోనే సెబీకి ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేయడం గమనార్హం!

సాఫీగా రేట్ల కోత బదిలీ



- నగదు లభ్యత పెంపు అనుకూలిస్తుంది
- ఫిచ్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ: వ్యవస్థలో నగదు లభ్యత పెంపు దిశగా ఆర్‌బీఐ ఈ ఏడాది ఆరంభం నుంచి తీసుకున్న చర్యలు.. 100 బేసిస్ పాయింట్ల (ఒక శాతం) రేట్ల తగ్గింపు పూర్తి ప్రయోజనాన్ని బ్యాంక్‌లు బదిలీ చేసేందుకు అనుకూలిస్తుందని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోలు రూపంలో ఆర్‌బీఐ రూ.5.6 లక్షల కోట్ల మేర లిక్విడిటీని పెంచినట్టు గుర్తు చేసింది. దీంతో మార్చి నుంచి నగదు లభ్యత మిగులు స్థాయికి చేరినట్టు తెలిపింది. సీఆర్‌ఆర్‌ను (నగదు నిల్వల నిష్పత్తి) 100 బేసిస్ పాయింట్లను తగ్గించడం రూపంలో మరో రూ.2.7 లక్షల కోట్ల నగదు దశల వారీగా వ్యవస్థలోకి చేరుతుందని పేర్కొంది. జనవరి నుంచి వ్యవస్థలో లిక్విడిటీని గణనీయంగా పెంచడమే కాకుండా, భవిష్యత్తులోనూ తగినంత లిక్విడిటీని కొనసాగించాలన్న ఆర్‌బీఐ నిర్ణయం నిధుల పరమైన పరిస్థితులను సులభతరం చేసినట్టు వివరించింది. "పెరుగుతున్న మిగులు నిధులు, డిపాజిట్ రేట్లు తగ్గుతుండడం దీన్ని స్పష్టం చేస్తోంది. రుణ వృద్ధి మందగించడంతో ఈ రంగం రుణ/డిపాజిట్ రేషియో పెరుగుదల తిరోగమించడం డిపాజిట్ల పరంగా బ్యాంక్‌లపై ఒత్తిళ్లను తగ్గిస్తుంది" అని ఫిచ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది.

నిధుల వ్యయాలు దిగొస్తాయి..

ఈ ఏడాది వడ్డీ రేట్లను ఆర్‌బీఐ ఒక శాతం వరకు తగ్గించడం తెలిసిందే. ఫిబ్రవరిలో పావు శాతం, ఏప్రిల్‌లోనూ పావు శాతం, జూన్‌లో అరశాతం తగ్గింపు నిర్ణయాలు తీసుకోవడాన్ని ఫిచ్ రేటింగ్స్ నివేదిక గుర్తు చేసింది. ఈ చర్యలు ఆర్‌బీఐ లిక్విడిటీ విధానంలో గణనీయమైన మార్పునకు నిదర్శనమని పేర్కొంది. నిధుల పరంగా ఒత్తిళ్లు లేకుండా రుణ వృద్ధికి ఈ చర్యలు మద్దతునిస్తాయని తెలిపింది. "తగినంత లిక్విడిటీ వల్ల తాజా నిధుల సమీకరణ వ్యయాలు తగ్గుతాయి. 2025-26 సంవత్సరంలో బ్యాంకుల మార్జిన్లు 0.30 శాతం తగ్గుతాయన్నది మా అంచనా. 2026-27లో డిపాజిట్లపై వ్యయాలు తగ్గడం ఫలితంగా మార్జిన్ల ఒత్తిళ్లు దిగొస్తాయి. తక్కువ సీఆర్‌ఆర్ కూడా ఇందుకు అనుకూలిస్తుంది" అని ఈ నివేదిక వివరించింది. జూన్ సమీక్షలో ఆర్‌బీఐ సీఆర్‌ఆర్‌ను సైతం ఒక శాతం తగ్గించి 3 శాతం చేయడం గమనార్హం.

ఎస్‌బీఐ నిధుల సమీకరణ షురూ

- క్విప్ ద్వారా రూ. 25,000 కోట్లు
- బాండ్ల జారీతో రూ. 20,000 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నిధుల సమీకరణకు తెరతీసింది. షేరుకి రూ. 811.05 ఫ్లోర్ ధరలో అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్)ని చేపట్టింది. తద్వారా రూ. 25,000 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. అయితే ఫ్లోర్ ధరకంటే 5 శాతం డిస్కౌంట్‌లో క్విప్‌ను పూర్తి చేసే వీలున్నట్లు తెలియజేసింది. షేరు తాజా ధర రూ. 831.55తో పోలిస్తే ఫ్లోర్ ధర సైతం 2.5 శాతం తక్కువకావడం గమనార్హం! వీటికితోడు రుణ సెక్యూరిటీల(బాండ్లు) జారీ ద్వారా మరో రూ. 20,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉన్నట్లు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో దేశీ ఇన్వెస్టర్లకు బాండ్లను ఆఫర్ చేయనున్నట్లు తెలియజేసింది. వెరసి రూ. 45,000 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసింది. ఈ ఏడాది మే నెలలో ప్రయివేట్ ప్లేస్‌మెంట్ ద్వారా రూ. 25,000 కోట్ల సమీకరణకు ఎస్‌బీఐ బోర్డ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. జూన్‌లో బ్యాంక్ వాటాదారులు సైతం ఇందుకు ఆమోదముద్ర వేశారు. కాగా.. ఎస్‌బీఐ ఇంతక్రితం 2017-18లో క్విప్ ద్వారా రూ. 15,000 కోట్లు సమకూర్చుకున్న విషయం విదితమే!


క్విప్ నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు బీఎస్ఈలో 1.8 శాతం బలపడి రూ. 832 వద్ద ముగిసింది.

రిలయన్స్ సంస్థలు సైతం

రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బోర్డు వివిధ మార్గాలలో రూ. 9,000 కోట్లు సమీకరించేందుకు తాజాగా అనుమతించింది. దీనిలో భాగంగా ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ సంబంధ క్విప్ లేదా క్విబ్ తదితరాల ద్వారా రూ. 6,000 కోట్లు సమకూర్చుకోనుంది. అంతేకాకుండా ఒకేసారి లేదా దశలవారీగా మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా మరో రూ. 3,000 కోట్లు సమీకరించనుంది. ఇందుకు ప్రయివేట్ ప్లేస్‌మెంట్ లేదా ఇతర విధానాలను ఎంచుకోనుంది. రిలయన్స్ పవర్ బోర్డు వివిధ మార్గాలలో రూ. 9,000 కోట్లు సమీకరించేందుకు తాజాగా అనుమతించింది. దీనిలో భాగంగా ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ సంబంధ క్విప్ లేదా క్విబ్ తదితరాల ద్వారా రూ. 6,000 కోట్లు సమకూర్చుకోనుంది. అంతేకాకుండా ఒకేసారి లేదా దశలవారీగా మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా మరో రూ. 3,000 కోట్లు సమీకరించనుంది. ఇందుకు ప్రయివేట్ ప్లేస్‌మెంట్ లేదా ఇతర విధానాలను ఎంచుకోనుంది.

రామ్ ఇన్ఫోకు 'ఉన్నతి' ప్రాజెక్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సొల్యూషన్స్ రామ్‌ఇన్ఫోకి త్రిపుర ప్రభుత్వంలో భాగమైన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నుంచి రూ. 14.14 కోట్ల ఆర్డరు లభించింది. త్రిపుర రూరల్ ఎకనామిక్ గ్రోత్, సర్వీస్ డెలివరీ ప్రాజెక్ట్ కింద 'ఉన్నతి' ప్లాట్‌ఫాం అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలను కంపెనీ చేపట్టాల్సి ఉంటుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను మెరుగ్గా అందించేందుకు ఇది ఉపయోగపడనుంది. 60 పైగా కీలక ప్రభుత్వ విభాగాలు, 300 పైచిలుకు పథకాలు అన్నీ ఒకే డిజిటల్ వేదికలో అందుబాటులో ఉండేలా దీన్ని తీర్చిదిద్దనున్నారు. దీనితో 41 లక్షల మందికి పైగా పౌరులకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ఈ ప్రాజెక్టుకు రామ్‌ఇన్ఫో సంస్థ సిస్టం ఇంటిగ్రేటర్‌గా వ్యవహరిస్తుంది. దీన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత 26 నెలల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈశాన్య భారతంలో తమ కార్యకలాపాలను పటిష్టం చేసుకునేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడగలదని సంస్థ ఎండీ ఎల్. శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.



క్యూ1 ఫలితాలు

కల్పతరు లాభం నేలచూపు

నికర లాభం 42% డౌన్



న్యూఢిల్లీ: దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఇటీవలే లిస్టయిన రియల్టీ రంగ కంపెనీ కల్పతరు లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 42 శాతం క్షీణించి రూ. 14 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 24 కోట్లు ఆర్జించింది. కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ గ్రూప్ కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం రూ. 535 కోట్ల నుంచి రూ. 667 కోట్లకు బలపడింది. మార్చితో ముగిసిన గతేడాది నికర లాభం టర్న్ అరౌండ్ సాధించి రూ. 22 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023-24)లో రూ. 95 కోట్ల నష్టం ప్రకటించింది. ఈ బాటలో మొత్తం ఆదాయం రూ. 2,040 కోట్ల నుంచి రూ. 2,332 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో కల్పతరు షేరు బీఎస్ఈలో 1.5 శాతం లాభపడి రూ. 427 వద్ద ముగిసింది.

డీబీ కార్ప్ లాభం క్షీణత

క్యూ1లో రూ. 81 కోట్లు

న్యూఢిల్లీ: మీడియా రంగ సంస్థ డీబీ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 81 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 118 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 590 కోట్ల నుంచి రూ. 559 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 459 కోట్ల నుంచి రూ. 480 కోట్లకు పెరిగాయి. ఆదాయంలో ప్రకటనల నుంచి రూ. 398 కోట్లు సమకూరగా.. గత క్యూ1లో రూ. 428 కోట్లు అందుకుంది. సర్క్యులేషన్ ఆదాయం మాత్రం రూ. 119 కోట్ల నుంచి రూ. 120 కోట్లకు నామమాత్రంగా పెరిగింది.

ఫలితాల నేపథ్యంలో డీబీ కార్ప్ షేరు బీఎస్ఈలో 4 శాతం లాభపడి రూ. 282 వద్ద ముగిసింది.

రుణరహిత సంస్థగా రాంకీ ఇన్‌ఫ్రా

రూ. 3,860 కోట్ల రుణం చెల్లింపు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ సంస్థ రాంకీ ఇన్‌ఫ్రా కీలకమైన మైలురాయిని సాధించింది. రూ. 3,859.81 కోట్ల రుణాలను పూర్తిగా చెల్లించేయడం ద్వారా రుణరహిత సంస్థగా మారినట్లు కంపెనీ తెలిపింది. 2015 జూన్ 12న టర్మ్ రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలకు సంబంధించిన పునర్వ్యవస్థీకరణ ఒప్పందం (ఆర్ఏ) కుదిరిందని, 2019 జూన్ నాటికి టర్మ్ రుణాల చెల్లింపు పూర్తయిందని పేర్కొంది. ఆ తర్వాత 2025 జూలై 11న ఆర్ఏ నుంచి నిష్క్రమణకు సంబంధించిన ఆర్ఈఏ ఒప్పందాన్ని రుణదాతలు, రామ్‌కీ ఇన్‌ఫ్రా కుదుర్చుకున్నాయి. వాటాదారులకు మరింత విలువను చేకూర్చడానికి, దేశ ఇన్‌ఫ్రా అభివృద్ధిలో తమ వంతు తోడ్పాటు అందించడానికి కట్టుబడి ఉన్నామని సంస్థ ఎండీ వైఆర్ నాగరాజ చెప్పారు.

భారత్-సింగపూర్ మధ్య
నిధుల బదిలీ సులభతరం

యూపీఐ కిందకు మరో 13 బ్యాంక్‌లు

న్యూఢిల్లీ: భారత్-సింగపూర్ మధ్య నిధుల బదిలీని మరింత సులభతరం చేస్తూ.. యూపీఐ-పేనౌ కిందకు మరో 13 బ్యాంక్‌లను చేర్చినట్టు ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ ప్రకటించింది. ఈ నెట్‌వర్క్ పరిధిలోకి మొత్తం 19 భారత బ్యాంక్‌లు చేరినట్టయింది. "జూలై 17 నుంచి రెండు దేశాల్లోని యూజర్లు మరిన్ని బ్యాంకుల పరిధిలో నిధులను బదిలీని సులభంగా చేసుకోవచ్చు.



ఈ సేవ మరింత సౌకర్యంగా, అందుబాటులోకి వస్తుంది" అని ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) తెలిపింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి ఎన్ఐపీఎల్ అనుబంధ సంస్థ కావడం గమనార్హం. ఆర్‌బీఐ, మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ (ఎంఏఎస్) సంయుక్తంగా యూపీఐ-పేనౌ సేవలను లోగడ ప్రారంభించడం తెలిసిందే.

ఈసారి ద్రవ్యోల్బణం @ 4 శాతం

- జీడీపీ వృద్ధి 6.5 శాతం
- ఎగుమతులకు అమెరికా టారిఫ్ రిస్కులు
- క్రిసిల్ రిపోర్ట్



కోల్‌కతా: గత ఆర్థిక సంవత్సరంలో 4.6 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) ఈ ఆర్థిక సంవత్సరంలో సగటున నాలుగు శాతానికి పరిమితం కావచ్చని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఒక నివేదికలో తెలిపింది. వర్షపాతం సాధారణంకంటే అధిక స్థాయిలో ఉంటుందనే అంచనాలు నెలకొన్నందున ఆహార పదార్థాల ధరల పెరుగుదల నెమ్మదించవచ్చని పేర్కొంది. ఇక కమోడిటీల రేట్లు తగ్గడంతో ఆహారేతర ద్రవ్యోల్బణం కూడా ఒక మోస్తరు స్థాయికే పరిమితం కావచ్చని తెలిపింది. మరోవైపు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని, అంతకన్నా తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయని క్రిసిల్ పేర్కొంది. ఎగుమతులకు అమెరికా టారిఫ్‌లపరమైన రిస్కులు ఉన్నప్పటికీ, రెపో రేట్ల తగ్గింపు, తగినంత వర్షపాతంలాంటి సానుకూలాంశాలు వృద్ధికి ఊతంగా నిలుస్తాయని వివరించింది. ద్రవ్యోల్బణం నెమ్మదిస్తుండటంతో ఈ ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ కాస్త విరామం తర్వాత రెపో రేటును మరోసారి తగ్గించవచ్చని పేర్కొంది. అంతర్జాతీయంగా అనిశ్చితుల వల్ల పెట్టుబడుల ప్రవాహం, కరెన్సీ కదలికల్లో హెచ్చుతగ్గులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు నివేదిక తెలిపింది.

వేచి చూసే ధోరణిలో ఆర్‌బీఐ..

ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాలూ తక్కువ స్థాయిలో ఉంటే పాలసీ రేట్లను మరింత తగ్గించే అవకాశం ఉంటుందని, కాకపోతే ప్రస్తుతానికి తాము వేచి చూసే ధోరణిలోనే ఉన్నామని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇటు వృద్ధి, అటు ధరలపరంగా స్థిరత్వం .. రెండూ ముఖ్యమేనని ఆయన చెప్పారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణ లెక్కల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందున అది 3 శాతం లోపే ఉంటుందా లేదా అనేది తాను ఇప్పుడే చెప్పలేనని మల్హోత్రా పేర్కొన్నారు. ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడంతో రెపో రేటు ప్రస్తుతం 5.5 శాతానికి దిగి వచ్చిన సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం నెమ్మదిస్తున్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో ఆర్‌బీఐ మరో విడత రేట్లను తగ్గించవచ్చనే అభిప్రాయం నెలకొంది.



పోరాటయోధుడు

అన్ని విభాగాల్లో నిలకడగా రాణిస్తున్న రవీంద్ర జడేజా

రెప్పపాటులో దూసుకొచ్చే బంతులను ఒడిసి పట్టాలంటే అతడు ఉండాలి...పాయింట్, కవర్స్, మిడాన్, మిడాఫ్ ఇలా ఎక్కడైనా నమ్మశక్యం కాని క్యాచ్‌లు అందుకోవాలంటే అతడు కావాలి...అవుట్‌ఫీల్డ్ నుంచి నేరుగా వికెట్లను గురిచూసి గిరాటేయాలంటే బంతి అతడికి చేతికి చిక్కాలి!

పిచ్ నుంచి కాస్త సహకారం లభిస్తుందంటే చాలు ప్రత్యర్థిని చుట్టేయడానికి అతడు కావాలి...ప్రత్యర్థి బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకున్నారంటే భాగస్వామ్యాన్ని విడదీయడానికి అతడు రావాలి...స్లో ఓవర్ రేట్ బారిన పడకుండా చకచకా ఓవర్లు ముగించాలంటే అతడికి బౌలింగ్ ఇవ్వాలి!!

టాపార్డర్ బ్యాటర్లకు సరైన సహకారం లభించాలంటే నాన్‌స్ట్రయికర్‌గా అతడు ఉండాలి...లోయర్ ఆర్డర్‌ను కాచుకుంటూ విలువైన పరుగులు చేయాలంటే క్రీజులో అతడు ఉండాలి...గడ్డు పరిస్థితుల్లో జట్టును గట్టెక్కించాలంటే అతడు బ్యాట్‌తో 'కత్తిసాము' చేయాలి!!

ఇలా బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ అన్నిట్లో అతి ముఖ్యమైన ఆ అతడు మరెవరో కాదు... రవీంద్ర సింగ్ జడేజా. పుష్కర కాలానికి పైగా భారత టెస్టు జట్టులో కొనసాగుతున్న ఈ సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ తాజాగా ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో తన విలువ చాటుకుంటున్నాడు. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలతో మెరిసిన 'జడ్డూ'... లార్డ్స్‌లో ఓటమి అంచున నిలిచిన జట్టును దాదాపు విజయానికి చేరువ చేశాడు. 'బిట్స్ అండ్ పీసెస్' క్రికెటర్ అనే విమర్శల నుంచి... పరిపూర్ణ ఆల్‌రౌండర్ అనిపించుకును స్థాయికి ఎదిగిన జడేజాపై ప్రత్యేక కథనం...

- సాక్షి క్రీడా విభాగం

- అసలు సిసలు ఆల్‌రౌండర్‌కు ప్రతిరూపం
- ఇంగ్లండ్‌తో సిరీస్‌లో వరుసగా నాలుగు హాఫ్‌సెంచరీలు
- బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ మెరుపులు

ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో భారత్ విజయానికి 193 పరుగులు అవసరం కాగా... 82 పరుగులకే టీమిండియా 7 వికెట్లు కోల్పోయింది. ఇంకేముంది మరో పది, ఇరవై పరుగుల వ్యవధిలో మిగిలిన మూడు వికెట్లు కూలడం ఖాయమే అనే ఊహాగానాల మధ్య భారత జట్టు చివరకు 170 పరుగులు చేయగలిగింది. చివరి ముగ్గురు బ్యాటర్లు వీరోచిత పోరాటం చేసిన మాట వాస్తవమే అయినా... దానికి నాయకత్వం వహించింది మాత్రం ముమ్మాటికీ రవీంద్ర జడేజానే. యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్ ఇలా నమ్ముకున్న వాళ్లంతా ఒక్కొక్కరుగా పెవిలియన్ బాట పడుతుంటే జడేజా మాత్రం మొక్కవోని సంకల్పంతో బ్యాటింగ్ చేశాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా దుర్భేద్యమైన డిఫెన్స్‌తో కట్టిపడేశాడు. మరో ఎండ్‌లో వికెట్ కాపాడుకోవడం కూడా ముఖ్యమైన తరుణంలో నితీశ్ కుమార్ రెడ్డి, బుమ్రా, సిరాజ్ అండతో జట్టును గెలుపు అంచుల వరకు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో అతడు స్టోక్స్, ఆర్చర్, వోక్స్, కార్స్ వేసిన బౌన్సర్లకు ఎదురు నిలిచిన తీరు... పోరాట యోధుడిని తలపించింది. స్కోరు బోర్డు పరిశీలిస్తే జడేజా పేరిట అర్ధశతకం మాత్రమే కనిపిస్తుంది కానీ... లార్డ్స్‌లో అతడు చేసిన పోరాటం సెంచరీకి తీసిపోనిది. కఠిన క్షణాలు, పరీక్ష పెడుతున్న బంతులు, బ్యాటింగ్‌కు కష్టసాధ్యమైన పరిస్థితులు... వీటన్నిటితో పోరాడిన జడ్డూ క్రికెట్ ప్రేమికుల మనసు గెలుచుకున్నాడు.

వరుసగా నాలుగు ఫిఫ్టీలు...

11, 25 నాటౌట్, 89, 69 నాటౌట్, 72, 61 నాటౌట్... తాజా ఇంగ్లండ్ సిరీస్‌లో జడేజా గణాంకాలివి. తొలి మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో తప్ప అతడు విఫలమైంది లేదు. లీడ్స్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ తరఫున జైస్వాల్, గిల్, రాహుల్ ఒక్కో సెంచరీ చేస్తే పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు బాదాడు. దీంతో జడేజాకు ఎక్కువ బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోగా... బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో కెప్టెన్ గిల్ అనితరసాధ్యమైన బ్యాటింగ్ ప్రదర్శనకు సంపూర్ణ సహకారం అందించిన ఘనత జడేజాదే. తొలి ఇన్నింగ్స్‌లో ఆరో వికెట్‌కు గిల్‌తో కలిసి 203 పరుగులు జోడించి జట్టుకు కొండంత స్కోరు అందించిన 'జడ్డూ'... రెండో ఇన్నింగ్స్‌లోనూ సారథితో కలిసి ఐదో వికెట్‌కు 175 పరుగులు జత చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్‌కు అండగా నిలుస్తూ స్ట్రయిక్ రొటేట్ చేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ ఓ మాదిరిగా రాణించిన సమయంలో నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌తో విలువైన భాగస్వామ్యాలు నమోదు చేసిన అతడు... రెండో ఇన్నింగ్స్‌లో అసాధారణంగా పోరాడాడు. ఇంగ్లండ్ బౌలర్లంతా ఒకదశలో జడేజాను అవుట్ చేయడం సాధ్యం కాదని నిర్ణయించుకొని అవతలి ఎండ్‌లో వికెట్ పడగొట్టేందుకే ప్రయత్నించారంటే అతడు ఎంత పట్టుదలగా ఆడాడో అర్థం చేసుకోవచ్చు.

వికెట్ విలువ గుర్తెరిగి...

గత ఏడాది భారత జట్టు టి20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం ఆ ఫార్మాట్ నుంచి విరాట్ కోహ్లి, రోహిత్ శర్మతో పాటు జడేజా కూడా వీడ్కోలు పలికాడు. తదనంతరం ఆ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు సుదీర్ఘ ఫార్మాట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించగా... 'జడ్డూ' మాత్రం కొనసాగుతున్నాడు. జైస్వాల్, గిల్, సుదర్శన్, సుందర్, నితీశ్ వంటి యువ ఆటగాళ్లతో కూడిన జట్టులో... రాహుల్, పంత్ కన్నా ఎక్కువ టెస్టులు ఆడిన అనుభవం ఉన్న జడేజా ఈ సిరీస్‌లో తన వికెట్ విలువ గుర్తెరిగి బ్యాటింగ్ చేస్తున్నాడు. పరిస్థితులకు తగ్గట్లు తన బ్యాటింగ్‌ను మార్చుకుంటూ ప్రతి కెప్టెన్ తన జట్టులో ఇలాంటి ప్లేయర్ ఉండాలనుకునే విధంగా ఆడుతున్నాడు. గతంలో కేవలం తన బౌలింగ్, ఫీల్డింగ్‌తోనే జట్టులో చోటు దక్కించుకున్న 'జడ్డూ'... ఇప్పుడు నమ్మదగ్గ బ్యాటర్‌గా ఎదిగాడు. ఒకప్పుడు 'బిట్స్ అండ్ పీసెస్' క్రికెటర్ అని విమర్శలు ఎదుర్కొన్న అతడు... వాటికి తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. భారత గడ్డపై మ్యాచ్‌ల్లో ఎక్కువ వికెట్లు తీసిన జడేజా... విదేశాల్లో బౌలింగ్‌తో అద్భుతాలు చేయలేకపోయినా... నిఖార్సైన బ్యాటర్‌గానూ జట్టులో చోటు నిలుపుకునే స్థాయికి ఎదిగాడు. తాజా ఇంగ్లండ్ పర్యటనలో పేసర్లు వికెట్ల పండగ చేసుకుంటుండగా... ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ 3 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో లంచ్‌కు ముందు చివరి ఓవర్‌లో స్టోక్స్ అవుట్ కావడం వెనక 'జడ్డూ' కృషి ఉంది. అంతకుముందు ఓవర్ వేసిన అతడు కేవలం 90 సెకన్లలోనే ఆరు బంతులు వేయడంతో మరో అదనపు ఓవర్ వేసే అవకాశం దక్కగా... అందులో సుందర్ బౌలింగ్‌లో స్టోక్స్ పెవిలియన్ చేరాడు.

ఎప్పుడూ తెరవెనుకే!

జడేజా టెస్టు అరంగేట్రం చేసినప్పటి నుంచి చూసుకుంటే... అతడి కంటే ఐదుగురు బౌలర్లు మాత్రమే ఎక్కువ బంతులు వేశారు. 2018 తర్వాతి నుంచి అతడు 42.01 సగటుతో పరుగులు రాబట్టాడు. 83 టెస్టుల్లో జడ్డూ 4 సెంచరీలు, 26 అర్ధసెంచరీలతో 3697 పరుగులు చేయడంతో పాటు... 326 వికెట్లు పడగొట్టాడు. అందులో 15 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. అయితే ఇందులో అధిక శాతం ఉపఖండ పిచ్‌లపైనే నమోదవడం... జడేజా మంచి స్కోరు చేసిన మ్యాచ్‌ల్లో టాపార్డర్ భారీగా పరుగులు రాబట్టడంతో ఎప్పుడూ అతడి పేరు పెద్దగా వెలుగులోకి రాలేదు. పదకొండేళ్ల క్రితం 2014లో లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో టెస్టులో ధనాధన్ హాఫ్ సెంచరీతో పాటు ఆఖర్లో చక్కటి త్రోతో అండర్సన్‌ను రనౌట్ చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన జడేజా ఈసారి ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించాలని విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యాడు. అయితే ఈ క్రమంలో తన పోరాటంతో మాత్రం అందలమెక్కాడు. ఇకపై కూడా అతడు ఇదే నిలకడ కొనసాగించాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. ఆరు బంతులను ఒకే ప్రాంతంలో వేయగల నైపుణ్యంతో పాటు... వేర్వేరుగా సంధించగల వైవిధ్యం గల జడేజా... నోబాల్స్ విషయంలో మరింత దృష్టి పెట్టాల్సిన అవసరముంది!



రిత్విక్ జోడీ ఓటమి

గ్‌స్టాడ్ (స్విట్జర్లాండ్): వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ తర్వాత బరిలోకి దిగిన తొలి టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యులు బొల్లిపల్లి రిత్విక్ చౌదరి, శ్రీరామ్ బాలాజీలకు నిరాశ ఎదురైంది. గ్‌స్టాడ్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో జతగా ఆడిన రిత్విక్–శ్రీరామ్ బాలాజీ ద్వయం తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. జాకుబ్ పాల్–డొమినిక్ స్ట్రయికర్ (స్విట్జర్లాండ్) జోడీతో జరిగిన మ్యాచ్‌లో రిత్విక్–శ్రీరామ్ బాలాజీ జంట 4–6, 7–6 (10/8), 7–10తో 'సూపర్ టైబ్రేక్'లో ఓడిపోయింది. 1 గంట 50 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–బాలాజీ మూడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. మరోవైపు ఇదే టోర్నీలో ఆడుతున్న అర్జున్ ఖడే–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో అర్జున్–విజయ్ జంట 7–5, 6–3తో నికోలస్ బరియంతోస్ (కొలంబియా)–మిగెల్ రేయస్ వరేలా (మెక్సికో) జోడీపై గెలిచింది.

నిశేష్ రెడ్డి బోణీ



లాస్ కాబోస్ (మెక్సికో): మిఫెల్ టెన్నిస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతికి చెందిన అమెరికా క్రీడాకారుడు నిశేష్ రెడ్డి బసవరెడ్డి శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నిశేష్ 6–4, 6–1తో నికోలస్ మెజియా (కొలంబియా)పై గెలుపొందాడు. 82 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 111వ ర్యాంకర్ నిశేష్ ఐదు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. ఈ ఏడాది జనవరిలో ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో మెయిన్ 'డ్రా'లో గెలిచిన తర్వాత... టూర్ లెవెల్ టోర్నీలో నిశేష్ సాధించిన రెండో విజయం ఇదే కావడం గమనార్హం. గత ఆరు నెలల్లో నిశేష్ 15 ఏటీపీ టూర్ లెవెల్ టోర్నీల్లో పోటీ పడ్డాడు. క్వాలిఫయింగ్‌లో గెలిచినా... మెయిన్ 'డ్రా'కు వచ్చేసరికి ఓడిపోతున్నాడు. ఆరు నెలల తర్వాత నిశేష్ మెయిన్ 'డ్రా'లో మళ్లీ విజయం రుచి చూశాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 97వ ర్యాంకర్ ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా)తో నిశేష్ ఆడతాడు.

ఆటను మరింత విస్తరించేందుకు...

అంతర్జాతీయ క్రికెట్ మండలి కొత్త ప్రణాళికలు ● నేటి నుంచి ఐసీసీ సమావేశం

సింగపూర్: 2026లో జరిగే టి20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌కు ఇటీవలే ఇటలీ దేశం క్వాలిఫై అయింది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌కు పెరుగుతున్న ఆసక్తి, యూరోప్ దేశాల్లోనూ ఆట విస్తరిస్తున్న తీరుకు ఇది సరైన ఉదాహరణ. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇప్పుడు సరిగ్గా దీనిపైనే మరింత దృష్టి పెట్టనుంది. కొత్త దేశాల్లో క్రికెట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు కొత్త ప్రణాళికలు రూపొందించాలని ఐసీసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై మరింత సమగ్ర చర్చ, భవిష్యత్తు కార్యాచరణ విషయంలో ఐసీసీ చర్చించనుంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఐసీసీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ప్రధాన ఎజెండాల్లో ఇది కూడా ఒకటి. వచ్చే టి20 వరల్డ్ కప్ 20 జట్లతో జరగనుంది. దీనిని ఆ తర్వాత 24 జట్లకు పెంచే ప్రతిపాదనపై



ఐసీసీ చైర్మన్ జై షా

కూడా సమావేశంలో చర్చిస్తారు. అమెరికా–వెస్టిండీస్‌లలో జరిగిన 2024 టి20 వరల్డ్ కప్ నిర్వహణలో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ కొనసాగుతుండగా...విచారణలో వెల్లడైన అంశాలతో ఏజీఎంలో నివేదిక ప్రవేశపెట్టే అవకాశం కూడా ఉంది. టెస్టు క్రికెట్‌ను పెద్ద, చిన్న జట్లతో రెండు వేర్వేరు స్థాయిల్లో నిర్వహించే అంశంపై కూడా చర్చించనున్నారు. ఇలా టెస్టులను వర్గీకరించే అంశానికి ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ బోర్డులు గట్టిగా మద్దతు పలుకుతున్నాయి. తాజాగా ఆసీస్‌పై విండీస్ 27 ఆలౌట్ ప్రదర్శనను బట్టి చూస్తే దీనిపై గట్టిగానే చర్చ సాగనుంది. అయితే 2025–27 డబ్ల్యూటీసీ టెస్టుల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఏదైనా మార్పుపై నిర్ణయం తీసుకుంటే 2027 తర్వాతే సాధ్యమవుతుంది. మరో వైపు నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా 2019లో సస్పెన్షన్‌కు గురైన జాంబియా జట్టుకు ఐసీసీ అసోసియేట్ టీమ్‌గా మళ్లీ అవకాశం కల్పించనుండగా...తొలిసారి ఈస్ట్ తైమూర్ టీమ్ కూడా ఐసీసీలో భాగం కానుంది. ఐసీసీ కొత్త సీఈఓ హోదాలో సంజోగ్ గుప్తా తొలిసారి ఈ సమావేశంలో కీలక పాత్ర పోషించనున్నారు.



న్యూజిలాండ్ ఘనవిజయం

రాణించిన రాబిన్‌సన్

హరారే: ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. గత మ్యాచ్‌లో జింబాబ్వేపై గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు... బుధవారం జరిగిన పోరులో 21 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ రాబిన్‌సన్ (57 బంతుల్లో 75 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో రాణించగా... జాకబ్స్ (30 బంతుల్లో 44 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. డెవాన్ కాన్వే (9), డారిల్ మిచెల్ (5), మిచెల్ హే (2) విఫలమయ్యారు. ఆల్‌రౌండర్ జేమ్స్ నీషమ్ (0) రికార్డు స్థాయిలో ఏడోసారి డకౌటయ్యాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంఫాకా 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 18.2 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. డెవాల్డ్ బ్రేవిస్ (18 బంతుల్లో 35; 1 ఫోర్, 3 సిక్స్‌లు), జార్జ్ లిండే (20 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కాస్త పోరాడారు. టోర్నీలో భాగంగా శుక్రవారం జింబాబ్వేతో న్యూజిలాండ్ తలపడనుంది.

ఇంగ్లండ్‌కు షాక్

డబ్ల్యూటీసీ పాయింట్లలో కోత ● స్లో ఓవర్‌రేట్ కారణం

లండన్: భారత్‌పై లార్డ్స్ మైదానంలో మూడో టెస్టులో అద్భుత విజయం సాధించి ఉత్సాహంగా ఉన్న ఇంగ్లండ్ జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) షాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో 'స్లో ఓవర్ రేట్' నమోదు చేసిన ఇంగ్లండ్‌పై ఐసీసీ చర్య తీసుకుంది. మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో రెండు పాయింట్ల కోత విధించింది. అనుమతించిన నిర్ణీత సమయంలో ఇంగ్లండ్ రెండు ఓవర్లు తక్కువగా వేయడంతో ఓవర్‌కు ఒక పాయింట్ చొప్పున శిక్ష పడింది. లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 74.5 ఓవర్లు ఆడగా... స్పిన్నర్ బషీర్ గాయపడటంతో ఇంగ్లండ్ పూర్తిగా పేస్ బౌలింగ్‌పై ఆధారపడాల్సి రావడం (68 ఓవర్లు) కూడా ఓవర్‌రేట్‌పై ప్రభావం చూపించింది. మూడో టెస్టులో ఫలితం తర్వాత డబ్ల్యూటీసీలో ఆడిన 3 టెస్టుల్లో 2 మ్యాచ్‌లు గెలిచి 24 పాయింట్లు సాధించిన ఇంగ్లండ్ రెండో స్థానంలో నిలిచింది. అయితే ఇప్పుడు 2 పాయింట్ల శిక్షతో 22 పాయింట్లకు దిగజారింది. పైగా పాయింట్ల



శాతం కూడా 66.67 నుంచి 61.11కు తగ్గడంతో శ్రీలంక (66.67) తర్వాత మూడో స్థానానికి పడిపోయింది. ఆడిన 3 టెస్టులూ గెలిచిన ఆస్ట్రేలియా మొత్తం 36 పాయింట్లు, 100 శాతంతో అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

‘కీబోర్డ్ వారియర్స్’ను సైలెంట్ చేశా

విమర్శకుల నోళ్లు మూయించడం ఆనందంగా ఉంది: ఆర్చర్

లండన్: సుదీర్ఘ విరామం తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ తన ప్రదర్శనతో విమర్శకుల నోళ్లు మూయించడం ఆనందంగా ఉందని అన్నాడు. ఈ క్రమంలో ఆర్చర్ విమర్శకులను ఉద్దేశించి 'కీబోర్డ్ వారియర్స్' అనే పదాన్ని ఉపయోగించాడు. 2021లో చివరిసారి ఇంగ్లండ్ తరఫున టెస్టు మ్యాచ్ ఆడిన ఆర్చర్... టీమిండియాతో జరిగిన లార్డ్స్ టెస్టుతో పునరాగమనం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లతో ఫర్వాలేదనిపించిన ఆర్చర్... రెండో ఇన్నింగ్స్‌లో మూడు కీలక వికెట్లతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. 'ఇది సుదీర్ఘ ప్రయాణం. ఇన్నాళ్ల తర్వాత తిరిగి జట్టులోకి వచ్చి విజయంలో భాగమవడం సంతోషంగా ఉంది. గత మూడు నాలుగేళ్లుగా ఎంతమంది 'కీబోర్డ్ వారియర్స్' నన్ను లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశారో లెక్కచెప్పలేను. ఎన్నో గాయాలు, మరెన్నో పునరావాస శిబిరాల తర్వాత వచ్చిన ఈ గెలుపు చాలా ప్రత్యేకం' అని ఆర్చర్



అన్నాడు. మోచేయి, వెన్నునొప్పి, కండరాలు ఇలా ఎన్నో గాయాల బారిన పడిన 30 ఏళ్ల ఆర్చర్... గత కొంత కాలంగా పరిమిత ఓవర్ల క్రికెట్ మాత్రమే ఆడుతున్నాడు. ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్ సంతరించుకోవడంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో తిరిగి అడుగు పెట్టాడు. భారత రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో పాటు పంత్, వాషింగ్టన్ సుందర్‌ను ఆర్చర్ పెవిలియన్‌కు పంపాడు. పంత్ వికెట్‌తో జట్టులో నూతనోత్సాహం వచ్చిందని ఆర్చర్ వెల్లడించాడు. 'ఇన్నాళ్ల తర్వాత ఆడిన తొలి టెస్టులో నేను అనుకున్న దానికంటే ఎక్కువ ఓవర్లు బౌలింగ్ చేశా. ఇది శుభసూచకం. పంత్ వికెట్‌తో జట్టులో కొత్త ఉత్సాహం వచ్చింది. ఆ తర్వాత మరింత పట్టుబిగించగలిగాం' అని ఆర్చర్ అన్నాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం లార్డ్స్ వేదికగా ముగిసిన మూడో టెస్టులో ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ఈ సిరీస్‌లో ఆతిథ్య జట్టు ప్రస్తుతం 2–1తో ఆధిక్యంలో ఉండగా... ఇరు జట్ల మధ్య ఈ నెల 23 నుంచి మాంచెస్టర్‌లో నాలుగో మ్యాచ్ ప్రారంభం కానుంది.

టి20 సిరీస్ బంగ్లాదేశ్‌దే

మూడో మ్యాచ్‌లో శ్రీలంకపై గెలుపు



కొలంబో: శ్రీలంక పర్యటనలో భాగంగా టెస్టు, వన్డే సిరీస్‌లు కోల్పోయిన బంగ్లాదేశ్ జట్టు... టి20 సిరీస్ కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన ఆఖరి పోరులో బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో ఆతిథ్య శ్రీలంకను ఓడించి 2–1తో సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. ఓపెనర్ నిసాంక (39 బంతుల్లో 46; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... షనక (25 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) విలువైన పరుగులు చేశాడు. కెప్టెన్ అసలంక (3), దినేశ్ చండీమల్ (4), కుశాల్ పెరీరా (0), కుశాల్ మెండిస్ (6) విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహదీ హసన్ 4 ఓవర్లలో కేవలం 11 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 16.3 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 133 పరుగులు చేసింది. తన్జీద్ హసన్ (47 బంతుల్లో 73 నాటౌట్; 1 ఫోర్, 6 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో రాణించగా... కెప్టెన్ లిటన్ దాస్ (32; 2 ఫోర్లు, 1 సిక్స్), తౌహిద్ హృదయ్ (27 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అతడికి సహకరించారు. లంక బౌలర్లలో నువాన్ తుషార, కమిందు మెండిస్ చెరో వికెట్ పడగొట్టారు. మెహదీ హసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', లిటన్ దాస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

సాక్షి ప్లస్
గురువారం। 17-7-2025


జార్ఖండ్‌లోని గిరిధ్ జిల్లా కొదైబాంక్ గ్రామంలో బుధవారం పొలంలో వరినాట్లు వేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబులాల్ మరాండీ


ఐస్‌లాండ్‌లోని గ్రిందావిక్‌లో అగ్నిపర్వతం బుధవారం బద్ధలయ్యింది. భగభగ మండుతున్న శిలాద్రవం ఇలా హెలికాప్టర్ నుంచి దర్శనమిచ్చింది.

ధరణిని దాటి శుక్రుడిని చూసి..

చెప్పిన పనితోపాటు చెప్పని పనినీ బేషుగ్గా చేసిన జపనీస్ శాటిలైట్లు

శుక్రుని మేఘావృత విశేషాలను వెల్లడించిన హిమవరీ ఉపగ్రహాలు

అప్పగించిన పనిచేయకుండా ఆవారాగా తిరిగితే ఎవరైనా తిడతారు. కానీ చెప్పిన పని చేస్తూనే మరో కొత్త విషయాన్ని కనిపెట్టినందుకు ప్రశంసలను అందుకున్నాయి రెండు జపాన్ ఉపగ్రహాలు. భూవాతావరణ విశేషాలను రాబట్టేందుకు ప్రయోగించిన హిమవరీ-8, హిమవరి-9 కృత్రిమ ఉపగ్రహాలు చివరకు శుక్ర గ్రహ మేఘావృత ఉష్ణోగ్రతల్లో వైరుధ్యాలను వెల్లడించి ఇప్పుడు శెభాష్ అనిపించుకున్నాయి. శుక్రగ్రహం మీది వాతావరణ తరంగాల్లో మార్పులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇవి సేకరించాయి.

దశాబ్దకాల డేటా..

బిర్లాటెంపుల్ ముందు ఒక పేద్ద కుటుంబం ఒకరి తర్వాత ఒకరు ఫొటోలు దిగుతుందనుకుందాం. అప్పుడు సమీపంలో గుర్తు తెలియని పిల్లాడు ఉంటే అతను ఈ ఫొటోలన్నింటిలోనూ పడతాడు. అతని హావభావాలన్నీ స్పష్టంగా తెలుస్తాయి. అచ్చం అలాగే భూ స్థిర కక్ష్యలో తిరుగుతూ ప్రతి 10 నిమిషాలకు ఒకసారి భూ వాతావరణ ఫొటోలు తీసేందుకు జపాన్ హిమవరి-8 ఉపగ్రహాన్ని 2014లో, హిమవరి-9 అనే ఉపగ్రహాన్ని 2016లో నింగిలోకి పంపింది. ఇవి 2015 నుంచి ఇప్పటిదాకా వేలాది ఫొటోలను తీశాయి. అయితే వీటిని గమనించగా అన్ని ఫొటోల్లోనూ ఒక మూలగా శుక్రుడు సైతం కనిపించాడు. దీంతో ఈ పదేళ్లకాలంలో శుక్రుని వాతావరణ మార్పుల వివరాలను సేకరించేందుకు సువర్ణావకాశం లభించింది. ఇది సువర్ణావకాశం ఎందుకంటే భూమి నుంచి టెలిస్కోప్ ద్వారా శుక్రుడిని గమనించాలంటే భూవాతావరణం అంతగా అనుకూలించదు. పైగా అదే సమయంలో సూర్యుడి దేదీప్యమానమైన కాంతి ప్రభావం శుక్రునిపై ఉంటుంది. దాంతో భూమి నుంచి శుక్రుడిని గమనించడం కష్టం. ఇప్పటికే శుక్రుడి సంబంధింత వర్ణ తరంగదైర్ఘ్య సమాచారం సైతం పెద్దగా ఉపయోగపడలేదు. ఈ నేపథ్యంలో అనుకోకుండా రెండు వాతావరణ ఉపగ్రహాల డేటాలో చిక్కిన శుక్రుని వివరాలు ఇప్పుడు ఆ గ్రహ వాతావరణంపై పరిశోధనకు అక్కరకొస్తున్నాయి. **– సాక్షి, నేషనల్ డెస్క్**

సల్ఫ్యూరిక్ యాసిడ్ మేఘాలు

శుక్రునిపై మందపాటి కార్బన్‌డయాక్సైడ్ వాతావరణం పరుచుకుని ఉంటుంది. పైగా ఆకాశం సల్ఫ్యూరిక్ యాసిడ్ మేఘాలలతో కప్పబడి ఉంటుంది. గత పదేళ్లుగా హిమవరి 8, 9 ఉపగ్రహాలు పంపిన సమాచారాన్ని యూనివర్సిటీ ఆఫ్ టోక్యో పరిశోధకులు విశ్లేషించారు. మల్టీస్పెక్ట్రల్ హిమవరి ఇమేజర్స్ సాయంతో రోజువారీగా, సంవత్సరాలవారీగా వాతావరణ మార్పులను సరిపోల్చిచూశారు. ''గతంలో ఏ ఉపగ్రహాన్ని ఇలా పదేళ్లపాటు నిరాటంకంగా పరిశీలించలేదు. భూమి కోసం ఉద్దేశించిన ఉపగ్రహాలు అనుకోకుండా ఇలా శుక్రుని డేటాను ఒడిసిపట్టాయి. శుక్రుని వాతావరణంలో సూర్యకాంతి పరావర్తనం, గాలి వేగం, ఉష్ణోగ్రతల్లో మార్పుల వివరాలు తెల్సుకునేందుక ఈ డేటా ఎంతగానో ఉపయోగపడుతోంది. ఉష్ణ తరంగాల్లో మార్పులనూ తెల్సుకోవచ్చు''అని పరిశోధనలో కీలక రచయిత అయిన గక నిషయమ చెప్పారు. ''విభిన్న తరంగదైర్ఘ్యాలతో విస్తరించే పరారుణ కాంతిని ఒడిసిపట్టేందుకు హిమవరి శాటిలైట్లలోని సెన్సార్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. మరో నాలుగేళ్లపాటు ఇవి సేవలందిస్తాయి. 2030దాకా ఏ దేశం కూడా శుక్రుని వాతావరణ పరిశోధన కోసం ప్రత్యేక ప్రాజెక్ట్‌చేపట్టేదు. ఈ నేపథ్యంలో హిమవరి శాటిలైట్ల తదుపరి డేటా సైతం కీలకంగా మారనుంది''అని నిషయమ చెప్పారు. పరిశోధకులు 437 భిన్న వాతావరణ పరిస్థితుల్లో శుక్రునిపై మేఘాల పరిస్థితిని విశ్లేషిస్తున్నారు. శుక్రుడు, భూమి వేర్వేరు కోణాల్లో సమీపానికి వచ్చినప్పుడు శుక్రుని వాతావరణంలో జరిగే మార్పులను తెల్సుకునేందుకు ఇప్పుడు అవకాశం చిక్కింది. హిమవరి అంటే జపాన్ భాషలో పొద్దుతిరుగుడు పువ్వు అని అర్థం. నిరంతరంగా భూమిని పరిశీలిస్తూ భూ స్థిర కక్ష్యలో తిరుగుతాయని, అందుకు గుర్తుగా ఈ పేరు ఎంపికచేసినట్లు ఆనాడు జపాన్ ప్రకటించింది.

తగ్గుతున్న అమెరికా ఇమేజ్

చైనానూ సానుకూలంగా చూస్తున్న ప్రపంచం

వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా ప్రజాభిప్రాయంలో మార్పు వస్తోంది. అందరి హాట్ ఫేవరెట్‌గా ఉన్న అమెరికా ఇమేజ్ తగ్గిపోతోంది. అంతేకాదు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్ల సానుకూలత గణనీయంగా తగ్గిపోతోంది. చైనా, ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ పట్ల ఆదారణ పెరుగుతోంది. ప్యూ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన కొత్త సర్వే ఈ విషయాలు వెల్లడించింది. గతంలో నిర్వహించిన సర్వేల్లో అమెరికా అగ్రస్థానంలో ఉండగా.. చైనా పట్ల వ్యతిరేకత ఉండేది. కానీ.. తీరు మారుతోంది. ఇటీవలి సంవత్సరాలతో పోలిస్తే.. ఇప్పుడు రెండు అగ్రరాజ్యాలు సమానంగా అభిమానాన్ని సంపాదించుకుంటున్నాయి.

8 దేశాలు అమెరికా వైపు..
7 దేశాలు చైనా వైపు..

జనవరి 8 నుంచి ఏప్రిల్ 26 వరకు యూఎస్ సహా 25 దేశాలలో 30,000 మందికి పైగా వ్యక్తులను ప్యూ సర్వే చేసింది. 24 దేశాల్లో నిర్వహించిన తాజా సర్వేలో, ఎనిమిది దేశాలలో అమెరికాను గొప్పగా అభివర్ణించారు. ఏడు దేశాలలో చైనాను పొగిడారు. మిగిలిన దేశాల్లో రెండింటికీ సమాన గౌరవం లభించింది. ముఖ్యంగా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీతో సహా 10 అధిక ఆదాయ దేశాల్లో 35% మంది మాత్రమే అమెరికా పట్ల సానుకూల అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. గత సంవత్సరం 51% ఉండగా.. ఇప్పుడది 35 శాతానికి పడిపోయింది. ఈ ధనిక దేశాల్లో 32% మంది చైనా పట్ల సానుకూల అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. ఇది గత సంవత్సరం 23% మాత్రమే ఉంది. అంటే తొమ్మిది శాతం పెరిగింది. ఇక అధ్యక్షుడు జిన్‌పింగ్‌పై తమకు నమ్మకం ఉందని 22% మంది చెప్పారు. ఇది గత సంవత్సరం 17%గానే ఉంది. అంటే ఈ ఏడాదికి 5శాతం పెరిగింది.

ట్రంప్ విధానాలే కారణం!

ఈ మార్పునకు కారణమేంటనేదీ ప్యూ రీసెర్చ్ సెంటర్ తేల్చలేకపోయింది. అయితే.. అభివృద్ధి చెందుతున్న భౌగోళిక రాజకీయ మార్పులు, నాయకత్వం అవగాహన ఈ ఫలితాలకు కారణమై ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అధ్యక్షుడు ట్రంప్ పరిపాలన విదేశాంగ విధాన నిర్ణయాలపై విమర్శలు పెరుగుతున్న తరుణంలో ఈ ఫలితాలు వెలువడ్డాయి. విదేశీ సహాయాన్ని తగ్గించడం, సాంప్రదాయ మిత్రదేశాలపై సుంకాలను విధించడం, అంతర్జాతీయ విద్యార్థులను ప్రభావితం చేసే వలస విధానాలను కఠినతరం చేయడం వంటి వరుస విధాన చర్యలు అమెరికా పట్ల విశ్వసనీయతను పోగొడుతున్నాయని డెమొక్రాట్ సెనేటర్ల బృందం ఆరోపించింది.

అమెరికావైపే ఇజ్రాయెలీలు..

ఇక.. ఇజ్రాయెల్ ప్రజలు మాత్రం.. పాలస్తీనా, ఇరాన్‌లపై తమ యుద్ధానికి మద్దతు ఇచ్చిన అమెరికా పట్లనే ఎక్కువ సానుకూలంగా ఉన్నారు. 83% మంది ఇజ్రాయేలీలు అమెరికాను ఇష్టపడుతుండగా.. 33% మంది చైనా పట్ల తమ సానుకూలతను తెలిపారు. వారిలో 69% మంది ట్రంప్‌పై తమకు నమ్మకం ఉందని చెబుతుండగా, 9% మంది మాత్రమే జిన్‌పింగ్ పట్ల విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

కదులుతున్న కారులో మహిళపై గ్యాంగ్‌రేప్

రాజస్తాన్‌లో దారుణం

జైపూర్: రాజస్తాన్‌లోని అల్వార్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఏడుగురు దుండగులు ఓ మహిళను అపహరించి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కారులో ప్రయాణిస్తూ ఒకరి తర్వాత ఒకరు రేప్ చేశారు. 11 రోజులపాటు బాధితురాలిని నిర్బంధించారు. చివరకు రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. బాధితురాలి భర్త ఫిర్యాదు ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్ 24న రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళను ముగ్గురు వ్యక్తులు అపహరించారు. బొలేరో వాహనంలో బలవంతంగా ఎక్కించి తీసుకెళ్లారు. వాహనంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రతిఘటించేందుకు ప్రయత్నించిన మహిళపై దాడికి దిగారు. నోట్లో గుడ్డలు కుక్కారు. గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ మరో నలుగురు ఉన్నారు. 11 రోజులు అక్కడే నిర్బంధించారు. ఏడుగురు వ్యక్తులు ఆమెపై అత్యాచారం చేశారు. బాధితురాలిని నగ్నంగా మార్చి అభ్యంతకరంగా వీడియోలు చిత్రీకరించారు. పోలీసులకు చెబితే ఈ వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని హెచ్చరించారు. రూ.3 లక్షల ఇస్తామని, నోరు మూసుకోవాలని చెప్పారు. అపస్మారక స్థితికి చేరిన బాధితురాలిని రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారు. స్థానికుల సాయంతో ఆమె తన ఇంటికి చేరుకున్నారు.

మనిషి చనిపోయినా.. ఆధార్ యాక్టివ్‌గానే ఉంటోంది

- పెరుగుతున్న దుర్వినియోగ ముప్పు
- సమాచార హక్కు(ఆర్టీఐ) దరఖాస్తులో వెల్లడి

న్యూఢిల్లీ: ఆధార్ కార్యక్రమం 14 ఏళ్ల కిందట ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు లక్షలాది మంది చనిపోయారు. కానీ.. వారి ఆధార్ మాత్రం యాక్టివ్‌గానే ఉంటోంది. ఏటా 83 లక్షలకు పైగా మరణాలు నమోదవుతున్నప్పటికీ ఆధార్ డీయాక్టివేషన్ రేటు మాత్రం 10% కంటే తక్కువగా ఉంది. ఇది దేశంలోని మరణాల రేటుతో పోలిస్తే చాలా తక్కువ. ఇప్పటివరకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కేవలం 1.15 కోట్ల ఆధార్ నంబర్లను మాత్రమే డీయాక్టివేట్ చేసింది. దీంతో ఆధార్ దుర్వినియోగంపై ఆందోళనలు పెరుగుతున్నాయి.

జూన్ 2025 నాటికి దేశంలో 142.39 కోట్ల మంది ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఐక్యరాజ్య సమితి జనాభా నిధి ప్రకారం, ఏప్రిల్ 2025 నాటికి దేశ మొత్తం జనాభా 146.39 కోట్లుగా ఉంది. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీ ఆర్ఎస్) ఇచ్చిన అధికారిక డేటా ప్రకారం, దేశంలో 2007 నుంచి 2019 మధ్య ప్రతి సంవత్సరం సగటున 83.5 లక్షల మరణాలు సంభవించాయి. అయితే.. ఈ సంఖ్యతో పోల్చి చూస్తే.. ఆధార్ డీయాక్టివేషన్ చాలా తక్కువగా ఉంది. మొత్తం మరణాల్లో కేవలం 10 శాతం కంటే తక్కువ మంది ఆధార్ మాత్రమే రద్దు అయ్యింది. చనిపోయినా.. ఇప్పటికీ యాక్టివ్‌లో ఉన్న ఆధార్ కార్డుల గురించి ప్రత్యేక డేటా కూడా యూఐడీఏఐ దగ్గర లేదు. డీయాక్టివేషన్ ప్రక్రియ క్లిష్టంగా ఉందని యూఐడీఏఐ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల ఆధార్ దుర్వినియోగం అవుతోందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మనుషులు చనిపోయినా.. ఆధార్ యాక్టివ్‌గా ఉండటం వల్ల.. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర గుర్తింపు-అనుసంధాన సేవలను ప్రభావితం చేస్తుంది. పథకాలు, సబ్సిడీలు, ఇతర మోసాలను నివారించడానికి పౌర మరణ రిజిస్ట్రీలు, ఆధార్ డేటాబేస్ మధ్య అనుసంధానం అవసరమని నిపుణులు వాదిస్తున్నారు.

రైతుల జీవితాలు మార్చేందుకు కట్టుబడి ఉన్నాం: మోదీ

న్యూఢిల్లీ: అన్నదాతల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. ధన్-ధాన్య కృషి యోజనతో జిల్లాల్లో పంటల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. వెనుకబడిన జిల్లాల్లో ఈ పథకం అమలు చేయబోతున్నామని, తద్వారా అక్కడి రైతుల ఆదాయాలు పెరిగి, వారి జీవితం మారిపోతుందని బుధవారం ఉద్ఘాటించారు. దేశంలో పునరుద్పాతక ఇంధన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయంచామని, ఆ దిశగా చర్యలు చేపట్టామని వెల్లడించారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించండి

- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టండి
- ప్రధానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించిన బిల్లును రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. జమ్మూ కశ్మీర్ ప్రజల డిమాండ్ చట్టబద్ధమైనదని, వారి రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కని లేఖలో పేర్కొన్నారు. ''గత ఐదేళ్లుగా జమ్మూకశ్మీర్ ప్రజలు పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని నిరంతరం కోరుతున్నారు. గతంలో కేంద్రపాలిత ప్రాంతాలకు రాష్ట్ర హోదా మంజూరు చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ, స్వతంత్ర భారతంలో జమ్మూకశ్మీర్ కేసు విచిత్రమైనది. విభజన తర్వాత పూర్తి స్థాయి రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా తగ్గించడం ఇదే మొదటిసారి. సాధ్యమైనంత త్వరగా, వీలైనంత త్వరగా రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ముందు హామీ ఇచ్చింది''అని ఆ లేఖలో రాహుల్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రధాని మోదీకి రాహుల్ గుర్తు చేశారు. అలాగే లద్ధాను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద చేర్చడానికి బిల్లు తీసుకు రావాలని గాంధీ కేంద్రాన్ని కోరారు. లద్దాఖ్ ప్రజల సాంస్కృతిక, అభివృద్ధి, రాజకీయ ఆకాంక్షలను పరిష్కరించడంలో, వారి హక్కులు, భూమి, గుర్తింపును కాపాడుకోవడంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు అవుతుందని ఆయన పేర్కొన్నారు. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేసినప్పుడే.. జమ్మూకశ్మీర్ కూడా రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కేంద్రం విభజించింది. అయితే.. కేంద్రపాలిత ప్రాంతాలకు రాష్ట్ర హోదా పునరుద్ధరించడం అనేది ప్రతిపక్షాల దీర్ఘకాల డిమాండ్. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనేక సందర్భాల్లో ఎటువంటి కాలపరిమితి ఇవ్వకుండానే జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు హామీ ఇచ్చారు. అయితే, ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించడం రాష్ట్ర హోదా పునరుద్ధరణ డిమాండ్‌కు ప్రతికూలంగా మారింది.

ఫ్లోరిడాలో విమాన ప్రమాదం

సురక్షితంగా బయటపడ్డ నలుగురు

ఫ్లోరిడా: ఫ్లోరిడాలోని ఒక చిన్న విమానం ల్యాండింగ్ సమయంలో కూలిపోయింది. నార్త్ పెర్రీ విమానాశ్రయం సమీపంలో చెట్టును ఢీకొన్న విమానం మంటల్లో చిక్కుకుంది. విమానాశ్రయ రన్‌వేకి కేవలం ఒక మైలు దూరంలో ఈ ప్రమాదం జరిగింది. చుట్టుపక్కల వారు త్వరగా స్పందించి విమానంలోని ఉన్న నలుగురిని రక్షించారు.ఒకరు మంటలు ఆర్పే అగ్నిమాపక యంత్రాన్ని తీసుకురాగా, మరొకరు నీటి పైపుతో మంటలు ఆర్పారు. మరొకరు గొడ్డలితో విమానం కిటికీని పగులగొట్టారు. ప్రయాణికులు, పైలట్ అందరూ సురక్షితంగా ఉన్నారని పోలీసులు నిర్ధారించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.



గాంధీ తైల వర్ణ చిత్రానికి రూ.కోటి 75 లక్షలు

లండన్: మహాత్మాగాంధీ అరుదైన తైలవర్ణ చిత్రం రూ.కోటి 75లక్షలు పలికింది. తాము అంచనా వేసిన దానికంటే ఎక్కువ మొత్తానికి ఈ చిత్రం అమ్ముడుపోయిందని లండన్‌కు చెందిన వేలం సంస్థ బోన్‌హామ్స్ తెలిపింది. భారత రాజ్యాంగ సంస్కరణలను చర్చించడానికి, స్వపరిపాలన డిమాండ్లను పరిష్కరించడానికి జరిగిన రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి 1931లో గాంధీ లండన్ వెళ్లారు. ఆ సమయంలో బ్రిటిష్ కళాకారిణి క్లేర్ లైటన్ దీనిని చిత్రించారు. గాంధీజీ కూర్చుని ఉన్న ఏకైక తైలవర్ణ చిత్రపటం ఇదేనని బోన్‌హామ్స్ తెలిపింది.ఆ సమయంలో గాంధీజీ కార్యాలయంలోకి ప్రవేశించిన అతికొద్ది మంది కళాకారుల్లో ఆమె ఒకరు.

ఆన్‌లైన్‌లో తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ ఓటీపీ ధ్రువీకరణ తప్పనిసరి

జమ్మూ: రైల్లో ప్రయాణించడానికి ఆన్‌లైన్‌లో తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవాలంటే ఆధార్ గుర్తింపును ఓటీపీ ద్వారా ధ్రువీకరించడం తప్పనిసరి అని రైల్వేశాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. ఈ నెల 15వ తేదీ నుంచే ఈ నిబంధన అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. తత్కాల్ టికెట్ల బుకింగ్ విషయంలో పారదర్శకత కోసమే ఈ సవరణ తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అసలైన ప్రయాణికులు దీనివల్ల లబ్ధి పొందుతారని, అక్రమాలకు తెరపడుతుందని చెప్పారు. ఆధార్ ఓటీపీ వెరిఫికేషన్ పూర్తికాకుండా ఆన్‌లైన్‌లో తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవడం సాధ్యం కాదని వెల్లడించారు. ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తోపాటు పీఆర్ఎస్ కౌంటర్లలో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవచ్చని సూచించారు. అధీకృత ఏజెంట్ల వద్ద కూడా టికెట్లు అందుబాటులో ఉంటాయని, అక్కడ కూడా ఓటీపీ వెరిఫికేషన్ పూర్తి చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. తత్కాల్ టికెట్లు కావాలంటే ఆధార్‌తో అనుసంధానమైన సిమ్‌కార్డున్న మొబైల్ ఫోన్‌ను ఉపయోగించాలని తెలిపారు.

పాకిస్తాన్‌లో భారీ వర్షాలు, వరదలు

ఇప్పటివరకు 140కి చేరిన మృతుల సంఖ్య

లాహోర్: పాకిస్తాన్‌లో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వరదలు ముంచెత్తుతున్నాయి. తాజాగా వరదల కారణంగా 24 మంది మృతిచెందారు. 150 మందికిపైగా గాయపడ్డారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు, వరదల ధాటికి మరణించినవారి సంఖ్య 140కి చేరినట్లు అధికారులు బుధవారం ప్రకటించారు. పంజాబ్ ప్రావిన్స్‌లో అధికంగా వర్షాలు కురుస్తున్నాయి. లాహోర్‌లో మూడు ఇళ్ల పైకప్పులు కూలడంతో 12 మంది మరణించారు. పంజాబ్, ఖైబర్, సింధ్, బలూచిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో మరణాలు సంభవించాయి.



సర్పంతో ఆటలాడితే అంతే

భోపాల్: నాగ పామును మెడకు చుట్టుకొని, బైక్ నడుపుతూ సాహసం చేయబోయిన ఓ వ్యక్తి అదే పాము కాటు వేయడంతో మృతిచెందాడు. మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బాధితుడిని దీపక్ మహావర్‌గా గుర్తించారు. పాముతో బైక్ నడుపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీపక్ స్థానిక జేపీ కాలేజీలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు. పాములను పట్టడంలో నేర్పరిగా పేరుంది. వేలాది పాములను రక్షించి, సురక్షిత ప్రాంతాల్లో వదిలేశాడు. ఇటీవల నాగు పామును పట్టుకున్నాడు. దాన్ని అందరికీ చూపించాలని భావించాడు. అందుకే మెడకు చుట్టుకొని బైక్ నడిపాడు. కానీ, పాము అతడిని కాటు వేసింది. దీపక్‌ను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఆలస్యంగా తీసుకురావడంతో రక్షించలేకపోయామని డాక్టర్లు చెప్పారు. దీపక్ భార్య గతంలోనే మృతిచెందారు. అతడికి రౌనక్, చిరాగ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రుల మరణంతో వారు అనాథలుగా మారిపోయారు.

అభివృద్ధి పథంలో ఈశాన్యం

- పేదరికం, ఆకలి నిర్మూలనలో పురోగతి
- నీతి ఆయోగ్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడి

పేదరికం, ఆకలి నిర్మూలన, విద్య, లింగ సమానత్వం, ప్రజలకు స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యాన్ని అందించడంలో ఈశాన్య ప్రాంతం పురోగతి సాధిస్తోంది. ఈ ఏడాది గణనీయమైన అభివృద్ధి సాధించినట్టు నీతి అయోగ్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2023-24 సంవత్సరానికి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సూచిక ప్రాతిపదికన ఈశాన్య ప్రాంతంలోని 121 జిల్లాల్లో సర్వే నిర్వహించగా.. 85% అంటే, 103 జిల్లాలు 'ఫ్రంట్ రన్నర్స్'గా నిలిచాయి. అదే 2021-2022లో 103 జిల్లాల్లో 64 మాత్రమే ఫ్రంట్ రన్నర్స్‌గా నిలిచాయి. ఈ ఏడాది ఫ్రంట్ రన్నర్స్ 26శాతం పెరిగాయని నివేదిక వెల్లడించింది.

పది జిల్లాలను మినహాయించి..

పేదరికం, ఆకలి, పారిశుధ్యం వంటి రంగాలలో పురోగతిని అంచనా వేయడానికి ఈశాన్య ప్రాంతంలో సర్వే నిర్వహించారు. ఎనిమిది రాష్ట్రాలలోని 131 జిల్లాల్లో 121 జిల్లాలను 15 రంగాల్లో అంచనా వేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన, మారుమూల ప్రాంతాల్లో ఉన్న పది జిల్లాలను మాత్రం మినహాయించారు. జిల్లాలను వాటి పురోగతి ఆధారంగా అచీవర్స్, ఫ్రంట్ రన్నర్స్, పెర్ఫార్మర్స్, ఆస్పిరంట్స్‌గా వర్గీకరించారు. పేదరికం విభాగంలో ఆస్పిరెంట్ జిల్లాల సంఖ్య గణనీయంగా తగ్గింది. 20 నుంచి కేవలం 3కి పడిపోయింది. 'జీరో హంగర్' కేటగిరీలో కూడా ఆస్పిరంట్ జిల్లాలు 21 నుంచి 1కి పడిపోయాయి. జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా నడిచే రక్షిత మంచినీరు, పారిశుధ్యంలో 114 అగ్రస్థానంలో ఉన్నాయి. లింగ సమానత్వంలోనూ పురోగతి కనిపించింది. ఇందులో 112 జిల్లాలు ఫ్రంట్ రన్నర్స్‌గా నిలిచాయి. అఫర్డబుల్, క్లీన్ ఎనర్జీ విభాగంలో అచీవర్ జిల్లాలు 14కు చేరాయి.

మణిపూర్‌లో 75% ఫ్రంట్ రన్నర్స్

2023 మే 3నుంచి ఉద్రిక్తతలతో ఉన్న మణిపూర్ పురోగతిలో మిశ్రమ రికార్డును ప్రదర్శించింది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో, 75% ముందంజలో ఉన్నాయి. పరిశుభ్రమైన నీరు-పారిశుధ్యం, అఫర్డబుల్ అండ్ క్లీన్ ఎనర్జీ, ఉపాధి-ఆర్థిక వృద్ధి, స్థిరమైన నగరాలు-సమాజాలు వంటి రంగాల్లో అభివృద్ధి సాధించింది. ఇందులో ఇంఫాల్ వెస్ట్ జిల్లా అగ్రస్థానంలో ఉండగా, తమెంగ్‌లాంగ్, నోనీ, ఫెర్జ్‌వల్ జిల్లాలు అత్యల్ప స్థానంలో నిలిచాయి.

టాప్ 10లో..

2023-24 సంవత్సరానికి నాగాలాండ్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాల్లో మూడు జిల్లాల చొప్పున, సిక్కిం నుంచి ఒక జిల్లా టాప్ 10లో నిలిచాయి. మిజోరాం, త్రిపురలోని అన్ని జిల్లాలు ఫ్రంట్ రన్నర్స్‌గా నిలిచాయి. లింగ సమానత్వం, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, ఉపాధి-ఆర్థిక వృద్ధి, స్థిరమైన నగరాలు-సమాజాలు వంటి అనేక విభాగాల్లో నాగాలాండ్ మంచి పనితీరును కనబరిచింది. త్రిపురలోని ఎనిమిది జిల్లాలు ముందంజలో ఉన్నాయి. మౌలిక సదుపాయాల్లో స్థిరమైన పురోగతి సాధించాయి. అసమానతలు తగ్గాయి. అస్సాంలోని 33 జిల్లాలలో 89% ముందంజలో ఉన్నాయి. గతంలో 19 జిల్లాల నుంచి 33కు పెరిగాయి. నాణ్యమైన విద్యను అందించడంలో సిక్కింలోని ఆరు జిల్లాలు ఫ్రంట్ రన్నర్లుగా ఉన్నాయి. పరిశ్రమలు, ఆవిష్కరణలు-మౌలిక సదుపాయాలు పెరగడం, అసమానతలు తగ్గించడంలో త్రిపుర ముందుంది. పర్యావరణ పరిరక్షణలో అరుణాచల్ ప్రదేశ్ వెనుకబడి ఉండగా, నాణ్యమైన విద్యను అందిండచంలో మేఘాలయ ఇబ్బంది పడుతోంది.

కొన్ని సూచికలలో ఇంకా వెనుకబడి..

మొత్తం మీద గణనీయమైన మెరుగుదల ఉన్నప్పటికీ, ఈశాన్య ప్రాంతంలోని అనేక జిల్లాలు ఇప్పటికీ అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నాయి. జాతీయ పథకాలు, స్థానిక ప్రయత్నాలు లాభాలను సాధించినప్పటికీ పర్యావరణ పరిరక్షణలో వెనుకబాటుతనం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ కేటగిరీలో 49 జిల్లాలు ఆస్పిరెంట్స్‌గా ఉండటం అందుకు ఉదాహరణ. బాధ్యతాయుతమైన వినియోగం, ఉత్పత్తిలో ఫ్రంట్ రన్నర్ జిల్లాలు 67 నుంచి 51కి పడిపోయాయి. అసమానతలు తగ్గించడంలో ఆస్పిరెంట్ జిల్లాలు 12 నుంచి 33కి పెరిగాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి?

న్యాయమూర్తులు రకరకాల ప్రభావాలకు, ప్రలోభాలకు దూరంగా ఉండాలి. వృత్తి నిబద్ధతను, నిష్పాక్షికతను, అత్యున్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉండి జాతి, మత, కుల ప్రాంతాలకు అతీతంగా తీర్పులను వెలువరించే గొప్ప లక్షణాలను కలిగి ఉండాలి. అప్పుడే ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ద్విగుణీకృతం అవుతుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ

క్రియాశీలత - ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయ సమీక్ష అధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అంటే.. న్యాయ వ్యవస్థ తన అధికారాలు, విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి, సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడతారు.

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- ★ శాసన, కార్య నిర్వాహక శాఖలు విధి నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ★ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడంతో ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపరచలేని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ★ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పించడంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టుల దృష్టికి తీసుకువచ్చాయి.
- ★ న్యాయస్థానాలు స్వయం ప్రేరిత (Suo-Moto) కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీ చేయడం.
- ★ దత్త శాసనాధికారాల వల్ల కార్య నిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై, అధికారాన్ని దుర్వినియోగం చేయడం, జవాబుదారీతనం లోపించడం.

న్యాయశాఖ క్రియాశీలత - ప్రధాన వివాదాలు

- ★ ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాలకార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- ★ లక్ష్మీకాంత్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్న పిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- ★ తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం, దాని ద్వారా తాజ్‌మహల్‌కు ఉన్న ముప్పునకు సంబంధించిన కేసులు.
- ★ బిహార్ పశుగ్రాసం కేసు.
- ★ జార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి వివాదం.
- ★ రక్షణ శాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- ★ జడ్జీల నియామకం.
- ★ కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్. బొమ్మై తొలగింపు వివాదం.
- ★ ఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడలు.
- ★ పెట్రోల్ బంక్‌ల కేటాయింపులు.

- ★ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని అనుమతించడం.
- ★ ఎర్రబుగ్గ కార్లు, సైరన్లకు సంబంధించిన అంశాలు.

మొదలైన కేసుల్లో సుప్రీంకోర్టు క్రియాశీలక తీర్పులను వెలువరించింది.

ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం [Public Interest Litigation (PIL) Or Socially Interested Litigation (SIL)]:

సాధారణంగా న్యాయస్థానాలను ఆశ్రయించడానికి వివాదంలో భాగస్వామికి మాత్రమే హక్కు ఉంటుంది. దీన్నే లోకస్ స్టాండై (Locus Standi) అంటారు. అయితే 1980 తర్వాత సుప్రీంకోర్టు నూతన శకానికి శ్రీకారం చుట్టింది. వివాదాలతో సంబంధం లేని వ్యక్తులు కూడా న్యాయస్థాన జోక్యాన్ని కోరవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. విషయం లేదా వివాదంలో ప్రజా ప్రయోజనాలు ఉంటే మూడో వ్యక్తి కూడా (థర్డ్ పార్టీ) జోక్యం చేసుకునే అవకాశం ఉంటుంది. దీన్నే 'ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (PIL)' అంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పి.ఎన్. భగవతి, వి.ఆర్. కృష్ణ అయ్యర్ చొరవ వల్ల ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అనే భావన ప్రచారంలోకి వచ్చింది. పిల్‌ను సుప్రీంకోర్టు, హైకోర్టులో మాత్రమే దాఖలు చేయాలి. కేసుల్లో ప్రజా ప్రయోజనాలు ఉన్నట్లు జోక్యం కోరే వ్యక్తి నిరూపించగలగాలి. ఈ పద్ధతి ద్వారా చాలా ప్రజా సమస్యలు పరిష్కారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ప్రజలకు న్యాయాన్ని చేకూర్చడమే కాకుండా పేదలు, బలహీన వర్గాల హక్కులను కాపాడగలిగింది. అనేక కుంభకోణాలు బయటపడటానికి పిల్ దోహదం చేసింది.

గమనిక: PIL అనే భావన మొదటగా అమెరికా రాజ్యాంగంలో ప్రారంభమైంది. కొన్ని మార్పులతో భారత సుప్రీంకోర్టు అదే పద్ధతిని అనుసరిస్తోంది.

ప్లీ బార్గెయినింగ్ (Plea Bargaining)

నిందితుడు నేరాన్ని అంగీకరిస్తే న్యాయస్థానం విచారణ ఆపేసి అతడికి తక్కువ శిక్ష విధించవచ్చు. దీన్ని 2006 నుంచి అమలు చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా కేసులు సత్వరం పరిష్కారం అవుతాయి. అయితే ఈ సౌకర్యం అన్ని నేరాలకు వర్తించదు.

న్యాయ ప్రవర్తన

ఇటీవల న్యాయ ప్రవర్తన (Judicial Behaviour) అనే ప్రక్రియ ప్రాముఖ్యతను సంతరించుకుంది. సమాచార హక్కు చట్టం, రాజకీయ ప్రక్రియల అధ్యయనంలో ప్రవర్తన పద్ధతి అనుసరించడం వల్ల న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్న అంశాలు, వారి క్రమశిక్షణ, పనితీరు, నిబద్ధత మొదలైన విషయాలు ప్రజా సమీక్షకు గురవుతున్నాయి. న్యాయమూర్తులు శీఘ్రంగా కేసులను విచారించడం, విచారణ సమయంలో విపరీత జాప్యానికి బాధ్యత వహించేలా చేయడం, న్యాయమూర్తుల ప్రవర్తన ఆదర్శంగా ఉండేలా చేయడం మొదలైన అంశాల పరిశీలనను న్యాయ వ్యవస్థ ప్రవర్తన అంటారు.

కోర్టు ధిక్కారం - శిక్ష

కోర్టు తీర్పులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినా, అమలు చేయకపోయినా, తీర్పులకు పక్షపాతం ఆపాదించినా అలాంటి వారిని ప్రకరణలు 129, 215ల ప్రకారం శిక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంది.

ఉదా: కర్ణాటక కేడర్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ వాసుదేవన్‌కు కోర్టు ధిక్కారం నేరం కింద నెల రోజులపాటు జైలు శిక్ష విధించారు.

సోషల్ జస్టిస్ బెంచ్

భారత రాజ్యాంగం ప్రవేశికలో పేర్కొన్న - సామాజిక, ఆర్థిక, రాజకీయ అనే మూడు రకాలైన న్యాయాలను సాధించడానికి రాజ్యాంగంలో అనేక ఏర్పాట్లు ఉన్నాయి. అయితే వీటి అమల్లో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అణగారిన వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు తగిన రీతిలో అమలు కావడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ, బాల కార్మిక వ్యవస్థ, పేదరికం, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యం, దళిత హక్కుల ఉల్లంఘన మొదలైన అంశాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని న్యాయస్థానాల ద్వారా పరిష్కరించడానికి విపరీతమైన జాప్యం జరుగుతోంది.

ప్రజల సామాజిక సమస్యలను, ప్రభుత్వం ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను త్వరితగతిన విచారించడానికి సుప్రీంకోర్టులో సామాజిక న్యాయ బెంచ్ అనే ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ ఉదయ్ యు. లలిత్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుంది. 2014 డిసెంబర్ 12 నుంచి ఈ బెంచ్ పనిచేయడం ప్రారంభించింది. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ బెంచ్ సమావేశమవుతుంది. సుప్రీంకోర్టులో సామాజిక న్యాయానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు సహా కొత్త కేసులనూ విచారిస్తుంది.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్

పార్లమెంట్ చేసిన గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం 2010 ప్రకారం దీన్ని ఏర్పాటు చేశారు. 1992లో ఐక్య రాజ్య సమితి పర్యావరణ, అభివృద్ధి సమావేశం; రియో డి జెనిరియోలో చేసిన తీర్మానం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు ప్రాతిపదికగా చెప్పొచ్చు.

నిర్మాణం

ఇది ఒక చట్టబద్ధమైన సంస్థ. ఇందులో ఒక చైర్మన్, 10 మందికి తక్కువ కాకుండా, 20 మంది సభ్యులకు మించకుండా 'జ్యుడీషియల్ మెంబర్లు', అదేవిధంగా 10 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా పర్యావరణం, సంబంధిత రంగాల్లో నిష్ణాతులైన ఇతర సభ్యులుంటారు. వీరందరినీ కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది.

చైర్మన్, సభ్యుల పదవీకాలం 5 ఏళ్లు. పునర్నియామకానికి అర్హులు కారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, చైర్మన్ లేదా జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులైతే వారి పదవీ విరమణ వయసు 75 సంవత్సరాలు. హైకోర్టు న్యాయ మూర్తులు జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులైతే వారి పదవీ విరమణ వయసు 67 ఏళ్లు. నిష్ణాతులైన సభ్యుల పదవీ కాలం 65 ఏళ్లు.

అర్హతలు

- ★ చైర్మన్ లేదా జ్యుడీషియల్ సభ్యుడిగా నియామకం పొందే వ్యక్తి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ఉండాలి.
- ★ పర్యావరణం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వారిని నిష్ణాతులైన సభ్యులుగా నియమిస్తారు.

తొలగింపు - రాజీనామా

- ★ చైర్మన్, సభ్యులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు కేంద్ర ప్రభుత్వం తొలగిస్తుంది.
- ★ అవినీతి, అసమర్థత, దివాళా తీయడం, నేరారోపణ రుజువు కావడం మొదలైన కారణాల ఆధారంగా తొలగిస్తారు. వీరందరూ వారి రాజీనామాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు.

అధికారాలు, విధులు - పరిధి

- ★ పర్యావరణానికి సంబంధించిన అన్ని ప్రధాన వివాదాలు దీని పరిధిలోకి వస్తాయి.
- ★ అటవీ పరిరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ మొదలైన చట్టాల్లోని అంశాలను విచారిస్తుంది.
- ★ మెజార్టీ సభ్యులు ఇచ్చిన తీర్పే తుది తీర్పు. అయితే ప్రత్యేక సందర్భాల్లో ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై 90 రోజుల్లోగా సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు.

జాతీయ న్యాయ సర్వీసుల సంస్థ (National Legal Services Authority)

జరిగిన అన్యాయాన్ని లేదా నష్టాన్ని కోర్టుల ద్వారా సత్వరమే పరిష్కరించుకొని తగిన పరిహారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుంది. అయితే పేదరికం, అవిద్య కారణంగా వారు న్యాయాన్ని పొందలేకపోవచ్చు. భారత రాజ్యాంగం నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39(ఎ) ప్రకారం ప్రజలందరికీ సమన్యాయాన్ని వర్తింపజేయడానికి సమాన అవకాశాలు ఉండాలని ఉచిత న్యాయ సలహాను పొందేందుకు తగిన ఏర్పాటు చేశారు. ఇలాంటి సేవలను అందించడానికి జాతీయ స్థాయిలో ఒక సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికనుగుణంగా 1987లో జాతీయ న్యాయ సలహా సేవల చట్టాన్ని పార్లమెంట్ రూపొందించింది. ఈ చట్టం ప్రకారం 1998లో 'జాతీయ న్యాయ సేవల అధికార సంస్థ'ను ఏర్పాటు చేశారు.

జాతీయ స్థాయిలో ఈ సంస్థకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య పోషకులు (Patron-in-Chief)గా, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు కార్య నిర్వాహక చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

రాష్ట్రస్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య పోషకులు (Patron-in-Chief)గా హైకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు, రిటైర్ అయిన న్యాయమూర్తుల్లో ఒకరు కార్య నిర్వాహక చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

జిల్లా స్థాయిలో జిల్లా న్యాయమూర్తి హోదా రీత్యా ఈ సంస్థకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. తాలూకా లేదా మండల స్థాయిలో ఈ సంస్థకు సీనియర్ సివిల్ జడ్జి హోదా రీత్యా చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

విధులు

- ఉచిత న్యాయ సలహా అందించడానికి చర్యలు తీసుకోవడం.
- దేశ వ్యాప్తంగా న్యాయ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడం.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- ★ సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీబీ.
- ★ సుప్రీంకోర్టులో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్, రెండో వారు కె.జి. బాలక్రిష్ణన్.
- ★ గతంలో 9 మంది మహిళా న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో సేవలందించారు. ప్రస్తుతం బి.వి. నాగరత్నమ్మ, బేలా ఎం.త్రివేదిలు న్యాయమూర్తులుగా కొనసాగుతున్నారు.
- ★ సుప్రీంకోర్టులో అతి తక్కువ కాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తి కె.యన్.సింగ్. ఈయన 18 రోజులు మాత్రమే పనిచేశారు.
- ★ ఆంధ్రప్రదేశ్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలుగా పనిచేసిన వారు కోకా సుబ్బారావు, ఎన్వీ రమణ.
- ★ దళిత వర్గాల నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన వ్యక్తి కె.జి. బాలకృష్ణన్.
- ★ గోలక్‌నాథ్ కేసు సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు.
- ★ కేశవానంద భారతి కేసు సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎం. సిక్రి.
- ★ ఇందిరాగాంధీ లోక్‌సభ సభ్యత్వ అనర్హతకు సంబంధించి విచారించింది - జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్ బెంచ్.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?



ఆధునిక కవితోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన 'లలిత'.

భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు - అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి - కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి - నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి - గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి 'హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్' అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని **'లిరికల్ పోయెట్రీ'**నే తెలుగులో **'భావ కవిత్వం'** అని పిలుస్తున్నారు.
- 'లిరిక్' అంటే **'గాన గుణం అమరిన రచన'** అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి **'ముసలమ్మ మరణం'** నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డి**ని పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడ**ను ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం **కాల్పనికవాదం**. దీనికి మూల పురుషుడు **రూసో**.
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత - **రూసో**.
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన **'రొమాంటిసిజమ్'**ను అనుసరించిన కవులనే **'కాల్పనికవాద కవులు'** అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయేట్రిగా పిలుస్తారు.
- **'లిరికల్ పోయెట్రీ'**ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712-88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో 'న్యూ హెలాయిస్' రచనలో ప్రణయతత్వాన్ని, 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం - **ఆత్మాశ్రయ సిద్ధాంతం**.
- భావకవితోద్యమం మూడు (1910-40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. 'కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత' - **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి ప త్రికలో)
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం' - **విశ్వనాథ సత్యనారాయణ**.
3. 'కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత' - **శ్రీశ్రీ**.
4. 'వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం' - **సి.నా.రె.**

భావ కవిత్వం లక్షణాలు

1) ఆత్మాశ్రయత	2) ప్రకృతి ప్రీతి
3) స్వేచ్ఛాప్రియత్వం	4) ప్రణయం
5) దేశభక్తి	6) సంఘ సంస్కరణాభిలాష
7) స్త్రీ ఉదాత్త చిత్రణ	
8) మానవ సామాజిక స్పృహ	
9) మార్మికత	10) స్మృతి

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

రాయప్రోలు సుబ్బారావు - లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం, స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.

బసవరాజు అప్పారావు - సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.

పింగళి - కాటూరి కవులు - తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.

కాటూరి వెంకటేశ్వరరావు - గుడిగంటలు, పౌలస్త్య హృదయం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి - కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.

దువ్వూరి రామిరెడ్డి - పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.

నండూరి సుబ్బారావు - యెంకి పాటలు

నాయని సుబ్బారావు - సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.

వేదుల సత్యనారాయణశాస్త్రి - దీపావళి, ముక్తఝరి.

అబ్బూరి రామకృష్ణారావు - మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాలు, మాతృ భూమి, తిక్కన మొదలైనవి.

అడవి బాపిరాజు - శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.

విశ్వనాథ సత్యనారాయణ - ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిదూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవితోద్యమం **అభ్యుదయ కవిత్వం**. ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివరి వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని 'ప్రోగ్రెస్' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో **'అభ్యుదయం'** అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి **'పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం'** అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే**.

- సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో **'పారిస్'**లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో **'ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'**ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే **'ది డెయిలీ ట్రిబ్యూన్'** పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో **'మున్షీ ప్రేమ్ చంద్'** అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో **'న్యూ సిగ్నేచర్స్'** అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘాన్ని** ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **వాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. 'ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ **అభ్యుదయ కవిత్వం**'.
2. 'ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం' - **దేవులపల్లి కృష్ణశాస్త్రి**.
3. 'చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం' - **వేల్చేరు నారాయణరావు**.

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ - **శ్రీశ్రీ** అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- **శ్రీశ్రీ** 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ **'జ్వాల'** పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం **'నయాగరా'**. 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రమణ్యం కలసి రచించారు.
- **శ్రీశ్రీ** మహాప్రస్థానం సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ):
మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి

ఆరుద్ర:
త్వమేవాహం, సినీవాలి,
గాయాలు - గేయాలు

అవంత్స సోమసుందర్: వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)

కాళోజీ నారాయణరావు: నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)

దాశరథి కృష్ణమాచార్యులు: అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహోంద్రోదయం.

రెంటాల గోపాలకృష్ణ:
సర్పయాగం, సంఘర్షణ

అనిసెట్టి సుబ్బారావు: అగ్నివీణ

కె.వి. రమణారెడ్డి: అడవి,
భువనఘోష, అంగారవల్లరి

సి. నారాయణరెడ్డి: మంటలు - మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.

పురిపండా అప్పలస్వామి: పులిపంజా, అనల పతాకం, సంధ్యావందనం, స్వర్గానికి - నరకానికి.

పఠాభి: ఫిడేలు రాగాల డజన్,
పఠాభి పంచాంగం (1964)

శిష్ట్లా ఉమామహేశ్వరరావు: నవమిచిలుక, విష్ణుధనువు

శ్రీరంగం నారాయణబాబు: మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
1) కులపాలికా ప్రణయం
2) కరుణ విప్రలంభం
3) అమలిన శృంగారం
4) విప్రలంభ శృంగారం

2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే' అది?
1) విప్లవ కవిత్వం
2) అభ్యుదయ కవిత్వం
3) ఆధ్యాత్మిక కవిత్వం 4) భావ కవిత్వం

3. 'వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం' అనే శ్రీ రంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?
1) దిగంబర కవిత 2) అభ్యుదయ కవిత
3) భావ కవిత 4) విప్లవ కవిత

4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
1) వర్గ సామరస్యం 2) వర్గ సంఘర్షణ
3) ప్రణయ బోధన 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

భారతీయ ఉక్కు నగరం అని దేన్ని పిలుస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశంలో పారిశ్రామిక రంగం

ఖనిజ ఆధారిత పరిశ్రమలు: భారతదేశం ఇనుము - ఉక్కు ఉత్పత్తి పరంగా ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. (చైనా, జపాన్, యూఎస్ఏ, రష్యాల తర్వాత). స్పాంజ్ ఐరన్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. భారతదేశంలో ఇనుము ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధిని రెండు దశల్లో పరిశీలించవచ్చు అవి...

- **స్వాతంత్ర్యానికి పూర్వం:** ఈ దశలో ఇనుము - ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధి ప్రైవేటు రంగంలోనే జరిగింది.
- **స్వాతంత్ర్యానంతరం:** ఈ దశలో విదేశీ సహకారంతో ప్రభుత్వ రంగంలో ఇనుము - ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చెందింది.

స్వాతంత్ర్యానికి పూర్వం

1. 1830 - భారత్‌లో మొట్టమొదటి ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని చెన్నై సమీపంలోని పోర్ట్ నోవాలో స్థాపించారు.
2. 1864 - పశ్చిమ బెంగాల్‌లోని 'కుల్టీ' అనే ప్రదేశంలో 'బెంగాల్ ఐరన్ వర్క్స్' ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.
3. 1907 - జార్ఖండ్‌లోని 'జంషెడ్‌పూర్' (సక్చి) అనే ప్రాంతంలో జంషెడ్ జీ టాటా మొదటిసారి సమీకృత ఇనుము ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. దీన్నే టిస్కో (TISCO - టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) అని పిలుస్తారు.

ముడి పదార్థాల సరఫరా

- ఐరన్ ఓర్- జార్ఖండ్‌లోని నేముండి, ఒడిశాలోని గురుమహ - సాని, బాదమ్ పహాడ్
- బొగ్గు - ఝూరియా, రాణిగంజ్
- మాంగనీస్ - జోడామైన్స్ (ఒడిశాలో కియోంజార్ జిల్లా)
- నీరు - సువర్ణరేఖ
- డోలమైట్ అండ్ లైమ్‌స్టోన్ - సుందరగఢ్

4. 1908 - కుల్టీ సమీపంలోని హీరాపూర్ అనే ప్రాంతంలో మరో ఇనుము ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు.
5. 1919 - బెంగాల్‌లోని బర్న్‌పూర్ వద్ద ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (IISCO) ఏర్పాటు చేశారు. దీనిలో కుల్టీలోని బెంగాల్ ఐరన్ వర్క్స్, హీరాపూర్‌లోని హీరాపూర్ స్టీల్ ప్లాంట్లను విలీనం చేశారు. 1972లో IISCOను భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

ముడి పదార్థాల సరఫరా

- ఐరన్‌ఓర్ - జార్ఖండ్‌లో సింగ్భమ్ జిల్లాలో ఉన్న 'గున' గనులు
- బొగ్గు - ఝూరియా, రాణిగంజ్
- విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
- నీరు - బార్కార్ నది
- డోలమైట్, లైమ్‌స్టోన్ - సుందరగఢ్



6. 1923 - కర్ణాటకలోని భద్రావతి వద్ద 'మిస్కో' (మైసూర్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) ఏర్పాటు చేశారు. 1929లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో దీని పేరును విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారంగా మార్చారు. 1962లో దీన్ని భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

ముడి పదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - కెమ్మంగుడి
విద్యుత్ - శరావతి పవర్ ప్లాంట్
నీరు - భద్రావతి నది
లైమ్ స్టోన్ - బుందిగూడ
మాంగనీస్ - షిమాగో, చిత్రదుర్గ

స్వాతంత్ర్యానంతరం

రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో

7. 1957 - ఛత్తీస్‌గఢ్ (గతంలో మధ్యప్రదేశ్) యూఎస్ఎస్ఆర్ సహాయంతో 'భిలాయ్' ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

ముడి పదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - రాజ్‌హర
బొగ్గు - కోర్బా, కార్గాలి
లైమ్ స్టోన్ - నందిని
విద్యుత్ - కోర్బా థర్మల్ పవర్ ప్లాంట్
మాంగనీస్ - భాండారా, బాల్గాయ్

8. 1959 - బ్రిటన్ సహాయంతో పశ్చిమ బెంగాల్‌లో ఇనుము-ఉక్కు కార్మాగారాన్ని 'దుర్గాపూర్'లో స్థాపించారు.

ముడిపదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - బొలానిమైన్స్
కోల్ - ఝూరియా, రాణిగంజ్
లైమ్‌స్టోన్ - బిర్‌మిత్రాపూర్
మాంగనీస్ - కియోంజార్
విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్

9. 1959 - ఒడిశాలో పశ్చిమ జర్మనీ సహాయంలో 'రూర్కెలా' ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

ముడి పదార్థాల సరఫరా:
ఐరన్‌ఓర్ - సుందరగఢ్, కియోంజార్
బొగ్గు - ఝూరియా
విద్యుత్ - హీరాకుడ్ హైడ్రోపవర్ ప్లాంట్
మాంగనీస్ - బరాజమ్‌డా
లైమ్‌స్టోన్ - పూర్ణాపాండ్

మూడో పంచవర్ష ప్రణాళిక కాలంలో

10. 1964 - జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో యూఎస్ఎస్ఆర్ సహాయంతో 'బొకారో' స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

ముడిపదార్థాల సరఫరా
ఐరన్ ఓర్ - కిరిబరు (ఒడిశా)
బొగ్గు - ఝూరియా
లైమ్‌స్టోన్ - పాలము
విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో

11. 1972 - ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖతీరంలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ సహాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 1982లో నిర్మాణాన్ని ప్రారంభించగా 1992లో పూర్తైంది.
   - 1992 ఆగస్టు 1న దివంగత ప్రధాని పి.వి. నరసింహారావు ఈ కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు.
   - ఈ కర్మాగారం దేశంలో అత్యాధునికమైంది, తీర ప్రాంతంలోని ఏకైక ఇనుము - ఉక్కు కర్మాగారం.

ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంలో

12. 1982 - తమిళనాడులోని సేలం వద్ద ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఇది నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి.

ఏడో పంచవర్ష ప్రణాళిక

13. 1989 - కర్ణాటకలోని హోస్పేట్ వద్ద విజయనగర్ ఐరన్ - స్టీల్ కంపెనీని ఏర్పాటు చేశారు.

కొత్తగా ఏర్పాటు చేయనున్న స్టీల్ ప్లాంట్‌లు

1. ఒడిశాలో పోస్కో స్టీల్ కంపెనీ. దీన్ని దక్షిణ కొరియా సహాయంతో ఎంఓయూ పద్ధతిలో నిర్మించనున్నారు.
2. బైలడిల్లా - ఛత్తీస్‌గఢ్
3. సూరజ్‌గఢ్ - మహారాష్ట్ర

అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ సమీపంలో జయక్ నగర్‌లో అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను స్థాపించారు. దీన్ని భారత ప్రభుత్వం 1954లో జాతీయం చేసింది. ప్రస్తుతం ఈ కార్పొరేషన్ పరిధిలో ఐదు ప్రభుత్వ రంగ కంపెనీల ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. అవి....

1. బాల్కో (భారత్ అల్యూమినియం కంపెనీ - కోర్బా (ఛత్తీస్‌గఢ్), రత్నగిరి (మహారాష్ట్ర)

హెచ్ఎంటీ (హిందూస్థాన్ మిషన్ టూల్స్):
1953లో కర్ణాటకలోని బెంగుళూరులో మొదటి హెచ్ఎంటీ యూనిట్‌ను స్థాపించారు. ప్రస్తుతం దేశంలో ఆరు హెచ్ఎంటీ యూనిట్లు ఉన్నాయి. అవి....
1) శ్రీనగర్ 2) బెంగుళూరు
3) పింజోర్ 4) హైదరాబాద్
5) జైపూర్ 6) కాలమస్సేరి

బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్):
1956లో మొదటి బీహెచ్ఈఎల్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో ఆరు బీహెచ్ఈఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...
1) భోపాల్ 2) హరిద్వార్
3) రాణిపేట్ (తమిళనాడు)
4) బెంగళూరు 5) హైదరాబాద్
6) జగదీశ్‌పూర్

హెచ్ఏఎల్ (హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్):
1964లో బెంగళూరులో మొదటి హెచ్ఏఎల్ యూనిట్‌ను స్థాపించారు. దేశంలో ఆరు హెచ్ఏఎల్ యూనిట్లున్నాయి. అవి....
1) నాసిక్ 2) కోరాపుట్
3) హైదరాబాద్ 4) లక్నో
5) కాన్పూర్ 6) బెంగళూరు

ఐడీపీఎల్ (ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్):
ప్రస్తుతం దేశంలో ఐదు ఐడీపీఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...
1) రిషికేశ్ 2) హర్యానాలోని గుర్గావ్
3) హైదరాబాద్ 4) ముజఫర్‌పూర్
5) చెన్నై

2. ఇండాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ) - హీరాకుడ్, బెల్గాం, ఆలూపురం
3. నాల్కో (నేషనల్ అల్యూమినియం కంపెనీ) - కోరాపుట్ సమీపంలోని దామన్‌జోడి, అంగుల్
4. హిందాల్కో (హిందూస్థాన్ అల్యూమినియం కంపెనీ - రేణికూడ్ (ఉత్తరప్రదేశ్)
5. మాల్కో (మద్రాస్ అల్యూమినియం కంపెనీ - మెట్టూరు (తమిళనాడు)

కాపర్ పరిశ్రమ

భారత్‌లో మొదటి కాపర్ పరిశ్రమను జార్ఖండ్‌లోని 'ఘాట్‌సీలా' వద్ద ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న రాగి ఉత్పత్తి కేంద్రాలు...

1. మహుభాండార్ (జార్ఖండ్)
2. ఖేత్రి (రాజస్థాన్).

మాదిరి ప్రశ్నలు

1. భారతీయ ఉక్కు నగరం అని దేన్ని పిలుస్తారు?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) జంషెడ్‌పూర్
2. 'భిలాయ్' ఇనుము ఉక్కు కర్మాగారానికి ఏ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు?
   1) ఫరక్క థర్మల్ పవర్ ప్లాంట్
   2) దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
   3) కోర్బా థర్మల్ పవర్ ప్లాంట్
   4) హీరాకుడ్ పవర్ ప్లాంట్
3. కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారానికి అవసరమైన నీటిని ఎక్కడ నుంచి సరఫరా చేస్తారు?
   1) కావేరి నది 2) తుంగ
   3) నేత్రావతి 4) భద్రావతి
4. జర్మనీ సహకారంతో దేశంలో ఏర్పాటు చేసిన ఇనుము ఉక్కు కర్మాగారం ఏది?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) విశాఖ
5. దేశంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన ఏకైక స్పాంజ్ ఇనుము - ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది?
   1) హోస్పేట్ 2) మెట్టూరు
   3) విశాఖ
   4) పాల్వంచ(ఖమ్మం)
6. భారత్ అల్యూమినియం కంపెనీ (బాల్కో) ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ యూనిట్ ఉన్న ప్రదేశం ఏది?
   1) రాణిపేట్ 2) రేణికూట్
   3) బెల్గాం 4) కోర్బా
7. కింది వాటిలో హెచ్ఎంటీ యూనిట్ లేని ప్రదేశం ఏది?
   1) రిషికేశ్ 2) పింజోర్
   3) కాలమస్సేరి 4) అజ్మీర్
8. రైల్వే ఎలక్ట్రిక్ ఇంజన్లను తయారు చేసే బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్) యూనిట్ ఏది?
   1) హరిద్వార్ 2) భోపాల్
   3) రాణిపేట్ 4) బెంగుళూరు
9. ట్రాక్టర్స్‌ను తయారుచేసే హెచ్ఎంటీ యూనిట్ ఏది?
   1) శ్రీనగర్ 2) కాలమస్సేరి
   3) అజ్మీర్ 4) పింజోర్
10. 'సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్'ను తయారు చేసే ఐడీపీఎల్ యూనిట్ ఏది?
    1) రిషికేశ్ 2) చెన్నై
    3) ముజఫర్‌పూర్ 4) గుర్గావ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 4; 4) 2; 5) 4;
6) 4; 7) 1; 8) 2; 9) 4; 10)2.

The synonym of Tranquility is..



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Due to the financial crisis (1)/ the price of food grains (2)/ has risen sharply (3) / over the past few months. (4) / No error (5)
2. Under the Hindu Minority and Guardianship Act, (1)/ a child natural guardian, (2)/ both of person and property, (3)/ is first the father and then the mother. (4)/ No error (5)
3. New data for rural households (1)/ will reveal by the Socio Economic and Caste Census (2)/ represent a grim reminder(3)/ of the state of rural India. (4)/ No error (5)
4. Ensuring financial services and health care (1)/ to the poor can be done (2)/through create (3)/ social businesses. (4) / No error (5)
5. A committees will be set up (1)/ to study and to reconsider (2)/ the rejected applications of forest encroachers (3)/ in the State. (4) / No error (5)

Directions (Q. 6 -10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given in bold in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The union minister said that all the States **had been instructed** to have a contingency plan ready in the wake of a drought forecast this season.
   1) has being instructed
   2) were been instructed
   3) will been instructed
   4) has been instructed
   5) No correction required
7. The attendance for the movie **release** yesterday was sparse and reviews were negative.
   1) releasing 2) will release
   3) released 4) was released
   5) No correction required
8. Singles and albums will be released on Friday **upon**.
   1) from now on 2) together
   3) from know 4) from within
   5) No correction required
9. Millions of people across the world **could affect** by cyber attack.
   1) will affect 2) would effect
   3) can effect 4) were affected
   5) No correction required
10. In the heaviest commercial launch **of it's formation**, the Indian Space Research Organization's PSLV on Friday launched five satellites.
    1) since its inception
    2) from it beginning
    3) with an initiation
    4) at the starting
    5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), and (E) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) What this means is that the weaver has to figure out where on the loose threads the dye should go in order for it to form the proper pattern when it is woven on the loom.
B) Some ikats are made by dyeing the warp threads, some by dyeing the weft threads and some by dyeing both, a technique known as double ikat.
C) The word 'ikat' comes from the Malaysian word 'mengikat,' or 'to tie'.
D) It gets more complicated as you add more colors.
E) It's like an aesthetic logic puzzle, and just thinking about it makes my head hurt.
F) Because the loose threads are tied into bundles using grasses or wax-treated cotton to specify where the dye is able to sink in and color the thread.

11. What is the FOURTH sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) A
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) E 4) D 5) C
13. What is the LAST sentence after rearrangement?
    1) A 2) C 3) B 4) E 5) D
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) A
15. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. The master dispensed ______ the services of his servant.
    1) of 2) with 3) off
    4) for 5) at
17. He has great _______ for me.
    1) affection 2) affectation
    3) effect 4) affect 5) affliction
18. My friend is ________ very good at cricket.
    1) coincidence 2) affectionate
    3) passion 4) really 5) fact
19. Turkey's economy has grown _______ over the past ten years.
    1) prodigiously 2) providently
    3) provisional 4) affectionate
    5) increasing
20. In an abrupt ______ of violence, Boko Haram ______ killed around 200 people in Nigeria over the past week.
    1) surge… insurgents
    2) rush… rebel
    3) push… content
    4) radical… revolt
    5) revolution… captive

Directions (Q. 21-25): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The model code of conduct places _____ (21) on the government initiating welfare schemes and development projects in a constituency going to the polls. But voters ___ (22) they would be rewarded later if they vote for the ruling party. However, there is no guarantee that the _____ (23) in a by-election would hold in a general election. When voters sense an opportunity to throw out a ruling party in a general election, and not just embarrass it as in a by-election, they vote in a very _______ (24) manner. While these by-elections are thus cause for some celebration for those in power in the respective States, they are by no means pointers to what ______ (25) follow in a general election.

21. 1) restrictions 2) barricades
    3) obstacle 4) impediment
    5) hurdle
22. 1) aware 2) know
    3) welfare 4) benefit
    5) object
23. 1) outcast 2) formality
    3) results 4) affect
    5) distress
24. 1) new 2) creation
    3) innovate 4) different
    5) symptomatic
25. 1) must 2) may
    3) have 4) shall
    5) could

Directions (Q. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

"The whole sky was blazing with stars, larger and brighter than they appear through the dense atmosphere breathed by inhabitants of the lower parts of the earth. They seemed actually suspended from the dark vault of heaven, and their gentle light shed a fairylike gleam over the snow-fields around the foot of the Matterhorn, which raised its stupendous pinnacle on high, penetrating to the heart of the Great Bear and crowning itself with a diadem of his magnificent stars. Not a sound disturbed the deep **tranquillity** of the night except the distant roar of streams that rush from the high plateau of the St. Theodule glacier and fall headlong over precipitous rocks till they lose themselves in the mazes of the Gorner glacier."

26. "The lower parts of the earth" refers to
    1) lower altitudes
    2) people with poorer vision
    3) the underworld 4) plains
    5) stars
27. A vault is
    1) a place for safekeeping
    2) a jumping-off place
    3) an arched structure
    4) a welcoming place
    5) the whole sky
28. The Great Bear is
    1) a rock formation
    2) a constellation of stars
    3) a mountain in the Alps
    4) a wild animal
    5) a special species
29. A maze is
    1) a corn field
    2) a remarkable place
    3) a river
    4) a confusing network of paths
    5) a constellation
30. The synonym of **Tranquillity** is
    1) surreptitious
    2) clandestine
    3) serendipity
    4) providence
    5) serenity

ANSWERS

1) 1	2) 2	3) 2	4) 3	5) 1
6) 5	7) 3	8) 1	9) 4	10)1
11) 3	12) 1	13) 4	14) 2	15) 2
16) 2	17) 1	18) 4	19) 1	20) 1
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 3	28) 2	29) 4	30) 5.